అరుణ కిరణాలు

రచన
ఆచార్య పి.వి. అరుణాచలం
ఫౌండర్ వైస్ ఛాన్సలర్
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

సుశీల ప్రచురణలు:
526, బాలాజీ కాలని, తిరుపతి – 517502.
2026.

Aruna Kiranalu

Dr. P.V. Arunachalam

Published by:
Suseela Prachuranalu,
526 Balaji Colony, Thirupathi - 517 502.
Email: anu.ravin@yahoo.com
Cell: 7702503997

సాంకేతిక సహకారం: **పెద్ది సాంబశివరావు,**
బృందం తెలుగుతేజం, గుంటూరు –6.
ఫోన్: 94410 65414
గాలం రమేష్, 97043 42313
వై. భవాని, బి.కాం, 96529 89521

Price: **Rs. 250/-**

Printed at:
Rainbow Print Pack
Ameerpet, Hyderabad.
Cell: 9246271620

విషయసూచిక

తొలి పాఠకుడిగా నేను

"అచట పుట్టిన చివురు కొమ్మైన చేవ" అని కవులన్నట్లు శ్రీపుదూరు విశ్వనాథ అరుణాచలం గారు కార్వేటి నగరంలో సామాన్య కుటుంబంలో జన్మించి, అంచెలంచెలుగా ఎదిగి విశ్వవిద్యాలయ ఉపకులపతి (Vice-Chancellor) పదవి నలంకరించడం సామాన్య విషయం కాదు. వారికి గల పట్టుదల, కార్యదీక్ష, సునిశిత మేధస్సు, లోకజ్ఞత, ప్రతిభావ్యుత్పత్తి పాటవాలు అమోఘం. వృత్తిరీత్యా గణిత శాస్త్రాచార్యులుగా పనిచేసినా, ప్రవృత్తి రీత్యా కవిగా, సాహిత్య విమర్శకులుగానే నాకు పరిచయం. వారి రచనలు భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రప్రదేశ్ పత్రికలలో అప్పుడప్పుడు ప్రచురింపబడినవి. ప్రముఖుల ఘనతను శ్లాఘిస్తూ వ్రాసినవి కొన్ని, స్వతంత్ర కావ్యాలు కొన్ని సంకలన గ్రంథంగా ఇన్నాళ్ళకు సేకరించి ప్రచురించారు.

కార్వేటినగర పాలకులు శ్రీకృష్ణదేవరాయల వలె అష్టదిగ్గజకవులను పోషించి వాసిగాంచి యున్నారు. అట జన్మించిన ఆచార్య శ్రీ అరుణాచలం గారు బహు భాషాకోవిదులుగా, గణిత శాస్త్రాచార్యులుగా గణన గాంచడం వారి వైదుష్యానికి నిదర్శనం.

వారు రచించిన "అరుణకిరణాలు" లిఖిత ప్రతినొసంగి పరిశీలించి ఇమ్మన్నారు. ఆ గ్రంథాన్ని ఆమూలాగ్రం పరిశీలించి నా అభిప్రాయాలు తెలియ జేస్తున్నాను.

"శరత్కాల మందలి వెన్నెల, తేనెలూరిన పనస తొనలు, మల్లెపూల తావులు, శ్రీగంధపు పొడి, ఆమనిలో కురిసే తొలకరి జల్లులు, గులాబీపూల మృదుత్వం, ఉషోదయపు చల్లని గాలి, అరుణోదయంలో పూర్వదిక్కున తోచే వరాలు, కలకంఠమ్ముతో కలకూజితాలు గావించే కమ్మని స్వరాలు, ప్రకృతిలో మదికానంద మొసగే వస్తువి తతులు – వీని నన్నింటిని మేళవించి ఆపాత మధురమైన స్వరాలతో రంగరించిన గానంలా హృదయాన్ని ద్రవింపజేసే కవితలే ఈ "అరుణకిరణాలు".

"కవి అరుణాచలంగారు, వారి కవిత కిరణాలు" వెరసి "అరుణ కిరణాలు"గా పుస్తక రూపం దాల్చినది. అరుణుడు తన తేజకిరణాలతో ఈ విశ్వానికి

వెలుగును ప్రసాదించినరీతి; అరుణాచలంగారు తమ కవితా తేజః కిరణాలతో ఈ విశ్వానికి జ్ఞానజ్యోతిని గ్రంథరూపంగా ప్రసాదించారు గాన ఈ గ్రంథనామం సార్థకత సంతరించు కున్నది.

ఆచార్య శ్రీ అరుణాచలంగారు తమ అనుభవాన్ని, వైదుష్యాన్ని రంగరించి వ్రాసిన కవితాఖండికలు పులకరింపులను తలపింప జేస్తున్నాయి. మొత్తం ఖండికలు వివిధ కవితారీతులతో హృద్యంగా వెలువారీ ఉన్నవి.

వారు రచించిన "తెగిన తీగల వీణ" చారిత్రాత్మక గేయ కావ్యం. మొగల్ దర్బార్ గ్రంథంలోని ఒక చిన్న ఘట్టమును వస్తువుగా గ్రహించి ఐదు మాత్రల గణాలతో పాదానికి నాలుగు గణాలు చొప్పున గానయోగ్యమగుట కనుగుణంగా గేయాన్నిసాగించినారు. వర్ణనలు తేనె సోనల తెలుగు నుడికారాలతో మనోహరంగా ఉన్నాయి. కథాగమనము పాఠకుని కుతూహల పరచి రస రమ్య లోకానికి మున్ముందుకు పరుగులు తీయిస్తుంది. భగ్న ప్రేమికుల విషాదాంత కథ గనుక హృదయాన్ని కదలించి కరిగించేటట్లు చేస్తుంది. కథా కథనం మధ్య నుండి సాగి మొదటికి వచ్చి, ఆ పిదప ముగింపుతో ఉత్కంఠ భరితంగా సాగింది. ప్రకృతి వర్ణనలు లలిత పద సంశోభితమై ప్రబంధకవుల వర్ణనల తలపింప జేస్తుంది.

"సంధ్యాంగనాఫాల – ఫలకమున కాశ్మీర
తిలకమున సూర్యుండు – సిందూర కాంతులను
సంధించు కొని వెల్గి – పశ్చిమాంబుధి మున్గె"

అని ఉత్ప్రేక్షాలంకారమున సాయంకాల వర్ణనను సాగించినారు.

"తపన తపనకు అలసిపోయిన
ధరణి దేవికి వలువ నివ్వగ
పరమ సంతోషమున చంద్రుడు
పరుగులిడి వచ్చెన్"

కామినీ హృద్యుడౌ భూమిక్
మధుర స్మృతులను పులకరించుచు
యామినీ వల్లభుడు వచ్చెను
స్నిగ్ధ చాంద్రీజ్యోతులతో ॥

అంబరంబున తారకలకడ
సంబరమ్మున తిరుగు కా
దంబినులతో దోబూచు లాడెను
చంద్రబింబము వేడ్కతోన్ ॥

అని చంద్రోదయ వర్ణన గావించి ఉన్నారు. ఆ వర్ణనల చదువునపుడు ప్రబంధములందలి కవుల వర్ణనలు తప్పక తలపునకు రాగలవు.

The Moon shines Bright, in such Night as this,
When the sweet wind did gently kiss the trees,
And they did make no noice in such a night.

చంద్రుడు ప్రకాశవంతంగా ప్రకాశిస్తాడు, ఇలాంటి రాత్రిలో, మధురమైన గాలి చెట్లను సున్నితంగా ముద్దు పెట్టుకున్నప్పుడు, అలాంటి రాత్రిలో ఎటువంటి శబ్దం చేయలేదు.

అని ఆంగ్లకవి షేక్స్పియర్ పద్యపాదాలను తలపింప జేస్తున్నవి ఆ వెన్నెలలో

"క్రమ జ్యోత్స్నాసిక్త–గంధ యుగ్మము తోడ
చాంద్ర నమశ్శిఖ కంఠహారశ్రేణి కమనీయముగా నుండ
మంజుష పదలగ్న–మంజీర శింజితము
మహిత సమ్మదమాయె కశవరాంపకము
కౌశేయ కంచుకము ధరియించి ఉపవనిని
దేవ సుందరి వోలె–దేదీప్యమానముగ
నళిని నాట్యమ్మాడె నవమోహనమ్ముగా"

అని వర్ణించారు. జయరాజ్ పాడిన పాటల మాధుర్యము నీక్రింది రీతిని వర్ణించారు:

"వెన్నెలలు విరిసినవి–విపిన మమృతముగా
ఎంచ విద్యావేది–గానోపునని యెంచి
పవన కంపిత మంజు–రవము లవి నిగువడి
అతిలోక మాధుర్య–శ్రుతులు విని తనిసినవి

యంత్రవత్ జీవితము ఎంత సేపని జెప్ప
చాలునని సొమ్మసిలి–రాలు చుండిన సుమము
దివ్యగానమ్ము విని–పుంతమున కత్తుకొనే
నిర్ణీత కార్యమును–ముగియించి యొక చుక్క
పశ్చిమాంబుధిమునుగ – పయనమై చనుచుండి
పరమాద్భుతంబైన అమర సంగీతపు
ఆలాపనంబు విని – అట్టె నిలిచింది
సుమరాశి విరబూచే – పొన్నలును బొగడలును"

పరవశమ్మును జెందె–యమున విని పొంగినది
సంగీత మాధుర్య – నిర్ఝరి నెదిరించి
నిలువ జాలిన దేది–ప్రకృతిలో కనబడదు'

జహంగీరు పాదుషా కర్కశ హృదయంతో నళినిని ప్రేమించిన జయరాజుకు మరణశిక్ష విధించడం, నళిని ఆ విషాదాన్ని భరించలేక విషం త్రాగి మరణించడం హృదయ విదారకంగా పాఠకుల నయనాలు అశ్రుకణాలతో చెమర్చు రీతి వ్రాసియున్నారు.

గణగణఘంటా : పై మకుటంతో 128 కంద పద్యాలు హృద్యంగా సాగించి యున్నారు. ఆ పద్యాలన్నీ 1949 – 62 ల మధ్య భావోద్రేకంతో, అప్పటి సమాజ పరిస్థితులను అవగాహన చేసికొని వ్రాసినవని శ్రీ అరుణాచలంగారే ఉటంకించి ఉన్నారు.

ప్రాచీన పూర్వకవులు తొలుత శతకాలను వ్రాసి ఆ పిదప పురాణ, కావ్యాలను వ్రాసియున్నారు. తిక్కన శ్రీకృష్ణశతకం, బద్దెన సుమతి శతకం, పోతన నారాయణ శతకం, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకం– వ్రాసి పిదప బృహత్ గ్రంథరచనకు పూనుకొని యున్నారు.

శతకమనగా నూరు పద్యములు కలిగి ప్రతి పద్యం చివర సంబోధన కలిగి వ్రాయబడు ప్రక్రియ. భక్తి, నీతి, శృంగారం, వైరాగ్యం, సమాజ జీవన విధానం మున్నగు వానిలో నేదో ఒక అంశాన్ని ప్రధానంగా గ్రహించి వ్రాయుట. పద్యం చివర ఏ మకుటముంటుందో అవియే అన్నిపద్యముల చివర వచ్చురీతి వ్రాయుట.

భావంతో పాటు లక్షణ, లక్ష్యాలకు ప్రాధాన్యత నొసగి ఉదాహరణలతో రచనలు గావించుట.

కందము వ్రాసిన వారిని కవి యన్నారు. కందము జాతి పద్యము. వీనినే సంస్కృతలాక్షణికులు 'ఆర్యావృత్తమని' చెప్పి యున్నారు.

శ్రీ అరుణాచలంగారి "గణగణ ఘంటా" శతకంలోని మొదటి పద్యం

"శ్రీరాముడొక్క దినమున
ఏరా! యివ్విధమున నిదు–రింపగ తగునా!
లేరా! త్వరగ వ్రాయను
రారా! శతకంబు నొకటి–రమ్యపు కరణిన్"

చదివినపుడు కుమార శతకం లోని పద్యము.

తేరా! పలకాబలపము
ఈరా! అయవారి చేత – ఇంపలరంగా!
పోరా! భోజన వేళకు
రారా! పద్యాలు చదువ – రాజకుమారా!
సుమతి శతకంలోని
శ్రీరాముని దయ చేతను
నారూఢిగ సకల జనులు – నౌరాయనగా
ధారాళ మైన నీతులు
నోరూరగ చవులు పుట్ట–నుడివెద సుమతీ!

అను పద్యాలు తప్పక జ్ఞప్తికి రాగలవు. నేటి సమాజంలోని పోకడను నిర్భయంగా తెల్పడంలో "ఢంకా బజాయించి" లేదా "బల్లగుద్ది" చెప్తున్నామని ప్రజలు చెప్పడం పరిపాటి. శ్రీ అరుణాచలంగారు అదేరీతి సమాజ ప్రవృత్తిని "ఘంట మ్రోగించి" చెప్తున్నానని "గణ గణ ఘంటా" మకుటాన్ని పద్యాల చివర చెప్పి ఉన్నారు. అన్ని పద్యాలు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలను, రాజకీయ నాయకుల పోకడలను తమ కలంపోటుతో కాయానికి గాయంకాకుండా,

హృదయాన్ని మాత్రం గాయపరచే రీతి వ్రాసియున్నారు. ఉదాహరణకు కొన్ని మాత్రం పేర్కొంటాను.

లంచంబు ప్రజల లోపల
మంచంబులు వేసి కొనుచు–మనియెడి వేళన్
దంచగ వారిని సమయము
గాంచుచునే యుండు మీవు–గణగణ ఘంటా!

మేడల లోపల నెప్పుడు
నీడల లో చల్లగాను–నివసించు జనుల్
వేదుదురు ప్రజాక్షేమము
గాడిద మేల్ వీరికన్న–గణగణ ఘంటా!

స్త్రీ విద్య లవసరమ్మని
భావాలనుపన్యసించు–పలు సంస్కర్తల్
కేవలము వారి వారినే
గావింపరు చదువరులుగా– గణగణఘంటా!

రికమెండేషన్ గలిగిన
రకరకమగు పనుల కేగి–రంజిల వచ్చున్
అకట! అది లేనప్పుడు
“కకపాలను” పట్ట వలెను – గణగణ ఘంటా!

కొలువున వెలసిన యపుడే
పలువిధముల గౌరవమ్ము – ప్రాప్తించు నిలన్
కొలువూడిన మరుక్షణమే
కలియరు స్నేహితులు గూడ – గణ గణ ఘంటా!

సమ్మెను ప్రారంభించుట
గమ్మత్తుగ సెలవు వచ్చు – కారణమేదో!
పిమ్మట చూతమనెడి సం
ఘమ్ములు కొల్లలుగా వెలసె – గణగణఘంటా!

ఈ లాంటి పద్యాలతో నిబిడీ కృతమైన ఈశతకాన్ని చదివిన, సమాజంలో కొందరైనా పరిణితి గాంచితే కవి గారి కృషి ధన్యత గాంచ గలదు.

పండుగలు ఋతువుల క్రమాన్ననుసరించి, ప్రకృతిలో కలిగే మార్పులకు గుర్తుగా వస్తూంటుంది. ఆయా ఋతుధర్మాన్ని అవి చర్విత చర్వణంగా వచ్చి, జన జీవనానికి దోహదం చేస్తూ మేలొన గూరుస్తూ ఉంటుంది. జనం ఒక్కొక్క ఋతువులో తామనుభవించే కష్టాలను, కృషిని, అనుభూతిని ఈ పండుగల ద్వారా మఱచి బంధు, మిత్రులతో సరస సల్లాపాలతో, సంతోషంగా కాలం గడుపుతారు. అందుకే భారత జాతి, సంస్కృతిలో నొక భాగంగా పండుగలు చరిత్రలో చోటు చేసికొని యున్నవి. శ్రీ అరుణాచలంగారు సంక్రాంతి శోభను జూచి

"రోదసీ గర్భాంతరాళమున ప్రత్యూష పవన వాహన మెక్కిన జంగముని గణ గణ రావమ్ము కదలింది. ఉషః కాంత ప్రాచీన రోచిస్సు విరియించి సంక్రాంతి సంతోష సంభ్రమం తిలకించుటకు పర్యుత్సుకత్వమున వచ్చినది. ఆ ఉషః కాంతకు, రమణీయ పరిశుభ్ర వసనం ధరించి, హసిత ముఖ పద్మంతో అవని మహాలక్ష్మి ఆహ్వాన మొసగినది. సంక్రాంతి సామ్రాజ్ఞికి క్షిత్యుషః కళ్యాణులు అత్యాదరము తోడ స్వాగత శ్రీలోసగిరి. ఆమె అడుగిడిన చోటెల్ల మంజీర శింజాన సంజాత సంగీత సంపదలతో నిలింప భామలు మెచ్చు అతిలోక సౌందర్యంతో సింగార ముప్పొంగు గృహాంగణ సీమలు చెలువారినవి" అని సంక్రాంతి లక్ష్మిని వర్ణించారు.

వర్ష ఋతువులో పగలు తక్కువై రాత్రులు దీర్ఘమై ఉంటాయి. వర్షపాతం వల్ల భూమి చిత్తడియై, వాగులు వంకలతో ప్రవహిస్తుంటుంది. ఆకాశాన్ని...

మబ్బులు ఆవరించి పగలు కూడ కనుచీకటులతో ఉంటుంది. ఈ చీకటి రాత్రులు తొలగి, వర్షాల వల్ల ఏర్పడిన బురద తొలగి పోవాలని ప్రజలు నరక చతుర్దశి, దీపావళి పండుగలు జరుపుకుంటారు. ఆ విషయాన్ని కవిగారు దీపావళి ఖండికలో

"భానుడు దక్షిణ పథము – పట్టి ప్రయాణము చేయసాగెనీ
క్షోణీ తలమ్ము చీకటుల – చుట్టుకొనన్ పరితోష హీనమై

మ్లాన మతిన్ కృశించె నెద – మా హృదయమ్ములు సాచి కాంతి దే
వీ ! నిను పూజ జేసెదము – వెల్గులొసంగి జగమ్ము బ్రోవుమా ! ”

అని పరిదేవన గావించారు. ఉగాది గూర్చి

“ తరులు లతాసమూహములు – దాల్చెనుగాది బహుకృత్యప్రియా
భరణములన్ మనోజ్ఞముగ – పచ్చని వెన్నెల నేత్ర పర్వమై
వరలెను నవ్యశోభ ప్రకృతి – మహోజ్వల వైభవమ్ముతో
పరవశ మందె దివ్య నవ – భాగ్యము లందెను గడ్డిపోచలన్”అని వర్ణించారు.

“వివాహము” అను ఖండికలో వరునకు వధువు ముఖ్యము – నారికి నరుని సఖ్యము వలయునని ఆర్యులు తలచి క్షితి తలాన పెండ్లి సంస్థను నెలకొల్పి వెడలినారని వైవాహిక బంధాన్ని చక్కగా వివరించారు.

“చంద్రమండలం” ఖండికలో విశ్వాంతరాళంలో గల సృష్టి రహస్యాలను తెలిసి కొనుటకు నేటి మానవుని పరిశీలనా దృష్టిని, విజ్ఞాన వికాసాన్ని పెంపొందించుకొనుటకు, ఖగోళమందలి విశ్వరహస్యాన్ని కనుకొనుటను చంద్రమండలాన్ని గూర్చి పూర్వులనేక రీతుల తెల్పియున్నారని వక్కాణించారు. “సూర్యాస్తమయం” ఖండికను చదువుతుంటే నంది తిమ్మన ‘పారిజాతాపహరణం’ లోని సూర్యాస్తమయ పద్యాలు స్మృతి పథానికి తప్పక వస్తుంది.

“వసంతం వెళ్ళి పోయింది” ఖండికలో శిశిర ఋతువు ఆకులను రాల్చి, ప్రకృతిని శోకజలధిలో ముంచి, తరువుల వస్త్రాలను ఇచ్ఛానుసారం లజ్జవీడి లాగి వేసింది. అయినా శత్రువైన శిశిరము అంతమై ఋతువులకు రాణి వసంతసుహాసిని అవతరించునను ఆశ కవిగార్కి బ్రతుకున కాదర మొసగినది. ఆ వసంతరాకతో ప్రకృతి పులకరించినది. దానిని కవిగారు

“క్రొంజిగురాకు విందులను – గూర్చి ఎదందలు పుల్కరింపగా
మంజు వసంత గీతికల – మమ్ముల రింపు మటంచునీ పికి
పుంజము బిల్చె యామములు – పొంగి ముదమ్మున కోయిలల్ మనో
రంజన గానమున్ వినిచె – రాగ ఝరిన్ జగమెల్ల తేలగన్”

"సౌర భా కీర్ణ మారుత – స్పర్శకతన
పారవశ్యము జెందుచు – పౌరమివి
భావరిన్ సరోవరమున – పడవ నెక్కి
హాయిగ విహారముల్ సల్పు – నభిలషింతు"

అని వర్ణించారు. అట్టి వసంత ఋతుశోభను తిలకిస్తూ వసంతం ఎప్పుడు వెళ్ళి పోయిందో కూడ గమనించకుండా కవి మైమరిచారు. ఏవేవో ఊహలతో తేలిపోయి గ్రీష్మఋతువు ఆగమనాన్ని కూడ పరిశీలించక పోయారు. భీష్మ రూపం దాల్చిన గ్రీష్మ ఋతువును గాంచి

"ఆశా సౌధము కూలెన్
క్లేశమ్మే మిగిలి హృదయ – గేహము నందున్
లేశము వివేకముతో
నాశము జేసితిని నేనే — నా సంతసమున్"

"విమల మధురాధర సుధల – విందుజేసి
నన్ననంత సంతోష – సంపన్ను జేయు
నని తలచిన వసంత భా – మిని ప్రణయిని
వెడలిపోయె నొక్కని నను – వీడి ఎటకో"

అని చింతించారు. వారి వగపును జూచి, మల్లెపూవు కరుణార్ధ్ర హృదయంతో నీవదృష్ట హీనుడవని ఓదార్చినది.

"మాణిక్యానికి లేఖ" ఖండిక వచన గేయంలో వ్రాయబడినది. కవిగారి బాల్యం, విద్యాభ్యాసం, బాల్యంలో ఆడుకొనే ఆటలు, ప్రతిఋతువులోను వచ్చే పండుగలు పండుగ సంబరాలను మధురస్మృతులుగా మనోహరంగా వ్రాశారు. ఉన్నత విద్యాభ్యాసం వరకు వారి స్వీయచరిత్రలా, జన్మభూమిపై వారికి గల ఎనలేని ప్రేమాభిమానాలను వెల్లడించి యున్నారు. వెట్ట మునస్వామి ప్రస్తావనతో ఈ లేఖ సమాప్త మౌతుంది.

అనార్కలి కావ్యం మరొక ఖండిక. ఆశ్వాసాలతో హృద్యమైన పద్యాలతో చెలువారి యున్నది.

నన్నయ భట్టు భారత రచనలో వర్ణనలకు ప్రాధాన్యమివ్వక, కథాగమన వేగాన్ని చూపి పాఠకుని వెన్నంటే పరుగులు తీయించిన రీతి కావ్యము సాగియున్నది. తిక్కన, పింగళి సూరనలు, చూపిన సంభాషణా రూప పద్య వైచిత్రిని వీరు తమ పద్యాలలో కూడా చూపి ఉన్నారు. కొన్ని యెడల వైదర్భి, కొన్ని యెడల గౌడి, మరికొన్ని పాంచాలి రీతులతో మనోరంజితంగా వ్రాసియున్నారు. మాధుర్య సౌకుమార్యములకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చియున్నారు. అష్టాదశ వర్ణనలు ఇందు చోరవచేసికొని యుండినచో నీ అనార్కలి కావ్యము చారిత్రాత్మక ప్రబంధముగా చిరస్థాయి సంతరించుకొని ఆంధ్ర సాహిత్యంలో ప్రత్యేకతను నిలుపుకొని నిలచి యుండెడిది.

ఈ ఖండికలలో కొన్నిటిని గూర్చి మాత్రమే వివరించాను. సమీక్షా విస్తరణ అధిక మౌతుందనే ఉద్దేశంతో అన్నింటికీ అభిప్రాయం వ్రాయలేదు. అన్నీ పంచామృతాలుగానే రసాస్వాదన కలిగించేవిగా ఉన్నవి. శ్రీ అరుణాచలంగారు ప్రాచీన కవిత్వము నుండి అర్వాచీన, నవీన కవితల వరకు ఔపోసన పట్టి, వానిని ఈ గ్రంథంలో పొందుపరచి యున్నారు. ఈ గ్రంథానికి అభిప్రాయం వ్రాసే అవకాశ మొసంగిన శ్రీ ఆచార్య అరుణాచలం గార్కి కృతజ్ఞతాభివందనాలు.

శ్లో. లౌకికానాం హి సాధూనా మర్థం వాగనువర్తతే ।
ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోనుధావతి ॥

అనునార్యోక్తి ఆచార్య శ్రీ పి.వి. అరుణాచలం గారి పట్ల ఎంతయు సార్థకత గాంచియున్నది. వారి ఆయురారోగ్య భాగ్యాలు వర్ధిల్లాలని చిరకీర్తి నార్జించాలని ఆకాంక్షిస్తూ అభినందిస్తున్నాను.

బుధజన విధేయుడు

4-2-1999 **ఇరువారం లోకనాథం**

అరుణ బైందవం

బిందు మాలిని, నాదవరంగిణి, హంసానంది, సింధు మందారి, శివరంజని, గోపికావసంతం ఆపాతమధురంగా వినవస్తున్నవి. ఇందులో ఏమి వింత లేదు. ఇవన్నీ రాగాల పేర్లు. వీటిలో సంగీతం అంతర్లీనమైయున్నది. అన్నీ సబిందుకాలని గూడ తేలికగానే గుర్తింప వచ్చును. ఇట్లే మరికొన్ని :

లలంతి, పుంస్కోకిల, వాసంతి, పంచమి, నిద్రాణమైన భావాంకురాలను మోసులెత్తించగల నిర్యందుక శబ్దాలు లేవనికాదు. లలిత, పావని, స్మృతి మనస్విని, సజని, యమునాకల్యాణి, ఋషి కుల్య శ్రీ పాదరేణు – అన్ని మాధుర్యధుర్యాలే. శ్రుతిరంజకమైన కొన్ని సంస్కృత ధాతువులను కూడ పేర్కొనవచ్చును.

జజృంభు : (= విజృంభించిరి), ముముచు : (= వదిలిరి) రురుచిరే (=ప్రకాశించిరి), అస్మృత్ (=స్మరించెను), చుచుంబె (=ముద్దుపెట్టెను), మహమ్మి (= మహిమయందు) ఇత్యాది. అనునాసికాలు, అంతస్థాలు, ఊష్మాలు వీటి ఆవృత్తి, సంయోగిత శ్రావ్యతకు కారణాలు కావచ్చును.

1980 లో బ్రిటన్‌లో సండే టైమ్స్ నిర్వహించిన ఒక అభిప్రాయ సేకరణలో ఈ క్రింది పదాలు అత్యంత జనప్రియ మైనవని (Popular) తేల్చినారు: Melody, velvet, gossamer, crystal, autumn, peace, tranquil twilight, murmur, caress, mellifluous, whisper ఇందుకు కారణాలను కూడ ప్రస్తావించినారు. అటువంటి ప్రయత్నం తెలుగులో జరిగితే సబిందుక శబ్దాలు అగ్రశ్రేణి నలంకరించగలవని నా నమ్మకం.

వాగ్గేయకారులలో ఆద్యుడు శ్రీ జయదేవకవి “మధుర కోమల కాంత పదావళి” తో అష్టపదులను సృష్టించినారు. బిందువు పునరావృత మైనపుడు వెలువడే శబ్దసౌందర్యాన్ని కవితలో కూర్చినారు. ఇంకొక విశేషం. జయదేవకవి బిందుబిల్వగ్రామనివాసి.

1. శింజానమంజు మంజీరం ప్రవివేశ నికేతనం
2. దిక్కుందరి వదన చందన బిందు బిందు:
3. మంజుల వంజుళ వంజుళ గతం

జయదేవికవి గీత గోవిందంలో ని సర్గలకు పెట్టిన పేర్లు అద్వితీయంగా అమరినవి: సామోద దామోదరం ముగ్ధ (స్నిగ్ధ) మధుసూదనం నాగనారాయణం, చతుర చతుర్భుజం, సుప్రీత పీతాంబరం.

లీలాశుకుని కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలు కర్ణామృతాలే.

"సాయంకాలే వనాంతే కుసుమిత సమయే సైకతే చంద్రికాయాం"

లలితా సహస్రనామంలో, స్తోత్రాలలో లలిత పదావళి ఉచ్చస్థాయి నందుకొన్నది.

1. శింజానమణి మంజీర మండిత శ్రీ పదాంబుజా
2. మల్లాకామాలతీ కుంద మందారాంచిత మస్తకా
3. శ్రుతి సీంత సిందూరీ కృత పాదాబ్జ ధూళికా
4. బిసతంతు తనీయసీ

లలితాంబిక శ్రీ చక్రాంకిత బిందుమధ్య వాసినీ బిందునాద వశంకరీ ;బైందవాసన.

యాదేవీ సర్వభూతేషు బిందు రూపేణ సంస్థితాశక్తికి కేంద్రం బిందువు.

పరమాత్మ స్వరూపమైన ఓంకారం బిందు సంయుక్తమే. బిందువును ఒక సంఖ్యగా మొదటి గణించిన వారు భారతీయులే. శూన్యం అరేబియాలో సైఫర్లై, లాటిన్ భాషా సంపర్కంతో మార్పు చెంది Zero గా అవతరించింది. ప్రపంచ పర్యటన గావించి భూమధ్యరేఖ వలె భూమిని పరివేష్టించింది.

భారతీయ గణిత శాస్త్రజ్ఞులు సున్నకు పర్యాయపదాలుగా "శూన్యం, అనంతం, ఆకాశం, అంతరిక్షం ...." వాడి యున్నారని శ్రీ అరుణాచలంగారు

"వ్యాసమంజూష"లో పేర్కొన్నారు. బిందు పూర్వోత్తరాలను క్షుణ్ణంగా పరిశోధించి, సున్నలో నిర్గుణబ్రహ్మాన్ని దర్శించినారు. ఈ బిందువే పూర్ణం, పూజ్యం, సర్వమంగళం, శూన్యమైనా అనంతమే; సంపూర్ణమే. సాహిత్యంలో, గణిత శాస్త్రంలో బిందువు ప్రధాన పాత్రను నిర్వహిస్తున్నది. ఫెర్మాట్ యొక్క చివరి సిద్ధాంతం ను ధ్రువీకరించిన ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు ఆంద్రూ విల్స్ బిందువును ఇట్లాగుర్తించాడు "విశ్వం సున్నా, అనంతం యొక్క ఉత్పత్తి"

ఇక కవి చేపట్టిన మధుర కోమల కాంత పదావళిని పరామర్శించుదాం. వీరికవితలో లలిత పదాలు కోకొల్లలు.

1. మంజీర శింజితము రంజిల్లె వెనువెంట
2. అతిలోక సంగీత స్వరతరంగములతో
3. మలయాంతర్గత మారుతోల్లలిత ...
4. పరమ పరిమళ పవన సంభరిత క్రమ చంద్రికా కీర్ల...

మంజుల, లలిత, పరిమళ, వసంత, వాసంతి,

నవనీత, క్రమ, అంబర చుంబిత, ప్రావృట్చేరద, కలకూజిత – ఇత్యాది శబ్దాలు కవిని మురిపించినట్లు కనబడుచున్నవి.

మంజు (ల) శబ్దం అగ్రతాంబూలం గైకొని యున్నది. "మంజుల" కు ఇంచుగాగమం ఏత "మంజలించు" అను తత్సమ ధాతువును కవి సాధించడం గమనార్హం. ఇతర కవిపండితులు "మంజలించు" ను వాడినట్లు నాకు కానరాలేదు. తత్సమ ధాతువులపై విస్తృత పరిశోధన నెరిపిన ఆచార్య జె.యస్. సూర్యనారాయణ గారు కూడా ఈ పదాన్ని వారి తత్సమ ధాతువుల జాబితాలో చెప్పలేదు. (చూ. తెలుగు కవుల సంస్కృత ప్రయోగాలు (నన్నయ నుంచి నేటివరకు) కవి స్వేచ్ఛకు ఇది నిదర్శనం.

వీరి భావుకతకు, విషయ వివేచనకు, గురుభక్తిని కవి పండితాభిమానానికి కవితా ఖండికలు సాక్ష్యమిచ్చు చున్నవి. వీరు బాల్యమిత్రులు, సహోద్యోగులు,

స్వదేశవిదేశ శిష్యగణాల ఆదరాభిమానాలను చూరగొన్న వారు. పేరు పేరున వారి ప్రత్యేకతలు కరతలామలకంగా వీరికి తెలియును. ఈ అవగాహనే వీరి విశిష్టత; శిష్టత.

ఆదికవి నన్నయ, శ్రీనాథుడు, ప్రబంధ కవులు, రాయప్రోలు, దేవులపల్లి, విశ్వనాథ సత్యనారాయణ, కరుణశ్రీ శేషేంద్ర మున్నగు కవుల భావచ్ఛాయ విడిగా, సంక్షిప్తంగా వీరిలో ఎడనెడ కనబడుచున్నది. ఇది సమగ్ర పరిశీలనకు అనువైన అంశంగా భావిస్తున్నాను.

మరి మరి చదివింప జేయగల భావాలూ ఊహలు వీరి కవితలో తామర తంపరగా నున్నవి.

అనార్ఘ్యఘుటాల్లాగా పయనిస్తున్నారు జనం

అట అక్కసులు అప్పటి కప్పుడే చెల్లు బాటయిపోయి ప్రక్క రోజూ మిగలవు.

బ్రహ్మాండమంత నిశ్శబ్దాన్ని పరమాణువంత శబ్దంతో నింపాలని నింపాదిగా ప్రయత్నిస్తున్నారు.

కవితా లల్లమువ్వల్లారు యువతకు వీరి సందేశం;

"లెమ్మిక మేలుకొమ్ము కదలింపుము ఘంటము
మంజువాక్ ప్రపూరమ్ములు చిందు కైతలను వ్రాయుము,
లోకహితము గూర్చు భావమ్ములు జాలువార రసవంతముగాన ....

ఆధునిక రచయితలలో గణిత పరమైన కవితను, వ్యాసాలను రచించే వారు అరుదు. ఈ నేపథ్యంలో గణిత శాస్త్రంలో భారతీయ, పాశ్చాత్య మేధావుల ప్రతిభను, ప్రతిపాదనలను వీరు తులనాత్మకంగా పోషించి, ఎడనెడ సమన్వయించి యున్నారు. ఒక ప్రక్క గణితాన్ని, వేరొక ప్రక్క సాహిత్యాన్ని చేపట్టి ఇరుతెరగుల విజయం సాధించిన సవ్యసాచి శ్రీ అరుణాచలంగారు విజ్ఞానానికి, కళలకు మధ్య సేతువును నిర్మించడంలో వీరికి గల దీక్ష, తపన అసాధారణమైనవి. వీరి కలం

నుంచి ఎన్నో రచనలు ఎదురు చూచే వాళ్ళలో నేనూ ఒకడనని విన్నవిస్తున్నాను.

వీరి జగద్గురు ప్రణతిని చదివినప్పుడు అనుకోకుండా నా మనో వీధిలో ఈ గేయం మెదిలింది:

ఆలయమున వినబడునదిగో ! –
ఆలయమున కనబడునదిగో
నవజీవన ఘంటా నినాదం
విశ్వశాంతి కాంతి
వినండి మీరా శుభ నాదమును
కనండి మీరా శుభతేజమును
ఈ ఉదయాన్న, ఈ ఉదయామున ॥ ఆ ॥

(శ్రీ రజనీకాంతరావు గారి "శతపత్ర సుందరి" నుండి)

27-2-2001

నీకాయ పట్టెడ కె. సుదర్శనం, బి. ఇ.,
దుర్గానగర్ కాలనీ, చిత్తూరు-2

ముందుమాట

1996 మే 14న ఆచార్య అరుణాచలంగారికి షష్టిపూర్తి. ఈ సందర్భంగా వారికి సన్మానం చేయాలని గణిత అధ్యయన శాఖలో సన్మాన సంఘం ఏర్పడింది.

లెక్చరరుగా, రీడరుగా, ప్రొఫెసర్, డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా విశ్వవిద్యాలయానికి సేవలందించిన వ్యక్తిని ఆషామాషీగా సన్మానించ రాదని, విశ్వవిద్యాలయ శాఖాధ్యక్షులందరి సలహా తీసుకోవాలన్న ఉద్దేశ్యంతో శాఖాధ్యక్షుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలుగు అధ్యయనశాఖ అధ్యక్షురాలుగా నేను రోస్టరు డ్యూటీలో వుండి ఆ సమావేశానికి హాజరయ్యాను.

శ్రీకృష్ణ చంద్రగౌడ్, హరిదేవ్ బాహురి మున్నగు ప్రముఖ విద్యాంసులచేత అలహాబాదులో 'భాషాసంగమం' అనే సంస్థ స్థాపించబడింది. ఆంధ్రప్రదేశ్, తిరుపతిలో శర్మగారు శాఖను ప్రారంభించారు. నేనీ సంస్థలో కార్యదర్శిగా కవిసమ్మేళనం కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో ఆచార్య అరుణాచలం గారు తాను రాసిన 'గణ గణ ఘంటా శతకం' లోని కొన్ని నీతి పద్యాలు చదివారు. ఆయన గొప్పసాహిత్య ప్రియుడు, కవి అని నాకు స్పష్టమైంది.

సన్మాన సంఘం వారు నా అభిప్రాయం అడిగినప్పుడు అరుణాచలంగారి రచనలు సేకరించి ప్రచురిస్తే అంతకన్న గొప్ప సన్మానం మరొకటి వుండదు అని చెప్పాను. అందుకు వాళ్లంతా ఏకగ్రీవంగా సమ్మతి తెలియజేసి ఆ పని నన్ను చేయమని కోరారు.

భాస్కరరెడ్డిగారు అరుణాచలంగారి శిష్యుడు, నివురు గప్పిన నిప్పు లాంటి సాహితీమూర్తి అరుణాచలంగారి ఇంటి నుంచి దఫాల వారీగా ఆయన సాహిత్యాన్నంతా చేరవేశారు. అప్పట్లో భాస్కరరెడ్డి గారు నాకందించిన సాహితీ సహకారం వల్ల భాస్కరరెడ్డి నాకు ఎప్పటికీ మరువలేని మరపురాని అభిమాన పాత్రుడయ్యాడు.

ఈ మాట చాలా నిజాయితీగా చెప్తున్నా. అసలు నిజం అరుణాచలం గారికి దొరికిన పిచ్చికాయితం గాంధీ మహాత్ముడిలా దాచుకొని మనస్సుకొచ్చినప్పుడు దానిపై సాహిత్యపు జల్లులు కురిపించడం అలవాటు.

రచనలన్నీ ఇంకు రంగును బట్టి పేపరు ఆయుస్సు బట్టి జతచేయడం ఒక బ్రహ్మ ప్రళయం అయ్యింది. పాతకాయితాల వాసన, సశేషంగా వుండే రాతలు సంపూర్ణం చేయడం వల్ల కాయితాల బొత్తి వెయ్యి పేజీల సేకరణ అయ్యింది. ఆ విషయం సన్మాన సంఘానికి తెలియజేసినప్పుడు వారు సరిపడ నిధి లేదని, క్లుప్తంగా అరుణాచలం గారి జీవితం సాహిత్యం చిన్న హ్యాండ్‌బుక్‌గా తయారు చేస్తే ప్రింటు చేయగలమని చెప్పారు.

ఆ కారణంగా ''అరుణ కిరణాలు'' ప్రింటుకు నోచుకోలేదు. పర్యవసానంగా ''ఆచార్య అరుణాచలం గారి జీవితం సాహిత్యం'' అనే గ్రంథం రాశాను. ఆ పుస్తకాన్ని సన్మానసభలో అందరికి పంచి పెట్టడం జరిగింది.

''అరుణ కిరణాలు'' స్వయంగా ముద్రించాలన్న నిర్ణయంతో తెలుగు విశ్వవిద్యాలయం వారికి ఆర్థిక సహకారం కోసం అర్జీ పెట్టుకున్నాం, వారి సమ్మతి లభించింది. దురదృష్టవశాత్తు మేము పుస్తకం ముద్రణకై ఇచ్చిన కీర్తిప్రింటర్సు మూతపడింది. ఆ అచ్చు ప్రతి ప్రింటర్సు యజమాని ఆచార్య అరుణాచలం గారికి పుస్తకం అప్పజెప్పి వెళ్లిపోయారు. పనుల ఒత్తిడిలో అరుణాచలం గారు ఆ విషయం మరచిపోయి పుస్తకం నా దగ్గరే వుందన్న అభిప్రాయంలో వుండిపోయారు.

సార్ ఇంటికి పెయింట్ వేసే సందర్భంలో అటకల మీద కాగితాల కట్టల సరంజామాలోంచి ఈ పుస్తకం బైటపడ్డది. అరుణాచలం గారి మనస్సులోని అపోహలు తొలగి ''పుస్తకం దొరికిందమ్మ పంపుతాను. ద్రావిడ విశ్వవిద్యాలయం ద్వారా ముద్రించే అవకాశం వుందేమో చూడమని చెప్పారు.'' 1998లో పూజారి వెంకటేష్ అనే విద్యార్థికి 'అరుణకిరణాలు' ప్రెస్‌కి ప్రింటింగ్ ఇచ్చాము. తొందర్లో ప్రింటు అవుతుంది. ఈ లోపల నీ పరిశోధన కొనసాగించమని చెప్పడం, ఆ విద్యార్థి

ఎంతో నేర్పుగా సకాలంలో పరిశోధన పూర్తి చేయడం జరిగింది. ఆ పరిశోధన వ్యాసాన్ని చూసి అరుణాచలంగారు ఎంత శ్రమ పడ్డావమ్మ నన్నొక సాహితీమూర్తిగా నిలబెట్టడానికి' అని మెచ్చుకోవడం నాకు లభించిన, నేనెప్పటికీ మరిచిపోని అభినందనలు.

సకాలంలో పుస్తకం అందించలేని కారణంగా తెలుగు విశ్వవిద్యాలయం నుండి మంజూరు అయిన ఆర్థిక సహాకారం రాలేదు. అరుణాచలం గారి కోరిక మేరకు పట్టు వదలని విక్రమార్కుడిలా ద్రావిడ విశ్వవిద్యాలయం వారికి ముద్రణ కోసం ఏడెనిమిది సంవత్సరాల క్రితం అర్థించాను. ఇదుగో అదుగో చేస్తాం అంటూ ముగ్గురు రిజిష్టార్లు, ముగ్గురు వైస్ చాన్సలర్లు మారారు. పని జరగలేదు. అది ఇంతకు ముందే ముద్రించబడిందని ఒక అపవాదు, మరోసారి పక్కన పెట్టివుంది అనీ, మరోసారి ఫండ్స్ లేవని ఎన్నో సాకులు, అడ్డంకులు ఎదుర్కొన్నదీ 'అరుణకిరణాలు''.

చివరకు కుటుంబసభ్యులే పూనుకొని అరుణ కిరణాలు ముద్రించడం అరుణాచలంగారి పైన వారికుండే ప్రగాఢమైన అభిమానం చాటుతున్నది. వారికి మనసారా, హృదయపూర్వక ధన్యవాదాలు.

అరుణాచలంగారు రాసిన ''సాయి రామచంద్ర'' శతకానికి నేను ముందుమాట రాశాను. సత్యసాయి పట్ల వారికి వుండే శరణాగతి తత్త్వమే, అరుణ కిరణాలనే ఈ గ్రంథాన్ని ప్రచురణ యోగ్యం చేసింది.

భగవంతుడు భక్తుడికి ఎల్లవేళలా అండగా నిలుస్తాడు. మరుగు పడ్డ మాణిక్యాలను వెలికి తీస్తాడు.

.. అరుణాచలం గారి జీవితాన్ని జతచేస్తున్నాను.

జీవితం సాహిత్యం

ఆచార్య విశ్వనాథ అరుణాచలంగార్ని గూర్చి మనము నాలుగు మాటలు ముచ్చటించుకొనే ముందు కార్వేటినగరాన్ని గూర్చి కొంత తెలుసుకోవాలి. అరుణాచలంగారి మాటగా చెప్పాలంటే కార్వేటినగరం ప్రాచీనాంధ్ర సంస్థానాలలో ఒకటి. తరచి చూడగలిగిన వారికి వెయ్యేండ్ల చరిత్ర అందిస్తుంది.

ఒకనాడది మహా మండలేశ్వరుల ముఖ్యపట్టణం. ఇనవంశ రాజులు పాలించిన దొడ్డగడ్డ ధనలక్ష్మి ఘల్లు ఘల్లుమని ఖజానాలో నాట్యమాడిన ప్రాంతం. సంస్కృతాంధ్ర సాహిత్యాలకు మల్లెపందిళ్ళు కట్టినట్టి మాన్యసీమ. ఈ సీమలో విశ్వనాథ, ధనలక్ష్మీల ద్వితీయ వరప్రసాదంగా వీరు 14 మే 1986న జన్మించారు.

ఈ వూరు చిత్తూరు జిల్లాలోని పుత్తూరునకు 12 కిలోమీటర్ల దూరంలో వుంది. శ్రీకృష్ణదేవరాయల అష్టదిగ్గజాలను బోలిన ఋగ్వేది వేంకట నారాయణకవి, పాతిపెద్ది వేంకటరాయకవి, పాల మంగళం అప్పయ్యకవి, సారంగపాణి, శ్రీశైలకవి, ముడుంబ అప్పయాచార్యులు, రాయభట్టు, వీర రాఘవకవి, అనంతరాజు సుబ్బరాయకవి, గరుడాద్రి సుబ్రమణ్యకవి, వంటి మహాకవుల స్థావరమైన ప్రాంతమిది.

ఆ గాలులు పీల్చిన మన బాలకవిలో సాహిత్యమనే అరుణోదయ కాంతి పేరు పెట్టడంలోనే ప్రజ్వరిల్లింది. చదువు సంధ్యలతో మేటివాడై, ఆట పాటల్లో ఆదరంగా పాల్గొంటూ, పండుగ పబ్బాల్లో తల్లికి సాయం చేస్తూ, పండు వెన్నెల్లో చెలికాండ్ల నడుమ చేరి నాటకాల్లో నటిస్తూ, పద్యాలల్లుకుంటూ, వాటిని రాగయుక్తంగా అలాపిస్తూ, 'శభాష్ అరుణ' అని స్నేహితరాళ్లు మెచ్చుకుంటే కొంచెం సిగ్గుగా తలవంచుకునే తత్వమూ, నిగర్వమూ వీరి జీవితానికి నిండుదనాన్నిచ్చాయి. కార్వేటినగరంలో హైస్కూలు వరకు చదివి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్రంలో బి.ఏ. లో చేరారు. ఇదే విశ్వవిద్యాలయం నుండి 1957లో ఎం.యే. ఫస్టుక్లాసు ఫస్టు ర్యాంకులో పట్టా పుచ్చుకున్నారు.

1957లో మద్రాసులోని జైను కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. ఆ పైన మరో ఏడాది పాటు కాంచీపురంలోని పచ్చియప్ప కాలేజిలో పని చేశారు.

1960లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉపన్యాసకులుగా అడుగు పెట్టారు. 1968లో 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' నుండి 'టు బాడీ ప్రాబ్లమ్స్ ఇన్ హైడ్రో- డైనమిక్స్' అన్న అంశంపై పరిశోధన చేసి పిహెచ్. డి. పట్టాను పొందారు. 1985-86లో 'మేడిసన్'లోని విస్కాన్సిన్ యూనివర్శిటీ'లో తిరిగి పరిశోధన చేశారు. 1970లో రీడర్ పదవిని అధిష్టించారు. 1977లో ఆచార్య పదవికి చేరుకొన్నారు.

పది ఎం.ఫిల్‌లు, తొమ్మిది పిహెచ్.డి. డిగ్రీలు వీరి ఆధ్వర్యంలో వెలుగొందాయి. ఎగ్జామినేషన్ విభాగానికి కోఆర్డినేటరుగా, నేషనల్ సెమినార్ డైరెక్టరుగా, ప్రపంచ విశ్వవిద్యాలయ సర్వీసెస్ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ బుక్ సెలెక్షన్ కమిటీ మెంబరుగా, 'స్కూల్ ఆఫ్' మ్యాథమాటిక్స్ అండ్ ఫిజికల్ సైన్సెస్ డీనుగా పనిచేశారు. ఎన్.ఎస్.ఎస్. అడ్వైజరీ కమిటీ మెంబరుగా, 'తెలుగు అకాడెమీ బోర్డ్ ఆఫ్ ది గవర్నర్స్'లో ఒకరుగా భాషా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖకు గౌరవాధ్యక్షులుగా, నేషనల్ ఇంటిగ్రేషన్ కమిటీ గౌరవాధ్యక్షులుగా, ఇది అది అని లేక అన్ని శాఖల్లో విశేషంగా కృషిచేసి చివరిగా శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ప్రిన్సిపాలుగా గద్దెను అలంకరించారు.

''కృషితో నాస్తి దుర్భిక్షం'' అన్నట్టు శ్రమకు తగ్గ ప్రతిఫలాలు వీరికి లభించాయి.

పరిశోధకుడిగా 'ఫుల్ బ్రైట్ స్కాలర్ అవార్డు', తెలుగులో వ్రాసిన గణిత శాస్త్రానికి 1988లో 'తెలుగు అకాడెమీ అవార్డులు' వీరికి లభించాయి.

నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ వారి నుండి 'ఫెలో ఆఫ్ ది నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్' బిరుదు లభించింది.

1990లో 'ది బెస్టు టీచరు అవార్డు'ను చిత్తూరు డి.ఇ.ఓ గారు బహుకరించారు.

ఉత్తర అమెరికాలోని న్యూయార్కులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలకు వీరికి ఆహ్వానం లభించింది.

తెలుగు అకాడెమీ హైదరాబాదు 'స్టాండింగ్ కమిటీ' మెంబరు గాను, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయములోని ఫేకల్టీ ఆఫ్ సైన్సెస్ డీనుగా కూడా వీరికి గౌరవ పదవులు లభించాయి.

వీరు ముప్పై అయిదు ఏళ్ళుగా విశ్వ విద్యాలయ అధ్యాపక వృత్తిలో వుంటూ డిగ్రీ ఇంటర్ తరగతులకు పుస్తకాలు వ్రాయడంతో పాటు గణిత శాస్త్రాన్ని విశ్లేషిస్తూ అసంఖ్యాక వ్యాసాలు వ్రాశారు. ఈ విధంగా వీరి సంపూర్ణ జీవితం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అంకితం జేశారు.

కుటుంబ జీవితం: ఆచార్య అరుణాచలం. శ్రీమతి సుశీల దంపతులకు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె. శ్రీమతి సుశీల తండ్రిగారు శ్రీ పినాకపాణి వాస్తవ్యులు. విల్లి వాక్కంలో వారి తండ్రి శ్రీ సింగారం పిళ్ళై పేరు మీద అనేక విద్యాసంస్థలు నిర్వహించుచున్నారు. శ్రీ పినాకపాణి మాతామహులు చిత్తూరు పెద్దకాల్వ గ్రామంలో తెలుగు పండితులుగా వృత్తి నిర్వహించి మహాభారతాన్ని ద్విపద కావ్యంగా వ్రాయాలని సంకల్పించి ఆదిసభా పర్వాలు వ్రాసి అనుకున్న కావ్యాన్ని అసంపూర్ణంగా వదలిపెట్టి పరమ పదించారు. వీరి 'ధాతృసతీ, సుమతి, సరస్వతీ!' మకుటంతో వ్రాయబడిన సరస్వతీ శతకం చక్కని భక్తిరస ప్రధానమైన కృతి.

ఆచార్య అరుణాచలం జ్యేష్ఠ పుత్రుడు డా॥ పుదూరు సాయి సుదర్శన్ జ్యేష్ఠ పుత్రుని భార్య చి॥సౌ॥ శిరీష, వీరికి ఒక కుమార్తె చి॥సౌ॥ లోపాముద్ర. రెండవ కుమారుడు చి॥ సాయి పతంజలి వాషింగ్టన్ DCలో US ఫెడరల్ ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. న్యూయార్కులో యిపుడే విద్యాభ్యాసం ముగించి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. కుమార్తె చి॥సౌ॥ సాయి అనురాధ. భర్త డా॥ రవీంద్రతోపాటు న్యూయార్కులో నివసిస్తున్నారు.

ఆచార్య అరుణాచలంగారికి సాహిత్యంలో అభిరుచి కలగడానికి రెండు ముఖ్యకారణాలు. వీరి తాత పుదూరు అరుణాచలంగారి అగ్రజులు నగరం

జగన్నాథంగారు కవి పండితులు. కార్వేటినగరం సంస్థానాధీశుల కొలువులో పేరు ప్రతిష్ఠల్ని ఆర్జించిన కుటుంబం వీరిది. జగన్నాథం తండ్రిగారు విశ్వనాథ పిళ్ళై గారు తాహసీల్దారుగా ఉద్యోగం చేసినారు.

తాశీల్ దారు పుత్రుడై ధరణిలో దాఁ గురువాచార్య భ
వ్యాశీస్సుల్‌గొని శిష్యుఁడై కవులకున్ వాగర్థసంక్లిష్టతన్
దా శాసించెను రాజ రాజ సభలన్ ధన్యున్ జగన్నాథు ధీ
కోశావారును దారు నాదరమునన్ గొల్తున్ సదా భక్తియై

''మధురకవి శ్రీ ముకుంద దైవజ్ఞుల వేంకటేశ్వర శతకం నుండి''

జగన్నాథంగారు కట్టమంచి రామలింగారెడ్డి గారితో చిత్తూరులో చదువు కొన్నప్పుడు కుప్పనయ్య గారి శిష్యుడైనాడు. సహజ గంభీరమైన కవిగా కార్వేటి నగరంలో మన్ననలుపొంది చిరుప్రాయంలోనే పరమ పందించారు. గద్వాలకు వెళ్లి పండిత పరిషత్తులో పాల్గొని 'వర్షాశనం' పొందినారు. వెంకటగిరి రాజావారి సంస్థానంలో తన వైదుష్యాన్ని ప్రదర్శించి ఏక సంథాగ్రాహి అన్న బిరుదు పొందారు.

వీరి తాతగారు చంద్రశేఖర్ పిళ్ళై. రెండేళ్లు తిరుమలలో తరిగొండ వెంకమాంబవద్ద శిష్యరికం చేసి లేఖకుడుగా ఒక ఘంటాన్ని నిర్వహించారు. వెంకమాంబ యోగాసనంలో కూర్చున్నప్పుడు ఆమెచుట్టు ఎనిమిది దిక్కులలో ఎనిమిది మంది వ్రాయసగాళ్ళు ఘంటములు చేతబూని వెంకమాంబగారి ఆశుధారాన్వితమైన కవితా సామాగ్రిని వ్రాసి భద్రపరచేవారు. చంద్రశేఖర్ పిళ్ళైగారు రెండేళ్ళ పాటు ఒక ఘంటాన్ని నిర్వహించారు.

చంద్రశేఖర్ పిళ్ళైగారు జగన్నాథ పిళ్ళైగారు చేసిన రచనలు ప్రాచుర్యాన్ని పొందలేదు. ఇటీవల ఆచార్య అరుణాచలంగారి పూనికతో జగన్నాథం గారి సీసమాలిక ఒకటి అచ్చైనది.

ఆచార్య అరుణాచలం గారి తండ్రి రెండు దశాబ్దాల క్రితం పరమపదించారు. తల్లి గారు ఇటీవల కన్నుమూశారు.

డా॥ అరుణాచలంగారి ఒక సోదరుడు, సోదరిమణులు శ్రీమతి లక్ష్మీ

నరసమ్మ, శ్రీమతి లక్ష్మీకాంతం గారి తమ్ముడు డా॥ పి.వి.చంద్రశేఖరం సిద్ధార్థ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నారు.

శిష్యుల అభిప్రాయం:

'ఓ అరుణాచల మహాశయా!

''ఎంచగ సాటిలేరు. కనిపించరు మిమ్ములదో ప్రాణముల్
త్రెంచెడి క్లిష్టమ గణిత రీతులలోని అనంత భావముల్

ఇంచుక బాధ కూర్చక అనేక మనోహర బోధనాకృతుల్ కంచి ఉపన్యసించు అరుణాచల దేవ ఇవే ప్రణామముల్'' అని వీరి శిష్యులు కొనియాడేవారు.

ఆ మాట నిజమేనంటూ 1987 అక్టోబరు 20 గురువారము నాడు 'ఈనాడు'లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఏడుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయని, అందులో ఒకరు గణిత శాస్త్రానికి చెందిన అరుణాచలంగారని ప్రకటించారు. వృత్తిరీత్యా శిఖిరాగ్ర మన్ననలు పొందారు.

వీరి సంపూర్ణ జీవితంను తడిమి చూస్తే సాహిత్య సుందరి వీరిని 1956లో వరించినట్లు అర్థమవుతుంది. అప్పట్లో పద్య రచనల పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతిని గెల్చుకొన్నారు. ఈ విషయము తన స్నేహితుని ద్వారా విన్నప్పుడు మనస్సు ఉప్పొంగి.

''ఆంధ్రభాషను దిద్ది అందాలు నింపిన
ఆది కవియగు నన్నయ నేను
వాణి నేద్వకుమని వారించి కవితతో
తరియించినట్టి పోతన్న నేను.

గౌడ డిండిమ భట్టు కంచు ఢక్కను గొట్టి
నాడు వెలిసినట్టి శ్రీనాథుడ నేను.

వేదాం వారింప నీతులు వెల్లువై
నవతార మందు వేమన్న నేను.

ఆంధ్ర కవితా పితామహుడల్లసాని
పెద్దనార్యుడనే నేను వినుడమర
లనుచు, ప్రస్తుతము మరచి, అసహజములు
లోనయై మరచి ఆవలనేను సిగ్గు
పడితినియణువు వారి ప్రతిభజూచి'' అని

ఒప్పుకుంటూ తన సాహిత్య పరిశ్రమలో మెరుగులు తెచ్చుకున్నారు. కానీ ఏదో మూల సాహిత్య సుందరి తనను వరించినట్లు నమ్మకం కల్గింది.

''ఆమె ఒకనాడు నీల వర్ణాంబరములో వచ్చిందని''
''ఒకనాడు వీణనుకొని చక్కని రసపూర్ణగానమున్'' తెలిపిందని
''ఆమె కమనీయ కావ్యమై హాయి గొల్పిందని''
''ఆంధ్ర సాహిత్యనందనోద్యాన వికసిత''
''రమ్య కావ్య ప్రసూన సౌరభమ్ముగా వెలిసిందంట.''

''ఆమె సౌహృద భావ పర్యాప్తమైన
నాదు జీవిత మింక ధన్యమని తలతు కాల
కాల కల్లోదధిన్ దారి కానలేక
పెను తుపానున కలగు జీవితపు నావ
కామె చుక్కానియయ్యెనానోము ఫలము''

అని తలంచి తనకిచ్చిన సాహితీ సంపదతో ఎందరికో ఆహ్వానాలు, శుభాశీస్సులు, భాష్పాంజలులు ప్రశంసలు, స్మృత్యంజలులు, వీడ్కోలుపులు, నిజాయితీలో పల్కిన హృదయతను నిరూపించుకొన్నారు. ఆచార్య ఆరుణాచలంగారిని ఎలాంటి వాడయ్యా అని అడిగితే దానికి ''పొగడడమే కాని తెగడటం రాదంటారు వారిని పూర్తిగా తెలిసినవారు, అంతగా తెలియని వారు గూడ ఇదే అభిప్రాయం చెప్పారు. వారి వ్యక్తిగత జీవితం వివరించే సమయం లేదు కేవలం వారి సాహిత్యాన్ని విశ్లేషిస్తాను.

రచనల విశ్లేషణ!

వీరి సాహిత్యాన్ని ఖండకావ్యాలు, శతకాలు, కథలు, వ్యాసాలు, పద్యగేయ రచనలు, ఉపన్యాసాలు అనువాదాలుగా వర్గీకరించవచ్చును.

1. ఖండ కావ్యాలు:– 1. అనార్కలి, 2. తెగిన తీగల వీణ.

2. శతకాలు:– 1. సాయిరామ చంద్ర శతకం, 2. గణ గణ ఘంటా శతకం.

3. కథలు (అనువాదం):– 1. వాసవదత్త, 2. అందిన పిట్ట జారి పోయింది, 3. మరుపురాని విషాద గాథ.

4. వ్యాసాలు:– 1. రమణ మహర్షి జీవితం, 2. రాజా బొబ్బరాజు రామకృష్ణ రాజు జీవితం, 3. గణిత బ్రహ్మ శ్రీ సంజీవరామశర్మ, 4. కార్వేటినగరం కవుల ఘనత, 5. కార్వేటినగరం నారాయణవనం, 6. చిత్తూరు రచయితల మహాసభ.

పద్య గేయ రచనలు:

1. పండుగలు:– 1. ఉగాది, 2. దీపావళి, 3. సంక్రాంతి, 4. సంక్రాంతి లక్ష్మి.

2. ప్రకృతి వర్ణనలు:– 1. ఉషస్సు, 2. సూర్యాస్తమయం, 3. వసంతం వెళ్ళిపోయింది (24–1–60), 4. ఆమని చేసిన హాని (15–2–65), 5. వీడ్కోలు మన్మధకు ఆహ్వానం దుందుభికి.

3. ప్రశంసలు:– 1. జగద్గురు శ్రీశ్రీ చంద్రశేఖరం గారికి సరస్వతీ స్వాములస్తుతి, (1971 ఆగష్టు), 2. ఆనందమూర్తి, 3. జి.యన్. రెడ్డి, 4. ఆయిలర్, 5. శ్రీ కె. రామిరెడ్డి (5–3–77), 6. డా॥ బెజవాడ గోపాల రెడ్డి (26–7–77), 7. శ్రీ శ్రీ ఆచార్య వినోభా భావె, 8. ఆచార్య రాయప్రోలు సుబ్బారావు, 9. పుట్టపర్తి నారాయణాచార్యులు, 10. చంఘిజ్ ఖాన్, 11. డా॥ సి జె. రెడ్డి, 12. వి. గోపాల రెడ్డి.

4. సన్మానాలు:– 1. యన్. నాయుడుగారు, 2. వై. నరసింహా రెడ్డిగారు, 3. జయ చంద్రుడుగారు, 4. ప్రశంస ప్రమాణాలు (7–2–82), 5. జయన్ ఆచారి.

5. వీడ్కోళ్లు:– 1. పద్యనీరాజనం (26–7–1959), 2. పదవీ విరమణ కృతజ్ఞతలు (1–4–61), 3. వీడ్కోలు గీతాంజలి నీలకంఠంగారికి (12–12–71), 4. మంగళనీరాజనం మునిరత్నం శెట్టికి, 5. శ్రీ బి. శ్రీనివాసరావు గారికి, 6. నాగరత్నంగార్కి వీడ్కోలు, 7. డి.ఆర్. కె. సంగమేశ్వర్.

6. శ్రద్ధాంజలి:– 12–1–66.

7. స్మృత్యంజలి:– 4–3–77.

8. ఇతరములు:– 1. మనోభావాలు, 2. ఈశ్వరాంబ దినం (18–3–72), 3. చంద్ర మండలంలో రాకెట్ (6–5–37), 4. వివాహం, 5. క్రొత్త సుభాషితం (20–7–72), 6. కవిత్వ తత్త్వ విచారం (23–6–72), 7. భూదానగీతం, 8. విచిత్ర మానవుడు, 9. మానవ జీవితం, 10. హాస్టల్ డే, 11. శంకరంబాడి సుందరాచారి, 12. మేఘ సందేశం, 13. పండిత పరిషత్తు ఆహ్వానం, 14. పద్యాల పోటీ, 15. పొయిటిక్ జెస్టిస్, 16. ఆమె (1–11–65)

9. అనువాదాలు:– 1. గాంధీ ఫిలాసఫీ మూడు జవాబులు, 2. అయినా పర్వాలేదు.

10. రేడియో ప్రసంగాలు:– 1. శంకరంబాడి సుందరాబారి, కవిత్వంపై దాశరధితో పాటు చర్చా ప్రసంగం (1973) ప్రసంగం, 2. గణితము ఆధ్యాత్మిక చింతన (ఆల్ ఇండియా రేడియో, కడప), 3. సాహిత్యంలో గణితం (ఆల్ ఇండియా రేడియో, తిరుపతి), 4. సుందరాచారి కవిత్వంపై పులికంటి కృష్ణారెడ్డితో ఇంటర్వ్యూ (ఆల్ ఇండియా రేడియో మద్రాసు)

11 ఉపన్యాసాలు:– 1. భాషా సంఘం: ఆంధప్రదేశ్ విశ్వనాధ సత్యనారాయణ, జాషువాల శత జయంతి ఉత్సవం (1995), 2. భాషా సంఘం ఆంధ్రప్రదేశ్ బహు భాషా కవి సమ్మేళనం, (యస్.వి.యు.) 1993 సం॥, 3. జ్ఞానోదయ ఆలయం 'జ్ఞాన శిల్పం' తిరుత్తణి 19వ వార్షికోత్సవ సందర్భంగా 5–5–92 మంగళవారం సభకు అధ్యక్షత వహించారు, 4. మిత్ర సాహితీ కార్వేటి నగరం (2–04–1994) సభకు అధ్యక్షత వహించారు, 5. కడప జిల్లా రచయితల మహాసభ 27–2–79

విషయం 'చలన చిత్రాలు సమాజం' వక్తగా వ్యవహరించారు, 6. నగరి ఉన్నత పాఠశాల ప్రారంబోత్సవం ఏప్రిల్ 8-7-34 ముఖ్యఅతిథి, 7. నూతలపాటి గంగాధరం స్మారక సభ 30-5-1995 న అధ్యక్షత వహించారు, 8. మేడసాని మోహన్ అష్టావధానం ప్రధమ ప్రదర్శన యస్.జి.యస్. కాలేజీలో జరిగింది. పుట్టపర్తి నారాయణచార్యులు ముఖ్య అతిథి ఆచార్య పి.వి. అరుణాచలంగారు అధ్యక్షులు, 9. ఏ. పి. ఓరియంటల్ సొసైటీ యాన్యువల్ మీట్ పావులూరి మల్లన గణితంపై ఉపన్యాసం 1970, 10. గణితము ఆధ్యాత్మిక చింతన' సాయి సేవా సమితి తిరుపతి, 11. ముచ్చేలి సదాశివరెడ్డి 'విశ్వ గుణాలోకం' గ్రంథం పై వ్యాఖ్యానం తిరుత్తణి, మదనపల్లి, తిరుమనాపల్లి, 12. సాయి తత్వం గూర్చి సాయి సేవా సమితుల్లో అనేక ఉపన్యాసాలు, ఇచ్చారు.

14. విద్యా విషయక ప్రసంగాలు:- 1. నేటి విద్యా ప్రమాణాలు, 2. బోధనశిక్షణ, 3. ఆధునిక బోధనారీతులు, 4. విద్య - శీలం, 5. విద్యసంస్కారం, 6. విద్యయువజన సంఘాలు, 7. విద్య యువజనులు సంఘ సేవ, 8. విజ్ఞాన శాస్త్రం - దేశ పురోగతి, 9. అంతరిక్ష పరిశోధన, 10. భారతదేశ గణిత శాస్త్రజ్ఞులు, 11. ఉన్నత విద్య తెలుగు మాధ్యమం, 12. విజ్ఞాన శాస్త్ర పారిభాషిక పదములు ఉత్పత్తి వికాసం, 13. పారిభాషిక పద సామాగ్రి ఉత్పత్తి వికాసం, 14. ఉన్నత విద్య తెలుగు మాధ్యమములో పాఠ్య పుస్తకాలు, 15. కార్వేటి నగరంలో వెల్లివిరిసిన సాహిత్య సంపద, 16. శ్రీనివాస రామానుజం శతజయంతి సందర్భంగా అనేక విశ్వవిద్యాలయాలలో దాదాపు 30 ఉపన్యాసాలు ఇచ్చారు, 17. పాక్ ముస్లిమ్ జ్యామితి, 18. గణిత అవధానాలు, 19. జిడ్డు కృష్ణమూర్తి భావనా సరళి, 20. జిడ్డు కృష్ణ మూర్తి విద్య, 21. జిడ్డు కృష్ణమూర్తి "మానవ జీవన విధానం'', 22. జిడ్డు కృష్ణమూర్తి మౌలికత, 23. సి.నా.రె అజంతా సుందరి ఊరూరా వ్యాప్తి చేశారు, 24. సి.నా.రె కర్పూరం వసంత రాయలు సి.నా.రె గేయాలు, మొదలైనవి, 25. వేమన, 26. పోతన, 27. నన్నయభట్టు, 28. విజయనగర సాహిత్యం, 29. శతక సాహిత్యం, 30. ధూర్జటి కాళహస్తీశ్వర మహత్మ్యం, 31. జంధ్యాల

పాపయ్య శాస్త్రి, 32. వేణుగోపాల శతకం, 33. శివతాండవం, 34. పర్యావరణ కాలుష్యం, 35. అంతర్ గ్రహమానము.

సాహిత్య పరిచయం:

ఆచార్య అరుణాచలం గారు గణిత శాస్త్రంలో సిద్ధహస్తుడన్న విషయం జగమెరిగిన సత్యం. వారి ఉపన్యాసాలు విన్నవారు వీరి పాండిత్య ప్రకర్షకు అబ్బురపడతారు. కానీ చాలా మందికి వీరి రచనా వ్యాసంగాల విషయం పెద్దగా తెలియదు. నిరాడంబరత మాటున వీరి సాహిత్య ప్రజ్ఞ దాగి పోయింది. తన మనోఫలకంపై ఉదయించిన అనేక భావనల్ని కరుణ, దయ, ప్రేమ ప్రకృతి ఆరాధన వంటి సుగుణాలు కుప్పపోసి నూర్చారు. అవినీతిని ఆధ్యాత్మిక దారుల ద్వారా అరికట్టవచ్చని సత్యసాయిని శరణు వేడారు. తన హృదయంలో విరబూచిన పద్య కుసుమాలను రెండు వందలకి పైగా సాయి చరణాలు సన్నిధికి అర్పితం చేశారు. మంచి, చెడు, మధ్య వూగిసలాడే సమాజ స్థితిని, శతాధిక గతిని, పరిస్థితిని గణ గణ గంటలో, ఘంటాపథంగా చెప్పారు. వీరి ఉపన్యాసాలు చాలా వరకు సాహిత్య పరమైనవి. కొన్ని ముఖ్యమైనవి మాత్రం ఇక్కడ చేర్చాను.

వీరి ఖండ కావ్యాల్లో సభ్యత మించని శృంగారం. పొంగి పొరలే కరుణ రసం కాంతివంతగా కాంతులు కనిపిస్తాయి. సౌమ్యత, నిర్మలత. సచ్ఛీలత, నీతి, ధర్మం వంటి మేలైన గుణాల వడపోతే వీరి సాహిత్యం.

ప్రధానమైన ఖండ కావ్యాలపరిచయం: –

1. అనార్కలి: –

'అనార్కలి' పసిప్రాయంలో చేసిన అద్భుత ప్రతి సృష్టి, వస్త్వైక్యము, ధారాశుద్ధి, భావ గాంభీర్యం. పద గుంభనము, శైలి సౌకుమార్యం అనే పంచపాత్రలో శృంగార కరుణ రసాలను కలబోసి వొలికించారా అనిపిస్తుంది. ఆ నడక తీరు చదివే వారికి హృదయాహ్లాదాన్ని అందిస్తుంది.

కథ: – అనార్కలి సంధ్యవేళ సరస సంగీత సాధన సలిపే సమయంలో,

సామ్రాట్టు వలపు పట్టి. శృంగార పురుషుడు సలాము చూపులకు ఆమె తాకింది. కన్నులు కన్నులు కలుసుకున్నాయి. ఆనాటి రాత్రి సలీం కలల భారంతో కలత నిద్ర చెందారు. మరునాడు ప్రేయసిని చూడాలనే కోరిక పెరిగి పోగా నృత్యశాలను సందర్శించే నెపంతో బయలు దేరాడు. అక్కడ సౌరహ విసర్పణ చేస్తూ ప్రియురాలు కనిపించింది. చూచి ముగ్ధుడైనాడు. తాన్ సేన్, కళావిదురుడు వీరి ప్రణయేచ్ఛ పసిగట్టి కొంప మునుగునని భావించి వారించాడు. గుర్నారుకు తెలిస్తే ప్రమాదమని, హెచ్చరించాడు. అనార్కలి అతనితో ''సర్వ భారతి సామ్రాజ్య సార్వభౌములు మీరు సామాన్య నేను, హస్తిమశకాంతరమ్మగుట అవగతమ్మే. తగనిదాన జహాపనా: తమకు నేను'' అని వాపోయింది. ''ప్రణయలోకాన నివియన్ని పనికి రావు. స్వర్గ సీమల నలరింతు సఖియ నిన్ను'' అని రకరకాలు ఆమెకు ప్రేమ సంకెళ్ళు బిగించాడు.

వీరి ప్రణయ రహస్యం తెలుసుకున్న గుర్నారు పథకం పన్ని ఫలరసమని చెప్పి, అనార్కలి చేత మధువు త్రాగిస్తుంది. రాజ్యసభలో నృత్యం చేస్తూ ఉన్మత్తయై, సోలుతూ హృదయ సుందరునిపై పడి ప్రణయమ్ము చూపిస్తుంది.

సభా మర్యాదను భంగ పరచినందుకు నిప్పులు త్రొక్కిన మాన్సింగ్, ''భద్ర గజముల చేత'' న్యాయ నిర్ణయము చేయించి, పర్యవసానంగా అనార్కలి జీవ సమాధి శిక్ష విధిస్తారు. శిక్ష యువరాజు చెవులకు చేరక ముందే అమలు జరుపబడుతుంది. 'కాలి పగిలిపోయిన పరిపక్వము నొందిన కాగితంలాగ' ఆమె జీవితము కాలి బూడిదైనట్లు కవి వర్ణించాడు, అనార్కలి ఎన్నో ప్రక్రియల్లో ఎందరిచేతో రచించబడింది.

గేయ రూపంగా మలచిన ఈ రచన ఎక్కడా తెగకుండా శైలి సుందరత కాపాడుకుంటూ హృదయాహ్లాదంగ రచించి తనదంటూ ప్రత్యేకతను చూపారు కవి.

2. తెగిన తీగల వీణ:–

అరుణాచలం గారి అధునాతన సృష్టి. ఆరంభంలో మధురాతి మధురంగా గానం వినిపిస్తూ ఉంటుంది. అంతఃపురంలో రాజనర్తకి నళిని పాదుషా ఎదుట

నాట్యం చేస్తుండగా పవనుడు మోసుకు వచ్చి ప్రణయ గీతాన్ని ఆమె చెవికి అందిస్తాడు. ఆమె హృదయంలో శాంతం మటుమాయమై గుండెలపై బండ మోపినట్లు అవుతుంది. ఒక్కక్షణం నృత్యాన్ని ఆపుతుంది. నృత్యాన్ని ఏల ఆపితివని పాదుషా ప్రశ్నించినపుడు హస్తరేఖ చూపి నృత్య భంగిమలో దుఃఖాన్ని దాచుకుంటుంది.

రాజు నిద్రమత్తులోకి జారుకున్న పిమ్మట చెలికత్తెను పిలిచి రాజ వీధిలో గానం ఆలాపించే వాడిని కనుగొని తరిమి, నా మనస్సు లోని దుఃఖాన్ని బాపు, అంటుది. సరి అంటూ చెలికత్తె మెరుపు తీగలాగా వెళ్ళి రాజనర్తకి వీధి ఇది. ఆమె ఆజ్ఞను, తలదాల్చి, ఇక్కడినుండి నిష్క్రమించుమని చెపుతుంది. అదే సమయంలో రాజనర్తకి అంతఃపుర వాకిట నుండి చూస్తుంది. గాయకుడు ఆమెను వీక్షించి గుర్తించి ఆనందభాష్పాలు. ఆమెను చేరుకోవాలని ఆతృత పడతాడు. ఆమె తన హృదయ గవాక్షాలతో పాటు నిజ గవాక్షాలను మూసింది.

ఈ సంఘటనకు పూర్వం 'నళిని', 'జయరాజు' తల్లి సంస్కృతి ఒడిలో గాన నృత్యాలతో కాలం గడిపే ప్రణయ జీవులు. జహంగీరు వాహ్యాళి కెళ్ళినప్పుడు, నళిని నృత్య గానాల రవళికి పరవశం బొంది తన అంతఃపురంలో అంతటి సుందరాంగి లేదని, ఆమె అనార్కలిని బోలినదని తలంచాడు. రాజ్యానికి వెళ్ళి భృత్యుల్నిపిల్చి, పదిహేను రోజులలో పంపగలమని చెప్పి, ఆమెను తోడ్కొని రమ్మని, తన యాజ్ఞగా చెప్పి పిలవమన్నాడు. ఏడాది గడిచిన తర్వాత జయరాజు భిన్న హృదయుడై ఆ వూరు చేరాడు. మరునాడు మహారాజు గాయకునికై గాన సభ ఏర్పాటు చేసినప్పుడు, నళినికి పిలుపు అందింది.

ఒక ప్రక్క తాను చేసింది పాపం అన్న పరితాపం, మరో ప్రక్క తన బ్రతుకు బాట నేర్పరుచుకొనే హక్కు తనకున్నదన్న ధీమా, ఈ రెండు ద్వంద్వ ప్రవృత్తుల మధ్య నలిగిపోతున్న సమయంలో, గాన సభకు ఆహ్వానం వచ్చిందని చెలికత్తె చెపుతుంది.

రాజసభలో జయరాజు వాయిద్యాలు వద్దని సభికులంతా స్వప్నావస్థలోకి

వెళ్ళేలా మహా అద్భుతంగా గానం చేశాడు. నళిని హృదయం అశ్రుతర్పణతో నిండింది. ప్రభువు అతనికి అనేక బహుమతులు సమర్పించాడు. వాటిని అతడు స్వీకరించక నళినిని చూసి, ఆమె నాది. ఆమెను ఇప్పించమంటాడు. జహాపనా గుండెలు మండి అతనికి ఉరి శిక్ష విధిస్తాడు. ఆనాటి రాత్రికే శిక్ష జరుపబడుతుంది. అర్ధరాత్రి ఢిల్లీ దివాణంలో గంట పన్నెండు మ్రోగగా నళిని గుండెల్లో సమ్మెట మ్రోగింది. నేను చేసిన ఘోర దుష్కృతికి, నిష్కృతి లేదని సౌధమ్మే తనను చూసి నవ్వినట్టుగా భావించి, ఉత్తరం వ్రాసి, విషపానం సేవించి, నేల కొరిగింది.

చక్కని వర్ణనలతో సోయగాన్ని చిందించిన ఈ రచనకు ప్రేరణ బానర్ రాసిన ఆంధ్రప్రభలోని చిన్న కథ అని తెలుస్తున్నది.

శతకములు

1) గణ గణ ఘంటా:

''చిన్నలము కాము చేయము
చిన్న పనుల్ పెద్ద తనము చెల్లమి ఎటుచే
య న్నేర్తుము పెద్దవి కను
కన్నిత్యము చేయ మేమి గణ గణ ఘంటా!''

''కవితకు క్లుప్తత, ఆప్తత
జవ సత్వాల్గుప్తత రస జాలమ్మున్ చే
ర్చు విశిష్టత గూర్చు, మహా
కవితగ వికసింపజేయు గణ గణ ఘంటా!''

అని పై విధముగా తన 'గణ గణ ఘంటా' శతకములో రెండు వందల పద్యాలలోనే అనేక సామాజిక విషయాలను సూక్ష్మంగా స్పృశించారు. ఇందులో వేమన రచనా రీతులు ద్యోతకమౌతున్నాయి. భావంలోనే గాక భాషలోను ఆతీరు అగుపిస్తున్నది.

2) సాయి రామ చంద్ర శతకం:–

మంజుల మధుర గానాని కనుగుణంగా భావాన్ని మలుస్తూ శ్రోతల

మనస్సులపై సత్యసాయి ముద్ర పడేలాగ రెండు వందల పద్యాలను ఈ శతకంలో పొందుపరిచారు. ఆత్మవిజ్ఞానమనే మతాన్ని కైవసం చేసుకొని, కవితా హృదయాన్ని రంగరించి, వెలువరించి, విశద పరచిన శతక రచన ఇది. 'మతము = సత్యము+అహింస' అన్న విషయాన్ని విడమరిచారు. అనేక రకాలుగా సాయి మహిమలు కొనియాడారు.

అనువాదాలు కథలు

1) ప్రేమ తత్వం వీరి ఊపిరి: –

''మనుష్యులు, అక్రమస్తులు, అన్యాయస్తులు, స్వార్ధపరులు.
అయినా పర్వాలేదు మనుషుల్ని ప్రేమించు
నువ్వు మంచి చెయ్యి.
ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి చేశావని నిందిస్తారు.
అయినా పర్వాలేదు మంచి చెయ్యి''
అనేది వీరి అనువాద సాహిత్యంలోని సారాంశం.

2) వాసవదత్త అనువాద కథ (భారతిలో ముద్రిత): –

హిందీ మాతృక పండిత గోవింద వల్లభ పంత్.

వాసవదత్త సజీవ స్వర్ణ విగ్రహం. ఆమె పుట్టుకతో వేశ్య. సువిశాల రమణీయమైన ఆమె. భవన ప్రాంగణమందు భిక్షార్థియై వచ్చిన బౌద్ధ భిక్షువులు నిలబడ్డారు. ఆమె దృష్టిని ఉపగుప్తుడనే భిక్షువు ఆకర్షించాడు. ఆమె అతనిని సమీపించి భిక్షాపాత్రను ముందుకు చాపమంటుంది, నువ్వు రిక్తహస్తాలలో ఏమి యివ్వగలవని అతడు ప్రశ్నిస్తాడు. తాను ప్రేమ ఆలింగనాన్ని ఇస్తానంటుంది, హృదయాన్ని యిస్తానంటుంది. రకరకాలుగా అతనిని ప్రలోభ పెడుతుంది. ఇహ సౌఖ్యాలను జయించిన అతడు ఇది సమయం కాదని కొద్దిరోజుల్లో వస్తానంటాడు. తర్వాత ఇందులో ఉపకథగా ఉపగుప్తుడి ఔదార్యాన్ని స్పష్టం చేసే కథ కల్పింపబడింది. ఉపగుప్తుణ్ణి ఒకనాడు సింహం కబళించనున్న తరుణంలో ఒక ధనుర్ధారి అడ్డుకొని దాన్ని హతమార్చాడు. అతనితో సంభాషించి అతని మనస్సుని అహింసా మార్గానికి మళ్ళించాడు.

మరొకసారి వాసవదత్త తటస్త పడింది. తిరిగి తన హృదయ సౌధాన్ని అధిష్ఠించమని వేడుకొంటుంది. అతడు ఏడాది గడువు లోపల వస్తానంటాడు. అతడు పెట్టిన గడువుకు రెండు రోజుల ముందు అతిలోక సౌందర్యాన్ని కాంక్షించి ఒక లక్షాధికారి ఆమె యింట చేరాడు. సంగీత నాట్యాలు ముగిసిన పిమ్మట వాసవ దత్తలో ధన పిశాచం ప్రవేశించి పచ్చల కైవారంతో ఆతడిని హతమార్చింది. అప్పుడే భిక్షువు వాసవదత్త వాకిలి తట్టాడు. ''భిక్షు వచ్చేసావా?'' అని అడుగుతుంది. లేదు నీ కళ్ళుమూసుకుపోతున్నాయి. చూసి పోదామని వచ్చానంటాడు. నువ్వు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటుంది. దానికింకా ఒకరోజు గడువుంది అంటాడు.

ఆమె గావించిన అకృత్యం బట్టబయలైంది. న్యాయాధికారి అప్పటికప్పుడు తీర్పు చెప్పగా కళ్ళుపీకి, ముక్కు, చెవులుకోసి, కరములు ఖండించబడి, రక్తం కారుతూ వుంటే, ఈగలు ముసురుతుంటే. విసురుకోను చేతులు లేని ఆమె స్థితిని భయానక భీభత్సాల ప్రతి రూపంగా కరుణ రసం వెల్లువై పారేలా రచించాడు.

అలాంటి పరిస్థితిలో భిక్షువు ఆమెని సమీపించి పలకరించాడు. ఆమె శిరస్సును తన హస్తంతో నిమిరాడు. ఆమె అతనిని గుర్తుపట్టి ఎందుకొచ్చావు? ఎవరికై వచ్చావు? అని నిందిస్తుంది.

అతను సోదరీ! అని సంభోదించి రావాల్సిన సమయానికే వచ్చానని నేత్రాలు లేకున్నా, అంతర్నేత్రాలతో భగవంతుని సాక్షాత్కారం చేసుకోమని ఉపదేశించి, ఆమెను తన పవిత్ర కరాలతో శాంతి నివాసానికి మోసుకు వెళతాడు.

కవి ఈ రచన ద్వారా మానవులకు ఆధ్యాత్మిక ప్రేరణ కల్పించాలని ప్రయత్నించి సఫలీ కృతుడైనాడు.

గణిత చరిత్రలో మరుపురాని మరో విషాధగాథ :

1832లో ఒక రైతు ప్యారిస్ నగరం వెళుతూ తుపాకితో పేల్చబడి దారి కడ్డంగా పడి వున్న మృతదేహాన్ని చూశాడు. అలా దిక్కు లేక చచ్చిన వాడు ఎవడో గాదు ఎవరిస్టిగాల్వా అతడు ప్రతిష్ఠ నిలబెట్టుకోడానికి బలవంతంగా సవాలుకు

దింపబడి నిర్దాక్షిణ్యంగా చంపబడ్డాడు. ఒక స్త్రీతో వీరికిగల సంబంధం కారణంగా ఈ విషాద సంఘటన జరిగింది. ప్రతిభావంతులను వారంతా ఇతన్ని మిడి మిడి జ్ఞానంతో కించపరచి, అలక్ష్యం చేసిన కారణంగా అతడు జీవిత కాలంలో వెలుగు చూడలేదు.

అతడు మరణించాక 300 మంది రిపబ్లికన్లు చేరి అతనిని స్మశానానికి మోసుకుపోయారు. బ్రతికున్నప్పుడు మనసిచ్చి మాటలాడని వారు సైతం స్మారక సభలు జరిపారు. స్మృతి గేయాలు రచించారు. ఎంత విచిత్రమైనదీ మానవ జీవితం అంటాడు కవి.

ఒక శతాబ్దం తర్వాత విఖ్యాత ఫ్రాన్సు గణిత వేత్త 'జోర్డాన్ గాల్వా' పరిశోధనలను ప్రపంచానికి తెలిపేందుకు ప్రయత్నించాడు. 'గాల్వా' రచనలు అంతరర్ధాలను పూర్తిగా అర్ధం చేసుకొనేందుకు ఒక దీర్ఘ జీవితకాలం కావాలి అనిపించింది. అంత గొప్ప వ్యక్తి కేవలం మానవులలోని ఈర్ష్య వల్ల నశించి పోయాడన్నది రచయిత యిక్కడ చెప్పదల్చుకున్న విషయం.

నక్షత్ర మండలం:

ఖగోళశాస్త్ర విషయాలను గూర్చి శాస్త్ర పరిచయం లేని వారికి, ఆసక్తికరంగా ఉపన్యాసాలివ్వడం, వ్యాసాలు వ్రాయడం, ఇదే విధంగా గణిత శాస్త్ర విషయాలను జనరంజక వ్యాసావళిగా వెలువరించారు. విశేష పరిజ్ఞానాన్ని పంచాలన్న తపన ఆయా రచనల్లో సువ్యక్త మయ్యింది.

అందిన పిట్ట జారి పోయింది:

ఇది హిందిలో జయశంకర్ ప్రసాద్ వ్రాసిన కథకు అనువాదం. అందమైన పల్లెసీమలో బుల్ బుల్ పాటలు వింటూ కాలం గడిపేది 'శిరి'. ఆమె స్నేహితురాలు, నీ చేతుల్లో బంధింపబడిన బుల్ బుల్ పిట్ట ఇపుడేదీ కనపడ్డం లేదే అని అడిగింది.

ఆమె నిట్టూర్చి సీతాకాలంలో తమ గుంపుతో పాటు వెళ్ళింది. వసంతం వచ్చినా రాలేదు అంది. ఓ మనోహర సంధ్యా సమయంలో ఆమెలో ఒక భావన రేగింది.

హిందూ దేశంలోని ఒక వీధి మొగసాలలో భోజనం లేక నీరసించిన వ్యాపారస్తుడు సామాగ్రిని గృహస్తునికి అమ్మ జూపుతున్నాడు. గృహస్తుడు అరువు కిచ్చి పొమ్మంటాడు. యువకుడు తాను అరువుకిచ్చే స్థితిలో లేనంటాడు. తన దగ్గర ధనరాశులుంటే హిందూ దేశ గృహస్తుల కిచ్చి యువకుడి నెత్తి మీది భారాన్ని దింపే ప్రయత్నం చేస్తే బాగుంటుంది అని శిరి అనుకుంటుంది. కాని ఆమెకు అంతటి శక్తి లేదు. తండ్రి క్రూరుడు. అందుకు సమ్మతించడు.

కొన్ని ఏళ్ళకు ఆమెకు ఓ ధనవంతుడితో పెండ్లి జరిగింది. దుర్బలుడు పొడుగరి అయిన పై యువకుడు పెద్ద బరువు మోసుకొచ్చాడు. ధనవంతుడు తన భార్యకు బహుమతిగా ఇవ్వాలని వాటి వెలను గూర్చి ప్రశ్నించాడు, అవి ధరకు ఇచ్చేవిగావని, బహుమతిగా మాత్రమే ఇస్తానంటాడు. వూరికే అయితే వద్దంటాడు సర్దారు. నేను కొంత విశ్రాంతి తీసుకు వచ్చి, వస్తువులు తీసుకు వెళతానని చెప్పి వెళ్ళి, అతను తిరిగిరాడు. శిరి అతని భారాన్ని దింపగలిగింది గానీ ప్రతిఫలం ఇవ్వలేక పోయింది. ఆమెకు అలా బహుమతి వదిలిన వ్యాపారస్తుడు ఆమె ప్రియుడు. ఈ విషయం నర్మ గర్భితంగా కథలో చెప్పబడింది. సామాన్య అంశాన్ని తీసుకొని శైలిలో ప్రత్యేకత చూపుతూ ఆంధ్రుల మనో ఫలకం మీద శాశ్వతంగా నిల్చేలా తెలిగించాడు.

పద్య రచనలు గేయాలు

తెలుగు సంస్కృతిని తల్లివలె ఆదరించే సంస్కారం వీరిది. అది సాహిత్యంలోనూ ప్రతిబింబిస్తున్నది. వీరి రచనల్లో దీపావళి, సంక్రాంతి, ఉగాది రచనలు సరిక్రొత్త భావనలతో ఎలాచోటు చేసుకొన్నాయో గమనిద్దాం.

"పచ్చని పట్టు చీర కనుపండువు లీనగా తెల్ల పూలతో ముచ్చటకాహ్వానం
గురియు ముత్తయిదువుల్ వలె దోచె వేప చెట్లెచ్చట చూచినన్...."

ఉగాది వేప చెట్లలో ఇంత సౌందర్యాన్ని చూడగల కవి మరి వొకరున్నారా?

ఉపస్సు: ఉపస్సుతో పాటే కవి తన కవితా హృదయాన్ని క్రింది పద్యంలో మేల్కొలుపుచున్నాడు.

''లెమ్మిక మేలుకొమ్ము; కదలింపు ఘంటము మంజు వాక్ప్రపూ
రమ్ములు చిందుకైఁ తలను వ్రాయించు; లోక హితమ్ము గూర్చు భా
వమ్ములు జాలువార రసవంతముగాక ఉషః సతీ ప్రియాం
కమ్మున జేరి నీ కవిత కాంతుల నీను మనీషి భూమికన్''

వారి సాహిత్యం వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని ఈ పద్యం పట్టి ఇస్తుంది. లోక హితం కూర్చాలన్న కోరిక. దానికి తగిన సాహిత్యం కండబలం ఉండబట్టి కవితలు కర్ణ సుధారసమ్ముగా తీరాయి.

దేశభక్తి:

విశాలాంధ్ర అవతరణం జరిగినపుడు కవి హృదయం ఆనందంతో పొంగు వారింది.

''ఆంధ్రజనని! సుగుణ తెలంగాణ సకియ
కలసి చల్లగధాన్యరాశులకు సిరికి
దాపురమైన బక యింటి కాపురమ్ము స
లుప పూనిరి ఎదదలు పులకరింప''

అని తన హర్షాన్ని వ్యక్తం చేశారు.

ఈ కవి మనస్సెప్పుడూ దేశ సౌభాగాన్ని కాంక్షిస్తుంది.

1988 జనహార్ లాల్ మరణం తర్వాత లాల్ బహుదూర్ శాస్త్రి మరణం కవిని మనోవేదనకి గురి చేసింది. ఆ బాధను ఓర్వలేక తన కలంతో వ్యక్తం చేశారు.

''భారత గగన ప్రభాకరు జవహర్
మరణమేఘ మింకను మాయనిదె
అప్పుడే గుండియలవియు నట్టుల వచ్చె
శాస్త్రి అస్తమయము విషాద వార్త
భారత వసుమతీ దారిద్రమేమిటో
రతనముల్ వరుసగా రాలిపోయె.

దాస్యబంధము వీడి స్వతంత్ర రీతి
కొత్తగా రూపు రేఖను కూర్చుకొనెడి
ఈ ప్రజాస్వామ్యమును నిర్వహించునట్టి
స్వార్థమెరుగని దేశ సేవకులు వారు''

అందరూ స్నేహితులకు హితులకు శుభాకాంక్షలు చెపుతారు. కానీ ఈ దేశభక్తుడి హృదయంలో ప్రాణానికి తెగించి పోరాడి జయం పొందిన యుద్ధ వీరులకు శుభాకాంక్షలు చెప్పడం ధర్మంగా తోచింది.

''పరదేశములగోరి భండనాలొనరింప
తల పెట్టి ఎఱుగనీ ధర్మభూమి
పొలిమేరలను దాటి కలుషిత హృదయములు
ప్రచ్ఛన్న సేనలై భరతవీర
పుత్రుల నెదిరింప శత్రు భీకరమున్
సంగ్రామ మొనరించి జయము గాంచినారని''

వారి కోలాహలాన్ని నేత్రపర్వం చేస్తూ మకర సంక్రాంతి పుష్పలక్ష్మి అయ్యిందని వినూత్న భావకల్పన చేశారు.

చంఘీజ్ ఖాన్: –

కవి మనస్సుకు సత్యమని తోచిన భావాన్ని నిర్భయంగా, స్పష్టంగా సువ్యక్తం చేయడం. చంఘీజ్ఖాన్ పద్యరచనలో అగుపిస్తున్నది.

చంఘీజ్ఖానును అందరూ నెత్తురు కూడు తినేవాడని, అతని జీవితాన్ని తారుమారు చేసి అతనిపై కట్టుకథలు అల్లి, భావిచరిత్రను అగుడుపాలు చేశాడని ప్రజలు నిందిస్తారు. కానీ అతడు ఉత్తముడన్న అభిప్రాయం కవిగారిది.

''రాజ్యము వీరభోజ్యము'' పరాక్రమవంతుడే సంభావనలందు సంపూర్ణుడు

కాగలడన్న న్యాయాన్ని అనుసరించి జీవించాడని, ఇతడు చంఘీజ్‌ఖాన్‌ని సమర్థిస్తాడు. ఇతని రచనల్లోని నిజాయితీ మనల్ని ఆలోచించేలాగా చేస్తున్నది.

వివాహం: –

వివాహ విషయంమీద వీరికున్న అభిప్రాయం మెచ్చదగ్గది. ''కాడిగట్టని ఎడ్లు మేడిదున్నగ లేనట్లే'' వివాహం అనే బంధం లేకుంటే జీవితం సాఫీగా సాగదు. అలిగే వధూవరుల మధ్య పొందిక ఉండాలి. ఇలా ఎన్నో అభిప్రాయాల్ని పద్య రచనల ద్వారా వెల్లడిచేశాడు. దాదాపు వివిధ అంశాలపై కేంద్రీకృతమై యాభై వరకున్న పద్య రచనలనన్నిటిని వివరించడం కుదరదు గనుక కొన్నింటిని మాత్రమే రుచి చూపించడం జరిగింది.

గాంధీ ఫిలాసఫీ: –

అనువాద సాహిత్యాల్లో 'గాంధీ ఫిలాసఫీఅండ్ దేర్ అన్సర్స్' అన్న యస్. యమ్.తివారీ రచనకు అనువాదం. ఇది పూర్తిగా స్వేచ్ఛానువాదం. 1972 'గాంధీ శాంతి ప్రతిష్ఠానం' వారు కోరిన మీదట వీరు అనువదించారు. మతం, చరిత్ర, సామాజిక శాస్త్రం, వేదాంతం, నీతిఅను అంశాలపై గాంధీ గారి అభిప్రాయాలను పండు వలచి పెట్టినట్లు సులభంగా వివరించాడు. దీని ముందుమాట చదివితే తప్ప ఇది అనువాదమన్న స్పృహ మనకు కలుగదు. గాంధీని మెచ్చుకోలుగా వీరొక మాట అన్నారు.

''సులువుగ నీతులు చెప్ప
గలవారే ఎల్ల వారు; గాంధీ వలె చే
తలలో నీతులు చెప్పం
గల మహనీయులు సుకృత్తు గణ గణ ఘంటా!

గాంధీ తత్వాన్ని తెలుగు చేసి సర్వమత సమ్మతమైన ఆత్మానుభవాన్ని పొంది, పాపభీతి, దైవ చింతనల నడుమ సాహిత్య రచనలు గావించినట్టు వీరి రచనలు వలన స్పష్టమౌతున్నది.

గణిత శాస్త్ర వ్యాసాలు:–

గణిత చరిత్ర, గణితశాస్త్రజ్ఞుల జీవితాలు, గణిత శాస్త్ర పరిశోధన, మొదలైన గణిత శాస్త్రాంశాలపై తెలుగులో దాదాపు 30 ప్రముఖ వ్యాసాలు వెలువరించారు. ఇవి వివిధ పత్రికల్లో ముద్రితములైనవి, వాటిని సంకలనం చేసి గ్రంథ రూపంలోకి తీసుకరావాలని, వీరి సన్మాన సంఘం తీర్మానించింది.

ఇవి గాక వైజ్ఞానిక శాస్త్రానికి, సాహిత్యానికి సంబంధించి అనేక వ్యాసాలు అముద్రితాలుగా వున్నవి. వీటిని కూడా ప్రచురించాల్సిన బాధ్యత మన మీదుంది. ఈయన రచనలన్నీ దాదాపుగా అముద్రితాలు. వీటిని వెలువరించి తెలుగు సాహిత్య ప్రియులకు అందించగల్గితే తెలుగుతల్లికి నీరాజనం పట్టినట్టవుతుంది. సహృదయులు, ప్రచురణ కర్తలు. ముందుకు వచ్చి మీ సేవలు అందించవలసిన అవసరం ఎంతైనావుంది.

డా॥ కట్టమంచి మహాలక్ష్మి

కృతజ్ఞతలు

అప్పుడప్పుడు వ్రాసి ఉంచినవి, ప్రచురించినవి – కవితాఖండికలు అరుణకిరణాలుగా మీ ముందుంచుతున్నాను – చెదురుమదురుగా డైరీలలో, నోటు పుస్తకాలలో పడిఉండిన రచనలను గ్రంథస్థం చేయడంలో సోదరి డా॥ కట్టమంచి మహలక్ష్మి కృషి ఎంతో ఉన్నది. వారికి నా కృతజ్ఞతలు.

నేను 1995వ సంవత్సరం మేనెల చివర శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ–ఉద్యోగ విరమణ చేసినప్పుడు నన్ను ఎంతో ఆదరణతో సన్మానించిన మిత్రమండలి సౌజన్యం కూడా ఈ గ్రంథావిర్భావానికి మరొకకారణం. వారందరికీ కృతజ్ఞతలు.

విద్యార్థి దశనుండి నా కవితలను విని, నన్ను ప్రోత్సహిస్తూ వచ్చిన మిత్రులు ముగ్గురు శ్రీ R.S.V. నరసింహరాజు, అడ్వకేట్ చిత్తూరు, డాక్టర్ G.M. నాయుడు, విస్కాన్సిన్ యూనివర్సిటీ, USA, శ్రీ G. సీతారామాచార్యులు, అసిస్టెంట్ డైరెక్టర్ (రిటైర్డ్), ఐసిఎంఆర్–టిబి రీసెర్చ్ సెంటర్, చెన్నై వీరికి ఈ కృతిని అంకితం చేస్తున్నాను.

నాలో కవితా వాసనను కలిగించిన మాఅమ్మ శ్రీమతి తాయారమ్మ గారిని స్మరించవలె. వారు వీలైనప్పుడల్లా మా పెదతాత కీ.శే. నగరం......

పెదతాత కీ.శే. నగరం...... (శ్రీమతి తాయారమ్మ గారి భర్త) గారి సాహిత్య జీవితాన్ని రసవత్కథలుగా, స్ఫూర్తిదాయకంగా వినిపించేవారు. తాత జగన్నాథ కవి గారు డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి గారికి సహపాఠి. సుప్రసిద్ధులు కుప్పనయ్యంగారి ప్రియశిష్యుల్లో ఒకరు – కార్వేటినగర సంస్థాన పండితులు– వేంకటగిరి, గద్వాల సంస్థానాలలో సత్కారములు పొందినవారు – వీరికి, అమ్మగారికి భక్త్యంజలులు.

నిండు నూరేళ్ళు జీవించి, కార్వేటినగర కీర్తికి ఒక దీపస్తంభంగా ఉండిన

తాతగారు కీ.శే. ముకుందదైవజ్ఞులు, మధురకవి బిరుదాంకితులు, స్మరణీయులు. వారి నుండి నేనెంతో స్ఫూర్తి పొందాను.

ఈ సాదాసీదా కవితలను ఆదరించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు. శ్రీ కె. సుదర్శనం గారికి, మధురకవి శ్రీ ఇరువారం లోకనాథంగారికి, శ్రీ కాణిపాకం లింగన్నగారికి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ N. గోపిగారికి, ఆర్థిక సాయంచేసిన తెలుగు విశ్వవిద్యాలయాధికారులకు కృతజ్ఞతలు. ముఖ చిత్రం సమకూర్చిన శ్రీ బాలిగారికి, చక్కగా ముద్రించిన తిరుపతి కీర్తి ప్రింటర్సువారికి కృతజ్ఞతలు.

తిరుపతి **ఆచార్య పి.వి. అరుణాచలం**

31-10-2001

కృతజ్ఞతలు

గణిత శాస్త్రవేత్తగా , విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా, ఉపకులపతిగా ప్రసిద్ధులైన మా నాన్నగారు, ఆచార్య విశ్వనాధ అరుణాచలం గారు, తన తొలినాళ్ళనుంచీ తెలుగు సాహిత్యం పైన ఎంతో మక్కువతో జీవించారు. ఆయన తీరికలేని ఉద్యోగజీవితానికి సాహిత్య సృజన నిరంతరాయమైన ఉపనదిలా సాగివచ్చింది. తాను రాసిన కొన్నికవితలను ఆయన అరుణ కిరణాలు అనే పేరుతో పుస్తకంగా కూడా ప్రచురించారు. ఆయన రాసిన మరికొన్ని రచనలతోబాటూ యిలా ఆయన కవితలనంతా సమగ్ర కవితా సంపుటంగా రూపొందించి ప్రచురించగలిగినందుకు మాకెంతో సంతోషంగా వుంది. ఈ సందర్భంగా సహధర్మచారిణిగా ఆయనకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించిన మా అమ్మ, శ్రీమతి సుశీల గారిని స్మరించుకుని స్ఫూర్తిని పొందుతున్నాము. వారిరువురికీ ఇష్టమైన పుస్తకాలను ప్రచురించి తెలుగు పాఠకలోకానికి సమర్పించగలిగినందుకు ఆనందిస్తున్నాము .

మానాన్నగారి మిత్రులు, అభిమానులు, శిష్యులు అనేకమంది తోడ్పాటు లేకపోయివుంటే ఈ పని యింత సమగ్రంగా జరిగి ఉండేది గాదు. వారందరికీ మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. .

కార్వేటి నగరానికి చెందిన 'మిత్ర సాహితి ' 'అభ్యుదయ నాట్య మండలి' సంస్థలకు చెందిన మిత్రులనందరినీ ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాము.

తనకు కార్వేటినగరంతో వున్న అవినాభావమైన అనుబంధాన్ని హృద్యంగా చిత్రించిన ఆయన స్వీయచరిత్ర ను పుస్తకంలో అదనంగా చేర్చాము.

ఈ పుస్తకం ముద్రణకు ముందుమాటలు రాసిన ఇరువారం లోకనాధం గారికీ, సీకాయ పట్టెడ సుదర్శనం గారికీ, ఇప్పుడీ కొత్త ప్రచురణకు విపులమైన పీఠిక రాసిన ఆచార్య కట్టమంచి మహాలక్ష్మి గారికీ మా కృతజ్ఞతలు.

రచయిత, సాంకేతిక పరిజ్ఞాని, పెద్ది సాంబశివరావుగారి తోడ్పాటు వల్లనే ఈ పుస్తకాన్ని అందంగా తీసుకురాగలుగుతున్నాము. వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.....

ఈ పుస్తక రూపకల్పనకు కావసిన సహాయ సహకారాలనందించిన ఆచార్య మధురాంతకం నరేంద్రగారికి ధన్యవాదాలు....

పుస్తకప్రచురణ మాత్రమేగాకుండా మిగిలిన అన్ని రకాల చేయూత నందించిన రెయిన్‌బో ప్రింట్ ప్యాక్ అధినేత నరేంద్ర గారికి కృతజ్ఞతలు.

పుదురు సాయి సుదర్శన్
పుదురు సాయి పతంజలి
అనురాధ సాయి రవీంద్రన్

తెగిన తీగల వీణ

(చారిత్రాత్మక గేయకావ్యం)

(1)

''ఆనాడు నీయాట: లతి మనోహరముగా
నలరార భూదేవి పులకించె హృదయేశ్వరీ!

హృదయమ్ము సంతోష సదనమ్ముగా వెల్గ
పరవశమ్మున మేను వర కళాధీనమై తరియించె దేవీ!

నీ చరణ మంజీర నిస్వనము గగనాన
అప్సరాంగనలు విని అచ్చెరువు నందిరట ఓ కోమలాంగీ!

మృదు మధురమౌ పాట హృదయ తంత్రులు మీట
గలవు పొత్తిళ్ళలో వలపు కౌగిళ్ళలో
దివ్యాను భూతులను తెలిపించి మురిపించు ఓ దేవదేవీ !

ఆనంద మకరంద నిష్యంది వదనమ్ము వీక్షించి
దివ్యానుభూతిలో తేలి ఎన్నాళ్ళాయె దేవి !

అతి లోక సౌందర్యవతి వంచు నినుగాంచు
జగమెల్ల గొంతెత్తి చాటెదను కన్పడుము జవరాలా!''

ఈ గీతి మధురమై సాగి పోవుచునుండె
దివినుండి అమృతము భువిలోకి ప్రవహించి నట్లుండె
గాంధర్వ గానంబు సంధించి నటులుండె
హృదయాన మల్లియలు వికసించి నటులుండె
శ్రీ కృష్ణ గానమ్ము చెలువారి నటులుండె
రాచబాటను పోవు ఆబాల గోపాల
మట్టె పరవశమందె వీనులకు విందుగా

గానామృతము సోక
ప్రతియొకరు స్వర్గాన సంచరించిన యట్లు
స్వాంతమ్ములు ప్పొంగ సంతోష పడిరి
రాజ భవనమ్ములో రాచ పరివారమ్ము
నిశ్చేష్టమై పోయి నిలుచుండిపోయినది

అపుడంతి పురములో రాజనర్తకి నృత్య
భంగిమలు విలసిల్లె
ఆస్థాన సంగీత సమ్మేళనమ్మంది
కన్నులకు పండువై కర్ణ పేయమ్మయ్యె
కళరూపుగా గొన్న కాంత మన రాజనటి
లలిత లలితమ్ముగా భావ భరితమ్ముగా
హావ యుక్తమ్ముగా నటియించి పాదుషా
ఎడద దూసుకు పోయె
కలకంఠి గానమ్ము కర్ణామృతమ్ముగా
దివ్య సౌందర్యమ్ము దేదీప్య మానముగ
సమ్మోహనమైన నృత్య సమ్మేళనము వెలయింప
తిలకించి పులకించి పరవశుండై యుండి పాదుషా

ఆ కమ్ర గానమ్ము ఆ ప్రణయ గీతమ్ము
పవనుండు మోసికొని పాటలో లీనమై
రాజనర్తకి చెవుల రంజింప జేయగా
అరమోడ్పు కనులతో అంజలిని ఘటియించి అట్టె నిలిచిందీ.
అపుడు నర్తకి జూడ ఆశ్చర్యమును గూర్చె
శిలయైన స్వర్లోక శిల్పమో యన్నట్లు
శృంగార మొలకించు బంగారు తీవ యన
లలితాంగి కన్పట్టె కలరవమ్మును వినుచు
ఒక క్షణ మటులుండి చకితయై రాజనటి

వికటమ్ముగా తోచి గడగడ వణకినది
ఎడద శాంతిని వీడ తడబడుచు నడచినది.
ఆణి ముత్యములనగ అశ్రువులు జార్చినది.
గుండెపై బడి యెవరో బండ పెట్టిన యట్లు
శోక తిమిరము లలమ సుదతి వేదనలతో
స్రుక్కి పోయిన క్షణము పాదుషా తెప్పరిలి
పరమాదరమ్ముతో పలికె నర్తకితోడ

''ఓ జరీనా! ఏల నాట్యమ్ము నిల్పితివి
ఆశయమ్మున కేమి అవమాన మైనదా?
సంశయమ్మును వీడి చరియించు నర్తకీ
నీ రూప సుందరత నీకళా చతురతల
వీక్షించి సర్వమ్ము నీరాజనంబుగా
నీ యెదుట నర్పింతు'' ఓ సుందరాంగీ!
భవదీయ గాంధర్వ కమనీయ గానమ్ము
విని యెడద నీయెదుట కర్పూర ఖండమై కరిగిపోయినది
అరుణార్క కిరణ సంస్పర్శ కతమ్ము గా
వికసించు అరవింద విధముగా హృదయమ్ము
పరిమళించెను వినుము పరితాప మెందుకే ?
అని పాదుషా యడుగ హాసరేఖను జూపి
''నాట్యభంగిమ,'' యంచు నిజము నెడదను దాచె

అర్ధనిద్రను మునిగి ఆనందమున ప్రభువు
పట్టించుకొనలేదు ఇట్టి సంఘటనమ్ము

రాజనర్తకి యపుడు నృత్యమ్ము ముగియించి
గుండెబరువున తూలి అడుగుపై అడుగునిడి వెడలి దాసిని పిలిచి
''రాజవీథిని యెవడొ నిర్భయమ్ముగ పాట
పాడుచున్నాడడుగొ ఆలకించవే దాసి

శీఘ్రమ్ము అచ్చోటు చేరి వానిని తరిమి
చిత్తవైకల్యమ్ము తీర్పవే చెలియా!''

అని చెప్ప నా దాసి విని కరుణ మోమున పుట్టి కాల్వలై కన్పట్ట
''పరదేశి వాడెవడొ ప్రణయమ్ము భగ్నమై
ప్రేయసికి దూరమై; విధి క్రూర దృక్కోణ
విదళిత హృదయుడై అరుదెంచి మొగసాల
ఆలపించుచు నుండెనమ్మా!
పోనిమ్ము మనకేల వానిత్రోలెడి పాపమమ్మా!''

''ఆ గీతి విని మనసు శోకతప్తమ్మయ్యె
వెడలి వేరొక వీధి మరలి పొమ్మనవె చెలి!
''సరి'' యంచు చెలికత్తె మెఱపుతీగయై వెడలి
పరదేశి యున్నయెడ కరుదెంచి యిట్టులనె

''ఓ గాయకోత్తమా! ఏగవలె నిటనుండి
రాజ నర్తకివాడ రా తగరు పరులెవరు.

అదిగో నర్తకి సౌధ మల్లదిగో కనుగొమ్ము
నటి యాజ్ఞ తలదాల్చి పటువేగమున పొమ్ము
ఓ గాయకోత్తమా! ఏగవలె యిటనుండి
అనినంత గాయకుడు అచ్చెరువుతో జూచి
వికటమ్ముగా నవ్వి చెలికత్తెతో ననియె
''రాజనర్తకి వీధి రాకూడదేలకో''?
''శృంగార రసపాయి జహంగీరు ప్రభువిచట
విశ్రాంతి గై కొనగ వేంచేసి యున్నారు
ఆటంకములు గల్గ ఆగ్రహించును ప్రభువు''

''పాదుషా విశ్రాంతి సౌధమ్ము గానోపు''
నని యాతడన చెలికత్తె వినయమ్ముతో ననియె

''పాదుషా విశ్రాంతి సౌధమ్ము గాదు ఇది
రాజనటి జరీనా రహినుండు సదనమ్ము
రాజనర్తకి నాట్య రమణీయతను గాంచి
ముదమంది మనసిచ్చి సదనమ్ములో జేరి
సతతమ్ము పాదుషా సంగీత మధురిమము
చవి జూచు చుండు
''అతి లోకసౌందర్య వతి యామెగా నోపు''
నని చెప్పి గాయకుడు చనుచుండె నటి వాటి

పాట పాడుట మాని పరికించి శిరమెత్తి
అంబర చుంబిత సౌ ధాగ్ర వినిర్మిత
దేహళిని నిలుచుండి దేదీప్యమానముగ
కన్పట్టె లలితాంగి గాయకున కపుడు
గత మెల్ల తక్షణము మతికెక్క నా మనిషి
అడుగు ముందున కిడక అచటనే నిలుచుండి
తన తపస్సు ఫలించె తనపాలి దేవుండు
కరుణించె ననియెంచి ఆనంద బాష్పములు
నయన పాత్రల నిండ '' నళినీ! నళినీ!'' యంచు
నర్తకిని పరికించి భవనమ్ము చేరుటకు పరుగెత్తు వానిగని
రాజనర్తకి యెదను అంపమ్ము కోతగా
దేహళిని బంధించి తిరిగి చూడక వెడలి.
పాన్పుపై పవళించె బాష్పములు రాలగా
తలగడను తలదూర్చి విలపించె రాజనటి
ఈటెతో నొడలెల్ల పోటు పొడిచిన యట్లు
తుదిలేని వెతలెన్నొ హృదయమ్ము మథియింప
ఇనుప పిడికిలితోడ ఎదను పిసికిన బాధ
తో స్రుక్కె రాజనటి దుఃఖ తాపమ్ముతో

సౌధాంగణ స్థలిని సందీప్తి కరమైన
మందార వృక్షమ్ము రాజనటి చేష్టలకు
చిత్తమ్ము చివుకుమన ''ఛీ'' యంచు తలవంచె
ఒకనాటి హృదయేశు నెడద వికలమ్మగుట
వీక్షించి నయనాల దుఃఖాశ్రు కణములగు
ప్రసవ రాశిని రాల్చి పరితాపమును జూపె
తలవని తలంపుగా పెళపెళార్భటులతో'
పిడుగు నెత్తిన బడగ తడబడుచు గాయకుడు
నడివీధి బడి నడచె
చిత్తహృదయమ్ములో చిమ్మ చీకటి క్రమ్మ
భగ్న వాంఛా జనిత భావరేఖా కీర్ణ
నయనములతో నతడు పయనమ్ము సాగించె
బారుమని ఏడువక చిరునవ్వు చిందించె
ఆ హాసరేఖార్థ మవగతము గాదు!

(2)

తల్లి ప్రకృతి యొడిని చల్లగా చెలువారి
సెలయేటి కౌగిటను విలసిల్లు గ్రామమ్ము
సాంద్రామ్ర విటపి వన సంచయావృత మనో
హరదృశ్య సంకీర్ణ వర గ్రామ సీమయది.
ఇటు ప్రక్కనొక లోయ అటుప్రక్క నొక సరసు
సహజ సౌందర్యమ్ము సంధింప జేసికొని
కలకూజితమ్ములకు నిలయమై, కన్నులకు పండువై
నెమ్మనము మురిపించు
మహిత లావణ్య విద్యోత మాన స్థలము.

ఆ మనోహర గ్రామ సీమలో ప్రభవించె
జయరాజ బాలకుడు నళినియును జన్మించె

చిన్నారి మురిపెంపు చేష్టలకు నెలవగుచు
కాల ప్రభావమున ప్రణయైక జీవులై
జయరాజు నళినీసతి చిత్తమ్ము లొకటి గాన్
సిగ్గు దొంతరలతో
అతి ప్రశాంతోద్యాన సీమలట
తమతోడ ప్రణయానుభూతితో
పరవశమ్మును జెంద
చరియించు నాజంట
పరమానందాస్పద మౌచు
ఆ జంట కలకంఠ గానమ్ము విని జగము
అమర సంగీతమనే అబ్బురమ్మున మున్గి
ఉబ్బితబ్బిబ్బౌను

లలిత జంగమ స్వర్ణలత యగుచు ఆ నళిని
నటియింప దివ్యాంగ నా గణము ముదమందు
సంతతము నవ వసంతమ్మని మదినెంచి
దిగులెల్ల విడనాడి దినమొక్క నిముసముగ
ప్రణయ భావనలోన వలపు కౌగిళ్ళలో
వసియించు చుండగా

మధుమాస మరుదెంచె నాచోట నొక యేట
స్వర్ణ ఖండమ్మునకు సౌరభ్య మబ్బినటు
గ్రామ పరిసర సీమ నవ వసంతుడు వచ్చి
సౌందర్య విస్తృతిని సకల విధముల జేసె
శిశిరమ్ముతో విసిగి వేసరిన తరులెల్ల
మధుమాస మరుదేర మంజులాభరణములు
మహిత సంతోషమున ధరియించి కన్పట్టె
నేత్ర పర్వముగ విరబూచె చామంతి

శోభలను జిమ్ముచు గులాబి కన్నెలు వెలయ
పూలతోటకు క్రొత్త చెలువమ్ము చే కూర
హల్లీసకములతో మల్లీ మందారముల
కుల్లమది పల్లవింప సంధిల్లెను స్వర్గసుఖము.
పున్నాగ పాదపము విన్నాణమున వెల్గె
క్రొంగ్రొత్త చెలువమును క్రముక భూమిరుహము
కయి చేసికొనె నపుడు ప్రియ వసంతుని రాక
ప్రకృతిని పులకింప
మధురాధరమ్ములో దరహాసమును నింప
ఆ మనోజ్ఞ ప్రభా స్తోమతకు గ్రామమ్ము
సౌందర్య నిర్ఝరిని స్నపితమై తనరారె ॥

★★★★★

తండ్రి తాతలు నాడు తనకుగా రాజ్యమ్ము
ఆర్జించిరని యెంచి చీకు చింతలు లేక
శృంగార పురుషుడై జహంగీరు పరిపాలనము
వెలయించే భర తోర్వి
అతి వినోదాసక్త హృదయుండు పాదుషా
లలిత కళలకు మురిసి చలిత చిత్తుడు నయ్యె
తనముందు తనతండ్రి శిష్ట పరిపాలనము
వెలయింప తన్మార్గ గతిగల్గి శాంతమై
రాచ కార్యమ్మెల్ల రహి సాగు చుండగా
చీకుచింతలు లేక శృంగార పురుషుడై జ
హంగీరు మనుచుండగా
మదికి సంతృప్తిగా మధుమాస మరుదెంచె.

★★★★★

క్షితి వసంతుని నిండు కౌగిలిని కైసేసి
కనుల పండువు గొల్పు ధవళ పక్షమ్ములో
ప్రకృతిని దర్శింప పాదుషా పయనమ్ము సాగించె

పరమ సంతోషమున పరిజనము వెనురాగ
చైత్ర మాసద్యుతులు నేత్ర పర్వమొనర్ప
మార్గ మధ్యమ్ములో వర్ధిల్లు గ్రామమ్ము
జయరాజ నళినీ ప్రియ మంజు భాషలను
విలసిల్లు గ్రామమ్ము కన్పట్టె, విడిది గొనె సమ్రాట్టు
కైవారము లొనర్చి కాన్కలను గైకొనుచు
సామంతులరుదెంచి సమ్రాట్టు కర్పించి
ప్రభువు మది మెప్పించి పరితుష్టులైనారు

అత్తరును పన్నీరు చిత్తమ్ము నలరింప
సాంబ్రాణి ధూపమ్ము సాంకవ సుగంధమ్ము
సంతోష మొనరింప సౌఖ్య సంధాయక
ప్రత్యేక నిర్మిత పట కుటీరమ్ములో ప్రభువు
స్మేరహృదయాబ్జమ్ము పులకించి వికసింప
విమలాసనమ్ముపై విరజిల్లె పాదుషా

ధరణి దేవికి ద్యుమణి పసిడిచాయల వెల్గు
పట్టు పుట్టములిచ్చి మృదు కపోలమ్ముపై
ముద్దులిడి మురిపించి శోణ యవనిక ముందు
శోభాయ మానముగ పశ్చిమానను నిల్చె
ప్రహ్లాద మూర్తియై మధుమాస సాయాహ్న
మంజులత తిలకింప ఆంతరంగికులతో ప్రభువు
అరుదేరె వాహ్యాళికై, అల్లంత దూరాన
అతిమనోహరముగా ఆనందప్రదముగా

శోభలను చిందించు ఉద్యాన వనసీమ
　　కనుచూపులను దాకె తత్సీమ వీక్షింప
ఆంతరంగికులతో వాహ్యాళి పొడిగించె

సంధ్యాంగనా ఫాల ఫలకమున కాశ్మీర
　　తిలకమన సూర్యుండు సింధూర కాంతులను
సంధించుకొని వెళ్గి పశ్చిమాంబుధి మునిగె
　　వృక్షశాఖికలందు పక్షిసంతానములు.

పర్యుత్సు కత్వమున భాషించుకొనుచుండె
　　వినువీధి నౌక కొన్ని విహరించుచుండె

తపను తపనకు అలసి సొలసిన
　　ధరణి దేవికి చలువ నివ్వగ
పరమ సంతోషమున చంద్రుడు
　　పరుగులిడి వచ్చెన్!

కామినీ హృత్పద్మ భూమికి
　　మధుర స్మృతులను పులక లిచ్చుచు
యామిని వల్లభుడు వచ్చెను
　　స్నిగ్ధ చాంద్రీ ద్యుతులతో!

అంబరమ్మున తారకల కడ
　　సంబరమ్మున తిరుగు కా
దంబినులతో దోబూచు లాడెను
　　చంద్ర బింబము వేడ్కతోన్!

పవన బాలకుడపుడు
　　భూమిజమ్ముల చేత
చామరమ్ములు వేయ
　　హాయిగా చనుచుండె పాదుషా

లలిత లలితమ్ముగా స్మృతి పథమ్మున భావ
దృశ్యములు కన్పట్టె తెరతీసినట్లుగా
మధుర మధురమ్ముగా మంద్ర మంద్రమ్ముగా
సంగీత శబ్దమంజరులు జహంగీరు చెవులెక్కె
మంజీర శింజితము రంజిల్లె వెనువెంట
మంజు శింజానముల మాధురికి ముదమంది
అవధాన చిత్తమున అతిలోక సంగీత
శ్రుతులలో లీనమై వడివడిగ అడుగు లిడి
వెడలి నయ్యెడ కపుడు
తోడివారలు కూడ పాదుషా వెన్నాడ
అతి మనోహర వనికి అరుదెంచి రెల్లరును
అతి పురాతనమైన దేవాలయం బదిగొ
ఆలయావృత ప్రకృతి భయభక్తి సంయుక్తి
బృందావనమ్ముగా నందన వనమ్ముగా
భగవంతు సన్నిధిని భాసురమ్ముగ నుండె
సురలోక ప్రకృతికి ప్రతిబింబమో యనగ
రాధతో మాధవుడు రమియించు వనమనగ
ఆ మహోజ్వల రజని
ఆరామ తల మెప్పె

వకుళ భూమిరుహము సహకార తరురాజి
శాంత శర్వరి వేళ చంద్రికా ప్లావితోద్యానవన సీమలో
సంగీత నాట్యముల సమ్మేళనమ్మునకు
స్వాంత మందుప్పొంగి ఆనంద బాష్పముల
నొకటొ రెండో రాల్చె అల్లదిగొ కన్పట్టె
మల్లీ నికుంజమ్ము మందార మంజులము
మాలతీ మంటపము

పరమ సంతోషమున పాదుషా మెలమెల్ల
మాలతీ మంటపము పూల పొదరింటి కడ
నిశ్శబ్దముగ జేర ఆంతరంగికులెల్ల
అచ్చోటనే నిలిచి వీక్షించినారు

ప్రహ్లాద హృదయులై ప్రణయ జీవులు వారు
ఇంతింత యనరాని సంతోష సంపదలు
సకలంబు తమవిగా నొకరు పాటలు పాడ
వేరొకరు నాట్యమ్మాడ! ప్రణయాను భూతులకు
నీరాజనం బెత్తి భువినుండి భువి వీడి
దివి లేక దివిసుఖము కైసేసి కొనివారు
భాసిల్లు చున్నారు! ప్రణయాంకితమైన
మధుర భావము లొలుక
బాహ్యప్రపంచమ్ము విస్మరించిరి వారు
సంపూర్ణ వికసిత
లలిత కుసుమ పరీ మళ భరిత లహరితో
సమీప భూమిరుహము చామరమ్ములు వేయ
ప్రసవ భూషిత మంజు పవన కంపిత లతలు
పుష్ప వర్షము కురియ నళినీ ప్రణయినీ నాట్య
కళ కంకితమైన జయరాజు హృదయాన
మల్లియలు వికసింప వికసిత హృదయాంత
రాళమ్ములో నుండి గంధర్వ గానమ్ము
కర్ణ పేయమ్ముగా వర్ధిల్లె నాక్షణము

గాత్రమును మనోరంజకముగ వంచి
చంద్ర వదనమ్ములో సోయగము వెలయించి
ప్రాణసఖు నవనీత చిత్తమును మురిపించి
మరపించి మధురిమలు కురిపించి

యామినీ వల్లభుని నెమ్మదిని కరగించి
నళిని నృత్యమ్మాడె నవమోహనమ్ముగా!

అరమోడ్పు కనులతో ఆస్యబింబము వంచి
కమల సంకాశ పాణిబంధము మనోజ్ఞముగ వంచి
తలలోని విరులెల్ల పరవశమ్మును జెంద
పెదవుల కతీతమౌ పలుకులను, కనుకొలకులను పలికించి
నళిని నాట్యమ్మాడె నవ మోహనమ్ముగా!
కమ్ర జ్యోత్స్నాసిక్త గండయుగ్మము తోడ
చాంద్రీ సమాశిష్ట కంఠ హారశ్రేణి
కమనీయముగ నుండ
మంజిష్ఠ పదయుగ్మ మంజీర శింజితము
మహితసమ్మద మీయ, కపిశ వర్ణాంశుకము
కౌశేయ కంచుకము ధరియించి ఉపవనిని
దేవ సుందరి వోలె దేదీప్యమానముగ
నళిని నాట్యమ్మాడె నవమోహనమ్ముగా!

కటి పైన వాలుజడ నటనమ్ము లొనరింప
నెఱికురుల సోయగము పరికించి విరులెల్ల
చిరునవ్వు చిందింప పవమాన వీచికలు పరిమళమ్ముల నింప
మాలతీ మంటపము హారతుల నందింప
నళిని నృత్యమ్మాడె నవమోహనమ్ముగా! ప్రసన్న మైతీవ
వంపు సొంపులలోన సోయగము కురిపించి
అనిమేషనయనాల వీక్షించు పాదుషా చేతమ్ము మురిపించి
అతిలోకమై పరగు అమరగానమ్ములో అభినయము సంధించి
ఘలుఘల్లుమని కాళ్లగజ్జెలలు మ్రోయించి
నళిని నాట్యమ్మాడె నవ మోహనమ్ముగా !
పరిపక్వ మాధుర్య యౌవనామృత పాత్ర

పూర్ణ వికసిత మంజు మల్లికా సఖ గాత్ర
స్మేర నీరేజ సుస్నిగ్ధ సుషమానేత్ర
మంజిష్ఠ పాదముల శింజితము వెలయించి
నళిని నాట్యమ్మాడె నవమోహనమ్ముగా!

వినువీధి తారకలు చిరునవ్వు చిందింప
అచ్చరలు గగనాన పరికించి భ్రమియింప
ఆశాంతములు మెచ్చి ఆశీస్సులందింప
స్థల జలజపాదముల చిలిపి గజ్జెలు మ్రోయ
ఝణ ఝణ ధ్వని కంకణ శ్రేణి వెలయింప
నళిని నాట్యమ్మాడె
నవమోహనమ్ముగా!

నటియించి అలసిన నళిని, పరవశుడైన
జయరాజు నెడదపై సొమ్మసిలి సోలినది
తీగవలె వ్రాలినది పువ్వువలె రాలినది
జహంగీరు దేహాన విద్యుత్తు ప్రవహించె
రోమాంచంబు దాల్చె ప్రభువు పాదుషా స్మృతి
భూతాను భూతులకు తెరువిడగ నుత్పుల్ల
నయనాంబు జాతంబు లందుండి
ఉష్ణాశ్రుకణములవి నాలుగైదో రాలె

★★★★★

ఆనాడు
యమునా నదీతీర సుమనోజ్ఞ వనభూమి
స్వాంత మర్పించెను అనార్కలీ లలితాంగి
తన బాహులతలకు తనువు నంకిత మిచ్చి
పారవశ్యము జెంది నిదురించె తన యెడద నీలాగె

★ ★ ★ ★ ★

''ఏ రీతి వర్ణింతు నీ నాట్య కౌశలము
నీదు సర్వస్వమ్ము మోదాన నాముెల నీరాజనంబిచ్చి
నింగికెగిరించితివి
ప్రణయ జీవులు మనము ధన్యులైతిమి ధరణి
మనప్రేమ నిర్ఘరికి కలుగునా అర్గళము నళినీ!
''భవదీయ కమనీయ గానామృతము మ
త్కర్ణపుటములు సోకమైమరచి ఆడితిని ప్రాణేశ్వరా!''
''బంధూక పుష్ప సంబంధమధురాధరము
క్రుమ్మరించెను ప్రియా కోటి సౌందర్యాలు
కజ్జలావృతమైన కనుదోయి కొనలందు
వెలయించితివి వేయి భావాల సోయగము
యుష్మద్భాషణము శిరీషసుమ పేశలము
త్వన్నాట్య కౌశలము స్వర్లోక విలసితము
సామాన్య నటి నీవ? కావు
సాక్షాద్దివ్యాంగనవె నీవు
అలికఫలకమ్ముపై తిలకమ్ము సోయగము
వదన బింబములోన వెల్గులను కైసేయ
నల్గగమనమ్ములో వచ్చితివి ప్రేయసీ
పద్మ సంకాశమౌ పాణియుగ్మము నందు
పదిల పరచితి వెన్నో
భావాభినయములను
కర్పూర తాంబూల సమ్మిశ్ర చర్య
శోణమైన మధురాధరమ్ములో
మధురిమలు చవిజూచి తన్మయమ్మున మేను
తావకీనమ్మయ్యె దేవి!

సుప్రభాతము నేడు ధవళసుమ చిత్రితము
హరిత వర్ణాంబరము ధరియించి అరుదెంచి
            దర్శనమ్మొసగితివి
విరియ బూచిన మల్లె పందిరి విధమ్ముగా
రమణీయ భవదీయ గాత్రంబు గన్పట్టె
            నాకపుడు నయన
            పర్వంబాయె దేవీ''

★ ★ ★ ★ ★

పారవశ్యము జెంది దృశ్యమ్ము తిలకింప
పాదుషా హృదయాన భావ పుంజము నిండె
భరతాంబమకుటమై విరజిల్లు ఢిల్లీ పురాన
మించు తీవల మించు చంద్ర వదనలు కలరు
            సుందరాంగులు కలరు
గానాభినయములే కాంతాత్వమును గొన్న
            ముద్దు గుమ్మలు కలరు
            కానీ
ఈ నళినీ లలితాంగిని వోలె
లావణ్య సరఃస్నపిత సుందరి లేదు
            స్వర్ణోక్క కుసుమాంగి సామాన్య మానవుని
            వశమౌట తన యెదద ఈర్ష్య ముట్టడి సేయ
ఏవిధమ్మునసైన నువిద తనదిగ పొంద
గాఢ సంకల్పమున విడలేక విడలేక
            విడి మంజు కుంజమును
అంతరంగికులతో ఆరామ తల్లి వీడి,
పయనమ్ము గావించె పాదుషా విడిది తలమునకు

తన గుడారము రమ్యతమముగా శోభలను
కైసేసికొని యపుడు కనుల పండువై కన్పట్ట
సమ్రాట్టు సంతుష్ట స్వాంతమున
ఇష్ట సఖులను గూడి ఇంపుగా భుజియించె
సముచితాహారమ్ము
సామంతరాట్ సమర్పిత దివ్య సంభార సంవృతము
అతి రమ్యమౌ పాన్పుపై పవళించె పాదుషా
పార్శ్వ పీఠమ్ములో ప్రాణ సఖుడమరంగ
మధుపాత్రికల నిండ మధువు స్వాగత మిడెను.

సహకార వృక్షమ్ము చామరమ్ములు వేయ
పున్నాగ నగమపుడు పుష్పవర్షము కురియ
పవమాన బాలకుడు ప్రకృతి సౌరభము
సకలమ్ము కొనివచ్చి
పాదుషా హృదయమును పరవళ్ళు త్రొక్కించె॥
తన చెంత తనరారు తారకల తలదన్ని
పశ్చిమదిశవెల్గు పడుచు చుక్కను జేర
సంభ్రమముతో చంద్ర బింబమ్ము పర్వులిడె
దారి విడి మేఘాలు తప్పుకొను చుండగా
శాంత చంద్రికా ప్లావిత మహోజ్వల రజని యందు
పాదుషా ప్రాణ సఖునెదుట నెడదను గ్రుమ్మరింప
తలపెట్టి మెలమెల్ల వాహ్యాళి విషయాల
నెమరింప దొరకొనెను ఆశాకీర్ణ చేతమ్ముగన్
''నళిని యట యా లలన నవమోహనమ్ముగా నటియించి నీవేళ
గాలికెరటాలలో తేలి పోయెడి లీల
మేఘాల తిలకించి పులకరించిన నెమలి
పురివిప్పి యాడుగతి నళిని నాట్యమ్మాడె
చిత్తమ్ము మురిపించె

స్వప్న సీమల తేలి
స్వర్ణోక్క సంతోషా స్వాదనమ్మొనరించి
సొంపులను కురిపించి వంపులను వెలయించి
చిత్తమ్ము మురిపించి నృత్యమ్ము గావించె
పరికించితివి గద పర్యుత్సకత్వమున''
''భవదనుగ్రహ ఫలము పరికించితి జహాపనా!
గాత్ర సౌందర్యమ్ము నేత్ర పర్వమ్మయ్యె''

''అపరాప్సరసవంటి అంగనామణి నళిని
            ఆస్థాన మందుంట మాకు అతి వాంఛనీయమ్ము''
''చిత్తము జహాపనా!'' యని ప్రాణసఖుడపుడు
''అరుణోదయమ్మునవె పరిసర గ్రామముల
            కాంత రంగికులతో జని కాంతవైనము గనుము
''సమ్రాట్టు పిలిపించె సతినంచు'' నుత్తరువు
            తెలిపించి నయముతో కొని తెమ్ము కోమలిని
ప్రియుడు వలదని చెప్ప ప్రభువాజ్ఞ యని చెప్పి
            పదునైదు దినములన్ పంపెద మటంచుచునోదార్చి
మోదాన నళిని గొని రండిటకు రయమున''
            తలవంచె 'సరి' యంచు
            సూచింప సమ్రాట్టు నెదుట
            నా ప్రాణ సఖుడపుడు
ఆ విశాల ప్రశాంత నిశాంత గర్భంలో
            స్నిగ్ధ చాంద్రీ ద్యుతులతో
మధుర భావాకీర్ణ హృదయమ్ము విరియగా
            భావి సంతత వసంతముగ కన్పట్ట
                తన వలపు సుధగాగ తన నెలవు దివిగాగ

స్వప్నసీమల ప్రణయ స్వాంతమ్ము వికసింప
హారిద్ర మంజులాం బరధారియై నళిని
స్వర్ణస్రోతస్వినీ స్నపితాప్సరస యగుచు
తన చెంత కరుదేర

''కరుణజూడుము ప్రణయినీ నీ చరణచారణ చక్రవర్తిని''
స్మితముఖాంబుజ ద్యుతులచే సం
తతము సవిధమ్మున వెలయుమా
యనుచు తన బాహు బంధాల
నళిని రంజిల్లగా నిదుర బోయెను ప్రభువు.

(3)

అది బహుళ పక్ష రజని అంచరెక్కల సెజ్జ
ఒంటరిగ పాదుషా పడియుండె
భావాంబరమ్ము పై స్మృతి జలదవారమ్ము
సతమత మ్మొనరింప నిదుర నిండని కనుల
నెదకు శాంతియె లేక అర్థహీనములైన
వీక్షణలతో నతడు వేగి పోవుచు నుండె॥
నళిని తన హృత్సీమ నందనమ్మొనరింప
అరుదెంచి ఒక యేడు అట్టె దాటినది.
తన జరీనా యగుచు ఆస్థాన కళలలో
అనర్గళముగావెల్గి సౌందర్యరాసులను
సమ్రాట్టు కర్పించి సంతోష పీయూషా
స్వాదన మ్మొనర్చినను సతతమ్ము హృదయమ్ము
శాంతి సదనము గాదు
ఈ విధమ్మున నతడు భావనలతో వేగి
ప్రశాంత యామిని పాన్పుపై పొరలు చుండె
మెల్ల మెల్లగలేచి మలయ పవనుని మందా

నిలమ్ములను వాంఛించి నిషణ్ణకముపై కూర్చుండె
నా నిశీధమ్ములో పాదుషా

హృదయ వీణనుమ్రోగె ఏదొ తెలియని బాధ
శాంతి యెఱుగని వికట జగతి శీలమ్ముగని
గగనమ్ము హసియింప ఆహోసభాసమ్ము తారకల గన్పట్టె
విగత సౌదామిని రేఖయై మెఱసినది
పాదుషా చిత్తమున చీకటులు కురిసినవి
నిశ్శబ్ద, నిశ్శంక పర్యంక తలముపై మై మఱచి నిద్రించె.
మానవ సమూహమ్ము
చీమ చిటుకన విన్పడు నిశీథినీ గర్భాన
దూరాన సుస్వనము తోరణమ్ములు గట్టి
మెల్లగా మెల మెల్లగా రాజసౌధము జేర
ప్రభువు చెవి మేలుకొనే పరమాదరమ్ముతో
స్వీయాను భూతి పెనగొన మనసులో చీకటులు మటు
మాయమై పోవ
వెన్నెలలు విరిసినవి విషమమృతమ్ముగా
వించు విద్యావేది గానోపు ననియెంచి
గాయకుని ఊహించి
పవన కంపిత మంజు రవములని సిగ్గుపడి
అతిలోక మాధురుల శ్రుతులు విని తనిసినవి

యంత్రవత్ జీవితము ఎంత సేపని జూతు
చాలునని సొమ్మసిలి రాలు చుండిన సుమము
దివ్యగా నమ్ము విని వృంతమున కత్తుకొనె
తక్షణము చింతలన్నియు వీడి
నిర్ణీత కార్యమును ముగియించి ఒక చుక్క
పశ్చిమాంబుధి మునుగ పయనమై చనుచుండి పరమాద్భుతంబైన

అమరసంగీతమును ఆలాపనంబు విని అట్టె నిలిచింది
తనప్రాణ వల్లభుడు భువిని వినలేక పోయెనని
వాపోయి వినుచుండె యామినీకాంత
సుమరాశి విరబూచె పొన్నలును, పొగడలును
పరవశమ్మును జెందె యమున విని పొంగినది.
చెంగు చెంగున గట్ల నొరుసుకొని పారినది
సంగీత మాధుర్య నిర్ఝరి నెదిరించి
నిలువ జాలిన దేది ప్రకృతిలో కన్పడదు

పాదుషా హృత్సీమ నూత్న వాతావరణ
జ్యోత్స్నలో పెంపొంది భావసస్యము లెన్నో!
''ఇంత చక్కని పాట ఎంత సేపని విందు
సంగీత నిష్ణాతు సన్మాన మొనరింప
సమ్రాట్టుకుచితమ్మ
అజ్ఞాత విద్వాంసు డితడెవ్వడేయూరో?
కతమేమొ? నీరీతి గానామృత మ్మొలికింప
గాయకుని పిలిపించి కళకు హారతులెత్తి
ఉదయాన కురిపింతు కనక వర్షము నంచు
నిదురించె రారాజు
నిర్మల హృదయమ్ము నిశ్చల నిశీథమ్ము
తన్మధుర గీతలో తాదాత్మ్యమును బొందె
జైరాజు గళములో జనియించు నా రవము
వర్ణనాతీతమ్ము సహజ మాధుర్యకంఠ
స్వరములో హృదయా వేదనల కురిపించి
తనగీతి మధురమై తనకు నందము గూర్ప
తన భావలహరికా డోలికలలోనూగి
ఖేదమే మోదమై తన గళమ్మున దాగు

కళకు రూపంబిచ్చి గాయకుడు జైరాజు గానమొనరించెన్

''నా జీవిత వసంతము నామరూపము వీడి

సతత శిశిరమ్ములో నన్ను సతమతమ్మొనరించి

ఏ దిక్కుకేగెనో భాగ్యహీనుడ నేను

బ్రతుకు కబ్బపు మొదటి పుటలవి

ప్రమోదమ్ముగ పరిఢవిల్లెను

మిగత కావ్యంబెల్ల

ఖేదకీర్ణమై పోయెన్

ఆ వసంతపు మధురశోభను

నేడు శిశిరము లొలక బోసెడి

బాధలను పరికించి రాల్చెద

నొకొక బాష్పం ఒకొక బాష్పం

ఒకొక బాష్పం బాష్పాంజలి॥

వలపు లేదు వనిత లేదు

వెలుతురే లేదు వికటముగ

ఈ వింత జగతికి ప్రకటితంబయె

బ్రతుకు జాడలు గాలిమేడలు

ఒకొక బాష్పం ఒకొక బాష్పం

ఒకొక బాష్పం బాష్పాంజలి॥

ఎండిరాలిన పండుటాకును

కాలిమసియగు కాగితమ్మును

ఇంక మార్పది గగన కుసుమము

ఒకొక బాష్పం ఒకొక బాష్పం

ఒకొక బాష్పం బాష్పాంజలి॥

★★★★★

అరుణోదయమ్మనుచు ధరణి దేవికి తెలుప
పూర్వపర్వత శృంగ భూమిపై
నుషోరేఖలవి పొడిచినవి
ఆ ఉషోదయమ్ము విరజిమ్ము శోభలను
కాశ్మీర కాంతిలో కమనీయముగ జేయ
దినకరుండరుదెంచె దేదీప్యమానముగ
రాగరంజిత రమ్య మేఘాంగనా చయము
కైవారము లొనర్చె
పద్మంపు చిరుమోవి ప్రభవించె చిరునగవు
ఆ నగవులో చిందె నతిలోక సుందరత
ప్రణయ ప్రహ్లాద భావాకీర్ణ ప్రథమ కిరణమ్మదిగో
'పద్మ' బింబాధరము చుంబించె
పరవశమ్మున ఆమె ఆ అమృతానుభూతిలో
ఆనంద మందినది.
చెల్లి చెలిమిని దలచి ఉల్లమ్ము ముద మంద
కలువ నెచ్చెలి యపుడు కనుమూసి కలగాంచె
నా రాత్రి తన ప్రియుని
ప్రణయ చేష్టిత మెల్ల భావనలుగా మెఱియ
సౌవర్ణ సౌందర్య సందీప్తి సంకీర్ణ
మేదినీ తలమపుడు మెరసినవి మురిసినవి చిర్నగపు కురిసినది.
చిన్మయానందమున తన్మయము నందినది
ప్రకృతి యొడిలోన సుమరాశి రాల్చినది
విమల హిమజల మపుడు
అది సూర్యనారాయణాంఘ్రి పూజార్థ
పరిశుద్ధ పాద్యంబొ?
వికసిత హృదయాంత రాళమ్ములో నుండి పెల్లుబికి
నయన పాత్రల నిండు ఆనంద బాష్పములో ?

సూర్యోదయములో సౌందర్యమవగాహనము గాక
తమదారి తామేగు ధరణి వాసుల గాంచి
జాలిగొనె విరజాజి
కోరకితమై యున్న కుసుమములు వికసింప
సూర్యదేవున కపుడు స్వాగ తాంజలి మోడ్చి
పరిసరాంగణమెల్ల పరిమళమ్ములు నింపి
పరమ సంతోషమున విరజిల్లినది మల్లి
ఆనందమందిన నంది వర్ధన సుమము
సుప్రభాతమ్మంచు సోయగము చిందించి
ధవళ మృదు పత్రముల పనసలేఖలు పంపె లోకబాంధవునకై
చేతనమ్మందినది జగతిలో జనచయము
హంస తూలికాతల్ప మందుండి లేచినది అలసమ్ముగా నళిని
బాలభాస్కరకాంతి బాహ్య జగతిని దూకి
నిబిడాంధకారముల నిర్మూలనము చేసి
ప్రకృతికి నొకక్రొత్త చెలువమ్ము చేకూర్చి
కాని నళినీ చిత్త, పద్మమున చీకటుల చీల్చజాలకపోయె
రాణి వాసమ్మంది ప్రాణేశు మరువంగ
పాడి గాదని ఆత్మ పలుమారు చెప్పినది
తానొనర్చిన పాప కృతికి నిష్కృతియె
లేదంచు వాపోయి
ఆశవీడిన నళిని చపేటికా స్థిత
వదన బింబమ్ములో తాండవమ్మాడె
శోక భీకర మూర్తి నిట్టూర్చి నిట్టూర్చి
నీరసించిన నళిని మోములో నొకవింత
పరివర్తనమ్మపుడు పరిఢ విల్లినది
కుమిలి కమలిన నళిని ముఖమున

క్రొత్త ధైర్యము గోచరించెను
ఆత్మసుఖమున కడ్డు ఏదను
ప్రశ్న ముఖమున మొలవగా

జైరాజు నెడ తాను చేసినది నేరమా?
ఆత్మ సుఖమును కోరి అన్యుని వరించినది
తన బ్రతుకుబాటపై తన హక్కు జూపుటకు
తానెందుకింతగా తపియింపవలయునో?
అని మథన పడి నళిని నిజసౌధమందుండ
చెలియ చెంగున వచ్చి చెప్పినది సంగీత
సభకు ఆహ్వానమ్ము వివిధ భావములెన్నొ
వెల్లి విరిసిన క్షణము సభకు పోవుటకామె సంశయమ్మందినది
ఒక కొంత తడవట్లు యోచించి రాజనటి
ఎద పదిల పరచుకొని ప్రభు సభకు పయనమ్ము

గావింప దొరకొనెను కలతలన్నియు మరచి
ఆస్థాన గానసభ అల్లదిగో సభముందు
సర్వమ్ము త్యజియించి శాంతికై తపియించు జయరాజు కనుపట్టె

సంస్కార హీనమై సంతోష శూన్యమై
దైన్యమ్ము తిమిరమ్ము మూర్తి మత్వము గొనగ
మానవాకారమున మహికేగు దెంచెనన
శూన్యదృక్కులతో శోక భీకరమూర్తి

పాదుషా కోర్కెపై ప్రఖ్యాత సంగీత పీఠిపై విరజిల్లె
చామరమ్ముల దాల్చి సేవకులు సేవింప
భాసురమ్మగు ధర్మ సింహాసనమ్ముపై
నధివసించెను ప్రభువు ''జహాపనా'' యనుచు జ
హంగీరు ముందటనిల్చి ''చార్లెస్లీము'' లొనరించి

వందనమ్మర్పించి మందగమనమ్ములో
మర్యాద లొలికించి సచివ ప్రభృతులపుడు
రచితోచితాసనమ్ముల లోనవర్ధిలిరి

చిత్ర చిత్రిత రత్న కంబళముపై సభ్య
బృందమ్ము వెలయంగ గలగల మటంచు అం
దెల రవళితో నళిని నడువ నేర్చిన మేల్మి
బంగారు బొమ్మనగ అలస గమనమ్ములో
అందములు చిందించి రాజనర్తకి కొరకు
రాజిల్లు పీఠిపై రమ్యముగ కూర్చుండె
ప్రియ గాయకోత్తమ హృదయ విదళిని నళిని
అధివసింపగ ''పీఠి'' ఆగ్రహము వహించి
కిరుకిరు మటంచు పల్కినది
రాజనర్తకి నళిని పాదుషా చిత్తమున
వెన్నెలలు వెలయించి చిరునవ్వు నవ్వినది
నూత్న వీక్షణలతో తిలకించె సంగీత
పీఠికాధ్యాసితుని చిత్ర కృత్రిమముగా
చిందించె నొక స్మితము
చిత్తమున చీకటులు వికటాట్ట హాసమ్ము
లొనరింపగా నళిని ఎంత యత్నించినను.
దాచుకోలేనంత దుఃఖమ్ము మోముపై తాండవ మ్మొనరించె
వాద్య సంగీతమ్ము వల దంచు జైరాజు
గళమెత్తి సంగీత కళకు హారతి బట్టె
కర్ణపేయమ్ముగా తాన్సేను కంఠమ్ము
తలపించు కలరవము కర్ణామృతమ్ముగా
గాయకుడు విన్పింప

ఆలకించిన మ్రోడు లన్నియును చివురించ

ముకుళితమైయున్న కుసుమములు వికసింప

ప్రహ్లాదితంబగును ప్రభువు మది పులకింప

దివ్యగానమ్మలరె నవ్యానుభూతులిడి

స్వప్నసీమలతేల్చి సభికులందరిని,

సవిధమ్ములో నుండు ఉపవనము నందుండి

పరమ పరిమళభరిత పవన లహరికలపుడు ప్రసరింప

అతిలోకసంగీత స్వర తరంగములతో

తాదాత్మ్యమును బొంది సంతుష్టులైనారు

సభ్యబృందమ్మపుడు

నళిని దిక్కున వీక్ష ణల నిలిపి జయరాజు

స్పంద విరత నయనమ్ముల బాష్పబిందు వారి జార

అవ్యక్త సంగీత దివ్యామృతమ్మపుడు

నిజ కంఠ మందుండి ఆవిర్భ వింపంగ

ప్రతి పదము నిజ దుఃఖ భావముల నందింప

వినువారి హృదయాల వెల్లి విరిసెను కరుణ

తద్భావ గూఢార్థ స్ఫురణ కల్గిన నళిని

నయనమ్ములందుండి అశ్రు కణములు జారె

కళలు కురిసెడి మోము కాంతి రహితంబయ్యె

చిరునవ్వు వెన్నెలలు చిందించు ముఖమద్ది

కాల జీమూతమ్ము తాండవ మొనరింప

భీకరాకృతి దాల్చి శోక తప్తమ్మయ్యె

తుల లేని సోయగము వెలయించు చిరు పెదవి

ఏవమును కల్పించి, భావ శూన్యమ్మయ్యె

దుర్భర దుఃఖ భారమ్ముతో నళిని

చిత్తమ్ము చెదరగా బ్రతుకు బరువై యేచ

శాంతి కరువై తోచ హృదయ సీమను వీచె

ప్రళయ ఝంఝా నిలము సభ్యు లెల్ల మనోజ్ఞ

సంగీత మధురిమను చవిచూచి సంతోష గోళ

పరిభ్రమణమ్ము లొనరింప

నళినీ నిజహృదయమ్ము విదళనమందినది

ప్రభు చిత్తమల్లదిగో ప్రమదమ్ము చెందినది

హిమ శకలమై కరగి తన్మయము పొందినది

సవిధోపవన భూమి సంతసంబందినది

లలిత లలితమ్ముగా గులాబి లాస్యములాడె

మనోరంజన మపుడు మనోహరముగా విరిసినది పరిమళము కురిసినది

సింగార మొలికించె బంగారు ఘంటమ్ము

మంద పవనములతో మనోజ్ఞ నాట్యమ్మాడె మాలతీ లత యపుడు

అతిలోక సంగీత చాతుర్యముల తోడ

తుది గీతమును బాడప్రతి పదము బాకుగా ప్రతి భావ మీటెయై

రాజనటి నళినీ హృదయమ్ము భేదించె

అంపమున ఘోరముగ కోసినటుల బాధించె

పరవశమ్మందినది పాదుషా చిత్తమ్ము

సభ్యవారమ్మపుడు సమ్మోహితమ్మయ్యె

అనిర్వచనీయ సీమలం దనర్గళముగా

విహారము సల్పి జైరాజు అరుదెంచె

పాదుషా సంగీత భవనమ్మునకు తిరిగి

కరతాళ ధ్వనులతో కళకు హారతు లిడగ

సభలోన రేగినవి అభినందన ధ్వనులు

ఎన్నిరోజుల క్రితమొ చిన్నారి చిరునగవు

మాయమై పోయినది జైరాజు మోముపై

అపుడధర సీమపై అధినయమ్మొనరించి ప్రభలతో ఆ నగవు

నళిని మోమున వెలయు భావరేఖల జూడ

జాలిగా జైరాజు వాలకము కన్పట్టె

ప్రభువు కనుసైగలో

భావార్థము లెఱింగి భటవర్గములు వచ్చె

అత్యద్భుతంబైన బహుమతుల నందింప

వలదంచు జైరాజు ప్రభువు మోమును చూచె జాలి గొల్పెడి రీతి

''గానకళా నిష్ణాతా! గైకొమ్మా! జోతలివే

మెచ్చియిచ్చు వస్తువులివి

ఇష్టపడని పక్షమ్మున ఎరిగించుము నీకోర్కెను

గానకళా నిష్ణాతా!''

పల్కు వెలి గ్రక్కుటకు భయపడెను జైరాజు

ప్రభువద్ది గమనించి భయము వలదని చెప్ప

నళిని తనదని చెప్పి తన ప్రియను తనకిచ్చి రక్షింపు మని వేడె

తక్షణము నళిని తనువుపై జెర్రులు

తాండవ మ్మొనరించె

గతము మఱచిన ప్రభువు కను కొలకుల నగ్ని

కణములై కోపమ్ము సర్వమ్ము దహియింప సంసిద్ధమయ్యె

కింకర్తవ్యతా మూఢ చిత్తమున సభవారు

నిశ్శబ్దముగ కూర్చుండి వీక్షించుచున్నారు.. ఆ వింత సంఘటనమ్ము

★★★★★

‘‘జహాపనా! వలదంటి స్వర్ణరాసుల నెల్ల
వలదంటి తులలేని వస్తువుల సహితమ్ము
కాని నా ఆరాధ్య దేవతను, మచ్చిత్త
పద్మాంత నిబిడ తమో హర్తకి నర్తకి
ననుగ్రహించమని వేడ ఆగ్రహించితిరి ప్రభూ !’’
పేరోలగమ్ములో నీరీతి గాయకుడు
కోరుటవమానమ్ము కోపమ్ము జృంభించె
కోటి పడగల నెత్తు వాతాశనము రీతి
పాదుషా వదనాన

★ ★ ★ ★ ★

సభవారు గుస గుసల ఉరిశిక్ష ఉచితమని
ఒకడు పల్కుచు నుండ పాదుషా తొందరకు
మందలింపులు రేగ మరొక దిశయందు
జాలిగుండెలు కరుగ సానుభూతిని జూపిరి
సభ్యవరులింకొక దిశయందు
నళిని గుండెలవియుచుండె మిన్ను విరిగి మీద పడును
ఆతపత్ర మెందులకని శిక్షగొనగ వేచియుండె
చింత వీడి గాయకుండు
దండనాధుని బిలిచి శిరఃఖండన మొనర్పుమని
చండశాసనము విధియించి శరవేగమున వెడలె
సభవీడి పాదుషా
నళిని గుండెల నిండ మర ఫిరంగులు ప్రేలె

★ ★ ★ ★ ★

శాంత శర్వరివేళ డిల్లీ దివాణమున
నడిరేయి సూచించు గంట పండ్రెండపుడు

టంగు టంగున మ్రోగె ఘంటారవమ్ములు
సమ్మెట దెబ్బలై నెమ్మనముపై బడగ
ఉలికి పడినది నళిని పలికినది పిచ్చిగా
మనసుచెదరిన నళిని ఉన్మత్తయై లేచినది
''త్వన్మనోహర దర్శ నోత్సుకత దరిజేర
విషపూర్ణ మధుపాత్ర లభియించే గద సఖీ''యని

బలిపీఠిపై నడుగు నిలిపి విలపించు
జైరాజు కన్పించె
నీ ఘోర దుష్కృతికి నిష్కృతియె లేదంచు
వికటమ్ముగా నవ్వె సౌధకుడ్యము లన్ని
ఆరాధ్య దేవతగ అప్సరాంగన వలె
పూజించి తనకొఱకు ఇల్లు వాకిలి వీడి
పిచ్చివాడై తిరుగు ప్రియుని విమల ప్రేమ
వికృత రూపము దాల్చి వేధించె నర్తకిని
మనః స్థితి కొంత మారగ స్వస్థతకు వచ్చిన నళిని
బ్రతుకనర్హమని ఎంచి పాదుషాకు స్వీయ
ప్రణయ గాథను గూర్చి పత్రమొక్కటి వ్రాసి
విషభరిత మధువు గొని ధరణిపై కూలినది భీకరార్భటులతో.

(1956-57)

అనార్కలి

గేయకావ్యం –1

ఆ విశాల ప్రశాంత వ నాంత సీమ
మల్లికా సుమసౌరభ మధురిమమున
విమల దాడిమ వృంతమ్ము ప్రమదమంది
పాణి తలమున నుండ విభ్రాజ మాన
మంజులాంగి యనార్కలి సంజవేళ
సరస సంగీత సాధన సలుపు చుండె॥ 1

జలధి ప్రావృత మేదినీ వలయరా జ్యమ్మేలు సమ్రాట్టుకున్న
లపుం బట్టి సలీము నామకుడు సౌభాగ్యచ్ఛటా శిష్టుడా
స్థలముం జేరెను సంధ్యవేళ వన సౌందర్యమ్ము దర్శించుచున్మ
లయాంతర్గత మారుతోల్లలిత శుంభత్కుంజ వీధిన్ అనా
ర్కలినిం గాంచె సురాంగనే యనుచు విభ్రాంతి ప్రభాస్వాంతుడై॥ 2

సన్నుత పంచమస్వర విసర్పణ దూరములై తటాలునన్క
న్నులు కన్ను లొక్కటయి కమ్మని భావపరంపరల్ వెసన్
జన్నవి మూగకోరికలు స్వాంతము లందిరుగాడ నింతలో
ఉన్నటులుండి యా సుదతి ఊహల నాపి వివర్ణయయ్యె న
త్యున్నత ధర్మ సౌధముల నుండు సలీము ప్రభుండె అయ్యయో.. 3

అని శంకాన్విత భావ వీథుల మహోప్యాయమ్ముగా నున్నజ
వ్వని ''నీవెవ్వర'' నంగ నా మగువ ''దేవా! నేననార్కలి నా
జనన స్థానము బీడువోవ తమ యా స్థానాన తాన్నేను స
జ్జన సాన్నిధ్యము పొందితిన్ సతతమున్ సంగీత విద్యార్థినై''... 4

ఆ యెడ నన్యులెవ్వరు. విహారవనంబున లేక పోవుటన్
ఆ యమ దివ్యమంజుల ముఖాంబుజ దర్శన కారణమ్మునన్
ఆ యువరాజు నందు ప్రణ యాంకుర ముద్భవ మందె నవ్వుచున్తీ
యని భావవీచికల తేలుచు రాసుతుడేగె మెల్లగన్॥ 5

''తన సౌందర్యము రాజనందనుని చేతః ప్రీతి గావించెనో
జనపాలుండిడిది తప్పుగా తలచి యే చందాన శిక్షించునో''
యని శోభామయి కోమలాంగి భవిత వ్యాలోచనా భీలమై
చనియెన్ మంజుల కుంజపుంజములలో సాంధ్యప్రభాశిష్టయై॥ 6

లలిత శోభావిశాల గులాబి బాల
కన్నె మాలతి చిన్నారి సన్న జాజి
లేత వలపులు మొలకెత్తు రీతి గాంచి
నవ్వు కొన్నవి నునుసిగ్గు నివ్వటిల్ల॥ 7

2

దాడిమ గుచ్ఛ సాదృశ సుధామయ తావక దివ్యమూర్తి వీ
నాడు మదీయ భాగ్యకల నమ్మున గాంచితి దేవదేవి! నీ
పాడిన పాటలో కరగి పారమెఱుంగక తన్మయమ్మునన్వా
డిద యయ్యెనా హృదయ సూనము, గైకొనుమా అనార్కలీ!॥ 8

చూపులు తూపులై తగిలె సుందరి మోహన మూర్తి మన్మనః
స్థాపిత మయ్యెప్రప్రథము సాంద్రతర ప్రణయప్రపంచమున్
చూపిన ఆ మనో హరిని శోభల దేల్చి వరింతు రాణిగా
భూపతి పాదుషానయిప్ర భూత మనోజ్ఞ సుఖంబులందెదన్. 9

మధుర సుమనోజ్ఞ సుందర మందహాస
కాంతి ప్రసరించి యింతలో కాన వైతి
వంబు దాచ్ఛాదిత శశాంక బింబ మనగ
త్వన్ముఖమ్మున తిమిరమ్ము తాండవించె. 10

విరియ బూచిన దానిమ్మ తరువు వోలె
మధుర మకరంద పూరిత మంజులమ్ము
నీదు గాత్రము ఆ మధు స్వాదనమ్ము
చేసెదను నా అనార్కలి చిత్తమలర॥ 11

అనుచు తలపోసి తలపోసి అర్థరాత్రి
హంస తూలికా తల్పము నందు వాలి
కలత నిద్దుర జెందెను కలలు నిండ
భావి భారత మేదినీ ప్రభువరుండు॥ 12

విద్యుల్లతాతన్వి హృద్యస్వరూపమ్ము
అభిముఖమై నిల్చి ప్రభల జిమ్మ
చిరునవ్వు తరగలై చిందులాడెడి మోము
ప్రణయ సందేశమ్ము పంపుచుండ
మగువ మాలతి, మల్లి మందారములు గూడి
తన ప్రేయసిని గూర్చి తనకు చెప్ప
కోయిల కన్నెలే గున్న మామిడి పైన
ఆనాటి రాగాల నాలపింప
ప్రేయసిని జూచు కోరిక పెరిగి పోవ
అమర సంగీత నిష్ణాతు డాదరాభి
మాన సంపత్తి గల్గు తా న్సేను జూచి
నృత్యశాలను దర్శించు నెపము తోడ
బయలు దేరెను తాన్సేను భవనమునకు
ప్రభు కుమారుడు చిత్తమ్ము పరుగులెత్త॥ 13

ఆ తాన్సేను కళావిశారదుడు ప్రహ్లాదనుత స్వాంతుడై
ప్రీతిన్ శిష్యుల జేర్చి నేడు ''మనప్రా వీణ్యమ్ము రా పట్టికిన్
చేతో మోదమొనర్పగా వలయు రా జీవాక్షులారా'' యనెన్.
ద్యోతిల్లంగ అనార్కలి హృదయమే దో భావ సమ్మిశ్రమై. 14

అంత సలీము రానట 'జహాపన' స్వాగత మంచు మెల్లగన్
చెంతకు వేగిరమ్మనగ చిత్తము ప్రేయసి కై తపింప సౌ
ధాంతర భూ వినిర్మిత మహాద్భుత నర్తన శాలకేగి వా
సంతిక వోలె సౌరభ విసర్పణ చేయుచు నాట్యమాడ వృ
త్తాంతర మందు నిల్చిన ప్రియంగని రాకొమరుండు ముగ్ధుడై 15

ఇరువురి మధ్య పొంగు ప్రణ యేచ్ఛల జూచి కళావిదుండు స
త్వరముగ కన్గొనెన్ వలచి వచ్చె సలీమని, తానుగా ధరా
వరసుతు నీవిధిం బిలిచె బాలిక యే యన కొంప మున్గనే
అరయుద మేమి సంగతి? య టంచు మదిన్ దలపోసె, రాసుతున్న
రమణి కీలితాసన శుభస్థలి యందుపవిష్టు చేయుచున్ 16

అతుల చతురుడు తాన్సేను శ్రుతుల గూర్చి
అమర గానమ్ము కర్ణపే యమొనర్ప 17
కమ్ర కరయుగ్మ కంకణ క్వణనలమర
పల్లవించిన మాలతీ వల్లి వోలె
మధురవాణి, మంజులవల్లి మనసుదీర
నృత్త మొనరించి యువరాజు చిత్తమలర॥ 18

మంజిష్ఠ పాద రంజిత
మంజీర స్వర వితాన మాధుర్యమునన్
కంజాక్షి నాట్యమాడగ
శింజితములు ప్రియుని చెవిని చిందులు ద్రొక్కెన్॥ 19

మంజు రంజిత మంజీర శింజితములు
తప్త కేకికి నబ్ద శ బ్దమ్ము వోలె
ప్రభు కుమారుని చిత్తమ్ము పరవశత్వ
మొంద జేసెడి భాగ్యమ్ము నందు కొనియె॥ 20

చూపులు తూపులై తగిలె స్థాపిత మయ్యె ప్రప్రథమ చూపున ఆ మనోహరిని
భూపతి పాదుషా నయిప్ర సుందరి మోహన మూర్తి మన్మనః
సాంద్రతర ప్రణయ ప్రపంచమున్ శోభల దేల్చి వరింతు రాణిగా భూత
మనోజ్ఞ సుఖంబులందెదన్ ॥

మధుర సుమనోజ్ఞ సుందర కాంతి ప్రసరించి యింతలో వంబు
దాచ్ఛాదిత శశాంక త్వన్ముఖమ్మున తిమిరమ్ము మందహాస కాన వైతి
బింబ మనగ తాండవించె॥

విరియ బూచిన దానిమ్మ మధుర మకరంద పూరిత నీదు గాత్రము అమధు
చేసె దనునా అనార్కలి తరువు వోలె మంజులమ్ము స్వాద నమ్ము చిత్తమలర॥

అనుచు తలపోసి తలపోసి హంస తూలికా తల్పము కలత నిద్దుర జెందెను
అర్థరాత్రి నందు వాలి కలలు నిండ భావి భారత మేదినీ ప్రభువరుండు॥

విద్యుల్లతాతన్వి హృద్యస్వరూపమ్ము అభిముఖమైనిల్చి ప్రభల జిమ్మ
చిరునవ్వు తరగలై చిందులాడెడి మోము ప్రణయ సందేశమ్ము
పంపుచుండ మగువ మాలతి, మల్లి మందారములు గూడి తన
ప్రేయసిని గూర్చి తనకు చెప్ప కోయిల కన్నెలే గున్న మామిడి పైన
ఆనాటి రాగాల నాలపింప ప్రేయసిని జూచుకోరిక పెరిగిపోవ అమర
సంగీత నిష్ణాతు డాద రాభి మాన సంపత్తి గల్గు తా న్సేను జూచి

నృత్య శాలను దర్శించు నెపము తో బయలు దేరెను తాన్సేను
భవనమునకు ప్రభు కుమారుడు చిత్తమ్ము పరుగులెత్త ॥

ఆ తరువాత నచ్చట ర హస్యముగా సుకళాని దగ్గుతో
చేతము విప్పి చెప్పి వరశీలి సలీము ''జహాపనా! భవత్
ఖ్యాతికి హీనమంచు భువి కాంతుడు దూరడె మాతులుండు ప్ర
ఖ్యాతుడు మానసింగు పర మాగ్రహుడై మము శిక్షచేయడే? 21

భావి భారత మేదినీ ప్రభువరేణ్యు
రాజ్ఞినేనని మురియుచు ప్రతి దినమ్ము
కలలు గనుచున్న 'గుల్నారు' తెలిసికొన్న
నేమి దురితమ్ము మూడునో ఎవరి కెఱుక''
అనుచు తాన్సేను చెప్పిన వినక అతడు 22

'నామనమున 'గుల్నారు'ను
ప్రేమించుట లేదు వినుము ప్రియ గురువర్యా!
ఏమైన గాని విడువను
ప్రేమించితి నా 'అనారు' ప్రేయసి ననియెన్॥ 23

‘‘సర్వ భారత సామ్రాజ్య సార్వభౌము
లక్బరు సుతులు మీరు సామాన్య నేను
హస్తి మశకాంతరమ్మగు టవగతమ్మె
తగని దాన జహాపనా! తమకు నేను॥ 24

ప్రణయ లోకాన నివియన్ని పనికి రావు
నా అనార్కలి వీవు! ఈనాటి నుండి
త్వన్మనోజ్ఞ దృఢాశ్లేష తన్మయత్వ
దివ్య నవ్యానుభూతిలో తేలిపోయి
స్వర్గసీమల నలరింతు సక్రియ నిన్ను॥ 25

3

మలయ సమీర కాంతు సుకుమార, శుభంకర హస్తయుగ్మమున్
నిలచి స్పృశించి సిగ్గుపడి స్నిగ్ధ కపోలలు ఊర్మికాంగనల్
తొలగ మరుత్కుమారుడు విధూత తరంగములన్ మరల్చి కౌ
గిలి నిడి తన్పుచుండ పులకించునదే యమునా తరంగిణి॥ 26

ఆ యమునా నది తటమునందు, విహార వనమ్మునందు ఆ
ప్యాయముగా పరీమళము లంబర వీధికి నెక్కుచుండె ఏ
మో! యెటకేగెనో ప్రియుడు? మోసము చేసెనటంచు పుష్పముల్తీ
యని తేనెతో నెదురు తెన్నులు చూచుచు నుండ నింతలో. 27

ఝుమ్మని ఝుంకారమ్మున
కమ్మని ప్రణయమ్ము లొలుకగా, గానాలా
పమ్ముల నరుదెంచెను భృం
గమ్ములు నెమ్మనము లలర కాంతల కడకున్. 28

కుసుమ కుమారికల్ ప్రణయ కోపము జూపుచు నోర మోమిడన్
గుస గుసలాడి తుమ్మెదలు కోమలులన్ మురిపించి మించుచున్
రసికత చూపు చుండ అను రాగ పరిప్లుత చిత్తుడై సలీం
అసదృశ మంజువల్లి విమ లాంగి ననార్కలి గ్రుచ్చె కౌగిటన్. 29

ఆ మనోహర రజని ను ద్యానవనము
అమరనాథుని నందన మై వెలింగె
పరమ పరిమళ పవన సం భరిత కమ్ర
చంద్రికాకీర్ణ నిర్జన స్థలము నందు
స్నిగ్ధ సుకుమారి సమసుఖా శ్లేషమందె
తన్మయంబున యువరాజు ధన్యుడయ్యె!!. 30

తత్ఫలమ్ముగ తనకు ఘాధవు డొసంగు
ఘోర మరణమ్ము కాన్కగా మారులేదు
అనుచు నెఱుగ దనార్కలి! అక్కటకట
మాట లెఱుగని దోషాన మాటరాక
తెలిసి కొన్నిట్టి యమునయు తెలుపకుండ
జాలి కన్నీరు జార్చుచు సాగి పోయె. 31

''ప్రఖ్యాతమ్మగు రాజవంశమున విభ్రాజిల్లు గుల్నారు నేన్
సౌఖ్యాస్వాదితు చేయనా! తనను? నీ చప్రాణి అనార్కలీ
సఖ్యమ్మే తన ధ్యేయమా! కుటిల దుశ్చారిత్ర నాట్యంగనే
ముఖ్యమ్మౌనట రాజనందనునికీ మూర్ఖమ్ము ప్రాప్తించెనే. 32

అస్మదానంద నిర్ఝరి కడ్డు నిలచి
భాగ్యమూర్తిని కబళింప పడగ సాచు
నూరు శిరసుల నాగది నులిమి వైతు
పడగలను సాచి ప్రియుని పై పడక మున్నె॥ 33

యౌవన భాగ్యరాసులను హారతిగా నిడదాచి యుంచితిన్జీ
విత మంజు లామృతము చిత్తమెలర్పగ నిత్తురంచు బృం
దావని నోటి లేవలపు తావుల జిమ్ముచు జీవితమ్ము స్వ
ర్గావని తేలునంచు కల గాంచుచునున్న ఫలమ్మిదా! ప్రభూ ! 34

అని గుల్నారు అనార్కలీ విషయ దీర్ఘాలోచనా మగ్నయై
దినముల్ బుచ్చుచు నుండె సంకుచిత విద్వేషాంత రంగమ్మునన్
చనుదెంచెన్ "నవరోజు" పర్వదినముల్ సంతుష్ట సుస్వాంతులై
జనముల్ పాడుచు నాడుచున్ దిరుగ ను త్సాహమ్ము పొంగారగన్? 35

ఆ నౌరోజు మహోత్సవమ్మున వినోదాసక్తుడౌ పాదుషా
ఆనంద ప్రదనూత్న నర్తన దిదృ క్షాయత్తుడై గానవి
ద్యా నిష్ణాతుడు, నాట్యశాస్త్రనిధియౌ తాన్సేను రప్పించి "మా
యానన్ నేడు మనోజ్ఞ నృత్యములనీ యాస్థాన మాహ్లాదమై
గానాంభోనిధి తేల ఏర్పరుప వేగం బొమ్మ తాన్సే" ననెన్॥ 36

అనార్కలి: – "గురుని యానతి తల దాల్చి కుతుక మొప్ప
నృత్య మొనరించు దానను నృపుని యెదుట
నిండు సభలోన కన్నుల పండు వగును
నా జహాపనా! మీకట నన్ను జూడ" 37

సలీమ్: – "నీవు పేరోల గమ్మున నృత్యమాడ
నిదియ కడపటి దినము నా హృదయ రాజ్ఞి
ఇంక నీరీతి నాట్యాలు నీచ మగును
మొగలు యువరాజు వలచిన ముద్దు సఖికి" ॥ 38

4

ఆ రమణీయ రాజభవ నాంగణ సీమ; ననేక భావముల్
బారులు గట్టి చిత్తమున పర్వులు తీయగ నిల్చియుండె గు
ల్నారు మనోజ్ఞయానమున నాట్యమయూరి యనంగ నెచ్చెలుల్
కూరిమి వెంబడింప నటకున్ జనుదెంచె, గురుండు ముందు రాన్
వారిజ పత్ర నేత్ర! పిక వాణి; అనార్కలి సమ్మదమ్మునన్॥ 39

ఆగ్రహము, నీర్ష్య హృదయమ్ము నలుము కొనగ
కల్పి తాదరమున ననార్కలిని గనుచు

కుశల మడిగెను గుల్నారు కూర్మి జూపి
నమ్మి వెళ్ళె ననార్కలి నాగు వెంట॥ 40

ఫలరస మిశ్రమౌ మధుర పానము గొమ్మని మత్తుమందులన్
కలిపి యొసంగె భూషలను గారముతో సవరించి మెచ్చుచున్
చెలియ యనారుకున్ కుటిల చిత్త రహస్యముగాగ నావలన్
సలలిత యాన యా సుదతి సంస్కృత నర్తనశాల కేగగన్॥ 41

నృత్త మొనరించునప్పుడు న్మృత్తయగును
కాన సమ్రాట్టు విధియించు కఠిన శిక్ష
నేటితో దీని భాగ్యము నేల గలియు
ననుచు గుల్నారు మనసులో నలరి పోయె॥ 42

సరస రాకాసుధాకర స్వామి సఖ్య
మంద గోరు చకోరికి నడ్డు వచ్చె
క్రూర కౌటిల్య కాలగం భీరమైన
ప్రళయ జీమూత పటలిదౌర్భాగ్య గరిమ॥ 43

అదిగో రాజనర్తనశాల ముదము జెంది
సర్వభారత సామ్రాజ్య చక్రవర్తి
అధివసించెను ధర్మ సింహాసనమున
పార్శ్వ పీఠాన యువరాజు వరలు చుండ
అవల కూర్చుండె మాన్సింగు అటనె వీర
బలుదును ఫజల్కవీంద్రుడు వెలసినారు॥ 44

రాజభృత్యులు తనచుట్టు రాజి కట్ట
కలరవమ్ములు మేఘ మం డలము దాటి
మృదు మృదంగ ధ్వని తరంగ మేళనమున
వివిధ వాద్యాలు హృద్యమై వెలయు చుండ
రాలు కరగించు తాన్సేను ప్రమద మంది
సుస్వనమ్ములు నేర్పుతో నిస్వనింప॥ 45

ఝుణ ఝుణత్కార కంకణ ధ్వనులెసంగ
ఘల్లు ఘల్లున కాళ్ళలో గజ్జెమ్రోగ
నృత్త మొనరించుచుండ నా మత్తుమందు
వలని మైకమ్ము కమ్మనా వనజ నేత్ర॥ 46

సోలుచు తూలుచున్ హృదయ సుందరుపై ప్రణయమ్ము జూపుచున్
కాలము విస్మరించి తన కై యరుదెంచె సలీమటంచునే
దొలలితమ్ముగా పలికి తూగుచు గాలిని తేలిపోయి భూ
పాలుడు సర్వసభ్యులును భ్రాంతిలు చుండగ నింతలో అనార్
కేలను సాచుచున్ దరియ కేరుచు రాసుతుమ్రోల వ్రాలగన్॥ 47

ఝల్లుమనె సలీమ్ గుండె గు భిల్లు మనియె
ఏది యెఱుగక తాన్సేను హృదయమపుడు
మొగలు సమ్రాట్టు మదినగ్గి సెగలునిండ
అరుణ దారుణ కుపిత నే త్రాంచలాల
నిప్పురవలట్టి భావాలు నెలవు కొనియె
తోక త్రొక్కిన త్రాచులా త్రుళ్ళి పడుచు
మానధనుడైన మాన్సింగు మండి పడియె
గొల్లు మని సభ్యు లెల్లరు ఘోరమనిరి॥ 48

5

బ్రతిమాలి యువరాజు మతిపోవునట్లుగా
దీనుడై విలపించె దిక్కులేక
రాజ్ఞి ముద్దుల పట్టి ప్రణయమ్ములో నగ్ని
విలయమ్ము వలదని వేడు కొనియె
తెగిన తీగలతోడ వగపిల్లు వీణయై
తాన్సేను హృదయంబు తల్లడిల్లె.
ప్రణయ వారాశిలో ప్రళయమేయని యనార్
కటకటాలను గొట్టె నిటల తలము

కాని రాజ్యాంగ నియమాలు కరుగ లేదు
దండనాథుడు మాన్సింగు చండశాస
నుడు ప్రభువునకు సలహాల నిడగనపుడు
ఆగ్రహంబును జాలియు నంతరంగ
మున పెనగులాడ నక్బరు జనవిభుండు॥ 49

అంచిత సర్వభారత నియంత, నిరంకుశ చక్రవర్తి యం
చెంచక నిర్భయాన మదమెక్కి నటించితివే అనార్కలీ!
వంచన చేసి మామొగలు వంశ సుధాకరమూర్తి మ్రింగ కాం
క్షించితివే! దురంత విధికిన్ బలి యౌటకు నుద్యమించితే!!! 50

క్రాలును స్వర్ణవర్ణనల కాంతుల నీని చరిత్రలోన మా
పాలన మంచు నెంచితిమి పారదమై యరుదెంచి నావు నీ
కాలము దీరిపోయెనొ? మొ గల్కుల మండిత పూజ్య సదృశ్య
శ్రీలకు నిప్పుబెట్టుటకు చేతులు సాచిన నీచ రాక్షసి॥ 51

అనుచు తనలోన చింతించి కనలు చుండ
మంతనంబాడ వచ్చిన మానసింగు
ప్రభృతులు విశిష్ట రాజ్యభారమ్ము మోయు
భద్ర గజములు దృఢముగ పట్టు బట్టి
ఒక్క త్రాటిపై నడువగ నుర్వి ధవుడు॥ 52

చెప్పె ''జీవసమాధియే'' శిక్షయనుచు
శిక్ష యువరాజు చెవులకు చేరుముందె
జరిపి తీరవలయు నతి సత్వరముగ
మూడు ఘడియల కాలమ్ము ముగియులోన
కానియెడల ననర్థమే కలుగ వచ్చు॥ 53

అనుచు నెల్లరి తీర్మాన మైన వెనుక
మనవి వినుడని లేచిన మానసింగు
మూడు గడియల కాలమ్ము ముగియు వరకు

ప్రభువు కొమరుని పిలిపించి పరువుపోవు
నిట్టి కార్యాలు వలదటం చెఱుగ జేయ
చిక్కు లేమియు మొలవక శిక్ష జరుగు
ననిన సమ్మతించెను మంచి దనుచు ప్రభువు॥ 54

6

పారాదారులు జాగరూకులయి దిగ్బంధమ్ము గావింపగా
కారాగారములోన నారు వగచెన్ గాఢాంధ కారమ్ములో
ఏరైపారె తదశ్రుధారలట, ది క్కేదీ యభాగ్యాంగనన్
వారింపన్ భువి నిర్మల ప్రణయ కావ్యశ్రేణి భేదాంతమా! 55

కాలి పగిలిపోవ పరిపక్వమున నుండు
కాగితమువోలె నుండెను కాంత గుండె
చావు బ్రతుకుల సంధ్యలో చానకపుడు
చెఱయె మిగిలెను ప్రేమకు గుఱుతు నంచు. 56

హృదయము లేనివారు రచియించిన శాసనముల్ శరమ్ములై
సుదతి యనార్కలీ హృదయ సుందర హేమ ఖగమ్ము గూల్చెనే
ముద మది పాదుషా క, తని ముఖ్యులకున్ తలరాత నేడిటన్
పదిలపు గుండెలో పెను తుఫానులు రేగె నటంచు నెంచుచున్. 57

ప్రేయసీ! అనారూ! పల్కవే యనారు!!!
అనుచు నావేదనలస్రుక్కి అరుగుదెంచె
చెఱకు యువరాజు, యారసం సిద్ధమైన
దీపమొకసారి గప్పున తేజరిల్లు
విధముగా కాంత ముఖమున వెలుగురేఖ
గోచరించె సలీమును జూచినపుడు. 58

మ్లాన వాసంత లతికయౌ లలన నపుడు
చిత్త మలరగ యువరాజు హత్తుకొనియె

కాల కాదంబినిని కూడ కలసి యుండు
రమ్య సందీప్తి కారక రజిత రేఖ॥ 59

వలచితి నేను నిన్ను కడువంతల పాలొనరింప నీవు పెన్
వలపులు గ్రుమ్మరించితివి బానిస కన్నను హీనమైన నా
చెలిమిని నీదు జీవితము చిచ్చుల పాలయి పోయెనే అనార్!!! 60

ఏటికి నేటి నిండుసభ నీవు పయింబడి నా వనార్కలి
గాటపు ప్రేమకారణముగా చెఱకంకితమైతివే అనార్
వాటిలె ఘోర సంఘటన వ్యక్తముకాని మహాంధ కారముల్
కోటలు కట్టు కొన్నవి, రగుల్ కొనె శోక దవాగ్ని కీలముల్॥ 61

గద్గద స్వరమున అనార్కలి తడబడి,
''సంతసమ్మున నృత్యమ్ము సలుపుచుండి
మిమ్ము జూచుచు మరచితి మేను... నేను..
తత్ఫలమ్ముగ బ్రతుకు అ ధ్వాన్నమయ్యె
ఈ .... క్షమించు.............
పలుకలేను జహాపనా....... 62

అనుచు హృదయేశు పాదాల నునిచె శిరము
కన్ను కొలకుల బాష్పాలు గంగలయ్యె
బోరుమని యేడ్చి కాంతను పైకి లేపె
బాహు వల్లరి సాయాన ప్రభుసుతుండు॥ 63

''ప్రళయమైనను మిన్నుపై బడిన గాని
జీవితేశ్వరి తోడనే పోవువాడ
ననుచు' పాదుషా కిప్పుడే వినతి చేసి
నిండు కౌగిలి లోనికి నిన్ను గొందు
అన్యు లెవ్వరు నన్నింక నాపలేరు''॥ 64

అని శోకంబును, కోపమున్ మనసు నల్లలాడ చేయన్ రహిన్
జనుచుండెన్ విశిఖమ్ము చందమున ప్రా సాదమ్ము చేరన్ సలీం

జన నాధాత్మజు జేరి రాజభటు, డో! జహాపనా! పాదుషా
పనిచెన్ మిమ్ముల పిల్వ సత్వరముగా ప్రార్థించెదన్, రమ్మనెన్॥ 65

ప్రణయ కారణ మరణమ్ము పరిణమించె
దారుణమ్మని ద్యుమణి సంతప్తుడగుచు
చూడ లేనని పడమటి మేడకేగె
ద్వారములనెల్ల బంధించె వసుధనపుడు 66

తగు సమయమ్ము వచ్చెనని తక్షణమే భటవర్గముల్ అనార్
మగువను బట్టి కట్టి అప మార్గము బట్టి శ్మశాన వాటికిన్
నగరము వీడి పోయిరి, అ నార్కలి జీవిత కావ్యమంతమై
మిగిలె సమాధియే, మరణ పీఠము నెక్కె వధూటి అక్కటా! 67

పాదుషా యొద్ద కేగిన నాదు విభుని
కంట బడకుండ మోసాన కాళరాత్రి
వేళ వధియింప తెచ్చిరి వీరు నన్ను
ప్రేమ కారణ మరణమే నోము ఫలమొ?
మరణ వేళైన ప్రియుని నా మనసు దీర
చూచి తరియించు భాగ్యమ్ము నోచనైతి॥ 68

కన్నతండ్రిని మరపించి నన్ను పెంచి
పెద్ద చేసిన గురునితో ప్రియమెలర్ప
పలుకు పుణ్యమ్ము లేదాయె పాపి కిచట
ఎంత ఘోరమ్ము గా విధి వేరు పఱచె॥ 69

అనుచు తుదలేని వ్యథలతో నలమటించి
అశ్రుధారలు పారగా నంజలించి
ఈశ్వరునిమ్రొక్కి నిలుచుండి ఎఱుక వీడి
మొదల నరికిన తరువులా పుడమి బడియె
విమల హృదయ! అనార్కలి!! వినయశీల!!! 70

(8-12-55)

గణగణ ఘంటా!

(శతకం)

శ్రీరాముడొక్క దినమున ఏరా! యివ్విధముననిదు రింపగ దగునా!
లేరా! త్వరగా వ్రాయను రారా! శతకంబు నొకటి రమ్యపు సరణిన్॥ 1

అనగనపుడు నేనును గడు వినయముతోలేచి రచన వేగమె సేయన్పె
నసలును చేత గొనుచును కనుగొంటి నిబంధనాల గణగణ ఘంటా! 2

కనుగొని వేగమె కరమును చన నిచ్చితి నిలికిలేక సరసపుదారిన్మ
నసున మెండగు కోర్కెల గణియింపగ తరములేక గణగణ ఘంటా! 3

'కష్టేఫలి' యను సామెత నిష్టముగా నాచరింప నిక్కము గానున్న
నష్టము లెప్పుడు గలుగక కష్టము కడ సుఖములుండు గణ గణ ఘంటా! 4

ధనమునకై ఓటివ్వకు చనువగు వచనాలకీవు సందివ్వకుమీ!
గుణవంతుడైన వానిని కనుగొని ఓటివ్వు మీవు గణ గణ ఘంటా! 5

లంచంబు ప్రజల లోపల మంచంబులు వేసి కొనుచు మనియెడు వేళన్
దంచగ వారిని సమయము గాంచుచునే యుండు మీవు గణ గణ ఘంటా! 6

మేడల లోపల నెప్పుడు నీడలలో చల్లగాను నివసించు జనుల్
వేడుదురు ప్రజాక్షేమము గాడిదమేల్ వీరికన్న గణ గణ ఘంటా! 7

ధనమే మైత్రిని గూర్చును ధనమే వైరంబు దెచ్చు ధనమే భువిలో
మనుటకు సాధన మరయగ ఘనతను జేకూర్చునీకు గణగణ ఘంటా! 8

(ఈ పద్యాలు చాలవరకు సం:1949– 62ల మధ్య వ్రాసినవి.)

భువి నాకడు నాశ మొందగ అవిరళముగ నొకడు వృద్ధి నందుట విధిరా!
రవి వృద్ధిజెందుచు నలర గవిషణ్ణుడు చంద్రుడగును గణగణ ఘంటా! 9

చులకన అమాయిక జనులు చులకన వృద్ధులు, విధవలు చూడగ భువిలో
చులకన పూర్వాచారము కలదా! ఇటువంటి వింత గణ గణ ఘంటా! 10

కోతికి పెత్తన మిచ్చితి చేతల గావించు మంచు చెలిమి సలిపితిన్
వాతలిడె నెల్ల ప్రజలకు కాతరమును వీడి యౌర గణ గణ ఘంటా! 11

ఎప్పటికైనను మృత్యువు తప్పదటంచు తెలిసికొని తగు సమయానన్
జప్పున గోసెను తనమెడ కప్పరమేలేక యొకడు గణ గణ ఘంటా! 12

స్త్రీ విద్యలవసరమ్మను భావాలనుపన్యసించు పలుసంస్కర్తల్
కేవలము వారి వారినె గావింపరు చదువరులుగ గణ గణ ఘంటా! 13

బాతాఖానీ వద్దుర యాతన కల్గించు నంచు నర్థించంగా
''బాతాఖానీయా'' అని ఘాత మొకటి యొసగెనాకు గణ గణ ఘంటా! 14

అడిగిన నాడే ఓటును వడి వడిగా నొసగి మరల వగచుట కంటెన్
కుడి యెడమలు పోల్చి యిడుము కడుమేళ్ళను పొందెదీవు గణ గణ ఘంటా! 15

అల్లారు ముద్దుగా మరి చల్లంగా పెంచినట్టి సాధ్వీమణియౌ
తల్లి మనస్సును గాయము కల్లోలము చేయకయ్య గణ గణ ఘంటా! 16

కాకులు గూడులు గట్టిన కోకిల కాపురము జేయు కువలయ మందున్
పోకిరి కోకిల కతమున కాకము కడుమోసపోవు గణ గణ ఘంటా! 17

అయ్యో! పాపమటంచును బియ్యమిదిగొ గైకొనుమని ప్రియమున నివ్వన్
నెయ్యివ్వ లేదురా యని కయ్యమునకు బిలిచె నొకడు గణ గణ ఘంటా! 18

మనవారు వీరటంచును వినయంబున నోటునిచ్చి వెతజెందకుమీ!
మనలోనే మూర్ఖులుందురు కనుగొనుమావారినెల్ల గణ గణ ఘంటా! 19

గరిడీ నేర్పెద నంచును బిర బిర పడద్రోసి నన్ను బేలగ జేసెన్
మరణంబు తప్పిచనినను కరమగు కష్టంబు గల్గె గణ గణ ఘంటా! 20

కట్టును దిట్టము లెఱగని బెట్టిదమగు నింగిలీషు బేతాళంబున్
చట్టన సాధించిననే గట్టిగ సుఖపడుదు వీవు గణ గణ ఘంటా! 21

పద్యములను ఎల్లరుగని హృద్యంబను నటుల వ్రాయ నూట కలముతో
నుద్యుక్తుండను కాగా గద్యంబే రాకపోయె గణ గణ ఘంటా! 22

రెకమండేషన్ గలిగిన రక రకమగు పనులకేగి రంజిల వచ్చున్
అకటా! అదిలేనప్పుడు బట్టవలెను గణ గణ ఘంటా! 23

ఎంతదయో మనుజులపై పంతంబున కఱవు పట్టి బాధింపంగా!
మంతెరి కసవును దినుమనె కంతును గైకొంచు విడక గణ గణ ఘంటా! 24

దిద్దునుర కొంపననుకొని పెద్దగ జదివిన వనితను పెండిలియాడన్
''చద్దిడకనె సభజేసెను'' కద్దుర యీవింత జగతి గణ గణ ఘంటా! 25

దేవుని ప్రార్థన కైజని దేవళము వెలుపల ''బూట్సు'' తెన్నున విడిచెన్
భావించి (చె) మదిని దానినె కావించెను ప్రార్థనొకడుగణ గణ ఘంటా! 26

ఇంటి కడ నున్న మందులు కంటికి కొరగాని వటుల కన్పడునయ్యా!
మంట కలుగు దాని గనిన కంటివ యిటువంటి వింత గణ గణ ఘంటా! 27

ఘోషా పద్ధతి గోరుచు బేషుగ బంధించెనయ్య పెనిమిటి ఆలిన్
శోషిల్లి యామె చచ్చెను కాషాయము గొనెనతండు గణ గణ ఘంటా! 28

మన దీపమె గద యంచును చనవుగ చుంబించ నొకడు చక్కన నేగన్
అనలుడు తాకెను ముఖమును కనుగొను మీ వింత నీవు గణ గణ ఘంటా! 29

కరమును వీడిన వస్తువు పరమాత్మునిదే యటంచు బలికెడి వారిన్
పరికించకు భక్తతతిగ కరమగు మోసంబు గలుగు గణ గణ ఘంటా! 30

పాటలు నేర్చిన మనుజుల పాటలు పాడుడని యడుగ బహు బిగువులతో
''మేటి'' యని తామె యను కొని ఘాటుగ వర్తింతురయ్య గణ గణ ఘంటా! 31

సైకిల్ హాండిల్ విడిచియు మైకంబున త్రొక్కియొకడు మడియుట గాంచెన్
పోకిరి వెధవా యంచును కాకులు ఎగతాళి జేసె గణ గణ ఘంటా! 32

ఘనమైన డిక్షనరిని గొని పని విడి పాఠంబు సేయ ప్రారంభింపన్
చనియెను యున్మాదుండై కనుగొంటివ వీనియాశ గణ గణ ఘంటా! 33

పై వారిని తమ ''లెవెలుకు'' తేవలె ననియెదరు, గాని దిగువగల జనుల్
పోవలె నట్టేటను బడి కావరు సమతాప్రియులిల గణ గణ ఘంటా! 34

ఆకలి బాపెడి మందిది చేకొని నాకిడుము ''టిఫిను'' చిత్తమెలర్పన్
ఆకొని యున్నాడను త్వరగా కరుణించమనె నొకడు గణ గణ ఘంటా! 35

ఎంతటి ధీమంతుండును, సంతసమున దాసుడగును సతతము పొగడన్
వింతగ మెదడుకు చెవులకు గంతల సమకూర్చు నుతులు గణ గణ ఘంటా! 36

వేసము వేసి రహస్యముగా సందులలోన పొంచి కడు జాగ్రత, పో
లీసుల కందక చనెనిట కాశిన్ తస్కరణ కొకడు గణ గణ ఘంటా! 37

మంచి తనమ్మును జగము తలంచును ''బలహీనత కుతు ల''యని జనులలో
మంచిని గని ''పాపమ్మ''ను. గాంచుము, చిత్రమగు జాలి గణ గణ ఘంటా! 38

భావ జగత్తుకు వాస్తవ జీవితమున కన్వయమ్ము సిద్ధించిననే
తావుల జిమ్మును మనుగడ గ్రావమ్మగు లేక యున్నగణ గణ ఘంటా! 39

కొలువున వెలసిన యపుడే పలువిధముల గౌరవమ్ము ప్రాప్తించు నిలన్
కొలువూడిన మరుక్షణమే కలియరు స్నేహితులు గూడ గణ గణ ఘంటా! 40

క్షితి 'నలోపతి' హోమియోపతి కతమున నయముగాక బాధాకరమై
మితి మీరెడి రోగములకు గతిశ్రీ శేషాచలపతి'గణ గణ ఘంటా! 41

బ్రతుకుట తెలియని వానికి గతి బడిపంతులు కొలువట కడునుత్తమమై
క్షితి దనరు, వృత్తికీ దుర్గతి యొనగూడె గదనేడు గణ గణ ఘంటా! 42

అతి పరిచయమైన తిరస్కృతి గలుగును నెయ్యమందుకీడును మూడున్
చతురత సన్మైత్రిని జాగ్రతమై కాపాడవలయు గణ గణ ఘంటా! 43

కోరిన వస్తువు మనదరి చేరని తరి దాని విలువ చెన్ను వహించున్
చేరిన యెడ దిగజారును కారణమేలేక మమత గణ గణ ఘంటా! 44

తెలిసినది కొంచెమైనను తెలియును సర్వమ్ము నాకు తెలియుడటంచున్
పలుక వలెన్, లేకుండిన కలుగదు మర్యాద నేడు గణ గణ ఘంటా! 45

పలుకంగ స్వేచ్ఛకలదని తలచిన వెల్లను పలుకగ ధర్మమ్మగునా!
యిల ప్రతిదానికి పరిధులు కలవని తెలియంగ వలయు గణ గణ ఘంటా! 46

ఎన్నిక వాగ్దానమ్ములు కన్నియపై వలపువేళ గారాబముతో
విన్నపము సేయు నుడులెట గన్నను కల్లలనుకొనుము గణ గణ ఘంటా! 47

కుల తత్త్వమ్ములు ముదిరిన కలదే ఎందైన లోక కళ్యాణము, రా
జులు, ప్రజలే యైనను తేగలరు సమాజమున ఖిలము గణ గణ ఘంటా! 48

ఎన్నికలపుడు ప్రతినిధులు తిన్నగ మన ఓట్ల కొఱకు తిరుగుచు వలలన్
పన్నికొని గెల్చి యాపై కన్నెత్తియు చూడరన్న గణ గణ ఘంటా! 49

అవినీతికి, లంచమునకు నివాళు లొనగూర్చువారి నేతృత్వము పొం
ది వినాశనమై పడిపోక వెలయు సంస్థలు హుళక్కి గణ గణ ఘంటా! 50

సులువుగ నీతులు చెప్పం గలవారే యెల్లవారు గాంధీ వలె చే
తలలో నీతులు తెల్పం గలమహనీయులు సకృత్తు గణ గణ ఘంటా! 51

ఎడదన్ ద్వేష జ్వాలలు ముడివడి పైకెగయు వేళ మోమున నగవే
ర్పడ కొందఱు కైమోడ్తురు కడు మెలకువ జూప వలయుగణ గణ ఘంటా! 52

''చితి శవమును కాల్చును జీవితమ్మనే కాల్చు చింత,'' విశ్వము నందున్
వెతల కతీతముగా దక్షత గల్గి మనుట పొగడుదు గణ గణ ఘంటా! 53

మనమున శోకము పర్వగ కనులందున దొరలు బాష్ప కణములు, దానన్
మనసు నవనీత సమమగు కనిపెట్టు మిదెంత నిజమొ గణ గణ ఘంటా! 54

కనిపెట్టిన విజ్ఞానము జనక్షయమ్మునకు గాక శాంతికి నియమిం
చిన నరుడు సుఖములన్ సుర గణముల తోడ తులతూగు గణ గణ ఘంటా! 55

పరమాణు యుగమునందున తరిగెను మానవుల జీవితమ్ములు వెలువల్
నర జాతి సమస్తము ముష్కరజాతిగ మారునే మొ గణగణ ఘంటా! 56

కవితా స్వరూప మొకటే కవితలలో క్రొత్తపాత కారణమున పె
ద్ద వివాదములనవసరము కవితాప్రగతి కది దెబ్బ గణ గణ ఘంటా! 57

ధనవంతుడ వైనంతనె ''మనవాడని వచ్చి బంధు మండలి జేరున్
ధన హీనుడవైనంతనె కన బడినను బల్కరన్న గణ గణ ఘంటా! 58

పలుకునది కల్లలైనను పలుకుము పలుమారు నొక్కి భావింతురు లో
కులు సత్యములనితదుపరి కలుగును నీనుడికి విలువగణ గణ ఘంటా! 59

దినమొక పద్దియ మని తొలుత నుడివి పఠియింతురేక ధాటిగ మనతా
ల్మిని పరిశోధింతురు కృప గనరు కవులు కొందఱు భువిగణ గణ ఘంటా! 60

అరటాకు ముండ్లు గ్రుచ్చిన అరటాకే ముండ్ల బడిన హాని ఘటిల్లున్
అరటికె, అప్పుడది ఉపయోగ రిక్తముగ శుష్కమగును గణ గణ ఘంటా! 61

క్షితి కొందఱు తమపనులన్ జతురతతో నిన్ను జేరి సాధింతురు వే
గ, తదుపరి చరింతురు సఖ్యతయే యేర్పడని యట్లు గణ గణ ఘంటా! 62

అందని ఆనందమునకు మందుడవై మనసుసాచి మతి చెడిపోగా
ఎందుకు నిష్ఫలముగ ఆ క్రందించ వలెన్ జగాన గణ గణ ఘంటా! 63

మనుజుని మదిలో నుత్తమ గుణములు పుట్టిన యపుడె చి గుర్చును, గ్రంథా
లను చదివిన నేర్పడవవి ''కనక మగునె యినుము రాయి''గణ గణ ఘంటా! 64

పరిణతి చెందిన హృదయము విరిసినపుడు వెలువడిన కవిత్వము నిలుచున్
పరమోత్కృష్టముగ యశ స్కరముగ చిరకాలము భువి గణ గణ ఘంటా! 65

ఆవేదనతో నిండిన భావావేశమ్ము పొంగి పలుకుల రూపై
జీవత్కవితా నిర్ఝరిగా వర్ధిల్లును సతమ్ము గణ గణ ఘంటా! 66

ఏదో కారణములతో హోదాలను పొందువార లుజ్జ్వల మతులై
ఆదర్శ ప్రాయులగుట కైదప్పిని జూపుదురిల గణ గణ ఘంటా! 67

''నిన్న అరుదెంచి యుండిన యున్నతమగు కొలువు గూర్చియుందును గాదా!''
అన్నాడొకడని, శ్రీవెంకన్నకు జెప్పితి తిరుమల గణ గణ ఘంటా! 68

కుహనా ధీమంతులతో విహరించుచు వారి ప్రతిభ వేనోళులతో
నహరహము పొగడవలె, ఆగ్రహము వహింత్రూరకున్న గణ గణ ఘంటా! 69

కుల బలమో, ధన బలమో కలవారల జీవితాలు కలరవములతో
వెలయు, నవిలేని వారిని కలవరములు కాయునేడు గణ గణ ఘంటా! 70

చిన నాటి నేస్త మని, మే లొనరింప గలుగు పదవుల నున్నాడని యా
తని సాయము గోరుట చులకన, ఆశ నిరాశ యౌను గణ గణ ఘంటా! 71

నీవలన ఎదుటి వానికి కావలసిన కార్యమొండు కలిగిన యెడలన్
నీవింద్రుడు, చంద్రుడవని గావించును స్తోత్రమతడు గణ గణ ఘంటా! 72

గూడు పుఠాణీల్ చేసెడి వాడధికారము వహించి వలపుల గూర్చున్
కీడొనరుచు వాని యెడద గాఢ ద్వేషాల నెలవు గణ గణ ఘంటా! 73

మనసున క్రౌర్యము పెంచిన మనుజుడు కరుణాళువగుట;
మానిత కరుణా గుణభూషణుడును, క్రూరుడు
గనడచు కొనుట; కడుఅరుదు గణ గణ ఘంటా! 74

తనలోని చెడ్డ గుణముల గన బరచక తిరుగు వరకు క్రాలును పూజ్యుం
డన బడి ఈనాటి మనిషి గనుక సమీక్షించికొనుము గణ గణ ఘంటా! 75

కులమత భేదాల్ వలదని పలుకుమురా బల్లగ్రుద్ది ప్రచ్ఛన్నముగా
కుల బలము నుద్ధరింపుము కలికాలపు పదవులంద గణ గణ ఘంటా! 76

క్షోణిని విశ్వాసముగల ప్రాణి శునకమంచు నిజము బలికెను మనుజుం
డేనాడో ఈర్ష్య గొనక గాణేయ మతని ప్రవృత్తి గణ గణ ఘంటా! 77

పెండిలి, పేరంటాలకు పండుగలు, సభలకు వ్రాయు పద్యాలు మహో
ద్దండము లైనను కవితా ఖండములై నిలువలేవు గణ గణ ఘంటా! 78

బహు పక్ష నాయకత్వము రహియిల్లెడి నాట సుస్థిర, శుభప్రద పౌ
రహిత ప్రభుత్వ మరుదని గ్రహియించెడి జాతి యెదుగు గణ గణ ఘంటా! 79

కులమత విద్వేషమ్ములు బలిసిన భారతము నందు భాషాద్వేషా
లలము కొనగ జాతీయత కలుషిత మయ్యె, హతమయ్యె గణ గణ ఘంటా! 80

కులమొక సంఘ సమస్యగ కలిగించిన హాని కంటె కడుఘోరము ని
చ్చలు రాజ్యతంత్ర మున నది కలిగించుచు నున్న క్షోభ గణ గణ ఘంటా! 81

గుణ వంతుడు విద్యానిధి గణనీయ త్యాగశీలి, కవిశేఖరుడున్
ధన వంతుని వెనుకనె పరి గణియింప బడుదురు నేడు గణ గణ ఘంటా! 82

అధికారమబ్బి నప్పుడు అధముండును సంఘమందు ఆద్యుడు, ప్రజ్ఞా
నిధి త్యాగి యగును జీవిత కథలను వ్రాయించు కొనును గణ గణ ఘంటా! 83

అనుమానము పెనుభూతము మనసున శాంతిని హరించు మానవతకు వ
న్నె నొసగు హార్ద్రత మాన్చి మృగనీతి గరపును జగమున గణ గణ ఘంటా! 84

వెనుక సహాయము చేసెడి ఘన నాయకులున్నయపుడు గర్వోద్ధతుడై
పని చేయక నక్రమ ధన కనకా ల్గొను నౌకరుదొర గణ గణ ఘంటా! 85

పదవీ సోపానములో కదలెడు నుద్యోగి చేత కాని తనపు హ
ద్దుదరి కని పీటరు తెలిపె గద చిత్రపు సూత్రమొకటి గణ గణ ఘంటా! 86

చిన్నలము కాము చేయము చిన్నపనుల్ పెద్ద తనము చెల్లమి నెటుచే
యన్నేర్తుము పెద్దవి? కను కన్నిత్యము చేయమేమి గణ గణ ఘంటా! 87

అవినీతి ప్రియులైనన్ స్తవనీయముగా మనుటకు చతురత గలమా
నవుల గని యబ్బుర పడు భగవంతుడు సహితము నేడుగణ గణ ఘంటా! 88

కినియుట మగువకు అందము అనునయము పలుకు పెనిమిటిఅబ్బిన యెడ, త
క్కిన సందర్భము లందున గనవచ్చును పెదవిచేటు గణ గణ ఘంటా! 89

తెలుగులు, అరవలు, మలయాళులు, కర్ణాట గుజరాతులు, మరాటీల్ వ
ర్ధిల, భారతీయులను కన గలగుట అరుదయ్యె నేడు గణ గణ ఘంటా! 90

సమ్మెను ప్రారంభింతము గమ్మత్తుగ సెలవు వచ్చు కారణమేదో!
పిమ్మట చూతమనెడు సంఘమ్ములు కొల్లలుగ వెలసె గణ గణ ఘంటా! 91

తన కొక ధర్మము నడవడి అనుయాయులకు మరొకటని అధ్యక్షుండై
అనుశాసించి ప్రబలుడగు ఘనుడు కనబడు పలుచోట్ల గణ గణ ఘంటా! 92

అనురాగము గౌరవమో మనమున కల్గిన యపుడె న మస్కారాల్ చే
యునెదుటి వాడని పొరబడక నిజమెరిగి మసలు కొనుము గణ గణ ఘంటా! 93

గదిలో నుజ్వల కాంతి ప్రదమగు దీపమును వీథి ప్రక్కన నిడగా
నది వలసిన వెలుతురు నొసగదు; ప్రాభవ హీనమగును గణ గణ ఘంటా! 94

వెలదుల వయస్సు, ఉద్యోగుల జీతాలు పరిశోధ కుల (research) నెడు విద్యా
ర్థుల 'పని' (work) నడుగుట నాగరక లక్షణము గాదు నేడు గణ గణ ఘంటా! 95

ఎనిమిది వరకు గణించే మనిషికి ఏడు పిదప తిక మకపడు మనుజుం
డని పించు జ్ఞాన హీనుడు గ, నికృష్ణుడుగా, నలుసుగ గణ గణ ఘంటా! 96

స్తుతమతిగాని మనుజునకు నతు లొనరుప వలసినపుడు నగవు, నెడందన్
వెతయ, జుగుప్పయు కలుగునె గతాళిగ మనుగడతోచు గణ గణ ఘంటా! 97

ఓహో! యనిపించెడి కృతి ఆహా! యని పించెడి కృతులందు విశిష్ట
''మ్మాహో కృతి'' రసధుని వడి గా హృద్రంజక మగునది గణ గణ ఘంటా! 98

★విని యుక్త గణిత శాస్త్రము నన వచ్చు మధుర కవిత్వమని స్వీకృతఖే
లనము, ''విశుద్ధ గణితము, లక్షణ శాస్త్రమునకు తులయగు గణ గణ ఘంటా! 99

★ (Applied Mathematics, Pure Mathematics)

కాముకుని నైజ మెఋగక ప్రేమికుడని నేడు మనము పేర్కొను కతనన్
ప్రేమికుల విలువ తగ్గెను కామాంధుల బృందమందు గణ గణ ఘంటా! 100

కవితకు క్లుప్తత, ఆప్తత జవ సత్త్వాల్, గుప్తత రస జాలమ్ముల్ జే
ర్చు విశిష్టత గూర్చు మహా కవితగ వికసింపజేయు గణ గణ ఘంటా! 101

కవి వరులు★ గారు విద్యార్థి వరులిల పరోక్షముగ వ రింపబడిన
భూ ధవులుగ శాసన సభ్యులు గ వెలయు చున్నారు నేడు గణ గణ ఘంటా! 102

(Unacknowledged Legislators)

''అవివేకులు నిర్మింతురు వివేకుల నివాసమునకు విన్నాణమునన్
భవనములను కోకొల్లలు గ''వింటివా? ఆంగ్ల సూక్తి గణ గణ ఘంటా! 103

విన్నవి వెంటనె మరతువు కన్నవి కాసింత సేపు క్రాలు నెడందన్
తిన్నగ సేయుముక్షుణ్ణము గన్నేర్తువుమరువకెపుడు గణ గణ ఘంటా! 104

న్యాయమ్ము నమ్మ సంఘము న్యాయమ్మును ధర్మగతిని నలువురి కెటులన్
జేయును ధనవంతునికే ఖాయముగా న్యాయమబ్బు గణ గణ ఘంటా! 105

ములుకుల బోలిన పలుకులు అలుగు చెలులగు నెలుగులు నయమ్మగు మౌనం
బిల నొక్కొక్క నిమిషమున కలిగించెడి బాధకన్న గణ గణ ఘంటా! 106

చవటలకై వడబోసిన చవటలు, చవటల పరపతి సమకూరంగా
చవట ప్రభుత్వమ్ములుగాక వెలయుదురె సత్ప్రభుతల గణ గణ ఘంటా! 107

పదవులనంబడు మధువులు పెదవులపై సోకగానె పెన్మత్తున సౌ
హృదము మఱచి వర్తించెం గద యొకనాటి సహపాఠి గణ గణ ఘంటా! 108

ఒకపుడతిశయోక్తులు కవితకు మాత్రము పరిమితంబు దైనందిన కృ
తికి, సహజోక్తుల కున్ గొంకక, నత్యుక్తి చెలగు నిల గణ గణ ఘంటా! 109

గురువును మించిన శిష్యుడు గురువునకున్ గూర్చు యశము కొండొక చోటన్
గురువెరిగిన దల్పమ్మను గరువపుశిష్యులము మేము గణ గణ ఘంటా! 110

వందన సమర్పణమ్మున అందముగా అతిథి మనసు ఆనందింపన్వం
దన మిడుమా! కుందకు, కందకు కల్ల పలుకుటకు గణ గణ ఘంటా! 111

పొత్తమునకు మున్నుడి నాయత్తము చేయుతరుణాన ఆడు మబద్ధాల్
మెత్తురు లేకున్న యెడన్ కత్తులు నూరుదురు కవులు గణ గణ ఘంటా! 112

నగరాలన్ మొగసాలల నగపడు నాహ్వాన ఫలక మందు ప్రకటిత
మ్మగు అదృతి ''శూన్య సమితి''★ గ గణించుట 'నాగరికత' గణ గణ ఘంటా! 113

★ Null set (Mathematical term)

భువి మిథ్యావాదమ్మది స్తవ నీయమైనను ప్రజ చరియించును, వా
స్తవమున కొక సెలవు లేఖ విసరివైచి సతతమ్ము గణ గణ ఘంటా! 114

వేదముల మాదిరి గణిత వాదములు న పౌరుషేయ వైభవ యుతముల్
వాదమె కానీ రచయిత కాదు గదా! ముఖ్య మిందు గణ గణ ఘంటా! 115

గణితము శాస్త్రము కళయో మనకీ మీమాంస వలదు మహిలో శాస్త్ర
మ్మున కాత్మ యగున్ కళకున్ ఘన మణి భూషణ మగునిల గణ గణ ఘంటా! 116

పులి వేసము దాలిచి బెబ్బులివలె పులులబ్బుర పడ ''భూంభూ'' మ్మని వి
చ్చల విడి విహరించెడి నక్కలగని అక్కజ పడకుము గణ గణ ఘంటా! 117

నేతయగువాడు తొలుతన్ ప్రీతిని యప్రీతిని వివ రించక చివరన్
చాతురి సభ నొప్పింపంగా తగును ''డెమోక్రసి'' యది గణ గణ ఘంటా! 118

అక్షర శిల్పమే కవితకు లక్షణ మని మోసపోకు లావు సమాసాల్,
వక్షోజ వర్ణనలును, నఖక్షతములు కవిత లౌనె? గణ గణ ఘంటా! 119

చెలిమి నెపమ్మున పెద్దకవుల తొలి పలుకుల బలము మి వుల లోకముపై
తెలుగు కవి నాయక జనులు కలబడు చున్నారు నేడు గణ గణ ఘంటా! 120

మగడాలిని పాలించే తగ వొకచో, అత్తగారి తత్త్వం బొకచో
నగపడ నధ్యక్షింపంగ గద్దెలు కలవొక కొన్ని గణ గణ ఘంటా! 121

పనియున్నప్పుడు ప్రేమన్ గన బరచుచు తదుపరి పెడ కాలిన్ జూపె
ట్టు నతండు లౌకికుం (love kick)డని ఘన కీర్తిని పొందుగాదె గణ గణ ఘంటా! 122

నేరము లెంచకు ''విద్యు త్స్ఫూరిత శాక్తేయుల యెడ తూష్ణీం భావం
బేరోజైనను శ్రేయము కారణ మనవసరముగద గణ గణ ఘంటా! 123

ఒక ప్రొఫెసర్ డస్ట్ బిన్ లోని కాగితమ్ముల ఖరము తిని యెటులొ పిహెచ్. డి.
కొని తిరిగె మిడి మేలము గ కొమ్ములు మొలిచె ననుకొని గణ గణ ఘంటా! 124

నలుగురు దయబెట్టిన గద కలిగె పిహెచ్.డీ. సిరి అది కాస్తమఱచి తొ
మ్ములు విరుచుక తిరుగు నతడు కలండు కాంచి తివ నీవు గణ గణ ఘంటా! 125

అనుమానము పెనుభూతము అను దినమున్ వెంట బడుచు హతమార్చునుగా
వున విశ్వాసము నాబడు ఘన శస్త్రము నుంచు కొనుము గణ గణ ఘంటా! 126

అరుదెంతురు యంత్రమువలె గురువులు, యమబోరుగొట్టు కోరికతోడన్వ
రవిద్యానిధులైనను కరువయ్యెను పల్కు చేవ గణ గణ ఘంటా! 127

గంట కొకసారి నీదగు ఘంటారావమ్ము వింట కలుగునెడందన్
మింటికెగయు సంతోషము కంటకమగు ''బోరు'' నందు గణ గణ ఘంటా! 128

పరీక్షలో గెలుపొందిన నాటి నా భావన

అది విశాల ప్రశాంత సౌధాంత సీమ
పద్యరచనా పరీక్షలో ప్రథమ వర్గ
బహుమతుల పొంద పలువురు వచ్చినారు
నేను సహితము కాంక్షతో పూనివచ్చి
రచన చేసితి కష్టించి యుచిత రీతి॥

శ్రీవాణీయుత గిరిజా
దేవీ కృప కల్గినాకు దివ్య ఫలమ్ముల్
రావా? యని యూహించితి
భావాంబర సీమలోన బహువిధములు గాన్॥

ఊహించినట్లే ఉదయము
స్నేహితుడా విజయవార్త
నింపెను చెవులన్
ఆహా! యని యుప్పొంగితి
నూహా కాశమ్మున కవి తోన్ముఖమతినై.

ఆంధ్ర భాషను దిద్ది అందాలు నింపిన
ఆది కవి యగు నన్నయ్య నేను
వాణి నేద్వకుమని వారించి కవితతో
తరియించి నట్టి పోతన నేను
గౌడ డిండిమ భట్టు కంచు ఢక్కను గొట్టి
నాడు వెలసిన శ్రీ నాథుడేను
విజ్ఞాన నీతులు వెల్లువై పారించె
నవతార మూర్తి వేమన నేను

ఆంధ్ర కవితా పితామహుడు అల్లసాని
పెద్ద నార్యుడనే నేను వినుడు మీర

లనుచు ప్రస్తుతము మఱచి యసహజమున
లీనమైతిని, పిమ్మట నేను సిగ్గు
పడితిని 'యణువునై' వారి ప్రతిభ ఎదుట.

ఐనన్ నాలో కవితా
స్థానమ్ము కలిగె ననుకొని సంతస పడితిన్
తేనెలు కల్గిన పువ్వుల
మానస వీథులు సహితము మద్విధి నుండున్

సరస సౌందర్యశీతల స్వామియైన
పౌర్ణమీచంద్ర దర్శన భాగ్య గరిమ
నింగి కెగిరెడి కెరటాలు నిండినట్లు
మన్మనో జలధి భావాలు జన్మ మందె.

పద్యరచనా పరీక్షలో పాలుగొనిన
వారలందఱి మొగములు వాడినట్టి
పుష్ప నిచయమ్ము వలె నాదు బుద్ధి నొడమ
ఒకట జాలి, గర్వాన మ ఱొక్కసారి
చూచి పలికించు వారల చూచినపుడు

విశ్వ కల్యాణ మొనరించు వృత్తముగొని
సరస సంగీత సాహిత్య సాధనమున
దివ్య కవితా విభూతితో కావ్యరచన
చేసి తీరంగ శపథమ్ము చేసినాను.

పుట్టపర్తి నారాయణాచార్యుల వారికి సమర్పించిన పద్యమాల

సద్యశః సంధాన విద్యా సముద్భూత
విజ్ఞాన ధనము నీ విమల మూర్తి
వివిధ భాషాభ్యాస విజ్ఞాన సముపేత
విఖ్యాత సాహితీ వేత్త నీవు
రమ్యసారస్వతా రామశోభిత దివ్య
సంగీత సంపూర్ణ ధురులు మీరు
సంగీత సాహిత్య సంయోగమున నొప్పు
అతుల కాదంబరీ సుతులు మీరు

స్వీకరింపుము స్వాగత శ్రీల నిపుడు
ఆయు రారోగ్య భోగ భాగ్యాభిరస్తు
అనుచు నానంద కిరణమ్ము లంతరంగ
సీమ రేకెత్తి దీవించె చిత్త మలర
విశ్వ విద్యాల యమ్మున వెలుగుమాత
రచియించి నావు క ర్ణ సుధారసమ్ముగా

తన్మయుండై శివ తాండవమ్ము
ఆంధ్ర ప్రబంధాల నలరు నాయికల మీ
రంచితమ్ముగ విమ ర్శించినారు.
సుందర సుమనోజ్ఞ సూక్తి వైచిత్రిలో
మిన్నుముట్టును మీదు మేఘదూత
కమ్మకమ్మని కైత ముమ్మరమ్ముగ రాగ
కోరి వచ్చెను పెను గొండలక్ష్మి

సంస్కృతాంధ్రాంగ్ల వాణులు సంతసమున
త్వన్మనోహర కావ్యసం తానములను
స్వీకరించిరి మీ కీర్తి వెలయజేసి
ఓ సరస్వతీ పుత్ర! వి ద్యా సముద్ర!

కమ్మని కంఠమెత్తి తమ కైతల పాడ సభజనాళి యు
ల్లమ్ములు పల్లవించును క ళా నిధి నిన్ గని ముగ్ధమౌ చకో
రమ్ముల వోలె మా మనసు రంజిలజేయుము మంజు వాక్ప్రపూ
రమ్ముల పుట్టపర్తి కవిరాజ ప్రసిద్ధ సరస్వతీ సుతా!!

ప్రబంధకవీ!

అతులితంబైన పాండితీ ప్రతిభ గల్గి
ప్రకటితంబైన జ్ఞాన సం పత్తి గల్గి
సార సంసిక్త సుకవితా ధార గల్గి
వ్రాయవైతి వెందులకో ప్ర బంధ సుకవి.

స్వీయ పథగామివై నీవు శ్రేష్ఠ కవిత॥

అనుపమమైన జ్ఞాన నిలయంబవు
నిస్తుల శిష్ట పాండితీ
ఖనివి మహోజ్వల ప్రథిత క్రమ
కవిత్వ జలాశయంబునన్
జనితము నీదు మానస వి శంకట
పద్మము తత్పరాగ బం
ధన సువిధేయ భావలత తా నెగ
బ్రాకని సీమ లేదహో॥

తావక దివ్య భవ్య కవి
తాఝరి పారి తెనుంగు నేలపై
జీవము గలిగి వెల్గునటు
జేసె ప్రబంధపు పంటలెన్నో మీ
భావలతామతల్లి యెగ
బ్రాకెను మింటికి గూడ సత్కవీ
నీవు మహోన్నతుండవు మ
నీష వికాస ఫలమ్ము పొందుటన్.

శ్వాసకు శ్వాసకున్ నడుమ
చక్కని కైతలతో నొకొక్క యా

శ్వాసము వ్రాసి నావట ప్ర
 శస్త్ర కళానిలయుండవై పద
న్యాస విచిత్ర శిల్పకల
 నమ్మున పూజ్యమహాకవీ! బహూ
ల్లాస కరమ్ములౌ తమక
 ళా సుమరాశికి మా నమస్కృతుల్.

హృదయము లొక్కటై కలిసి
 రింపుగా నా ప్రణయైక జీవులం
చెదకు ప్రసిద్ధి నిచ్చి రచి
 యింపక చర్విత చర్వణమ్ముగా
''మదనుని రచ్చకీడ్చి అవ
 మానము చేయగ నుత్సహించిరా
ముదితయు నాయకుండని'' య
 భూతపు కల్పన లల్లు టేలనో!

పాత్రలనుం గనుంగొన న
 పారముగా సృజియించి రమ్యమౌ
గాత్రము గూర్చి వర్ణనల
 కమ్మగ వ్రాసితిరైన మీరలా

పాత్రల చిత్త వృత్తిని స
 మానము గాగ ప్రబంధసీమలో
చిత్రణ చేయరైతిరి వ
 చించితి మన్నన సేయగోరెదన్॥

పంత మేమోగాని భాషలో పలుమారు
 సాము విద్యల నెల్ల సలిపినావు

భావమే మోగాని పదజాలముల గొంచు
గారడీ విద్యకు గడిగినావు.

చిత్రమే మోగాని చేత్రాడు వచనాల
చీకాకు కల్గర చించి నావు
హృద్యమేమోకాని పద్య శిల్పమ్ములో
దోబూచు లాడగ తొడరినావు

ఇట్టి ఘట్టాలు నలుగురి కెఱుక కంది
కవిత సఫలత చెంది సంఘాన వెలయ
వలయు ననుమాట తలపక వ్రాసినావు
నిజము చెప్పితి నన్ను మన్నించు స్వామి.

21-3-55

మేఘ సందేశము

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రికి కృతజ్ఞతలు

నాగరాజు:

ఆకాశమ్మున ధూళి ధూసర పరి
త్యక్తావ కాశమ్మునన్
ఏకాంతమ్మున వాయువీచికల హా
యింబోవు మేఘోత్తమా!
ఆకర్ణించి దయార్ద్ర చిత్తమున నీ
వందిమ్ము సందేశమున్
శోకాకీర్ణ మనః సుమమ్ము కవియన్
శోషిల్లు నా మల్లికిన్.

మల్లీశ్వరి:

సంతోషమ్మున కోరకుండగనే సు
స్వాంతమ్ము నిండారగా
నెంతేనిన్ జలదాన మిచ్చెదవు ని
న్నేమంచు వర్ణించెదన్
కాంతారమ్ములు దేశదేశములసం
ఖ్యాకమ్ముగా కంటివే
సుంతైనన్ దయయుంచి 'బావ' నెలవుల్
సూచించి పోవం గదే॥

నాగరాజు:

నీలాకాశ పథమ్ము నందు జనునో
నీ దృష్టి మా యూరిపై

కీలింప దలకొంటివా?

వెలుపల కించిత్తు దూరమ్ములో

క్రాలున్దేవళమొండు అచ్చటనె

వృక్షచ్ఛాయలో నుండెనా

ఆలాపించుచు 'మల్లి' బావ కొరకై

అల్లాడి పొర్లాడుచున్.

మల్లీశ్వరి:

ఎన్నాళ్ళిట్లు వియోగ వహ్ని బడి నే

నేడ్వంగ నిర్ణీతమో

కన్నుల్ తెన్నుల జూచి జూచి చెదరన్

కన్నీరు మున్నీరు గాన్

ఎన్నో రీతుల నిన్ను గొల్చెదను నా

యీ బాష్పముల్ గుండెలో

క్రన్నన్ గైకొని పోయి 'బావ' యెదుటన్

రాల్చంగదే జల్లుగాన్.

నాగరాజు:

భావమ్ముల్ గ్రహియించు నేర్పుగల యా

పద్బాంధవా! ప్రేంఖణ

ప్రావృణ్ణిరద! మల్లిమూర్తి నిలిచెన్

భావాంబర స్థానమున్

దేవి కంఠమే విన్పడున్, కనబడున్

దేవీ స్వరూపమ్మె; నా

దేవేరిన్ గని నాదు చిత్తమున సం

దేశమ్ము తెల్పంగదే! (మే 1955)

నీరాజనం

కార్వేటినగరంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి విరమణ గొన్నవారు..

శ్రీకర గురువర సద్వి
ద్యాకర సంపూజ్యమూర్తి తాపక కృషియ
సోకము, జోతలివేసు
శ్లోక యుతా! శ్రీ.జి.సోమ సుందర శాస్త్రి

నవనీతమ్మును జ్ఞప్తి చేయు మనమున్ న్యాయ వ్రతమ్మున్ సుదీ
ర్ఘ విశాలమ్మగు దృక్పథంబునకలం కంబైన మేధస్సు స
త్కవితా శక్తియు, కార్యదీక్షయును నౌ దార్యమ్ము రంజిల్లగా
నవతారించిన సోమసుందర విశిష్టాధ్యాపకాగ్రేసరా!
భవదీయామల పూజ్యసేవలకు మా భక్తి ప్రపూర్ణాంజలుల్

విమల దయార్ద్ర మానసిక వీచిక లందున దేల్చి నీతినీ
మములను నేర్పి సంతతము బాలుర నెల్లర దిద్ది తీర్చి స
క్రమ పథగాములై వరల గా కృషి సల్పిన దేశికోత్తమా
సమధిక గౌరవప్రద యశశ్శశికాంతుల నుల్ల సిల్లుమా !॥

చిన్న బిడ్డల దిద్దు శిల్పమ్ము మీలోన
మూర్తీభవించెను ముమ్మరముగ
బాల విద్యాబోధనాలయాన బ్రతుకు
సాగించి తనియు ని స్వార్థజీవి
నీతి నిజాయతిన్ నిష్కల్మషంబైన
అధ్యాపక వృత్తి నందినావు
సోదరోపాధ్యాయ సుస్నేహ మార్జించి
పూజ్యుండ వని కీర్తి పొందినావు,

సౌమ్యహృదయుడవయిన ప్రశాంత మూర్తి
శీల సౌందర్య శోభిత స్నిగ్ధ కీర్తి
సోమసుందర సార్ధక నామధేయ
స్వీకరింపుము విశ్రాంతి వేళవచ్చె
భాజనంబగు పద్య నీ రాజనంబు॥

కలసిన మనుజులు కలసిన ట్లుండక
 విడిపోయి వెడలుట పుడమి నీతి;
వెడలి పోయిన గాని ఎడద నుండిన చాలు
 నిస్తుల ప్రవిమల స్నేహలతలు:
భవదీయ మానస ప్రాంగణమ్మున మాదు
 పరిచయ స్వల్పమ్ము పరలు గాక;
మీ మూర్తి మాకెపుడు సామీప్యమున నుండు
 సౌహార్థ విజ్ఞాన సాధనముగ;

తమకు వీడ్కోలు నొసగు నీ తరుణ మందు
పరితపించిరి కార్వేటి పుర వధూటి
విమల విద్యాల యమ్మున వెలుగు తల్లి;
అనుచితమ్మని ఎంచి వా రవిగో మరల
మందహాసము చిందించి మసలినారు.
స్వీకరింపుము 'వీడ్కోలు' చిత్తమలర॥ 1-4-56

వీడ్కోలు (మన్మథకు) స్వాగతము (దుర్ముఖికి)

విశ్వ శాంతిని గూర్ప విత్తనమ్ముల చల్లి
వలయు సన్నాహాలు సలిపినావు:
భారతావని శాంతి వాణిని గొంపోయి
నేల నాల్గు దిశల నింపినావు;
గంగను వోల్గా తరంగిణిన్ జతచేర్చి
స్నేహ సంపదల సృష్టించి నావు
అఖిలాంధ్ర భువికి ప్ర హ్లాదమ్ము చేకూర్చి
తెలుగు సోదరులను కలిపి నావు;

ఇటుల చరితార్థ కార్యాల నేడు నిండె
మన్మథా! గొమ్ము వీడ్కోలు మహిత రీతి
మరల అరువది యేండ్లకు తిరిగి వచ్చి
గురుతు పట్టుము మారిన ధరణి నీవు॥

జగతి వసంతుని సాయాన గొని వచ్చె
నందంపు సడలనీ రాజనాలు
కోయిల కన్నెలే గున్న మామిడి పైన
పంచమ స్వరమాల పించు నదిగొ
మధుమాస సౌందర్య మాధురికి మురిసి
స్వాగతమ్ములు పల్కె వనము లెల్ల
ఆశాసహస్రముల్ అంత రంగమ్మున
మొలకెత్త దీవించె తెలుగు తల్లి

స్వాగతము గొమ్ము దుర్ముఖి వత్సరమ్మ
తెలుగు భువి యెల్ల నీయెద చలువ కతన
పసిడి పంటలు విలసిల్లి ప్రగతి జెంద
వలయును గదమ్మ నీవిట వెలయు చుండ!! 5–4–56

నిఖిల మానవతా ప్రతినిధి భూదానాధ్వర సోమయాజీ, సర్వోదయ సమాజ నిర్మాత
శ్రీ శ్రీ శ్రీ ఆచార్య వినోబాభావే మహాశయునకు

స్వాగత నీరాజనం: (పుత్తూరు)

శ్రీ దేవి నిలయమ్ము భారతికి వైశిష్ట్య ప్రదేశమ్ము: గౌ
రీ దృక్కాంతుల సుందరిల్లు భరతో ర్విన్ బుట్టి వేదమ్ములున్
వేదాంతమ్ము లెఱింగి వర్ధిలు మహా విద్వన్మణి! ధీనిధి
భూదానాధ్వర సోమయాజి! సుమతీ! పూతాత్మ! భక్త్యంజలుల్

భూదేవి పులకించి మోదాన దీవింప
పాదసంచారి యౌ సాధు మూర్తి
భరతాంబ గర్భాన చరితార్థ జన్ముడై
వరలిన రాజర్షి వరమనీషి
గాంధీ మహాత్ముని డెందమ్ము మెచ్చిన
సందీప్తి మయమూర్తి సాంద్రకీర్తి
పురుషోత్తముడవంచు ధరయెల్ల నినుగాంచి
గురుతించి స్తుతియించె గురువరేణ్య

సకల సద్గుణ సముపేత శాంతి దూత
స్వాగతమ్ము గొనుము వినో బామహాత్మ
భవదమల పూజ్యపాద సం స్పర్శ కలన
పులకరించెను పుత్తూరు పుర చరిత్ర॥

కల గనిన రామరాజ్యము
వెలయింపన్ గాంధీ మిమ్ము విధియించెనొకో !
నెల కొల్పుము సర్వోదయ
నిలయమ్ము ను రామభూమి ని వినోబాజీ !!॥

''భూదాన యజ్ఞమ్ము'' పుడమిని క్రొత్తదై
జయలక్ష్మి చెయిపట్టి సాగు కతన;

''గ్రామదానము'' గాంచి గణనీయమని పృథ్వి
నీరాజనంబిచ్చి నిన్ను గొలువ:
''సంపత్ప్రదానమ్ము'' సంతోష మొనగూర్ప
సిరివచ్చి వరమిచ్చి వరలు కతన;
''శ్రమదాన కార్యము'' ప్రమదాన తిలకించి
భూనభోంతరమెల్ల పులకరింప

జగతి సర్వోదయ పథాన ప్రగతి జెంద
భరత జనయిత్రి హృదయమ్ము పల్లవించు
మా మనసు లందు మల్లెల మాలలూగు
కనుల వెన్నెల డోలలు కాంతు లీను॥

కాలముదార శీలమున
గాంధిని మిమ్ముల నిర్వురన్ భువిన్
గ్రాల నొకే శతాబ్దమున,
కారణ మయ్యె మహాత్ములన్ గనన్
జాలితి మేము ధన్యులము
జన్మతరించెను స్వామి! స్వాగత
శ్రీలను స్వీకరింపుము సృ
జింపుము నూత్న సమాజ రాజమున్॥ (14-6-56)

భూదాన గీతము

ఓ భూమి కామంద! ఓ మేటిరైతా!!
భరతాంబ సంపదల పాలిటికి నేతా!!
విశ్వమానవుడైన శ్రీ వినోబా కార్య
రంగమ్ములో నీవు రంజిల్లి పాల్గొనుము ॥ ఓ భూమి॥

భూదాన యజ్ఞాన సమిధనొక్కటి వేసి
చరితార్థమై బ్రతుకు పండంగ చేసుకో ॥ ఓ భూమి॥

గాంధీజి కలగన్న శ్రీరామ రాజ్యంబు
వెలయింప శ్రీభావె తరలి వస్తున్నాడు
ముదముతో భూదేవి పదపూజ చేసికొని
వేంచేయు మహాఋషికి నీరాజనం బిచ్చి
చేయెత్తి ఓమారు జైకొట్టి మనమెల్ల
మహితాత్ము పూజింప మానవత సిద్ధించు ॥ ఓ భూమి॥

రాజ్యమంటే వీర భోజ్యమన్న మాట
కాలగర్భమ్ములో కలసి పోయిందయా!
దుక్కి దున్నే వాని కొక్కింత భూమైన
లేకుంటె విప్లవము లేస్తుందయా!
దేశాన సోదరులు ఈసురోమని యుంటె
దేశ సౌభాగ్యంబు గగన కుసుమంబయా! ॥ ఓ భూమి॥

కాలాను సారముగ గణ్యంబుగా మనుట
మనుగడకు సార్థకము మహికి సంతోషమ్ము ॥ ఓ భూమి॥

అరువ దేడులు నిండి పరిపక్వమైనట్టి
శాంత్యహింసామూర్తి సాగి వస్తున్నాడు

నడువ నేర్చిన ఆర్ష ధర్మంబనంగా
జయభేరి మ్రోగించి సాగివస్తున్నాడు
''దేహి'' యనుమాట వెలువడక మున్నే
దాన గుణమును జూపి తరియింపుమన్నా ॥ ఓ భూమి॥

నీకీర్తి కొనియాడు నిఖిల వేళల యందు
గోదావరి తల్లి, కృష్ణమ్మ, పెన్నమ్మ
తుంగభద్రాదేవి ఉబ్బితబ్బిబ్బౌను ॥ ఓ భూమి॥

(14-6-56)

ఉషస్సు

అదిగో తూరుపు కొండ కావలన బ్రహ్మానంద వీచీతతుల్
వదనాబ్జమ్మున నాట్యమాడ నవభా వస్ఫూర్తితో వచ్చుచు
న్నది శోభారతిగా యుషస్సు తెలుగ న్నా లెమ్ము పూజింపగన్
హృదయోన్మీలన మౌను ద్యోతిలును సా హిత్య ప్రభాపుంజముల్

లెమ్మిక మేలుకొమ్ము కద లింపుము ఘంటము మంజువాక్త్రపూ
రమ్ములు చిందుకైతలను వ్రాయుము, లోకహితమ్ము గూర్చుభా
వమ్ములు జాలువార రస వంతము గాగ యుషఃసతీ ప్రియాం
కమ్మున జేరి నీ కవిత కాంతుల నీను మనిషి భూమికన్

వచ్చెడి బాల సూర్యభగ వానుని జూచి ప్రమోద పూర్ణయై
విచ్చిన మోము తమ్మిని పవిత్రత కాల్వలు గట్ట స్వాగతం
బిచ్చె నుషః సతీమణి హసించె ధరిత్రి త్వదీయ భావనన్
స్వేచ్ఛకు నారుపోసి యిక చేయుము కమ్మని కావ్యసస్యముల్॥

పచ్చని పైరు కన్నియల పయ్యెద లాగే మనోహరమ్ముగా
వచ్చి మరుత్కుమారుడు సు వాసనలన్ దిశలెల్ల నింపుచున్
హెచ్చిన సిగ్గుతోడ హృద యేశ్వరు స్పర్శకు పుల్కరించి ము
ద్దిచ్చిపరిమళమ్ములను తీయగ గ్రోలిరి సస్యకామినుల్

సౌందర్యమ్ములు దిగ్దిగంతముల వి స్తారించి సుప్త ప్రజా
సందోహమ్ముల మేలుకొల్పు రవితా జన్మించు కాలమ్మునన్
నాందీ ప్రాయమ్ముగా నుషస్సు విరిసెన్ నవ్యప్రభా స్ఫూర్తి నీ
సందర్భమ్ము భవత్కవిత్వమునకున్ సంధించే నాందీత్వమున్

నింగి నీలపురంగు సింగారమును గూర్ప
        ధవళాంశుకము దాల్చె ధరణి దేవి,:
చంద్ర ఖండిక నెన్నొసట శోభలువెలార్ప
        పశ్చిమాశా రాజ్ఞి ప్రభల గురిసె:

పద్మ సంరంభమ్ము పరికించి తమలోన
గుస గుస లాడెను ప్రసవ రాశి;
నీలాభ్ర వస్త్రాన నెమ్మోము వెలయించి
తార జూచుచు నుండె నోరకంట
శాంత సుందర ప్రత్యూష సమయమిద్ది:
కర్ణ పర్వమ్ముగా కమ్ర కంఠమెత్తి
పాడు నవిగొ స్వాగతగీతి పక్షులెల్ల
మోద బాష్పముల ప్రకృతి మురిపెమంద

క్రమ్మిన ద్యుతి సంయుత మే
ఘమ్ములు నీరాజనముల కైసేసె మనో
జ్ఞమ్ముగ మందస్మిత భా
వమ్మును జిమ్ముచు 'ద్యుమణికి' స్వాగతమిడగన్...

(10 ఆగస్టు 56)

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారికి
స్వాగత సన్మాన పత్రము

వేంకటేశ్వర విశ్వ విద్యాల యాంధ్ర శా
ఖాచార్య శేఖరా! స్వాగతమ్ము!
వివిధ భాషాభ్యాస విజ్ఞాన సముపేత
సాహితీ వేత్తవు! స్వాగతమ్ము;
కమనీయ సత్కావ్య సముదాయ సంధాత
సత్కవి నేతవు స్వాగతమ్ము
నవ్యాంధ్ర సాహిత్య నందన నిర్మాత
సౌమనస్వి! యశస్వి! స్వాగతమ్ము!

''ఇంక నాలోన సాహిత్య మినుమడించు''
అనుచు నాశా సహస్రములంత రంగ
సీమ రేకెత్త స్వాగత శ్రీల దెచ్చె
విశ్వ విద్యాలయ వధూటి స్వీకరించి
ముదమొనర్పుము శ్రీరాయ ప్రోలు సుకవి॥

తమదగు కావ్య గుచ్ఛముల తావి తెనుంగు ధరిత్రిపై దిశాం
తములకు ప్రాకిపోయినది తావక భావలతామ తల్లికిన్
సమధిక కావ్యశిల్పవిల సత్కవితా సుతకున్ సమస్కృతుల్వి
మల కవిత్వ తత్త్వమున వేత్తవు స్వాగతమో కవీశ్వరా! ॥

శ్రీలు పొంగిన జీవగడ్డ యని తెలిసినది;
పాలు పారిన భాగ్య సీమ యని తెలిసినది;
ఏ దేశమేగినా, ఎందు కాలిడినా
పొగడెదము మాతల్లి, భూమి భారతిని
స్వీకరింపుము మాదు స్వాగతాంజలిని
శ్రీకర మ్మగు తావకాశీః ప్రభావమున
కవిత రూపొంద వలె, కమనీయ కాంతితో
భవిత రూపొందవలె భద్రపీఠమ్ముతో

విశాలాంధ్రావతరణ

మొగిలి పూవుల తావి మురిసి మల్లిని చేరి
 కమ్మని వాసనల్ గలిపి నట్లు;
కలకంఠి సుమనోజ్ఞ కంఠ స్వనమ్ముల
 శ్రుతికి కిన్నెర పల్కు లతికి నట్లు;
బృందా వనమ్ములో మంద్రమంద్రమ్ముగా
 వేణువు నాదమ్ము వెలసినట్లు;
గోదావరీదేవి మోదాతి రేకాన
 కిన్నెర సానిని గొన్నయట్లు

ఆంధ్ర జనని! సుగుణ తెలం గాణ సతియు
కలసి, చల్లగ ధాన్య రాసులకు సిరికి
దాపురమైన ఒకయింటి కాపురమ్ము
సలుప పూనిరి ఎడదలు పులకరింప॥

గోదావరీదేవి కుచ్చిళ్ళు జీరాడ
కడలి రాజుకు జెప్ప కదలు నదిగొ:
కృష్ణవేణి వెడలె గిరి మీది నాగార్జు
నాచార్యునికి తెలుపు నాశీయమున;

తుంగ భద్రాంగన పొంగి పొరలునదే
కృష్ణ రాయని కెటి గించు కాంక్ష:
పెన్నాతరంగిణి ప్రీతి శ్రీరాముల
కీ శుభవార్త నం దించు నదిగో!

''నాతెలంగాణ కోటి రత్నాల వీణ''
సిగ్గు పడకమ్మ! రావమ్మ! చేర దీతు
ననెడి యాంధ్ర మాత పిలుపు నందు కొనిన
ఆ తెలంగాణ సంబర మ్మరసి, మురిసె॥ (1-11-56)

మానవ జీవితము

బాధలన్నియు సమకూరి బార్లు తీరి
దుర్భలుండైన మనుజుని త్రొక్కి త్రొక్కి
అంత మెఱుగని ఘోరశో కాబ్ధి యందు
ముంచు చున్నవి పగబట్టి పుడమిలోన॥

గోరు చుట్టుపై రోకలి జారినట్టు
నిజ పరిజ్ఞాన ఫలమై జ నించినట్టి
శక్తులను గూడ స్వీయ నా శమ్ము కొఱకు
త్రిప్పు చున్నాడు మనుజుండు తెలిసి కొనక ॥

ఆటవిక జీవితము వీడి అనవరతము
ప్రకృతి పరిణామ పథమున ప్రగతి నంది
నాగరికతా గిరి శిఖర భాగములను
చేరితి మటంచు గర్వాన శిరము నెత్తు
ఘనతిమిరమున పడిన ఈ మనుజ జాతి॥

బ్రతికిన నాల్గురోజుల విరామము నందు స్వతంత్ర రీతి జీ
వితగతి సవ్యమార్గమున వేదన లందక సాగుచుండ సం
తతము సుఖాను భూతుల నెదల్ పులకింప సుఖించు పక్షి సం
తతి భువి కాని మానవుని దారి రగుల్కొను అగ్నిగుండముల్॥

లలిత సమీర డోలికల రంజిలి యూగుచు దుఃఖమేమిటో
తెలియక పారవశ్యమున తీయని విందుల నంది సౌరభ
మ్ముల వెదజల్లి తల్లి యెద మోహన గీతిక లాలపించు పూ
వుల బ్రతుకెంత పావనము! ఉర్వి మనుష్యునకే మహాపదల్॥

మనసున మల్లియల్ విరియు మంజుల మోహన సీమ యీ జగ
మ్మున ప్రకృతీ విలాసముల మున్గుచు తృప్తి వహించి హాయిగా

మనుటకు ''ప్రాణికోటులు స మస్త మెఱుంగును తృప్తిలేక యీ
మనుజుడొకండె సంతతము బాధల పాలగు నాశమందుచున్॥

ఎన్నడు దుఃఖదూరులయి యీ మహి స్వర్గముగా సుఖింతురో
కన్నుల పండువౌ ప్రకృతి కాంత యొడిన్ నడయాడు భాగ్యమీ
ఖిన్నుల కబ్బునా? విధి లి ఖించిన వ్రాతలు గుండె కోతలై
యున్నవి యున్న తీరుననె యుండునొ? మేధల కందకున్నదే॥

(15-9-57)

సంక్రాంతి అభినందనలు

బాల్యమిత్రుడు డా॥ G.M.నాయుడుకు (కలకత్తా) పంపిన శుభాకాంక్షలు

కఠిన హృదయుండు శిశిరుండు కన్నుమిన్నె
అంగక ప్రకృతిని పీడించి భంగ పరచి
తిరుగు చున్నాడు, సంక్రాంతి దివ్య సమయ
జనిత తేజః ప్రభావమ్ము జాలు వార
పరుగు లెత్తును వానితో పారిపోవు
గాత నీలోని దుఃఖసంఘమ్ము లెల్ల
నీదు హృదయమ్ము సంతోష నిలయమగును.

నా మనః పూర్వక శుభాభి నందనమ్ము
స్వీకరింపుము ప్రేమార్ద్ర చిత్తమలర॥

సకల సంపత్ సమన్విత సద్విలాస
శోభిత జగత్తు ప్రతియేట సోయగాన
మురియు చుండు వసంతమ్ము ప్రోల, అట్లె
మన మనస్సుల మల్లెల మాల లూగు
మకర సంక్రాంతి పర్వము ప్రభవమంద॥ 16-2-57

“Tribute To Srinivasa Ramanujan”

You were born for Mathematics
Its pursuit was an ennobling penance,
A “tapas” for you.
Blessed with unrivalled intelligence by the gods
you radiated the glory of the Muse of
Indian Mathematics.
Oh, Ramanujan! wisdom incarnate!
I bow before you in salutation.

Like “Adishankara’ and ‘Vivekananda,

Like ‘Shelly’, ‘Keats’ and other great English bards,
And like Galois and Abel, embodiments of Mathematics,
You have won everlasting fame for yourself.

Mathematics was a play, a revel, for you
Innumerable are your findings.
The world at large stands wonder struck
At the profundity of your intelligence

Scholars have struggled hard to elucidate your themes
Mighty Mathematicians, those royal elephants
Roaming the dense and dark jungles of Mathematics.
Have struggled in vain to understand fully
The deeper verities of your discoveries.

You are a mathematician of mathematicians,
A bosom friend of Numbers, whose hearts you won,
Blessed to be a genius were you
By the Mother goddess of Namagiri,
Oh! Ramanuja ‘Chinna swamy’!
In the zero that is ‘sunya’ one perceives the ‘Brahman’
That is free from all attributes and forms;
In the infinity we see, the Chakri Anantha Narayana,
Who is full of attributes, auspicious and benevolent

Will not your philosophy of Mathematics
Lead us to the vicinity of Duality, Oh Srinivasa?

Burning hunger and old soiled clothes and rags to
wear These do not daunt or hamper
The growth of a towering mind.
You dedicated all of your time to the pursuit of Knowledge,
And generated newer and newer processes of Mathematics
O' Ocean of wisdom! you have Indeed fulfilled the
mission of your life.

In musical melodies, in the effulgent world of letters,
In the hues and beauties of paintings.
And in dance, the art of rhythm, movement and
gesture Such astounding wonders are many,
But, alas, they are so rare in the realm of science.

Your robust and amazing intelligence
Manifested itself even in the classroom of
your school days,

You were in the vanguard of mathematics, a torch bearer
Admired and adored even by your peers,
Here are my salutations to you, O Srinivasa.

"Renowned Euler of Switzerland who was" Analysis
Incarnate"
Jocobi, respected as "Algorist, the Great",
It is in their distinguished company Ramanujan
takes his place
This is the verdict of great Mathematicians on you
How many have had this great honour?
I congratulate you, and salute you once again,

"Neither a wonder and mystery from the East
Nor an inspired idiot,
Not at all a psychological freak,
But a normal, steady human being of reason and

understanding
Ramanujan has become a great Mathematician
Solely by virtue of his own inborn intelligence''
So said many a great Mathematician.
We are thrilled to hear this testimony.

Though in death bed
You were still alert and active mentally
Your 'swan song', which brought you fame,
Is indeed unique in the history of mathematics.

In the very last act of the drama of your life
A dangerous and fatal malady afflicted you,

Bent upon extinguishing the light of Mathematics
This you suffered and endured
Meditation of Mathematics was your ''analgesic''
But the material you produced in that dark period
At an unbelievable pace
''Is equivalent to what a very great Mathematician
May achieve in a whole lifetime'',
So said the savants,
I admire and adore you, Ramanujan,
With folded hands I salute you again.
Sometimes truth, can be stranger than fiction
Even those who revel in inventing Impossible stories
And weave attractive works of fiction out of them,
When told of your life, your achievements,
And the resplendent edifice you built for Mathematics
Feel dazed with wonder and incredibility.
Strange are the ways of the world indeed!
Humility and obedience were his ornaments
Immaculate were his character and conduct
No wonder that this architect of Mathematics
Endeared himself to many a sublime soul.

22-12-87

విచిత్ర మానవుడు

సత్యమెఱుగక మిథ్యతో సహకరించి
హృదయ పూర్వక ప్రేమసం పదలొసంగి
మోస పోవుట తెలియక మురియు చుండు
జ్ఞాన హీనుడను విచిత్ర మానవుడను॥

బాహ్య సౌందర్యమును జూచి పరమ హర్ష
మంది ఆత్మసౌందర్యమ్ము నరయలేక
వికట మార్గాభి ముఖుడనై వేదనలకు
కరతలా మలకమ్ముగా పరిణ మింతు॥

స్వచ్ఛ గంగాంబు పూరమ్ము సాటి వచ్చు
ప్రాంత సలిలమ్ము వలదంచు భ్రాంతి చెంది
అందని మరీచికల వెంట ఆశపడుచు
పరువులెత్తిడి వాడను బాధపడుచు॥

సహజ సముదాత్త గీతని స్వనము మాని
కృతక రసహీన గానసంకీర్ణసీమ
తృప్త హృదయమ్ము నటియింప తెరువు గనెడి
జ్ఞాన హీనుండ నే వింత మానవుడను॥

నిలిచి చల్లని నీడలో నీరుగ్రోలి
దాహమార్చుట కోపక దారివెంట
పరువు లెత్తుచు తపనతో పాలు త్రాగి
తృప్తిగన నెంచు వాడను తెలివి మాని॥

నాట్యమాడిన జ్యోతితో నాశమౌదు
నంచు శలభమ్ముతో జెప్పి యా క్షణమ్మె
అగ్ని గుండమ్ము నంబడి అలమటించి
కోరి దుఃఖమ్ము వరియించు కుమతి నేను ॥

మలిన మంటని హృదయపద్మమ్ము గలిగి
స్నేహముంగోరి దరిజేరు నేస్తములను
పరిగణింపక, ననుగని పరిహసించు
వారి నెయ్యమ్ము కాంక్షించి వగయుచుందు॥

నిజపరిమళ రంజిత నికట పుష్ప
ములను పేక్షించి కాగితం పు కుసుమాల
కొఱకు ప్రాధేయ పడి సమకూర్చు కొందు
జ్ఞాన హీనుడ నతిచిత్ర మానవుండ.

''నిజము''నకు చాల దూరాన నేను కృతక
శార్య సంఘమందున పౌర సత్వము గొని
బ్రతుకు చున్నాను యంత్రమ్ము పగిది నూత
నత్వమే లేదు ఇట మానవత్వమునకు॥

కాగితపు పూల నవ్వులు కఠిన భావ
ములను తియ్యని భాషలో మూయుటలును,
'సప్తపథ' నుండి భాషలు సన్నలెన్నొ
నేర్చి యున్నారు నాతోటి నేస్తులెల్ల॥ (18-4-1958)

చంఘీజ్ ఖాన్

నీ వొక రాక్షసుండవని నెత్తురు కూడు భుజించి నెత్తురే
త్రావితివంచు లోకము సదానిను దూషణ సేయుచుండు నీ
జీవిత సత్యమంతయును చిందర వందర జేసి కల్పనా
కోవిదులైన వారు గుమికూడి రచించిన కట్టుగాథలే
భావిచరిత్రలై అగడు పాలొనరించెను నిన్ను టేముజన్.

నీలో మానవనైజ సద్గుణము లేనేలేదటంచున్ మను
ష్యాళిన్ వేటమృగాలుగా దలచి ఇష్టక్రీడ జెండాడి హిం
సాలోలత్వము మూర్తి మత్వము గొనన్ సంగ్రామభీముండవై
కాలాతీతుడవైతి వంచు రచనల్గావించి చారిత్రకుల్
నీలో వెల్గిన క్షాత్రతేజమును వర్ణింపంగ లేరేలకో.

అక్షరవాసనే ఎఱుగనట్టి అసభ్యపు ప్రాణి గాని నిన్
రాక్షసుగాగ నెంచిన ధరన్ గల కుట్రలు కూట నీతులున్
కక్షలు రేపు దుర్జనుల కమ్మని మాటలలోని తీపి ప్ర
త్యక్షముగా పఠించి సముదాయము హేయముగా కనంబడన్
దక్షతతో మెలంగితివి తజ్జన తండము గుండెగాలమై

రాజ్యము వీరభోజ్యము పరాక్రమవంతుడె సంఘమందు సం
పూజ్యుడుగా విరాజిలి ప్రభుత్వము గైకొను కాలమందు సా
మ్రాజ్యములన్ సృజించగల ప్రజ్వలితోజ్వలశౌర్యదీప్తి టే
మూజ్యిను రూపమై వెలిగె ముష్కర జాతికి బుద్ధి జెప్పగ నే

మంగోలీయుల పేరు దిగ్దిశలు సన్మానింపగా చూచి ఉ
ప్పొంగన్ కంకణధారివై రిపుల గుంపుల్ గుండె కంపింప మా
గాంగేయున్ తలపింపజేసితివి ప్రఖ్యాత ప్రతాపోన్నతిన్
చెంగీజ్ ఖాన్! యుగధర్మబద్ధుడవు నీ చారిత్రముల్ స్తుత్యముల్.

మనుజుల నమ్మనట్టి అనుమానపుదెయ్యము నీవటంచు ని
న్ననయము దూరు చంద్రు భువినందరు స్వాగతమిచ్చి మాటునన్
జనకుని జంపినారు, ప్రియ జాయను గర్భిణినిన్ కఠోరవే
దనలకు నింధనమ్ముగ ముదమ్మున దోచిరి ఒంటిపాటునన్
చనియెడి మేనమామను విషాదముగా హతమార్చినారు స్త్రీ
లను నడివీధి వస్త్రములు లాగి శరీరముగ్రుచ్చి చూపి జ
వ్వనులని అమ్మినారు గద వాకొనరాని మరిన్నిహింసలన్
మునిగిరొ? అట్టి సంఘమును ముష్కరజాతిని ఆదరించలే
దని కినిసెన్ ప్రపంచ మికనైన యదార్థమెరింగి నిన్ను నీ
ఘనతను మెచ్చి నిష్కృతికిగాన్ కరయుగ్మము మోడ్చునోటెమూ.

కలుషితమైన మానవుల గాలి సహించక నీవు కొండకో
నల వసియింప నిచ్చపడ నాగరకప్రజ జంతుతుల్యుడౌ
ఖలుడని నిన్ను గూర్చి పలుకారులు కూసిరి వాడి ఖడ్గమే
కలముగ పాఠముల్ గరపి గండర గండడవైతివో టెమూ!

షామాన్ గూయగు జూలవంటి మనుజుల్ సంఘాన మూఢత్వమే
క్షేమంకారి యటంచు స్వార్థపరులై చింతించి యావత్తు గో
బీమైదానము మంత్ర తంత్రములలో పీడించి కీడెంచు ద్రో
హుల్ మిథ్యామహితాత్ములెల్ల త్వదంఖండోద్దడ చండా కృతిన్
ఏ మాత్రం బెదిరించరైరి కనుకే యీకీర్తి నీ కబ్బెరా!

దీపావళి

గ్రహ పరిభ్రమణ ఘటన కాలచక్ర
        మందు సంభవించిన నాడె ఆదిశక్తి
గ, ఇవతాళించి, సర్వజ గాలు ప్రాకి
        వెలయు చున్నట్టి కాంతిదేవీ నమోస్తు॥

మానవుడు మహీతలముపై మనెడి మున్నె
        ప్రబలి ప్రసరించి బ్రహ్మాండ భాండమెల్ల
ప్రాణి సంతతి వర్ధిల్ల పాటు బడిన
దివ్య శక్తివి నీవు ఓ దీప దేవి॥

ఈ దీపావళి దివ్యపర్వమున యిం
        టింటన్ పరంజ్యోతి సు
శ్రీదమై సుఖదమ్ముగానై వెలయ నా
        శింతున్ మనుష్యాళి స
మ్మోదాకీర్ణ మనస్కులై ప్రమిదలన్
        ముట్టించు చున్నారు. భ
క్తిన్ దివ్యాకృతి దాల్చి చంద్రవదనల్
        తేజమ్ము జృంభింపగన్॥

భానుడు దక్షిణాపథము పట్టిప్రయాణము చేయసాగె నీ
క్షోణితలమ్ము చీకటులు చుట్టుకొనన్ పరితోష హీనమై
మాన మతిన్ కృశించునని మా హృదయమ్ములు సాచి కాంతిదే
వి! నినుపూజ జేసెదము వెల్గులొసంగి జగమ్ము బ్రోవుమా!॥

జనని! నీ పేర నొక పండు గను సృజించి
మా కృతజ్ఞత తెలుపంగ మహితరీతి
నిన్నుకొండాడు చున్నాము నిత్యము మరి
సత్యమును సర్వమును నీవె శక్తిమూర్తి.

మానవ హృదయసీమల మంజులించు
హ్లాద భావమ్ము స్నేహితుల నడుమన్ మొ
లిచి ప్రకాశించు మైత్రి, తల్లి శిశువుకడ
వెల్లి విరియు మార్దవము జీవితములపైన
గొని రసార్ద్రమ్ము గావించు ప్రణయ భావ
ము, సకలమ్ము జ్యోతి మయమీ భువన మందు॥

రసవ త్కావ్యములల్లి సత్యమును ధ ర్మోద్ధత్యమున్ ప్రస్తుతిం
చు సుధీరంజనుడౌ కవీశ్వరుడు, దక్షుండై అజాండమ్ము చు
ట్టి సమీక్షించి విశిష్ట సూత్రముల సృష్టించుసదా శాస్త్రవే
త్త సదానీ కరుణార్ద్ర వీక్షణము చేతన్ తల్లి! జ్యోతిర్మయీ!

బీట లెత్తిన హృదయపు పీఠము పయి.
అమృతపు చినుకుల్ గురిపించి హాయి గూర్చు
పర్వఘడియల మోదమ్ము బడయు నేర్పు
సన్నగిల్లు చున్నది తల్లి! భిన్న శక్తు
ల సుడిగుండాన జిక్కి అల్లాడు మాకు.

ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, దీపావళి సంచిక అక్టోబరు 1960

వసంతం వెళ్ళి పోయింది

ఆకులనురాల్చి ప్రకృతిని శోకజలధి
ముంచి తాడించి పీడించు ముష్కరుండు
నా యెడదలో వికృత భావ నా విపంచి
మీటి నన్ను బాధించు అమితకఠినుడు.

వాడు శిశిరుండు తరువుల వస్త్రములను
లాగు నిచ్చాను సారంబు లజ్జవీడి
శీతకరవాల ధారల చేతజిక్కి
అలమటించెడి ననుజూచి అపహసించు॥

శత్రు శిశిరాస్తమయమైన క్షణము నందె
నా వసంత సుహాసిని నా మనోహ
రి ఋతువులకు రాణి అవత రించు ననెడి
ఆశయే నాదు బ్రతుకున కాదరమ్ము
అదిగో! వచ్చిన దామని మదవతి వలె

''ఎప్పుడు వచ్చి నాదు హృద యేశ్వరి నన్ మురిపాన దేల్చునో''
చెప్పుమటంచు మల్లికను జేరితి యా కుసుమాంగి లేత న
వ్వొప్ప ''వసంత భామిని యదో'' యనె స్వాగత గీతి పాడితిన్॥
చెప్పగలేని కోరికలు చిత్తము మొత్తము పర్వదేవికి॥

సుమ రమణీ మణి చయము సుందర హాస మనోజ్ఞమయ్యె సం
భ్రమమున తుమ్మెదల్ ప్రణయ భావములన్ స్ఫురియింప జేసి యా
సుమముల చుట్టు ముట్టినవి శోభితమై పులకించె ధాత్రి యీ
సమయము నందె అచ్చరలు స్వర్గము వీడి చరింతు రిచ్చటన్॥

క్రొంజిగురాకు విందులను గూర్చి ఎడందలు పుల్కరింపగా
మంజు వసంత గీతికల మమ్మలరింపు మటంచు నీ పికీ

పుంజము బిల్చె ఆమ్రములు, పొంగి దమ్మున కోయిలల్ మనో
రంజన గానమున్ వినిచె రాగ ఝరిన్ జగమెల్ల తేలగన్॥

కన్నుల పండువై ఎదుట కన్పడు కొండల రెంటి మధ్యగా
కన్నియపై చెఱంగు వలె కమ్మని నీరదె పాయ పాయలై
తిన్నగ పారుచున్నది నదీ తట చారుని కుంజసీమలో
పున్నమి వెన్నెలల్ కురియ పూలు పరీమళమున్ వెలార్పగన్॥

మావులు నారికేళముల మైత్రి ఫలమ్ము వనస్థలమ్ము ఛా
యావృతమై మనోజ్ఞతకు నాకరమై రమణీయ దివ్య బృం
దావన మయ్యె, మంజుల ల తాగృహముల్ శశికాంత వేదికన్
పూవుల వర్షముల్ గురిసె పుష్కరిణి పవనమ్ము వీవగన్॥

సౌరభాకీర్ణ మారుత స్పర్శ కతన
పారవశ్యము జెందుచు పౌర్ణమీ వి
భావరిన్ సరోవరమున పడవ నెక్కి
హాయిగ విహారముల్ సల్ప నభిలషింతు ॥

పరిమళమ్మును సోపాన పంక్తి జేసి
పలుకరించును చంద్రుని కలువలెల్ల
కలువ చెలువల వలపు సం జ్ఞలను తెలిసి
అతడు ప్రతిపుష్ప పార్శ్వాన అవతరించు
జలమునన్ వాడు ప్రతిబింబ ములను నిల్పు
దృశ్య మత్యద్భుతంబు ద ర్శించ వలయు ॥

కానుగ చెట్ల వైభవము గాంచవలెన్ మధుమాస మందు ఉ
ద్యాన వనమ్ము నందు నవ యౌవన రేఖలు తొంగి చూడగా
చానల మోము భాసిలెడి చందము తోపగ నక్తమాల సం
తానము లేత వన్నెలను దాల్చె మహోజ్జ్వల దివ్య శోభతో ॥

మఱ్ఱిచెట్టునీడ మధ్యాహ్న సమయాన
పసుల మేపువాడు పడకవైచి
మురళి చేత బూని భువన మోహన రాగ
మాలసింప ప్రకృతి అలరి పోవు ॥

ఎన్నని వచింతు లెక్కలే నన్ని భాగ్య
రాసులను తెచ్చి నాౘమోల పోసి యను
భవించుమని వసంత లతాంగి విన్నవింప
పరమ సంతోష పీయూష పాన మత్తు
చిత్తమున సర్వమును మరచితిని నేను ॥

పూదోట పరిమళ పూర్ణ ప్రదేశాన
          మెలగ వచ్చు నటంచు తలచి నాను
మధురామ్ర వనములో మనసార ఫలముల
          భక్షింప కడు ఆశ పడితి నేను
పండువెన్నెల రేయి ప్రణయిని తోడురాన్
          విహరింపవలెనని వేచి యుంటి
ఉద్యాన వనసీమ సద్యోవినిర్భిన్న
          నారికేళజలము కోరి నాను
పరమ ప్రశాంత శు భ ప్రభాతమున క
          విత లల్లెదనని భావించినాను.
సెలయేటి తీరాన మలయ మారుత వీచి
          కలతేల వలెనని కలలు గంటి
సైకత సీమలో శయ్య నమర్చి తా
          రలతో మురిపెములు సలుపనుంటి
మురళీ రవళి విని పరవశమ్మును జెంద
          వట వృక్షమును జేర వాంఛయుండె

మంజు కుంజమున నా మధుర కాంతను జేరి
ఊయల లమరించి ఊగ నుంటి
ఇన్ని రీతుల నూహించి ఏది మొదట ?

ఏది మధ్య? ఏది పిదప? ఎన్నుకొనుట
కై వృథా కాలయాపన మయ్యెనంతొ
భావ సంఘర్షణమ్ముతో బాధపడితి ॥

ఎన్నుకొనుట కొరకె ఎంతకాలము గానొ
చింత సేయుచుంటి శీఘ్ర గతిని
నా వసంతరాణి నడచు చప్పుడు గూడ
గుర్తుపట్టలేని గ్రుడ్డినైతి ॥

మథన పడి మథనపడి స మస్య తేల్చు
కొనక నిట్టూర్పు విడిచి దృ ష్టిని మరల్చి
ప్రకృతిని పరికించితి గుండె పగిలి పోయె
భీష్మరూపమ్ము దాల్చెను గ్రీష్మ ఋతువు ॥

ఆశా సౌధము కూలెన్
క్లేశమ్మే మిగిలె హృదయ గేహము నందున్
లేశమ్మవివేకముతో
నాశము చేసితిని నేనె నా సంతసమున్॥

విమల మధురాధర సుధల విందు జేసి
నన్ననంత సంతోష సం పన్ను జేయు
నని తలచిన వసంత భా మిని ప్రణయిని
వెడలి పోయె నొక్కని నను వీడి ఎటకొ? ॥

చంద్ర కాంత వితర్దిపై చతికిలపడి
మొగము నర చేతులందుంచి వగచు చుంటి
నీవ దృష్టహీనుండ వ ని కరుణార్ద్ర
కంఠమున పల్కినది కల కంఠి మల్లి ॥

ఉగాది

నా మన సావరించి వ్యస
        నమ్ములు బారులు బారులై నిరా
శామయ జీవితాధ్వమును
        స్థాపన సేయగ నిశ్చయించినన్
ఈ మధుమాస శోభగన
        నీ రమణీయ వసంత నవ్య కాం
తిన్ మునుగన్ ప్రహర్షము మ
        దిన్ పదిరెట్లయి నట్లు దోచెడిన్.

తరులు లతాసమూహములు,
        దాల్చె నుగాది, జహూకృత ప్రియా
భరణములన్ మనోజ్ఞముగ
        పచ్చని వన్నెల నేత్ర పర్వమై
వరలెను నల్దిశల్ ప్రకృతి
        పర్వ మహోజ్వల వైభవమ్ముతో
పరవశమంది, దివ్యనవ
        భాగ్యములందెను గడ్డిపోచలన్॥

పచ్చని పట్టుచీర కను
        పండువు లీనగ తెల్ల పూవులన్
ముచ్చట కొప్పునం దురిమి
        ముత్తయిదుల్ వలె దోచె వేపచె
ట్లెచ్చట చూచినన్ ప్రకృతి
        యింతటి వేడుక వెల్లి పొంగనే
నచ్చెరు వంద నా మనసు
        నందున మల్లెల మాలలూగెడిన్ ॥

పండుగ వేళ పుష్పవని పంక్తులు తీరిన గుండు మల్లియల్
గుండెలు పుల్కరింప ఘుమఘుమ్మని వాసనలన్ వెలార్చె బ్ర
హ్మాండముగా, మదభ్రమర మంజుల ఝుంకృతి కర్ణపేయమై
నిండెను మూల మూలల వి నిర్మల సౌహృద ముల్లసిల్లగన్ ॥

క్షోణి తలాస ప్రత్యణువు
సుందరమున్ శివమున్ గ్రహించి వి
న్నాణముతో కుతూహలము
నన్ నటనమ్ములు సల్పుచుండగా
నే నొకడే వ్యథా భరిత
నిస్పృహలందుచుగాది కెంతయో
న్యూనత గూర్చువాడనని
నొచ్చి యడంచెద నెల్ల దుఃఖముల్

ఏ నొక ఆమ్రవృక్షమయి ఈ జగతిన్ జనియించియుండినన్
మ్లాన మతిన్ కృశించక కళానిలయమ్మయి చైత్రమాస శో
భానిచయమ్ము దాల్చి రస వత్ సువసంత పికమ్ము పాడగా
గాన సుధా ఝరీ స్నపిత కాయుడనై తరియించి యుండెదన్

పూత పసిండి వన్నియలు పొంగ జనించిన సోయగమ్ములో
లేత చివుళ్ళ నద్ది తుల లేని మహస్సులు గూర్చు శక్తి నా
చేతము నిండి దుఃఖముల చిందర వందర జేసి తేవలెన్
నూతన వత్సరమ్మున వి నూత్న యశస్కర భాగ్యరాసులన్

ఎన్ని వసంతముల్ చనియె నిప్పటికిన్ స్థిరమార్గ గామికా
కున్నది జీవితమ్ము పలు ఊహలు ఊహలుగానే పోయెనే
నిన్నిదినాలు తాలిమి వ హించితి నింక ఉగాది లక్ష్మి! య
భ్యున్నతి జూపవమ్మ సక లోర్వికి సంపద లిచ్చి నట్లుగాన్

నిన్న కృశించి దైన్యముగ
నీరసమై తలవాల్చి తోటలో
నున్నతమాల పాదపము
లుచ్చదశన్ నను బల్కరింప హ
ర్షోన్నతి చూపుచున్నవవి
గో! తదనంత మహాప్రహర్ష సం
పన్నత జూడ నాయెడద
పై ననలెత్తును కోటి కోరికల్.

కృతజ్ఞతతో

కె.కె. ముసలిగారి మునిరత్నం గారు కార్వేటినగరంలో మా అయ్యవారు.

''సర్వయోగమ్ము లందు సుసాధ్యమైన
కర్మ యోగము గలదు జగమ్ము నందు
దాని నాచరింప, బ్రతుకు ధన్య మగును''
అని మునుపు కురుక్షేత్రాన అర్జుననకు
దివ్యబోధ చేసిన కృష్ణదేవు కరుణ
కురియు సతతమ్ము మీ పైన గురువరేణ్య॥

డంబ మెఱుగని యొక నిరాడంబరుండ
వై, పవిత్ర విద్యాలయ మందు జేరి
కర్మయోగివై విద్యుక్త ధర్మములను
ఆచరించుచు ధన్యుడ వైతి వయ్య
పూజ్యముని రత్న గురురత్న పూత చరిత

ఏను చేసిన ఘనకార్య మేమి గలదు?
ఏల కీర్తింతు రని మీర లెంచ వచ్చు
కాని కార్వేటి నగరాన జ్ఞాన దీప
ములను వెల్గించిన గురూత్త ముల నొకరని
మరువ జాలము మిమ్ముల మాన్యచరిత ॥

క్షితి నుపాధ్యాయుడై యెంత సేవ జేసి
నను సమాజ మందెల్లరి వినుతి గొనుట
కష్టతరమైనదైనను త్కృష్టబోధ
నా కళాప్రపూర్ణుండవై నగర జనుల
మనసులందెక్కి నావయ్య మహిత రీతి
పూజ్యమునిరత్న గురురత్న పూత చరిత.

''చంద్రునకు నూలుపోగ'' ను చందమున త్వ
దీయ శిష్యబృందమ్ము భక్తిన్ కృతజ్ఞ
తా భరిత గురుదక్షిణ తమ కిడంగ
చేరియున్నాము ముదమున స్వీకరించి
ఎదలు పులకింప ఆశీస్సు లీయవయ్య
పూజ్య ముని రత్న గురురత్న పూత చరిత ॥

కార్వేటి నగరము

నాటి మహోజ్జ్వల స్థితి వి
          నన్ హృదయమ్ములు పొంగి నీవు ము
మ్మాటికి స్వర్గసీమకు స
          మాన మటంట నిజమ్మ కాని యీ
నేటి ధరిత్రి దేవి యొడి
          ని పరితాపము గాంచలేక కా
ర్వేటి పురీ! శిలావళి ద్ర
          వించు వచింపగ లేని బాధతో★

ఇన వంశ కలశాబ్ధి జనియించిన దొరలు
          పాలించు బంగారు కాలమద్ది
ధనలక్ష్మి ఘల్లు ఘల్లు మని ఖజానా లోన
          నాట్యమ్ము లాడు ది నమ్ము లవ్వి
భారతీ కంకణ క్వాణమ్ము కర్ణప
          ర్వమ్ముగా వినిపించు వర్షములవి
జీవకళలు జిమ్ము శిల్పమ్మనల్పమై
          విరియ బూచిన శుభ వేళలవ్వి

నాడు కార్వేటి నగరాన వాడ వాడ
          భాగ్యముల గాదులకు పోసి ప్రతి దినమ్ము
పండువుగ, మహానంద సం పత్సమేతు
          లై ప్రజలు మనిరి సుఖము లనుభవించి॥

ఏ రాణుల పసుపు పారాణి మెరిసెనో
          ప్రవిమల సోపాన పంక్తులందు.
ఏరాజు శౌర్యముల్ ఏపార జయలక్ష్మి
          వరలె నిట ఇది ద ర్బారు హాలు

ఏరాచ కన్నియ లీప్సితమ్ములు తీర
ప్రియుల వరులజేసె పెండ్లిమహలు
ఏ చంద్ర వదనల్ హృదీశ్వరుల ప్రణయ
సామ్రాజ్య మేలిరీ చంద్రశాల
మన చరిత్రల కందక మారు మూల
లందు వైభవోజ్వల మహా నంద భరిత
జీవిత జ్యోతి నిలిపి భాసించి నారో
కాల మెఱుగున్ యెఱుగు జగ తీలలామ

వేణుగోపాల ప విత్రమందిరమున
వైభవమ్ములు జాలువారు నాడు
ఈశ్వరాలయము అ ష్టైశ్వర్యముల తేలి
నిత్య పర్వమ్ములన్ నెరపు నాడు
విశ్వనాథుని గుడి వివిధ పూజా విధుల్
సక్రమముగ కొన సాగునాడు
రామభజనలతో గ్రామ ప్రజలలోన
భక్తి ప్రపత్తులు వరలు నాడు

నెలకు ముమ్మారు వానలు నిండు కురియ
సర్వ సౌభాగ్యరాసులు సంక్రమింప
ఎంత హర్షించిరో ప్రజ లెన్నడింక
నగరమున కట్టి యుజ్వల ప్రగతి గల్గు॥

ధాత వత్సరమున దారుణమ్ముగ వచ్చె
కార్వేటి రాజ్యాన కాటకమ్ము
కూలి నాలి గనమి కూటికి కరువురాన్
ప్రజలెల్ల కష్టాల పాల బడిరి
గాంచి కుమార వేంకట పెరుమాళ్రాజు
ప్రజలనాదు కొను నె పంబుతోడ

గ్రాసంబు కల్పించి స్కంధ పుష్కరిణిని
గట్టించి యార్జించె ఘన యశమ్ము

స్వయముగా ధనరాశితో వచ్చి ప్రభువు
క్రొత్త కోనేటి రచ్చపై కూరుచుండి
పట్టి పిడికిళ్ళతో కూలి పంచె నంట!!
ఎంత కరుణార్ద్ర హృదయమ్ము! ఎంత జాలి!! ॥

ఎవ్వాని కోపాగ్ని కింధనమ్మైపోయి
కోవూరి రామయ్య కూలినాడు
ఎవ్వాని వాక్కు సాహిత్య నభోవీధి
మేఘ గర్జనలను మించి తనరె
ఎవ్వాని భుజశక్తి కెదురు నిల్వగ లేక
శాత్రవనిచయమ్ము సమసి పోయె
ఎవ్వాని స్వార్థవి హీన సేవకతన
బొక్కసాన ధనము పొంగు చుండె

అట్టి శ్రీ పోలిపెద్ది వంశాబ్ది సోము
సుకవి వేంకటరాయు, ఆ శుకవి రాజు
శ్రీజగన్నాధు, ప్రఖ్యాత సిద్ధిరాజ
వంశమాన్య గోపన్నను వరమనీషి
చంద్ర శేఖరుల ఘనుల చరిత ములను
తనివి తీరగ తలపోసి ధన్యుడగుదు॥

పదముల సారంగ పాణి సంగీతమా
పాత మధురమని ఖ్యాతి కెక్క
వీణచే బూని గో విందసామి రమణీ
యమ్ముగా పెద్దవర్ణమ్ము పాడ
కవి పోలిపెద్ది వేంకటరాయుడు కమనీ
యమ్ముగా సత్కృతు లాలపింప
అప్పయ కవిరత్న మలసాని పెద్దన
భాతికైతల నల్లి పరిఢవిల్ల

9 – 6 – 61

*నాగరత్నం గారికి వీడ్కోలు

★ కీ.శే. బండార నాగరత్నంశెట్టిగారు కార్వేటినగరంలో తెలుగు పండితులుగా ఉండినారు.

కృష్ణరాయల తలపించు కృతముఖుండు
మా కుమార వెంకట పెరుమాళ్ళు రాజు
సింహ పీఠిపయి నధివసించినట్టి
దృశ్యములు వైభవములు మదిని దలంతు.

శ్రీ కృష్ణకరవిరా జిత వేణు విస్తృత
కమనీయ దివ్య గానమును విన్న
యమునాపయస్విని హర్షించి నాప్రేమ
మధురిమన్ పెరిగిన వెదురు నేడు
భువన మోహన దివ్య రవముల పలికింప.

ధన్యనైతి నటంచు తలచి మురియు
నటుల శిష్యవరుల అభివృద్ధిగని పొంగు
సదయ హృదయుడు ప్రసన్న గుణుడు
తెలుగు పండిత వృత్తిలో వెలయునట్టి
అస్మదాచార్య శేఖరు డైన నాగ
రత్నమును బ్రోచుగాక నిరంతరమ్ము
వేణుగోపాల కృష్ణుడు విశ్వవిభుడు॥

ఇరువది యేండ్లు మీరిచట నే గురు పీఠము నెక్కి మాన్యులై
నరలిన కారణమ్మిపుడు వందలు వందల శిష్యవర్యులీ
పురమున మీదు కీర్తికి విభూషలు కూర్చిరి కాన దీవెనల్
గురియుము ఛాత్రరత్నముల కున్ మనసుల్ పులకింపగన్ గురూ!

వృత్తుల కెల్ల ఉత్తమము విజ్ఞులు మెచ్చెడి'' బోధనమ్ము'' త
ద్వృత్తిని స్వీకరించి సిరి వేడ్క ''నెలార్చని తెల్గు భారతిన్

చిత్తము పల్లవింపగ భజించెడి మీకృషి శ్లాఘనీయమ
త్యుత్తమ మంచు పల్కెదన హో! ప్రియ శిష్యవరమ్ముగా గురూ! ॥

సారస్వత మిదని చదువ నుత్సాహంబు
గల్పించి పెంచిన గణ్యుడతడు
వ్యాకరణంబవశ్య పఠనీయంబని
సూత్రముల్ నేర్పిన సూరి యతడు
పల్కుల సొగసులో వ్రాత సొగసు నేర్పి
తెనుగు బోధించిన ఘనుడతండు
చిన్ని మనసును దిద్దు శిల్పమ్ము తనలోన
జీర్ణించు కొన్న దే శికుడతండు

అతడు నాగరత్నంశెట్టి ఆదరముగ
బాలురకు విద్య గరపుచు ప్రణుతి కెక్కె
ఆయురారోగ్య భోగభా గ్యముల తోడ
వరల వలయును వారు గో పాల కృష్ణు
దయకు సతతమ్ము పాత్రులై ధన్యులగుచు॥

వృత్తి ధర్మము మాఊరు వీడి మీరు
వేరు పాఠశాలకు నేగు వేళ నేను
కోరు చున్నాను విరమణ గొన్న పిదప
స్థిర నివాస మొనర్చుడీ పురము నందు
పూజ్య బండార వంశాబ్ది పూర్ణ చంద్ర॥ (8-4-1964)

వివాహము

బండికి గట్టిన బలమైన గుఱ్ఱమ్ము
 క్రమమార్గ బద్ధమై కదలు చుండు
గుఱ్ఱమ్ము లేకున్న గొప్ప బండియు గూడ
 నిర్జీవమై పోవు నిక్కువముగ
పట్టాలు లేకున్న పరుగెత్తు నా రైలు
 దారి తెన్నులు లేక పారదడుగు
కాడి గట్టని యెడ్లు మేడి దున్నగ లేవు
 పొదుపు పొందిక కల్గి పుడమి మీద.
కాన వరునకు వధువు ముఖ్యమ్ము నారి
కిన్ నరుని సఖ్యము వలయు క్షితి తలాన
అని గ్రహించిరి కాబోలు ఆర్యులిచట
పెండ్లి సంస్థను నెలకొల్పి వెడలినారు

(9 సెప్టెంబరు '64)

ఆమె

ఆమె యొకనాడు నీలవర్ణాంబ రంబు
దాల్చి సన్నజాజులు పేర్చి తలను గ్రుచ్చి
లలిత లలితమ్ముగా వచ్చి నిలచె నెదుట
ఆకసము నుండి దిగివచ్చి నట్టు లుండె॥

ఆమె సంగీత సాహిత్య ధామ మనుచు
తొలుత జూచిన వేళనే తలచ నైతి
ఒక్క దినము వీణియ గొని చక్కని రస
పూర్ణ గానమున్ వినిచె, ను ప్పొంగె మనసు॥

నాడు పున్నమి వెన్నెల తోడి చెలియ
లగొని మామిడి తోటలో లాస్యమాడి
భువన మోహనముగ నామె మురళి నూదె
ఎంత భాగ్యమునాదని ఎంచినాను॥

ఆమె యొకసారి మనసార అందమొలుకు
మందహాసము చిందింప మల్లె పూల
జల్లు కురిసినట్లనిపించు నుల్లమందు
పరిమళము నిండిన మనస్సు పరవశించు॥

చదువుకొనుచుంటి నొకనాటి సందె వేళ
దృష్టి క్రిందికి సారించి తిన్నగ నరు
దెంచి, ఊదాజరీ చీర అంచు కనుల
తాకు నట్టుల నాశ్రమోల తాను నిలిచె
తలను పైకెత్తి చూచితి తన్మ యుండ
నైతి, సోయగంపు సిరుల కామె నెలవు॥

మంద మందముగ మలయ మారుతమ్ము
ఆమె జడలోని పూలప రీమళమును

మోసికొని వచ్చి నన్ను స మ్ముగ్ధు జేసె
విరుల విలువలు తెలిసిన తరుణి యామె॥

మనసులో లక్షబాధలు మసలు చుండు
నప్పుడామె గాజుల సడి నాలకింప
బాధలన్నియు మఱుగున పడును, మోద
మొక్కటే నిండు నాయెద నిక్కువముగ॥

అందముగ దువ్వి వాల్జడ నల్లి లీల
ఫాలమున రెండు ముంగురుల్ వ్రేల నిచ్చె
సోగ కన్నుల కాటుక శోభ గూర్ప
అధిక ఫలకాన కుంకుమ తిలకము నిడి॥

సభ విభూషిత సప్తవర్ణ ప్రదీప్త
మైన ఇంద్ర ధనుస్సుపై అలరు నీలి
మము గ్రహించి వలువగా గ, మలచికొని
దాల్చి నటులుండె నెంతొసుందరత గురిసె॥

ఒక్కదిన మేదొ పనిమీద ఉదయవేళ
ఆమెను దరిసింప వలసి నట్టి యవస
రము కలిగె, నర చేతులన్ కమల నయన
ములను నులిమి కొనుచు నిల్చె మ్రోల, నగలు
పూలు సింగారములు లేక పోయినను మ
నోజ్ఞమైన సహజ శోభ ను తిలకించి
ఎంత మంచి ఉదయమని ఎంచితి నెద
నిమ్మపండు వన్నియమేను వికటసీమ
నడుగు బెట్టిన జాలు నెడద క్రమ్ము
నిమ్మపండు సువాసనల్ నిత్యనూత
నమ్ము ఆమె గాత్రము నెమ్మ నమ్ము వెన్న.

మధుర యామను లవ్విహి మకిరణ ఘన
మహిమ కతమున జ్యోత్స్నలు మంజులింప
మేడమీద చెలియలతో కూడి యామె
అష్టపదులను పాడగా ఆలకింతు

ఆమె రాధగా, మాధవ స్వామిగా ల
యించి యాలపించునపుడు గాంచవలయు
ఎంత రమణీయ సందర్భ మెంతటి కమ
నీయగాన స్రవంతి వర్ణింపలేను

ఆమె యొక సంజవేళ ఉద్యాన మందు
జీవమున్న శిల్పమువలె పోవుచుండె
హీన సంస్కార భూషిత హృదయుడొకడు
వెకిలి చేష్టలు జేసె, ఆ విర్భవించె
చెఱకు విలుకాని భస్మమ్ము చేయువాడు
భవుని మూడవ కంటిలో ప్రజ్వరిల్లి
నట్టి కోపాగ్ని కణములు ఆమె నయన
గోళముల నుండి ఇంతటి కోపమామె
చూపగలదని ఎఱుగను చోద్యమయ్యె.

ఈ కళాశాల చదువులు ఇష్టమున్న
పుడు లలిత కళలు, విహార ముల చెలంగు
నేటి యువతులు వంటలు నేర్వరనుచు
పెదవి విఱుచు వారికి ఈమె ప్రీతితోడ
చేయు వంటకం బిడవలె చిత్రమంచు
నారురుచుల వర్ణించుచు నారగింత్రు
అంత కమ్మగ వండుట నరయు నామె॥

పాలలో హిమశకలముల్ మేళవించి
పంచదార కలిపి సార పప్పు జేర్చి

శ్రేష్ఠమైన కుంకుమపూలు చిలుకరించి
చిన్నపళ్ళెర మందుంచు శీత లీక
రించి, ఎన్నోసారులు ఆర గించినాను॥

ఆమె నవ్వును, బుగ్గలపై మనోజ్ఞ
ముగ కళాత్మక ద్యుతివి భూతి నొసగి
ఏర్పడును రెండు బిందువుల్ ఇలను గల్గు
సొగసు మొత్తము తమదను సుందరులకు
లేని సౌందర్య సంపద కానిపించు॥

ఆమె విదియ చంద్రునిబోలె నందగించు
కర్ణ కుండలములను సింగార మొలుక
దాల్చి సగమల్లి మిగత వ దలిన వేణి
స్నిగ్ధమోహనతనిడ విచ్చేసె నపుడు॥

పిల్లలన్న నామెకు నెంత ప్రేమ, వారి
గూడి యెంత సేపైనను ఆడు కొనును
మంచి రత్నమాణిక్యాల గాంచి యామె
భాగ్యవతి కావలెనని మ ద్వాంఛితమ్ము॥

కేరి కేరి ఏడ్చెడి పాప జేరి యామె
చేతి కెత్తుకొనిన చాలు చిరునగవులు
పాప లేత పెదవులను ప్రతి ఫలించు
అమృత మయమేమొ ఆయమ హస్తయుగము॥

దారివెంట జనునెడ బాధాకరమగు
దృశ్యమేదైన గనిన మ దికలతవడ
ఆమె కా దిన మంతయు నన్నము దిగ
దు, మరి ఏమిచేయను తోచదు. కమలజుడు
నింపి యుండవచ్చును నవ నీత మెడద॥

ఆమె దరిజేరి యాచించి నట్టివారు
రిక్త హస్తులగుచు, భగ్న హృదయులౌచు
పోయిన దెఱుగ నేను ఎప్పుడును, తోచి
నదిడి వారి దీనవదనా న వెలిగించు
హాస దీపిక నామె ద యార్ద్రగుణము
వర్ధిల వలెనని యఖండ భాగ్య నిధులు
జేర వలె నామె కంచు నే కోరు కొందు॥

ఆమె పుత్తడి బొమ్మ మఱేమి ఎఱుగ
దని తలంతురు కొందరు తాను నేర్చి
యున్న చిలిపి చేష్టల కను గొన్న నేను
ఎంత చైతన్య వంతురా లీమెయందు ॥

ఆమె పుట్టిన రోజది ప్రేమ యెదల
వెల్లి విరియగ నెచ్చెలుల్ వివిధములగు
కాన్కలను తెచ్చినారు మం గళ కరముగ
చక్కని గులాబి వన్నెవ సనములను ధ
రించి రమ్యముగ నలంక రించు కొనియె
చెలులు వలయాలు దీర్ప లక్ష్మివలె వెలిగె॥

ఆమె జీవిత రథము హ ర్షాంకిత మయి
విరులు పరచిన బాటలో నరుగ వలెను
ఆమె కమనీయ కావ్యమై హాయి గొల్పు
మధుర మంజుల గానమై మనగ వలెను॥

ఆమె కేమి కొదువ చూడ అందము ధన
ము, గుణము సకలమ్ము కలదు పుష్కలముగ
చింత ఆవంత యెరుగని జీవితమ్ము
అని తలంతురు పెక్కురు అతి భయంక
ర ప్రళయ కాల ఝంఝా నిల ప్రకంపి

త క్షితిజమయి యామె హృ దయము నిండు
కలత నలిగిన ఘటనలు కలవు కొన్ని
కుసుమ కోమలమైన మనసు కలిగిన
ఆమె ఎటులెదు ర్కొనియెనో అచ్చెరువగు॥

ఆంధ్ర సాహిత్య నందనో ద్యాన వికచ
రమ్య కావ్యప్రసూన సౌరభము లెరుగు
నామె మధుర కంఠమున పద్యములు చదువ
నే ననిర్వచనీయ దివ్యాను భూతి
పొందెద రసార్ద్ర హృదయమ్ము పొంగి పొరలు॥

ఇన్ని భాగ్యములున్నను ఖిన్న హృదయ
యగు నొకప్పుడు తనకు కావ్యరచన తెలి
యదని పలుమార్లు తీవ్రప్రయత్నమొనరిం
చినను నిష్ఫల మాయెనే యని, తదుపరి
కావ్య రసపాన కుశలత కలిగె నదియె
చాలునని తలంచును ఆమె జాలి కలుగ॥

ఆమెతో నొకప్పుడు పల్లె సీమలందు
పయన మొనరించు భాగ్యమ్ము ప్రాప్త మయ్యె
వేదనాళికి దూరమై ఆదమరచి
హాయిగా పవ్వళించిన అతివ వోలె
కాని పించెడి ప్రకృతిని గాంచి యామె
వర్ణనాతీత సంతోష వార్ధి మునిగె॥

ప్రియుల వరులుగ పొందు అ దృష్టవతుల
వోలె తన కవితను సక లోర్విజనులు
గారవింపగ గర్వించు కవి విధాన
తనదు శిష్యుడు పూజ్యుడై ఘనత గొన్న
తరిని సంతుష్టుడౌ ఉపాధ్యాయు వోలె
చెలగు పంటచేలను గాంచి యలరు నామె॥

ఇల తలపయిని పాపట వలె కనబడు
గనిమ మీదుగా నడవనేర్వని కతాన
పదము తడబడగా నామె పైరు బాల
లకు నటనముల నేర్పించు లాగు తోచె॥

లేత మావి చిగుళ్ళను ప్రీతి నార
గించి కర్ణ పేయముగ కో కిల కలరవ
ములను విన్పించునని కావ్య ముల చదివితి
గాని నిజముగా నాదివ్య గాన ఝురులు
వెల్లి విరియు నీ బంగారు పల్లె సీమ
అనుచు పరభృత స్వనముల నాలకించి
వికచ వదన రాజీవయై వెలిగె నామె॥

రకరకాల మల్లెలు, మనో రంజనములు
పొన్నలు, పొగడలు గులాబి పూలగములు
చంపక లతాంతములు పారి జాతములు, మ
ఱిన్ని క్రొంగొత్త విరులతో వన్నెలొలుక
పెంచె పుష్ప వనము నామె ప్రేమ నింపి॥

ఆ వనమ్మున నామె పుష్పాప చయ మొ
నర్చు దృశ్యము గాంచి త న్మయుడ నౌదు
స్నిగ్ధ కిసల యాంగుళులు స్పృశించు కతన
ము కుళితము లైన పువ్వులు మోద మందు॥

ఆమె సౌహృద భావ ప ర్యాప్తమైన
నాదు జీవిత మింక ధ న్యమని తలతు
కాల కల్లోలినిన్ దారి కాన రాక
పెను తుఫానున వెడలు జీవనపు నావ
కామె చుక్కాని యయ్యెనా నోము ఫలము ॥ 1–11–65

ఆమని చేసిన హాని

అందరూ వసంతోదయమైనదనీ
　　చివురుటాకుల చీరలు దాల్చి తరు తరుణి మణు
లొయ్యారాలు ఒలక బోస్తున్నారనీ
　　ఎలుగెత్తి పలుకుదురు పాపం
బాధతో కుమిలి కష్టాల్నంతా సహించి
　　హేమంత, శిశిర దౌష్ట్యాలను తాల్మితో
ఎదుర్కొని వచ్చే వసంతంలో సంతో
　　షిస్తామని కలలు కంటూ కాచుక్కూచున్న
పత్రాలకు ఆ అదృష్టం రాకముందే
　　రాలిపోయే వ్రాత వ్రాశాడు విధాత

పరాన్న భుక్కులు, ఇతరుల కష్టాల
　　పునాదులపై స్వలాభాల విలాసాల
భవంతుల కట్టుకొనే భాగ్యవంతులూ
　　సుఖపడే కాలం వచ్చే వేళకు
అనుభవించే యోగం లేక రాలిపోయే
　　ఆకుల కోసం ఆకులపడతారా!
శిశిర దుశ్శాసన క్రూర కుటిల హస్తాల నుండి
　　అన్ని రోజులు ఒక్కక్షణం కూడ
విరామం నోచుకో కుండా
　　తమ మానధనం కాపాడిన
ఆకులు అల్లలాడుతూ అసువులు కోల్పోతుంటె
　　ఒక్క కన్నీటి బొట్టు కూడ కార్చక
క్రొంజిగు రాకుల సొంపులతో
　　చిరునవ్వుల పువ్వులతో

పరవశిస్తున్నవి తరువులు
        మీరు కసరినా విసరినా
మీపాద సన్నిధుల వీడము
        బ్రతికి నన్నాళ్ళు మీసేవలతో
పావనమై పండెను ఈ మా చివికిన బ్రతుకులు
        మరణానంతరం కూడ
మీపాద దాసులమై
        ముక్తుల మౌతామని రాలుతూ
దీనాతి దీనంగా
        ఆకులు పలుకు తుంటే
''నోర్మ్యాయ్'' అని
        అదిలిస్తూ అరుస్తూ
వీస్తున్నది గాలి

ఆర్.బి. ఆర్. సన్మానము*

★ కి.శే. రాజా బొప్పరాజు రామకృష్ణరాజుగారు,

Chairman, Madras (composite) State Legislative Council

శ్రీవాణీ కరుణార్ద్ర వీక్షణము భాసిల్లన్ ప్రియంబేర్పడన్:
ప్రావీణ్యమ్ము గడించి పెక్కుకళలన్ వర్ధిల్లు ధన్యాత్మ! మీ
సేవాదీక్షను, నీతి మార్గమును రాశీభూత సౌహార్ధమున్నా
వౌన్నత్యము లాది సద్గుణములన్ వర్ణింపగా శక్యమే॥

''కేసు'' చెఱుపరను కీర్తిని గడియించి
న్యాయవాద సువృత్తి నడుపు నెవరు?
రసిక సమ్రాట్టులని సకలాంధ్రులిల ప్ర
శంసింప బరగు ర సజ్ఞుడెవరు?
సంస్కృతాంధ్రాంగ్ల భాషా మధురిమల
నెఱిగిన సాహితీ హృదయు డెవరు?
ఆపాత మాధుర్యమౌ గాన విద్వద్ర
హస్యము లన్నింటి నరయు నెవరు?

అట్టి రామకృష్ణ నృపాలు డలరు గాత
ఆయు రారోగ్య భోగభాగ్యముల తోడ
వసుధ కార్వేటి 'నగర' సంవాసియై
వేణుగోపాల విభుడు దీ వించు కతన॥

పిన్న వయస్సునందె పర పీడిత తాడిత మాతృదేశ ర
క్షోన్నత భావముల్ గలుగ నుత్సుకతన్ పలుఉద్యమాల పా
ల్గొన్న భవద్యశమ్ము వెలు గున్మన తెల్గు చరిత్ర సంపుటిన్
ఎన్నడు రామకృష్ణ నృపతీ! విమలోజ్వల సద్గుణాకృతీ!॥

సద్యశోదమ్ముని స్తారమ్ము మీ రాజ
కీయాను భవము శ్లా ఘింతు మెపుదు
గణనీయమౌ అధికారపీఠముల న
లంకరించితి రక లంకముగను.

మీరుపాధ్యాయుల మీద జూపిన యాద
రము నిల్చు మాదు చిత్తముల నెపుదు
దేవాలయములకు సేవచేసిన మీదు
జన్మసార్థక మౌట సత్యమగును

బొప్పరాజు వంశోదధి పూర్ణచంద్ర
దివ్య కనవరాజకుల స త్కీర్తి సాంద్ర
రామ కృష్ణ రాజాఖ్య వ రల వలయును
మీరు, సంతోష సుఖములు మిమ్ము జేర॥

కార్వేటి నగరి యెపుడున్
గర్వించున్ మిమ్ముగన్న కతమున, సర్వాం
ధ్రోర్విన్ తనదు ప్రతిష్ఠను
పర్వన్ జేసితి రటంచు ప్రముదిత యగుచున్

(15-4-1965)

చంద్ర మండలం

ఒక్కడే చంద్రుండు పెక్కు తారల పెండ్లి
యాడుట న్యాయంబె అవని యందు
బాలచంద్రుల నెంచి పరవశమ్మును జెందు
చుక్కల మనసులో నిక్క మరసి
పూర్వు లూహించిన భువివంటి లోకాలు
వినువీధి కలవంచు విశ్వసించి
అంతమన్నది లేని అంబర సామ్రాజ్య
వైచిత్రి కనుగొను వాంఛ పెరుగ

గగన నౌకను రోదసీ గర్భమందు
నిలుపు చున్నాడు మనుజుండు నేర్పు కతన
జయము లొనగూడు వానివి జ్ఞానమునకు
నరుడు సురుడౌట నిజమౌను ధరణి యందు॥

10 అక్టోబరు '65

సంక్రాంతి

పరదేశముల గోరి భండనాలొనరింప
తల పెట్టి యెఱుగని ధర్మభూమి
పొలిమేరలను దాటి కలుషిత హృదయాలు
ప్రచ్ఛన్న సేనలై భరత వీర
పుత్రుల నెదిరింప శత్రుభీకరముగ
సంగ్రామ మొనరించి జయము గాంచి
దేశ గౌరవము ది గ్దిశల ప్రసారించి
వెలయు చున్నారు మా వీరు లిపుడు

వారి కోలాహలమ్ము పర్వమ్ము సేయ
అరుగు దెంచితి వేమొ ది వ్యప్రకాశ
పూర్ణ వదన రాజీవయై పుష్యలక్ష్మి
మకర సంక్రాంతి సమయాన మంజులముగ ॥

9-1-66

శ్రద్ధాంజలి

భారత జాతిని ఘోర దుఃఖాబ్దిని
ముంచి జహ్వారుడేగె మొన్ననే గద
భారత గగన ప్ర భాకరుడు జవహర్
మరణ మేఘ మికను మాయలేదు.

అప్పుడే గుండియ లవియు నట్టుల వచ్చె
''శాస్త్రి'' అస్తమయ విషాద వార్త
భారత వసుమతీ దారిద్ర్య మేమిటో
రతనముల్ వరుసగ రాలిపోయె
దాస్యబంధము నీది స్వ తంత్ర రీతి
కొత్తగారూపు రేఖలు కూర్చుకొనెడి
ఈ ప్రజాస్వామ్యమును నిర్వ హించి నట్టి
స్వార్థ మెరుగని దేశ సేవకులు వారు॥
మేరునగ సముడు ధీరుడు నెహ్రూ మ
హా మహాపీఠమ్ము నధి వసించి
జన రంజకముగ ప్రశస్త మార్గమున రా
జ్యమ్మునేలుట కష్ట సాధ్యముగద
నిర్మల చరితుడై నిష్ఠాగరిష్ఠుడై
వినయ భూషణుడను ఘన యశమ్ము
నార్జించి పూర్వనా యక మణుల్ నడచిన
పథము వెంబడి చని ప్రజ్ఞ కలిగి
పదియు నెన్మిది నెలలు ప్రపంచ మెల్ల
సంభ్రమాశ్చర్య చకితమై సంతసింప
భారత ప్రధానిగ జ్యోతి వలె వెలింగి
శాంతి సాధన కొఱకు తాష్కంటు కేగి
వీరమరణమ్ము పొందిన ధీరుడతడు
అమర లాల్ బహదూర్ శాస్త్రి కంజలింతు॥

12-1-66

సూర్యాస్తమయము

బంగారు వన్నియ పట్టు చీరను గట్టి
కమనీయముగ నవ్వె గగన కాంత
సంధ్యా సతికి నెన్నొ సటి తిలకమ్ముగా
భాను బింబము వెల్గె పశ్చిమమున
విరికన్నియల నుండి పరిమళమ్మును తెచ్చి
మహికి పండుగ జేసె మారుతమ్ము
పక్షి సంతానమ్ము పరమ సంతోషాన
కలరవమ్ముల నింపె గాన ఝరుల

దిగ్దిగంతాల సౌందర్య దీప్తి కురిసి
హృదయ సమ్మోహనంబగు నిట్టివేళ
పరమ హర్షాతి శయమునుబడయ కుండు
మనుజు డెవడుండు? వానినే దనుజు దంద్రు!!

8 మే '66

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి

శ్రీరంజిల్లెడు నాంధ్రభూజనని కీర్తిన్ దిగ్దిగంతాల వి
స్తారింపన్ దలకొన్న భాసుర యశస్సంపన్నులందొక్కరై
ఆరాధ్యమ్మగు విశ్వభారతిని విద్యల్ నేర్చి ఔత్సాహియై
ప్రారంభించిన మీదుసేవలకు సంప్రాప్తించె సార్ధక్యముల్.

స్వాతంత్ర్య శంఖమ్ము స్వాగతమ్ములు పల్క
    ఉద్యమాంగణమున కురకలెత్తి
స్థిరమనస్కుండవై దేశ సేవాదీక్ష
    గైకొని కష్టాల కడలిమునిగి
స్వారాజ్యనిర్మాణ చతురుండవై రాజ్య
    నిర్వహణప్రజ్ఞ సర్వమెరిగి
విశ్వకవి రవీంద్రు విపుల సాహిత్యర
    సప్రపంచమున వాసమ్ము చేసి

తాను నడచుచోటుల మంచి తనపునిండు
పరిసరములను జల్లెడి వరమనీషి
పూజ్య బెజవాడ వంశాబ్ధి పూర్ణశశికి
స్వాగతమ్ములు పలికెద స్వాంతమలర

కచదేవయానల కమనీయగాథను
    రసబంధురమ్ముగా గ్రాలజేసి
ప్రేమాధికతనిరూపించు చిత్రాంగద
    కథను మనోజ్ఞముగా రచించి
ఊర్వశికి తెలుగు ఓనమాలను నేర్పి
    తెలుగింటి పడుచుగా తీర్చిదిద్ది.

బౌద్ధ ధర్మార్థమ్ము ప్రస్ఫుటింపగ జేయు
 కృతులకు తెలుగు ఆకృతులు గూర్చి

వంగసాహిత్యనందన వనములోని
పారిజాతముల్, మొల్లలు, వారిజములు
నైన రవికవి కావ్యముల్ అనువదించి
తెలుగు తల్లిని పూజించి తనియు చున్న
మాన్యగోపాల రెడ్డికి ధన్యవాద
ములిడి గారవింతుము మేము ముదమెలర్ప

26–7–67

ప్రేమకు రాజీనామా

మూగవోయిన గళము లోపల
రాగమంజరి నింపకే యిక;
రాయిబారిన బ్రతుకు నందున
రాగవల్లరి నల్లకే సఖి

తెగిన తీగల వీణపై సం
ధించకే క్రొవ్వలపు పలుకులు;
విరిగిపోయిన ముకురశకలము
నెరికురుల్ సవరించకే చెలి
కారినది పీయూష కలశము
కోరకే ఆనందమనిశము.

పేదవాని గృహాంగణమ్మున
వేదనల పెన్నిధులె కానీ
ఆదమరచిన నిదురలన్నవి
ఆకసపు కుసుమాలు రమణి!
కలము నందలి మషీవర్ణము
నిలువసుంతయు లేనియట్టుల
మనసురసమయ

భావరహితము
మధుర కవితలనల్ల మనకే!
వలచినప్పుడు వలసినప్పుడు
పిలిచినప్పుడు పలుకవైతివి.

ఎండిపోయిన పిదప పైరులు
నిండు వర్షము కురిసి నట్టుల,

వత్తు వేటికి విఫలప్రేమో
న్మత్తు వద్దకు, నేడు పడతీ!

జూలై '71

వీడ్కోలు గీతాంజలి

శ్రీదము మంగళాస్పద విశేష దయామయ శోభితమ్ము, బ్ర
హ్మాది సురార్చితోజ్వల మహా మహిమాన్వితమౌ మహేశు వీ
క్షాదరముల్ సమృద్ధిగ న ఖండముగా కురియంగ నిత్యమున్
హ్లాదము మోమునన్ నిలుపు నాతడు రాజిలు నీలకంఠుడై॥

''నవ్వు మితరులతో నవ్వుదు రెడదల
        నుత్సాహ మార్ద్రత లొలుక వారు
ఏడ్చిన నినుగని 'హేళన సేతుర''
        నెడినుడి మనుగడ నడపుచుండ
నలుబదివత్సరాల్ నాణ్యత మీరగా
        పెక్కు పదవులంది పేరు గాంచి
పరిశోధ కుండని వరదేశికుండని
        విజ్ఞాన జగతిలో వినుతి కెక్కి

శ్రీజగన్నాథము, సుమతి శ్రీమతి మహ
లక్ష్మి నోముల ఫలము కాళ్ళకుల మణి
నీల కంఠమ్ము గారికి శూలపాణి
ఆయు రారోగ్య భోగ భాగ్యముల గూర్చు॥

చిన్ననాడె మీదు శేముషీ విభవమ్ము
మెచ్చె (Prof. Day) ప్రొ. డె. మనీషి మిక్కుటముగ
పదవి తోడ చదువు భాగ్యమ్ము చేకూర
భూరి పట్టములను పొంది తీవు

సొంత కృషి వలన సుశ్లోకుడవయి సు
        జన మాన్యుడ వయిన సాధు మూర్తి
హాస్య సల్లాపాల నాహ్లాద మొనగూర్చు
        సరస వచస్వియౌ చతుర భాషి

దక్షత జూపి య ధ్యక్షుండవై కళా
శాల పాలించిన శాంతమూర్తి
ఆదర్శముల జూపి ఆచార్యమణివయి
వెలయు చున్నట్టి ఓ విమల హృదయ

ధర్మగుణ భూషణుండవు తాల్మి నెలవు
ఒరుల నొప్పింపనట్టి యు ద్యోగి వీవు
నీతి మార్గాన నడచి ప్రఖ్యాతి గొన్న
నీల కంఠము గారు జేజేలు మీకు॥

శాంతము శేముషీ ద్యుతిప్ర సన్నత, దక్షిత కార్యదీక్ష సు
స్వాంతము నెల్ల నొక్కటయి సాత్త్విక రూపము దాల్చెనోయేటం
చెంతుము మిమ్ముగాంచి నుతి యింతుము సంతస మంది, కోపమా
పంతయు జూపనేరవు నివాళులి వేగొను మా! గురూత్తమా!

ఏను చేసిన ఘనకార్యమేమి లేదు?
ఏల పొగడుదు రనిమీర లెంచవచ్చు
వేలకొలది శిష్యులకు సద్విద్యనేర్పి
వారి అభివృద్ధి కాంక్షించువారుగాన
మరువ జాలము మేమెప్డు మాన్య చరిత

కాళ్ళ వంగడ మనెడి పాల్కడలి యందు
నీల కంఠము నిండువె న్నెలల విందు
తనివి కల్గించి కడుచల్ల దనము లొలుకు
నీల కంఠము పలుకు పన్నీరు చిలుకు

కష్ట సుఖముల యెడ సమ దృష్టి నిలిపి
కర్మ యోగివై మనుగడ గడుపు మీదు
మనసు నందున మల్లెల మాలలూగు
కనుల వెన్నెల డోలల కాంతు లీను॥

(ఆచార్య నీలకంఠం గారి పదవీ విరమణ సందర్భంలో శిష్యులు, సహోద్యోగులు సమర్పించినది)

కవి(త్వ) తత్త్వ విచారము

మాకు ఆట వెలదులు అక్కరలేదు
    పాత అలంకారాలు అక్కరలేదు
ఎన్ని శతాబ్దాలుగా ఆమె ధరిస్తున్నది
    ఉత్పల మాలల్ని, చంపక మాలల్ని
మొహం మొత్తింది బాబూ!
    తేటగీతులు మాకు పోటు మాట లనిపిస్తున్నాయి.
కవితా రసాన్ని బూజు పట్టిన సీసాల్లో
    ఎన్నాళ్ళని తాగేది బాబూ!
రస కందాలు అజీర్తిని కలిగించాయి.
    తిన సహించని సమోసాల్లాంటి సమాసాలు వద్దుమాకు
వాటి రగడలు చెత్త చెత్తగా మత్త కోకిలలూ
    ''హరిచాప సౌందర్య గరిమ వెలవెలబార
నవరత్న ఖచిత భూషణ కాంతి పెంపార''
    విద్యున్మాలలా వన మయూరంలా
వచ్చె సుగాత్రి లలామని
    మెచ్చని శాలీసుల మైనాము మేము
''అతి సుందర సుస్యందన మందున''
    దూరంగా వినువీధుల్లో విహరించే
అందని అందాన్ని కవితా సుందరిగా
    దరిసించి భువికి దింపి
మొహంకూడ కనబడకుండా
    కనబడనీయ కుండా అలంకారాలతో
కప్పావు కదయ్యా ! కవీ !

చూడాలని ఎంతో ఆశతో తపించే మమ్మల్ని
నిరాశా కశాఘాతాలతో ఏడ్పించావు
భువన మోహనంగా విమల గాంధర్వం
వినిపించే మధుర గాయని పాడుతూ వుంటే
ప్రక్క వాద్యాల గోష్ఠలో గందర గోళంలో
ఆమె కంఠస్వరం వినిపించక పోతే
మనస్సు ఎలా తపిస్తుందో నీకు తెలియదా బాబూ!
కష్ట మని పించే అష్టాదశ వర్ణనలు వద్దయ్యా!
వెగటనిపించే కృత్రిమమైన వర్ణనలు వద్దయ్యా!
అసలే వాసన లేని పూల మాలలతో
చాలా పాతవైన తాతల నాటి అలంకారాలతో
నిజాయితి లేని వంకరటింకర మాటలతో
ఆమెను వేదిక పైకి తెప్పించ వద్దు
నీకు పున్నెముంటుంది బాబూ!
ఆమెకు మాకు మధ్య ఏర్పర చావే
అడ్డు గోడలు వాటిని తొలగించు బాబూ!

(23-6-72)

కొత్త సుభాషితం

ఇచ్చిన పైకంలో కొంత ఖర్చయినది పోగా
　　మిగిలిన చిల్లర డబ్బులు అడక్కనే యిచ్చేవాడు. ఉత్తముడు.
అడిగినప్పుడు ఖచ్చితంగా పద్దుల్నిచెప్పి
　　పైకం అప్పగించేవాడు మధ్యముడు.
మిగిలిన డబ్బులు ఏవి? అన్నందుకు కోప్పడి
　　హుంకరించి మన మొహాన పడవేసే వాడు అధముడు.
ఎందుకులే ఈ గొడవంతా అని పలాయనం పఠించేవాడు
　　''ఎవ్వడొ ఎఱుంగన్ శక్యమే ఏరికైనా''　　　　20-7-72

జగద్గురు ప్రణతి

శ్రీదమై అనవద్యమై రుచిరమై చేతో వికాస ప్రద
మైదిగ్వ్యాప్త దయా స్వరూపమయి లోకారాధ్యమై హృద్యమౌ
నీ దివ్యాకృతి గాంచి నాడను భవానీదేవి దీవింపగన్
వేదజ్ఞాన జగద్గురూ! ప్రభువరా! విఖ్యాత యోగీశ్వరా!

ఉదయాస్తాచల సేతుశీతనగ మధ్యుర్వీ ప్రదేశంబునన్
పద సంచారము చేసి క్ష్మాపతుల ప్రాపావంతయున్ లేకయే
గద నద్వైతము నింపె శంకరుడు లోకాతీత ధీమంతుడై
ఎదురే లేక సమాజ మందతని కీర్తిన్ నిల్పుచున్నట్టి పూ
జ్యదయా మూర్తులు చంద్రశేఖరులు, ధ్యానింతు నమ్రుండనై.

సాపేక్ష సిద్ధాంత' సారమ్ము శివము శ
క్తిగ మారుపే యని తెలిపినారు
వేదభూమి వరకె విస్తరించెను శంక
రుని ప్రచారమ్మని వినిచి నారు
పండుగ సమయాల నిండువేడ్కలుమాని
ప్రార్థించుడని మీరు పలికి నారు
కార్వేటి నగరపు గత వైభవ జ్యోతి
నించుక మరలవె ల్గించినారు.

వేద వేదాంగ పారీణ! విశ్వమంగ
ళకర! అవిరళ శాస్త్రక ళాప్రపూర్ణ
బ్రహ్మ విద్యాప్రవీణ! దురంత హరణ!
హర కృపాసాంద్ర! చంద్రశే ఖర యతీంద్ర!

నిలకడ లేని మానసము, నీమము నిష్ఠయు లేని జీవిత,
మ్ములండి, ఈర్ష్య, క్రోధములు అగ్రులుజాచును చుట్టుముట్టి దు.

ర్బలుడను; తృప్తిగానక నిరంతర మాశల పంజరాన చి
క్కుల బడి సుక్కువాడ, మిము గొల్తును బ్రోవుము చంద్ర శేఖరా!

కన్నకొలంది కన్నులను కౌముది నింపెడి మీదు రూపమున్
విన్న కొలంది వీనులకు విందులు గూర్చెడి మీదు వాక్కులన్
ఎన్నిదినంబులైన దరి సింపగ వచ్చు, వినంగ వచ్చు. నే
సన్నుతి జేసెదన్ గొనుము సంయమి శేఖర, చంద్రశేఖరా!

పది నిముసమ్ములైన బిగబట్టి మనస్సును ధ్యాన శీలినై
కదలక యుండలేను, మమకారము, ద్వేషమసూయ మోహముల్
ఎదతెగలాగి నేస్తులు పయింబడి యీగల వోలె నన్ను చం
పుదురు నిరంతరమ్ము మిము మ్రొక్కెద బ్రోవుము శంకర ప్రభూ!

అమరుల తేజ మందికొని ఆశ్రమ వాటికలన్ జగద్వికా
రములకు దూరులైన ఋషి రాజులు లోక హితమ్ము గోరి ఉ
త్తములయి యుండి నారను ఉదంతము పొత్తము లందు గన్నదే!
మిముగన నవ్విరూఢి యనిపించు శుభంకర శంకర ప్రభూ!

వినయము, భక్తి భావము, పవిత్రత, గౌరవమున్, ప్రపత్తియున్,
'పెనగొన వత్తురెల్లపుడు, పిన్నలు పెద్దలు బీద సాదలున్
ధన పతులున్ మహామహులు దాసుల వోలె భవత్ కృపార సా
ర్ద్ర నయన కాంతి సోకునని తామర తంపరగా, మహాప్రభూ!

శంకర భగవత్పాదుల సంప్రదాయ
సంపదల పరిరక్షించు స్వామి, కంచి
కామ కోటి పీఠాధిపుల్, ఘనులు, చంద్ర
శేఖర సరస్వతుల దయా శీస్సు గోరి
సాగిల పడి మ్రొక్కులిడుదు సంస్తుతింతు! జులై, 94

AUM

OBEISANCE TO JAGADGURU*

H.JI. Sri Sri Sri Chandrasekharendra Saraswathi Swamula Varu, Kanchi at Chaturmasyam 1972

By the grace and kindness of Bhavani (The universal Mother) I behold your Divine form, which is adored by all the worlds; most beautiful and blissful, pure, pristine and effulgent, endowed with powers to enlighten the inner being, the very embodiment of all pervasive mercy, thou art the master of the world of Vedic knowledge! My Lord O! Renowned leader of the yogis.

Thou art the torch bearer of the glory that was Adi Sankara the unparalleled intellect of all times, who trod the land of hills and dales, from Sethu to Himalayas, from East to West, without the prop of the Rulers of the day, and preached triumphantly the philosophy of Advaitha.

Thou art venerable kindness. O! Chandrasekhra in obeisance offered are prayers of mine.

You spelt out that the transformation of SIVAM (Matter) Into Sakti (Energy) is relativity:

you pointed out that Sankara chose to preach only where the Vedas are held in esteem;

you ordained meditation in lieu of pomp and pageant on occasions festive;

you brought back the bygone brightness and prosperity to Karvelinagar; observed in Karvetinagar, Chittoor District, A.P O! thou art the Master of Vedas and Vedangas, thou art the harbinger

of universal goodness, thou art the repository of Eternal knowledge Blessed and beloved of Lord Siva art thou, of king of yogis, O! Chandrasekhra.

Bereft of serenity of Mind and NISHTA unobserved I live, caught up in the grip of jealousy, ire and confusion; I pull on, always discontented.

Ever engrossed and encaged in desires, I struggle of Lord! I pray, save me.

The more we behold your form, the greater is our liking to see it which fills our eyes with the softness and sweetness of moonlight your speech, is a grand feast to our ears Day after day can be spent in bliss as we behold you and hear in rapt attentionI praise you with utmost reverence, O! Chandrasekhara, prince among saints Unable am I to meditate in tranquillity even for a while selfishness, hatred, greed and heartburn, bosom friends of mine, moving around me are like wild flies O! Lord, save me, I implore you Many a story I had read of the Rishis of yore, who were luminous immortal beings, livings far away from the woes of the world, in their holy hermitages, to be benefactors of the Society.

But thy hallowed presence, proves beyond any doubt that these were no more legends, but realities.

With obedience, devotion, purity of thought and reverence the young and old, the poor and rich, the learned and lay all in multitudes come and surrender themselves unto you to bask under the soft sunshine of your merciful eyes I prostrate

imploringly before and praise and pray for the blessings of that Sublime Man:

Sri Chandrasekhara Saraswathi, Acharya of the Kanchi Kamakshi Peetham, who is the preserver of the treasures of sacred tradition of Sri Sankara Bhagavatpada.

(July,74)

Z.P.G.*

Zero Population Growth

ఆలుమగలిరువురు అర్భకు లిరువురు
జగతి జనుల సంఖ్య ప్రగతి గనదు
మనిషి బరువు కతన మడియదు భూమాత
''సున్న పెరుగు దల''కు శుభము నిజము॥ (3–3–77)

స్మృత్యంజలి

మా మహాకవి సమ్రాట్టు మధుర సాహి
తీ సరస్వతి, ఆంగ్లము, తెలుగు సంస్కృ
తముల నాపోశనముపట్టి నమహ నీయు
డు, రసమూర్తి, వాగ్మి, చతురుడు, విబుధుడు, క
ళాప్రపూర్ణుడు, చనె మన ల విడి దివికి॥

''అలఘు స్వాదురసావతార ధిషణా హంకార సంభార దో
హల బ్రాహ్మీ మయ మూర్తి!'' భవ్య కవి తాభ్యర్హ స్థిర'' వ్యోమపే
శల చాంద్రీ స్సుదు కీర్తి!'' నీకతన విస్తారాంధ్ర సాహిత్య సీ
మలు భాసిల్లెను, సవ్యసాచి! కవి సమ్రాట్ సత్యనారాయణా!॥

ప్రతిభ, వ్యుత్పత్తి కృషుల సం క్రమణ మైన
నీదు చేతుల లోన రా ణింప నట్టి
సాహితీ ప్రక్రియలు లేవు జగతి యందు
విశ్వనాథ కవీశ్వరా ! వినతు లివిగో!॥

వాల్మీకి, భవభూతి వరకవి కాళిదా
సాదుల మార్గము లనుసరించి
నన్నయ్య, తిక్కన్న నాచన సోమన్న
పెద్ద నాదుల రీతి ప్రీతి గూర్ప
అభినవ గుప్తాది ఆచార్య వర్యుల
సిద్ధాంతములయందు శ్రద్ధ బూని
అద్వైత తత్త్వమ్ము నందునిరతమును
పరిధ విల్లినగాఢ భక్తి గల్గి

భవ్యకవితా తపస్సున దివ్యశక్తి
సంపదల పొందిన యశస్వి సంప్రదాయ

రక్షణకు శ్రమించిన కవి రాజు నీవు
సత్యనారాయణా! నిన్ను సంస్మరింతు॥

''ఆంధ్ర ప్రశస్తి''లో, ''ఆంధ్ర పౌరుషము'' నన్
ఆంధ్రాభిమానమ్ము నలర జేసి
కన్నె తెనుగువాగు కిన్నెరసాని మ
గని కౌగిటకరగు గాథజెప్పి
తెలుగు నేల ప్రకృతి విలసనమ్ముల ఋతు
సంహార మందు ప్ర స్తురిల జేసి
రామ కథా సుధా రసమును తెలుగువా
రెల్లపంచు కొన రం జిల్ల జేసి
ఎన్నని వచింతు, లెక్కలే నన్ని కావ్య
ములను సృష్టించి, పూర్వకవులను బోలి
ఆధునికులను మించి మహా కవీశ్వ
రుడ వయి బహు కృతులను బిరుదుల నెన్నొ
స్వీకరించిన ధీనిధీ! విశ్వనాథ
సత్యనారాయణా! నిన్ను సంస్మరింతు॥

పద్యము వ్రాసినట్టులె వి భాసిలు చిత్రవిచిత్ర శైలిలో
గద్యము వ్రాయ నేర్చితివి కౌశల మొప్పజగద్ధితంబుగన్
గద్యము గా రచించితివి కమ్మని చక్కని గాథ లెన్నియో
సదృశ మంది తీవు కవి చంద్ర! మహాశయ! సంస్మరించెదన్॥

నాటి కవి సార్వభౌముడు సాటి పండి
తుండు, మేటి'డిండి'ముని తా నిండు సభను
మించు వరకె పోరాడి జ యించి మించె
నేటి కవిసార్వభౌముడు నిరుపమముగ

జీవితాంతము దీక్షతో చేవ జూపి
సాహితీశత్రువుల తోడ సంగరమ్ము
సలిపె 'వీరకవి' యనినే బిలుతు నతని॥

నిన్ను బోలిన కవి తెల్గు నేలగాక
వేరు రాష్ట్రాల నెందైన '' వెలసి యున్న
విశ్వ కవియని యాప్రజ వినుతి జేసి
నీదు ప్రతిభను వేనోళ్ళ నిస్వనించి
కూర్చి 'నోబెల్' బహూకృతిన్ గొలిచి యుంద్రు.

(4-3-77)

ప్రశంసా ప్రసూనాలు

(శ్రీ ఓ. సుబ్రహ్మణ్యాచ్చారికి)

సమితిం బొందెను సత్కృతుల్ పిదప రాష్ట్రస్థాయిమర్యాదలం
దె మహాధ్యాపకుడంచు రాష్ట్రపతి కీర్తించెన్ శెహబ్బాస్ త్రివి
క్రముడాచారి గడించి నట్టి ఘనతల్ గర్వార్హముల్ గావె? దే
శమునందెందరి కబ్బు నీ ప్రథితి? ఆచార్యుండు ధన్యుండహో!

మామిడి చెట్ల నీడ పది మాసములున్ మధు మాసమట్టులన్
శ్యామల శాద్వలిస్థలుల హాయిగ పాఠము లభ్యసించు నా
దేము త్వదీయ సౌహృద మదెట్టిదొ గాంచితి మోమహాశయా!
ఆ మధురస్మృతుల్ దలచినప్పుడు మైమెర పింపజేసెడిన్.

నాటక మండలిన్ నడపి నాటకముల్ నటియింపజేసి కా
ర్వేటి పురమ్ములో చదువు బీదల పిల్లల నాదరింపగన్
మేటికృషిన్ వెలార్చితిమి మిత్రుల సాయము సేకరించి ఆ
నాటి ఉదంతముల్ నిలుచు నాహృదయమ్మున శాశ్వతమ్ముగా.

చదువులు చెప్పు శిల్పమున చక్కని పాండితి అబ్బుటల్, కళా
విదుడగుటన్ గుణాఢ్యుడయి విజ్ఞుల మన్నన పొందుటల్ యశః
ప్రదము ననన్య సాధ్యము తపః ఫలితమ్ము నిజమ్ము మిత్రమా!
ముదమొనగూర్చు నెల్లరకు ముజ్జగ మేలెడి వేణుమాధవుం
డెద పులకింప దీవెనల నిచ్చి మిముంగరుణించు నెప్పుడున్.

నగర యశః పతాకకొక నవ్యతగూర్చిన ఒజ్జ సజ్జనుం
డగణిత గానమాధురికి నాశ్రయమైన రసజ్ఞమూర్తి భా
వగరిమ సొమ్ముగా బలుకు వంద్యుడు స్నేహితుడౌట భాగ్యమి
జ్జగతిని యంచు నెంచెద ప్రశంసల ముంచెద కైతలల్లెదన్.

7-2-82

''జ్ఞానమూర్తి యని సంభావింతు రామానుజున్''

గణితార్థం బుదయించి స
ద్గణిత సాక్షాత్కార దీక్షాతపో
ధనుడై, భ్రాజిత దేవద
త్త నవమేధా వైభవోపేత స
ద్గుణుడై, భారత భారతీ
గణిత విద్యుద్దీప్తి శాండీరుడై
ప్రణుతిన్ గాంచిన జ్ఞానమూ
ర్తియని సంభావింతు రామానుజున్॥

ఆది శంకరువలె, నల వివేకానందు
మల్లె, నాంగ్ల కవులు షెల్లి, కీట్సు
గణిత మూర్తులైన ★గ్యాలువా, ★★ఏబెలుల్
భాతి శ్రీనివాసు ఖ్యాతి వెలుగు.

జగదాశ్చర్యకర త్వదీయ పటుధీ
  చాతుర్యలీలా విలా
స గణేయ క్రియ లెన్నియో కలవు వి
  స్తారించి చెప్పంగ పె
ద్దగ యత్నించె జగమ్ము; సద్గణిత కాం
  తారమ్ములన్ దిర్గు మ
త్త గజ వ్రాతములే శ్రమించినవి తత్తా
  త్పర్య మూహింపగన్॥

★గ్యాలువా (18-11-32) ప్రాన్సు దేశ గణిత శాస్త్రవేత్త
★★ఏబెల్ (1802-29) నార్వేదేశ గణిత శాస్త్రవేత్త

గణిత పండితుల్ మెచ్చిన గణితవేత్త
''సంఖ్యల మనస్సు చవిగొన్న సంగడీడు

నామగిరి తల్లి వరమున నోముకొన్న
దివ్య శేముషి భరితుడు దిట్టయతడు
శ్రీనివాస రామానుజన్ ''చిన్నస్వామి''
(శ్రీనివాస రామానుజుని ముద్దుపేరు ''చిన్నస్వామి'')

''సున్నలో నిర్గుణ బ్రహ్మ మున్నదిగద
సర్వ కల్యాణ గుణనిధి చక్రి కలడ
నంత మునను'', నీగణితవే దాంత పథము
చేర్చుదా. ద్వైత సన్నిధి శ్రీనివాస?

మల మల మాడు చుండినను, మాసి చినుంగులు వడ్డ ప్రాతగు
డ్డలె శరణమ్ము లైనను గ డల్గొను శేముషి కెట్టి లోపమున్క
లుగదు శాస్త్ర చింతనకె, కాలము నంతయు ధారవోయ యు
జ్జ్వల గణిత క్రియల్ వెలసె జన్మతరించెను జ్ఞానశేఖరా! ॥

సంగీతమ్మున, సాహితీ జగమునన్
సౌరుల్ విరాజిల్లగా
రంగుల్ పొంగులు వారు చిత్ర రచనన్,
ప్రాగల్భ్య సంసిద్ధితో
అంగారంబుల చాలన ద్యుతుల హృ
ద్యంబైన నృత్తాలలో
నంగాన్పించు మహాద్భుతంబయిన ప్రజ్ఞా
దుల్, సుసంపన్నమి
బ్బంగిన్ ''సైన్సుల'' లోన కల్గుటరుద
ప్పా! శ్రీనివాసాహ్వయా!॥

బడి తరగతులు చదువున
ప్పుడె ప్రకటితమయె, త్వదీయ బుద్ధి బలమ్మా
ధ్యుడవై గణితమ్మున పూ
జ్యుడ వైతివయా! సఖులకు, జోహారులివే! ॥

ఎందరో మహనీయుల డెందములను
చూరగొన్న ఉత్తముడు వి శుద్ధ వర్త
నుడు, వినయ భూషణుడు, జగ న్నుతి బడసిన
మాన్య గణిత నిర్మాత, రా మానుజుండు॥

తూర్పు సీమల నుండు అద్భుతము గాదు
మూర్ఖ జనిత భావావేశ ము, నపు రూప
మానసిక శక్తి జృంభణ మౌన? కాదు
నిండు ఇంగితముగల మనీషి యతడు॥

సహజ ధిషణా సముద్భూత సత్యగణిత
సూత్రశిల్ప నిర్మాత రామాను జుండని నిను
గూర్చి గణిత కోవిదులు వా క్రుచ్చినారు
తలచు నప్పుడు పులకలు దాల్చుమేను ॥

మరణ శయ్యపై పరుండి మహితరీతి
''హంసగీతి'' నాలాపించి నట్టి ఖ్యాతి
గణిత శాస్త్ర చరిత్రలో కలిగె నీకె
శ్రీనివాస రామానుజా! జ్ఞానతేజ॥

అదిగొ! నీదు జీవిత చరమాంక మద్ది
గణిత కాంతిని దిగమ్రింగ గడగి నట్టి
కాల భీకర క్రూర రో గమ్ము వలన
బడలిన యొడలు కృశియింప, బాధప్రబల
''గణిత చింతన'' బాధా హరణ గుళికగ
స్వీకరించి, శీఘ్రగతిని చేసినట్టి
గణిత సామగ్రి ''జీవిత కాలమెల్ల
ఒక మహాపండితు డొనర్చు ఉత్తమ కృషి
కి సమమి''ది విజ్ఞుల ఉవాచ కేలుమోడ్చి
సన్నుతింతు రామానుజా! సతమునిన్ను ॥

కల్పనజేసి గాథలను కావ్యములన్ రచియించు వారికిన్
తెల్పిన నీదుజీవితము తీరు, భవత్కృత సూత్రముల్, మహా

శిల్పనిధాన రమ్యములు శ్రేష్టములైన ''వహో, అభూ తమౌ
కల్పనలం''చు నమ్మరు జ గమ్మున అబ్బుర మయ్యెడిన్ గదా!॥

గణిత విశ్లేషణాకృతి, ఘనయశస్వి
★''ఆయిలర్'' మహా గణిత విద్యా తపస్వి
★★ న్యాససమ్రాట్ ''జకోబీ'' విఖ్యాతులు భువి
శాస్త్ర కౌశలమున నీకు, జాకొబీ కి
అయిలర్ కు నడుమ పెద్ద ఆసనమ్ము
ఏర్పరచినారు పండితు లెంతగౌర
వాస్పదమది రామానుజా! అభినుతింతు॥

ఒక పవిత్ర దీదీప్తి తళుకుమనవలె
ఒక విశిష్ట నూతన భావముల్లసిల్ల
వలె గణిత సమీకరణమ్ము వల్ల '' అటుల
గాని యెడల నిస్సారమై గ్లాని గూర్చు
నని పలికిన ద్రష్టవు నీవు వినయశీల! 22-12-82

జి.హెచ్. హార్డీ అభిప్రాయము ''రిచర్డు ఆస్కీ'' ఉవాచ
★ ఆయిలర్ (1707-83) ఎనాలిసిస్ ఇన్ కార్నేట్ (స్విజర్లాండు గణితశాస్త్రవేత్త)
★★ యాకోబి (1804-81) దిగ్రేట్ అల్గారిస్ట్ (జర్మనీ గణిత శాస్త్రవేత్త)

అయినా ఫర్వాలేదు

(ఆంగ్ల రచనకు అనువాదం)

మనుష్యులు, అక్రమస్థులు, అన్యాయస్థులు, స్వార్థపరులు అయినా ఫర్వాలేదు మనుష్యుల్ని ప్రేమించు. నువ్వు మంచి చెయ్యి, ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి చేశానని నిందిస్తారు. అయినా ఫర్వాలేదు. మంచిని చెయ్యి నీవు విజయ సోపానా లెక్కుతుంటే మిథ్యామిత్రులు సత్యశత్రువులు ఏర్పడతారు అయినా ఫర్వాలేదు. విజయపథాన్ని వీడకు, ఈరోజు నువ్వు చేసిన మంచి రేపు విస్మరింపబడుతుంది.

అయినా ఫర్వాలేదు మంచిని చెయ్యి నిజాయితీవల్ల, నిర్మొహమాటంవల్ల ఇబ్బందుల పాలౌతావు అయినా ఫర్వాలేదు, నిజాయితీని నిర్మొహమాటత్వాన్ని వదలొద్దు.

మనుష్యులు దగాపడ్డ తమ్ముళ్ళను ఆదరిస్తారు అయితే ఘరానా వ్యక్తుల్ని ఆశ్రయించి అనుసరిస్తారు.

అయినా ఫర్వాలేదు, దగాపడ్డ కొందరు తమ్ముళ్ళకోసం పోరాడు.

ఏళ్ళ తరబడి సాగే నీ నిర్మాణాలు రాత్రికిరాత్రే కూలిపోవచ్చు అయినా ఫర్వాలేదు నిర్మించు.

సాయం నిజంగా అవసర మనుకొన్న వారే నువ్వు సాయం చేయడానికి పోతే నిన్ను అటకాయించవచ్చు, అయినా ఫర్వాలేదు వారికి సాయం చేయి.

నీలో గొప్పవి ఏవైతే ఉన్నాయో వాటిని ప్రపంచానికి, ఇవ్వు నీకు పన్నులు ఊడేట్లు తన్నులు తగుల్తాయి.

అయినా ఫర్వాలేదు నీ గొప్పని ప్రపంచానికి ఇవ్వు (జాతీయ సేవా పథకం N.S.S. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, (తిరుపతి) కోసం వ్రాసినది. మార్చి 89.

మనోభావాలు

కొండలోని ఓ పెద్దబండను పిండి చేయాలని గులక రాతితో కొండను కొడుతూనే ఉన్నా. పాషాణం వెన్నముద్దై కరుగు తుందని శ్రద్ధగా దానివైపే చూస్తూ ఉన్నా. సముద్ర గర్భంలోకి వెళ్ళి. చీకటిలో రత్న మాణిక్యాలను వెదకి తెద్దామని అగ్గి పెట్టె తీసికొని సమాయత్త మైనాను. కొండ శిఖరాన్ని కిందికి దింపాలని శిఖరానికి శిరోజాన్ని కట్టిలాగుతున్నాను. పూర్ణేందు బింబాన్ని పిలిచి ముద్దు ఇవ్వమని వేడినా ముఖమును త్రిప్పి వాల్చి అట్లాగే ప్రతిమలా నుంచున్నాను.

ప్రియురాలు రాసిన ప్రేమలేఖను ప్రభాత మారుతం తీసికొని మోసికొని ఏదో ఒకరోజు నా ముంగిట్లో వేస్తుందని ప్రతిరోజు చూస్తూనే ఉన్నా. గగన తలంమీద చెల్లాచెదరుగా ఉన్న తారల్ని ఏరి ఒక దారంలో గ్రుచ్చి, తారా తోరణంగా ఆమె మెడలో వేద్దామని ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్నాను. అందని ద్రాక్షపళ్ళు పులుపు నేడు కోసి ఉంచితే, రేపు మాగితే, తీయగా ఉండవా! అని అందకపోయినా ఎగిరెగిరి అందుకోవాలని అలమటిస్తున్నా. శిలలో మలచ బడ్డ ఆ నాట్య మయూరి ఎప్పటికైనా ప్రాణంపోసికొని అందియల ఝుణత్కారాలు వినిపిస్తుందని ఈ ప్రతిమముందే కూర్చున్నాను. నీళ్ళ తొట్టిలో ఇనుప ముక్కలేసి అవి ఎప్పుడు మెత్త బడతాయోనని పరీక్షిస్తున్నాను, నిరీక్షిస్తున్నాను.

ఒక పెద్ద స్తూపాకార స్థంభాన్ని బాహువుల్లో బంధించి నుంచున్నాను. అందరికీ అమృతాన్ని పంచిపెడుతూ పోతుంటే తొందరపడి దోసిలి అలాగే పట్టాను. మధ్యనున్న స్థంభాన్ని తొలగించుకొని అమృతం ఆరగించాలని ఆరాట పడుతున్నాను. ఎంతో ఆశతో ఉన్నా అమృతం నాదోసిట్లో ఉన్నది. అయినా నానోటికీ దానికీ ఎంతోదూరం. అమృతం కరతలామలకమైనా నిరంతర నిరీక్షణే.

బ్రహ్మాండ మంత నిశ్శబ్దాన్ని పరమాణువంత శబ్దంతో నింపాలని నింపాదిగా ప్రయత్నిస్తున్నాను.

నేను నీరుపోసి పెంచిన మల్లె తీగకు పూచిన పూల వాసనల్ని గాలిదోచు కొని

వెళ్తూ ఉంటే తెలుసుకోకుండా మల్లెల పరిమళం నాకోసం పరుగిడి వస్తున్నదే మోనని భ్రమపడుతున్న వాడ్ని.

వెళ్ళి పోయిన నీళ్ళకు త్రుళ్ళిపడి సేతువు కట్టె వెఱ్ఱిబాగులవాణ్ణి. పగకు, స్నేహానికి చేతులు కలపాలని విషంచేత అమృతం ఒలికించాలని అంచనాలు వేస్తున్నాను.

మందిరంలో ఖురాను, బైబిలు చదివి మసీదులో టెంకాయ కొట్టే రోజుకోసం నిరీక్షిస్తున్నాను. చర్చిలో సహస్రనామార్చనలు చేసి బోలో భారత కిజై, స్వతంత్ర భారత్ కిజై, వందే మాతరం అని ఎవరెస్టు శిఖరం మీదినించి ఎలుగెత్తి అరుస్తున్నాను. ఈరోజు మనకు నిజస్వాతంత్ర్యం వచ్చినరోజు, ఈ పండుగ పూట, నానోట ఈమాట కవితగా వినిపించు.

''చేయెత్తి జైకొట్టు తెలుగోడా గతమెంతో ఘనకీర్తి గల వోడా''

'అయ్యా!' అంటాను పలుకడు 'సార్' అంటే పలుకుతాడు 'పెళ్ళాం' అంటే వెకిలిగా చూస్తాడు 'మిసెస్' అంటే నమస్కరిస్తాడు 'అనంతపురం', 'గోదారి' అంటే ఆకాశంకేసి చూస్తాడు. 'అనంతపూర్', 'గోదారి' అంటే ఆప్యాయంగా పలకరిస్తాడు. 'విశాఖపట్నం' అంటే విసుక్కుంటాడు. 'వైజాగ్ అంటే వెరీగుడ్ అంటాడు. ఎవడు వీడు? వీడి గోడు తెలుసా వీడే మన Telugodu, 'ఏంఅబ్బాయ్' అంటే ఎగాదిగా చూస్తాడు. ''What Mr.'' అంటే యిష్టపడతాడు. బిడ్డ నాన్న అని పిలిస్తే ఖాతరు చేయడు. 'కిడ్, డాడీ అంటే సంబర పడతాడు. అమ్మను 'మమ్మీ' చేస్తేనే ఆనందిస్తాడు.

అంటాడు అత్త, మామ, అవ్వ, తాత, మాంధాత కాలంనాటి మాటలు ఆంటీ, అంకుల్, గ్రానీ, గ్రాండ్పా అనురాగపు మాటలు 'మొగుడని' పించు కోవడంలో మురిపెం ఏముంది? 'హబ్బీ' అనిపించు కోవడంలోనే ఆ అబ్బీకి అనందం.

'శాకాహారం, మాంసాహారం' అంటే ఆటవికుల అనాగరికపు మాటలంటాడు. 'వెజ్, నాన్‌వెజ్' అనడం నేడు సజ్జనతకు, సంస్కృతికి సంకేత మంటాడు.

నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, పోతన, తిమ్మన ఆహాహా! ఓహోహో! తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మాన్యులు కదండి.

పెద్దబ్బోడికి ఒక పేరు చిన్నబ్బోడికి మరోపేరు, ఇల్లా ఈ మహాకవుల పేర్లిడితే ఎట్లా ఉంటుంది? ''అబ్బేబ్బే! కుదరదండి కొడుకు తనానికే రాజీనామా యిచ్చేస్తారండి. మాఅబ్బాయి అయినా మాకేం మతిచెడిందా! ఇరవయ్యో శతాబ్దం ముగియ పోతూ ఉంది ఇట్లాంటి దర్టీ సలహాలిస్తున్నారు.''

అంటారు మన బ్రదర్సు ''మన బిడ్డలు తెల్గు మీడియంలో చదివి బట్ట కడితేనేనిజంగా తెల్లవారి దొరతనం గుల్ల అయినట్లు '' అని ఉపన్యాసాలు దంచేస్తాడు.

తన బిడ్డల్నేమో డొనేషన్లిచ్చి రెకమండేషన్లతో ఘనమైన కాన్వెంట్లకు పంపిస్తాడు.

''శ్రీరాముని దయచేతను గంగగోవు పాలు'' లాంటి పద్యాలు బిడ్డ వల్లిస్తే మన బ్రదర్ కనుబొమ్మ లెగురవు ''Dickory Dickory Dock Baba Black Sheep'' వల్లిస్తే మిన్ను ముట్టిన ఆనందంతో తన్నుతానే మరచి పోతాడు ''నాన్నా నేను చెడుగుడు, జిల్లాంగోడి, ఉప్పర పట్టెలు'' ఆడు కుంటా నంటే'' ''బాబ్బాబు!నీకు పున్నె ముంటుంది క్రికెట్ ఆడూ టెన్నిస్ ఆడరా ఆడడం చేత కాకుంటే వాటిని ఆడేవాళ్ళను చూచి ఆనందించడం, లేదా! వ్యాఖ్యానించడం, నేర్చుకోరా అంటాడు మనబ్రదర్. క్షమించండి అంటె క్షమించడు I am sory, excuse me అంటేనే క్షమిస్తాడు.

సెప్టెంబరు 89

డా|| డి. ఆర్. కె. సంగమేశ్వర రావు

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు

గణితశాస్త్రమును సత్కవితవోలె పలుకు
మధురభావుకుడైన మాన్యుడతడు
సిద్ధాంత రచనలో శిల్పము వెలయించు శాస్త్ర
కోవిదుడైన చతురుడతడు
లాక్షణి కతపట్ల లక్ష్యము సడలని
గణితతాపసుడైన ఘనుడతండు
గ్రంథాలు వ్రాయుచో గణనీయ శేముషి
ప్రతిఫలింపగజేయు ప్రాజ్ఞుడతడు
ఆంధ్ర విశ్వకళాశాల యందు గణిత
దేశిక పదవులను మెట్టె దీప్తి గూర్ప
ఛాత్ర శతములు మెచ్చిన శాస్త్రియతడు
సంగమేశ్వర రావు విజ్ఞానమూర్తి

''విద్య దోషధమని వెఱచు వారికికాదు.
పీయూషమని జూపి ప్రీతిగూర్చి
అబ్బో!అయః పిండమనెడి వారలకిది.
కల కండ తినుడని కలబలుగుచు.
సుళువుగా భావింప నలవికాని వినూత్న
విషయములను తేనె విందుజేసి
త్రికరణ శుద్ధిగా సకలవేళలయందు.
ప్రాచార్య కార్యమ్ము పరిమళింప
శాస్త్ర బోధన జేసి ప్రశస్తి గాంచె.

నాలుగు దశాబ్దముల మించు కాలమందు
గణిత జగమున జ్యోతియై ప్రణతిగొన్న

సంగమేశ్వర రావును సన్నుతింతు
జాతి రత్నమై వెలుగు విఖ్యాతుడతడు

ఖ్యాతి కెక్కిన ''తెలుగు అకాడమీకి''
గణిత పుస్తకాలను వ్రాయు కాలమందు,
సహచరుడనై గ్రహించితి శాస్త్రమందు,
మెళకువల నెన్నొ మీనుండి మేదురముగ

గణిత విద్వత్కవిగ నేడు గణుతి కెక్కి
మాన్యులైన ప్రాచార్యులై ధన్యులైన
వారు బహుకొద్ది వారిలో వన్నె కెక్కె
సంగమేశ్వర రావు విజ్ఞానధనుడు..

ఆయురా రోగ్యభోగ భాగ్యములతో డ
బ్రతుకు తీయని స్వప్నమై పరిఢవిల్ల
వరలు గావుత సంగమేశ్వర మనీషి
వేంకటేశ్వర స్వామి దీవెనలు గురియ.

10-06-90

ప్రవహించే సంగీతం

మొన్న మొన్ననే చన్ను గుడిచి
　　కన్ను తెరచిన చిన్నదేశమది సింగపూరు
మిన్నగా ఉన్నదని విన్నమాటేగాని
　　నిన్న చూచితి కన్నుల పండు వయ్యె
సంతోషద్దీవి అట
　　కొంత వ్యవధి చూచికొని నేస్తాలు వెళ్ళాము
వింత లెన్నో ఉన్న అందాల దీవి అది
　　సంతోష (Santosh) ద్వీపమట సంతోష స్తూప మది
అడుగడుగు అందాలు అగుపించు నచట
　　సుర లోకమున నుండి ఒక మట్టి ముక్క
ధరపైన జారి పడ్డదేమో!
　　ఇటు వంటి అందాల భరిణ
లేకున్న ఘనీ భవించిన సౌందర్యమో!
　　ప్రవహించే ఈ సంగీతం నడయాడే ఈ సింగారం

నర్తించే ఈ శివ చైతన్యం ఎలాగుంటుంది ఈ ఇలాతలంపై
　　భళా అనిపించే సంగీత కళానిలయమది సం
క్రాంతి వలయ మిది
　　కోటి అందాలు గల గూటిలో ప్రతి ఒకటి
మేటి అనిపించుటకు ఫోటోలు పడతాయి
　　ఒక జనత, ఒకజాతి, ఒక సింగపూరని
తన ఘనత ప్రకటించి
　　మహితరీతిని మనియెడి మహోఖండమది
వెండి పండుగ జేసి భాగ్య
　　భాండములను క్రుమ్మరించిన వేళ
వెళ్ళితిమి నేస్తాలు వేడుకల జూడ
　　గురజాడ కొత్తపాతల మేలు కలయికను తలపించే

తూర్పుపడమరలు కలిపి తన నేర్పరి తనమును జూపిన మనిషి
స్వేచ్ఛగా జీవించు, శ్రీలు పొంగెడి జీవ గడ్డరా యిది.
పాలు పారెడి భాగ్య సీమరా యిది.

ఇచట మనియెడి ప్రజలు ధన్య జీవులనుట
ఎంతో నిజము
జాతులెన్నో భాషలెన్నో
మతములెన్నో గతము లెన్నో
చరిత లెన్నో, సంస్కృతులవెన్నో
మనుజులందరు ఒక్కరే
మానవతకు పట్టాభిషేక మక్కడే
భాష పేరిట జరుగు (చెలగు) ఉ
క్రోషములు లేవు మతము పేరిట జరుగు
దురాగతము లసలేలేవు
మత విద్వేషాలకు నెలవది కానేకాదు.
మండు టెండల మాడిన అంతరంగాలపై
మలయ మారుతములు సోకి నట్టుల
హాయిగా తీయగా.
స్వర్లోక సుదర్శనమ్మని పించే
సంతోష సంరంభ సంప్రాప్తి కలిగె
నిలువెల్ల పరిమళించె కనుల వెన్నెల కాంతులే కురిసె
మనసున మల్లియలు మాలలైవిరిసె
అంబర చుంబి శిరస్సౌధముల నెక్కి
సంబరపడి ఉయ్యాల పెట్టెలో ఊరేగి నాము
అంబుధికి అంబరానికి మధ్య విలసిల్లే తోరణాల బాట
అది ఉయ్యాల రాస్తా ఆనందోత్సాహాలతో
సౌధాగ్రంనుంచి పయనించి
అందాల దీవిపై అడుగు పెట్టితిమి
ఒంటి పట్టామీద విద్యుదయస్కాంత సూత్రంతో
పర్యాటకుల్ని పరామర్శించి

వివరణలు సూచనలు సలహాల నందిస్తూ అలరింపజేస్తూ
రైలు బండి మమ్ములను దీవిచుట్టూ త్రిప్పినది
చివరి మజిలీగా వెలుగు వెల్లువల
నృత్య సంగీతపు మడుగును చేరాము
వలయాకృత జలరేఖల వన్నెలెన్నో! చిన్నెలెన్నో!

★★★★★

నీటి మీదగీత నమ్మలేని రాత
అనిమన నుడికారము అయినా
నీటి గీతాలలో లతానికుంజాలను రచించి
వాటికి ప్రాణము పోసి
నాట్య సుందరుల భంగిమలను ప్రకటింపజేసి
దగద్ధగాయ మానంగా
జగజ్జేగీయమానంగా
కదంత్రొక్కించి, పదం పాడించి
హృదంత రాళాలలో
దిగంత సౌందర్యాలను నింపి
శరీరంలోని అణువణువును
చైతన్యంతో జాగృత మొనర్చి
తనువెల్ల కనులుగా చూడనింపగు
విద్యుల్లతా తన్వీమణుల
నూపుర ఝణత్కారాలు ఒకవైపు
వెలుగు వెల్లువను విశ్లేషించి
సరిగమ పదనిసలతో సంశ్లేషించి
''బీటవారిన ఎదల'' పీయూషములు ప్రిదుల
గరిక బారిన వేల మరకతమ్ములు తేల''
ప్రగతిపథంలో ప్రస్థానిస్తున్నదీ కొత్త చిన్నదేశం సింగపూరు.

(సింగపూరు) (15 ఆగస్టు 1991)

డా|| లక్కోజు సంజీవరాయశర్మ

''అంకవిద్యాసాగరా''ఖ్యతో నడయాడు
సంజీవరాయని సన్నుతింతు
''గణిత బ్రహ్మ''యటంచు ప్రఖ్యాతికెక్కిన
సంజీవరాయని సన్నుతింతు
''విశ్వసంఖ్యాచార్య''విఖ్యాత గణితజ్ఞు
సంజీవరాయని సన్నుతింతు
నుతిగొనుచున్న ''గణిత సార్వభౌముడు''
సంజీవరాయని సన్నుతింతు

మంచి ''లెక్కలతాతయ్య''మాన్యుడతడు
గణితమున అవధానముల్ గ్రాలజేసి
కనులులేకున్న నేమి? అంకములతోడ
ఆడుకొను నాతడవలీల నద్భుతముగ

పూని ఆర్వేలగణితావధానములొన
రిచే వినోదవిజ్ఞానముల్ రుచులనీన
భాగహారము గుణనము బహువిధముల
ఘాతకార్యముల్ యుక్తి లెక్కలు, ప్రధాన
సంఖ్యల ప్రసక్తి అంకెలచదరములును
వర్గఘనముల గణనల నర్గళముగ
చేసి పండితుల మెప్పించి మించు
క్రీస్తు శకమునగల తేదికి సరియైన
తిథియు నక్షత్ర వారాది దిన వివరము
చాంద్రమానమున తెలుపు చతురుడతడు
మనుజకంప్యూట రనబడి వినుతిగాంచి
న విదుషి శకుంతలాదేవి భవదనంత
ధీ విశిష్ఠతల నభినందించెనంట
ఎన్నని వచింతు లెక్కలేనన్ని గణిత

కళల నవధానవిద్యగా వెలువరించు
బ్రహ్మ గణితాన సంజీవరాయశర్మ.

కన్నులు లేని బిడ్డ పలుకష్టములన్ బడునమ్మ కావునన్
మున్నుగ వడ్ల గింజలవి మూటిని బిడ్డగళానవేయుమా
తిన్నగ వీనిజన్మ కడతేరును గుండెను రాయిచేసుకో
యన్న హితాప్తసూక్తులకు నాయమ లొంగక జాగరూకతన్
నిన్ను శ్రమించి పెంచినది నీ భవితవ్యము నూహ సేసెనో!

కలమున్ బట్టగ లేదు కాగితము ప్రక్కన్ లేదు సంఖ్యావళుల్
చెలగున్ నీ రసనాగ్రమందు భళిరా! శ్రీ కాళహస్తీశ్వరున్
జలువన్ శాస్త్రజగాన నిట్టి మహదాశ్చర్య క్రియాపుంజముల్
కలవంచున్ కవితావిపంచిపయి వక్కాణింతు నీ చాతురిన్

దేశోద్ధారక పంతులు
కాశీనాథుని కులమణి ఘనకీర్తి. అనీ
బీసెంటు త్వదపధాన
ప్రాశస్త్యము చూచినారు పర్యుత్సుకతజ్జ
వహర్ లాల్ నెహురూమహాశయుడు.

వైశ్రాయ్ జార్జిస్టాన్లీయు, మా
నవకంప్యూటరుగా చెలంగు గణిత జ్ఞానబ్ధి శాకుంతలా
నవలారత్నము, దేశభక్తుడగు కొణ్డా వెంకటప్పయ్య వా
సి విరాజిల్లిన మాన్యరాష్ట్రపతి రాజేంద్ర ప్రసాదాదులున్న
వనీయుండని, నిన్ను మెచ్చిరిగదా సంజీవరాయాహ్వయా!

వేంకటేశ్వరు పేరున వెలసియున్న
విశ్వవిద్యాలయమ్మున విజ్ఞులొసగి
నారు డాక్టరు బిరుదమ్ము గారవించి
నీదు గణిత పాండిత్యము నిరుపమంబు
జయము సంజీవరాయాఖ్య జయము! జయము!

3-3-93

?> స్నేహితం

‘‘స్నేహితాని కంటె ధనం బలమైనది
స్నేహితాని కంటె కులం బలమైనది.
‘‘స్నేహితాని కంటె సెక్సు బలమైనది.
స్నేహితాని కంటె భయం బలమైనది.
‘స్నేహితాని కంటె స్వార్థం బలమైనది. 17-11-93

* మాణిక్యానికో లేఖ

★ శ్రీ నూతలపాటి మాణిక్యం చిననాటి నేస్తం, ప్రస్తుతం పట్టాభిరామ్ (మదరాసు) లో మకాం ఆయనకు వ్రాసిన లేఖ.

ఆచార్య అరుణాచలం నేస్తాని కోలేఖ
మాణిక్యం నేస్తమా! మొన్న నవంబరు (1994)
పదమూడో తేది పది నిముషాల పాటు
మనం కలుసుకొన్నాం
ఎన్ని మధురమైన స్మృతులు నామనస్సున ఆవరించినవి
అబ్బ ఎన్ని! చిన్ననాటి తలపుల వలపులు

ఎన్నని వచింతు లెక్క లేనన్ని
స్మృతి చిత్రాలు మనఃఫలకం మీద
అనుక్రమణికలాగా ఏర్పడ్డాయి.
ఎట్లా వివరిద్దాం వాటిని అన్నిటిని
అని తికమక పడుతూ చకచక రాస్తున్నాను రాస్తున్నాను నీకు
సహృదయుడు, సరసమిత్రుడు
రాయలచెర్వు సుధాకర్కు చదివి వినిపించండి
తలపోతలను త్రవ్వి వెలికి తీసిన కథలను
ఘటనలను, ఉదంతాలను, ఊసులను
వేసవిని వసంతకాలంగా మార్చుకొని
ఎన్నివసంతాలు గడిపామో మన చిన్ననాడు
అమావాస్యలను పున్నములుగా
ప్రత్యహాన్ని పర్వదినంగా
పేదల బిడ్డలమైనా పెన్నిధులకు వారసులు మనుకొని
తీయని బాల్యాన్ని గడపిన స్మృతులు
నన్ను పరవశింప చేస్తాయి

ప్రతి ఏట ఋతు చక్రం క్రొత్త తరగతి ప్రవేశంతో
ద్రౌపదమ్మ తిరునాళ్ళతో ప్రారంభమయ్యేది నేస్తమా!
కాలాన్ని ఈ తిరునాళ్ళతో ఈ అగ్గి తిరునాళ్ళతో కొలిచే వాళ్ళం
బడిలో చదివిన భారత కథలను
మళ్ళీ రంగ స్థలం మీద
పూర్వాపరాలతో కర్ణపేయంగా, నయనానందకరంగా
ధర్మరాజు గుడిలో విన్నాం కన్నాం, జ్ఞాపక ముందా!
పగటి పూట చెప్పబడిన భారత కథలు
రాత్రి పూట కంగుంది వారో, మరెవరో ఆడినప్పుడు
ఎంతో ఆనందపడి ఎన్నిరాత్రులు చూచామో
జ్ఞాపకం తెచ్చుకో నేస్తమా
పది రోజుల పండగ అది
కులాల వారిగా కొలిచే వాళ్ళం అయితే
కులతత్వాల కుళ్ళు మసలో లేదే
చూడు మిత్రమా నేటి సమాజం
కులప్రాతి పదిక మీద ఎట్లా బ్రద్దలై పోయిందో
కుల వివక్ష ఒకరాక్షసిగా
మనుజులకు శిక్షలు వేస్తూ ఉండడం
ఎంత దారుణ మబ్బా!
మన చిన్నపుడు కులాలకు అతీతంగా
అన్న, అక్క, మామ, బావ, నాయనా,
తాత, అవ్వ, చెల్లమ్మా, అబ్బాయీ, అబ్బోడా, అమ్మాయీ,
అయ్యలు అని ఆప్యాయంగా కలుపు గోలుతనంగా
చిన్నోడా. పెద్దోడా అని పలకరించు కొన్నాం
నెయ్యాన్ని కలకాలం నిలబెట్టు కొన్నాం
ఆ బంధాలు, అనుబంధాలు ఈనాడగపడవేమి నేస్తం?

నగరంలో నడివీధుల్లో నడుస్తున్నప్పుడెదురైన
ప్రతి హృదయం స్పందించేది
ఈనాడు ఎవడో వీడు? ఎందుకో పోతున్నాడని
పలకరించకనే నిరాదరంగా, అనార్ద్ర ఘటాల్లాగ
పయనిస్తున్నారు జనం సంచరిస్తున్నారు.ఇది నిజం
శుక్రవారం ''కొడి'' ఎక్కిన నాటి నుండి
రెండో సోమవారం వసంతోత్సవం వరకు

ఎన్ని సంబరాలు ఎన్ని సన్ని వేశాలు
లాక్షా గృహదహనమేనా హిడింబాసుర వధయేనా
ఏక చక్రపుర వాసం బకాసుర వధ
మత్స్యయంత్ర ఛేదనం ద్రౌపదీ కళ్యాణం
మాయా జూదం వస్త్రాపహరణం వనవాసం
అలుగు (కత్తి) నిలపడం తపసు మాను
ఉత్తర గోగ్రహణం కీచక వధ సైంధవ వధ
దుర్యోధన, దుశ్శాసన సంహారం అగ్ని ప్రవేశం
ఆదివారం, సోమవారం వసంతోత్సవం
ఎన్ని వింతలు ఎన్ని వినోదాలు
అప్పుడే తిరునాళ్ళు అయిపోయిందే
అన్నభావం బాధ: మరో సంవత్సరం వేచివుండు
మళ్ళీ ఈ వడ్డన వస్తుందన్న ఆశాజీవులుగా
బాల్యాన్ని గడిపాము నెమరు వేసుకో నేస్తం
ఈ తిరునాళ్ళ తీపిని మరిపింప చేయడానికి
కృష్ణాష్టమి, స్వాతంత్ర్యదినం
కృష్ణాష్టమికి ఉట్లు ఊడగొట్టేవాళ్లం
''చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ
బంగరు మొలత్రాడు పట్టు దట్టి

సందె తాయెతులును సరిమువ్వ గజ్జెలు
    చిన్ని కృష్ణ నిన్ను చేరి కొలుతు''॥
అని కొలిచి మైమఱచి పోయేవాళ్ళం కదూ.
    పద్యాలెన్నో వల్లె వేసే వాళ్ళం
ప్రతి పండక్కి క్రొత్త దుస్తులు
    లేక పోయినా పాలకాయలు
పప్పు బిళ్ళలు పెరుగు వడలు
    పిండి వంటలెన్నో తిన్నాంగదా! నేస్తమా!
స్వాతంత్ర్యం వచ్చిన సందర్భాన్ని
    క్రొత్త పండుగగా జరప నారంభించాం
మన ఆర్.బి.ఆర్. మన సుదర్శన వర్మ
    మాదిరాజు సుబ్రహ్మణ్యరాజు గారు
కోదండ రాజు అయ్యవారు
    ఎందరెందరో పాల్గొని వీరోచిత
పాఠాలను కథలు కథలుగా చెబితే
    భక్తి, ఆసక్తులతో ఆలకించే వాళ్ళం
గాంధి, నెహ్రూలకు గొంతులు కలిపి,
    జేజేలు కొట్టాం జ్ఞాపక ముందానేస్తం?
చిన్న సైజు జాతీయ పతాకం బిళ్ళలను
    చొక్కాలకు తగిలించు కొని,
జాతీయతా స్ఫూర్తిలో పరుగులు తీసాం
    వినాయక చవితినాడు పెరుగు కొనాలని
చెంబులు, చిన్న తపేళాలు చేత బట్టుకొని
    బండిరేవు వరకు
అలుపూ సొలుపు లేక, పోటీలు పడివెళ్ళాం
    ఒక తవ్వో రెండు తవ్వలో
పెరుగు దొరికితే, స్వర్గం అందినంత
    ఆనందంతో, పరుగున ఇల్లు చేరి,

జయించి వచ్చిన యుద్ధ వీరుడిలాగ
సంబరపడి అమ్మచేత అభినందనలు
అందుకున్న అర్చకులం మనం
పెరుగుకై వెళ్ళి నప్పుడే
జిల్లేడు, మారేడు, గన్నేరు,
దానిమ్మ, మరువమ్ము, దర్భ,
విష్ణుక్రాంత, ఉమ్మెత్త, దుర్వార,
ఉత్తరేణు, మంచి పత్రి, మంచి మొలక,
అగరు, కురువేరు, చామంతి,
తామరలు, అరటి, బొందెల తోటి
అరటి ఆకులు తెచ్చి అడవి తల్లికి మొక్కి
సరోవరాన్ని సమీపించి, సరసాలు ఆడి
ఊరి వెలుపల వున్న తోటల్లో చేరి
నాలుగోతరగతి గురువర్యులు
గురవరాజు అయ్యవారు నేర్పిన
వినాయక చవితి పద్యాలు వల్లెవేశాం
''తొండము నేకదంతమును
తోరపు బొజ్జయు వామహస్తమున్
కోరిన విద్యల కెల్ల నొజ్జవై యుండెడు
పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదమన్నాం
''ఓబొజ్జ గణపయ్య నీబంటు నేనయ్య
గుండ్రాళ్ళ మీదికి దండు బంపు''
అని పరుగులు తీసి పూజాసామగ్రి
సమకూర్చుకొన్నాం ఔనా నేస్తం
కుమ్మరి యింటి నుండి వినాయకుని బొమ్మలు
తట్టలో వ్రత దీక్షతో తెచ్చాం
అమ్మానాన్నలు బిడ్డలకు కొత్త బట్టలు కట్టబెట్టలే
దాని వెతలొంద కుండా

మన సంబరాలు చూస్తూ ఆ బాధను
అరాయించు కొన్నారు ఆనాటి రోజులవి
ఎన్నోఘట్టాలు ఆనాటివి
జ్ఞాపకమున్నాయా నేస్తం
కలవారి యిండ్లలో బొమ్మల కొలువులు
లేనివారి యిండ్లలో ఆ కొలుపులకు
రమ్మని పిలుపులు
లేమి ఎంతున్నా కత్తి, పార, కత్తిపీట
ఆయుధాలకు, పసుపు కుంకుమలు రాసి
దుర్గమ్మను ఆవాహనంచేసి, దశరాత్రులు
దుర్గాష్టమి పూజలను చేసి కొన్నాం
తాతల నాటి కాలంలో దశరా పండుగ
దొరలు (నడిపిన) జరిపిన తీరులను
ముకుందం పిళ్ళై తాత
పూసగుచ్చినట్లు చెపుతూ వుంటే
ఆనందంగా ఊకొట్టాం
దశరాలో విజయదశమిని
అక్షరాభ్యాసపు రోజులుగా భావిస్తారు
బిడ్డల భవిష్యత్తు కోసం
ఒకటి రెండు పుస్తకాలు
నట్టింట్లో పెట్టించి పఠించమని
చెప్పేవారు చెప్పిందే తడవు
చేశాంగదా మనమానాడు నేస్తం
క్రొత్త వ్యాపారం, క్రొత్త ఉద్యోగం
విజయ దశమి రోజు ప్రారంభిస్తే
మూడు పువ్వులారు కాయల వృద్ధి
కాగలవని నమ్మేవారు నగరంవారు
దశరా సెలవుల ముందే క్వార్టర్లీ పరీక్షలు రాసేవాళ్ళం

సెలవుల్లో ఆటవిడుపు పాటలు, పద్యాలు
ఎన్నో రాశాంగద నేస్తం!
నీలం నారాయణస్వామి, మునిరత్నం
శేషాచలం, చలపతి అయ్యోర్లు
శంకరంబాడి సుందరాచారి V.Y.D. కృష్ణమాచారి
పి. కృష్ణారెడ్డి, శ్రీనివాసులు నాయుడు, కోదండరాజు
జి. వెంకటరాజు అయ్యవార్లు
ఎందరో ఎలిమెంటరీ స్కూలు
నుంచి హైస్కూలు చదువులకు తెచ్చారు మనల్ని.
వారంటే మనకెంతో ప్రీతి
ఆనాటి చదువంటే మనకెంతో ఆసక్తి
అమ్మల పండగ వరలక్ష్మీవ్రతం
ఆపైనే దీపావళి టపాసుల పండుగ
కొత్తబట్టలు కట్టుకొని, కోరిన వంటలు చేయించుకొని తింటూ
సావాస గాళ్ళతో తిరుగుతూ
సంబరంగా రెండురోజులు
నిండువేడుకతో జరుపుకొనేవాళ్ళం
గుర్తుందా నేస్తమా?
''కార్తిక మాసాన ఘనతకెక్కేదేదిరా?
కార్తిక మాసాన ఘనత కెక్కెను గంగరా!
వీధి వీధి తిరిగినందుకు
కాసు చిక్కలేదుగాని కష్టమొక్కటి దక్కెరా!''
అది వీరావేశంతో పాడి అడ్డ కత్తులను
ఝుళిపిస్తూ★ ''మదన వేషం'' వేసి
గంగమ్మను కొలుచుట గుర్తుందా నేస్తం
గంగ జాతరప్పుడే ఆరునెలల పరీక్షలు
పరీక్షల భయంతో, జాతర వేడుకలో
పాల్గొన లేక మోకాటి లోతు నీటిలో

అమ్మవెంటో, అన్నవెంటో, అక్కవెంటో
అత్తవెంటో అడుగులేస్తూ
గంగమ్మ గుడికెళ్ళి మంగళవారాలు
పొంగళ్ళుపెట్టి చెంగున ఆడి
బంగారమ్మను కొలిచినాము నేస్తమా!
చివరి మంగళవారం బుధవారాలు
బడికి శెలవులిచ్చినపుడు
నడివీధిలో నిలిచిన బంగారమ్మ ''పందిరి గుడి''కి
పోయి, మొక్కులు చెల్లించాం
జ్ఞాపకంచేసుకో నేస్తమా!
బంగారమ్మను గంగదరికి చేర్చేటపుడు
ఆడుకుంటూ, పాడుకుంటూ
తప్పు మాటలు బూతు పలుకులు
పిల్లల్లాగా పెద్దలు కూడ ఆడుకుంటూ
బండ మాటలు చండాలపు తిట్లు
ఇష్టం వచ్చినట్లు గంగమ్మను కూడా
కలిపేసుకొని కదం త్రొక్కుతూ
పదంపలుకుతూ సాగే ఊరేగింపు
కనుల కింపుగా చెవులకు కంపుగా
ఉండేవి కదూ! ఓనేస్తం!
వైకుంఠ ఏకాదశి మహాపర్వంరోజు
రెండు సినిమాలుచూచి పుత్తూరికో
పళ్ళిపట్టుకోవెళ్ళి రాత్రంతా జాగరణ
చేసే వారలంకదా! మన మిత్రులు కొందరు
ఊళ్లోనే పేకాటలు వగైరాలు ఆడుకుంటూ
స్నేహితులందరు కలసి జాగరణ చేసేవారు
ముకుంద పిళ్ళై లేదా జయచంద్రశాస్త్రో మరెవరో
పురాణ ప్రవచనంచేస్తే కాసేపు గడిపి

సత్సంగంలో సమయం వెచ్చించి
జాగరణ భాగంగా జమకట్టించే
మిత్రులు కొందరు నీకు గుర్తు కొచ్చారా నేస్తం!
ఆ చిన్ననాటి స్నేహితులు
కొత్త కోనేటికట్టపై కూర్చుండి కురియు వెన్నెలతో మురిసి
జలమధ్యాన అందంగా అగపడు చందమామను
జూచి పరవశ మొందాము
త్వరలో రాబోయే సంక్రాంతిని
గురించి ఆలోచిస్తూ భోగిమంటలు
ఎట్లావేయాలో ప్రణాళికలు వేస్తూ
జాగరణ చేసి, ఏకాదశి వ్రతం
నెరవేర్చే వాళ్ళం కదానేస్తమా!
అప్పుడు ఉగాది ప్రాముఖ్యాలను
జనవరి ఒకటి దోచుకోలేదు.
అది ఒక పండుగగా రూపొందలేదు.
ఇప్పుడు పరస్పరం చెప్పుకొనే
కొత్త సంవత్సర శుభాకాంక్షలు
ఇంతటి జోరుగా అప్పుడు మనం
చెప్పుకోలేదే నేస్తం
ఈనాడు దేవుళ్ళు కూడ
జనవరి ఒకటికి ముస్తాబౌతున్నారు.
మనరోజుల్లో జనవరి ఒకటి సీదా
సాదా రోజుగానే సాగి పోయింది కదా!
ఇప్పుడు దీనికున్న ప్రాధాన్యం అప్పుడు లేదు
గనుకనే ఆంగ్ల సంవత్సరాది
మనల్ని అంతగా ఆకట్టుకోలేదు.
పెద్ద పండుగ గురించే అలోచనలన్నీ
ప్రతి సాయంత్రం కుషీగా దోస్తులందరం

చిన్న కనుమ దగ్గరికో, పెద్దకనుమ దగ్గరికో
ఆచ్చారి తోటవైపో, పీనుగల చేనుప్రక్కో
చక్రాలనెట్టుకో, పాశిగుంట వరకో
జీలగల వరకో గాండ్లవాండ్ల బావిదగ్గరికో
నువ్వుల బండవరకోవెళ్ళి
భోగి మండలు ప్రోవుచేసికొని
ఆలమందలతో పాటు ముందు వెనుకలుగా
గోధూళి వేళ కబుర్లు చెప్పుకుంటూ
భోగి మండలను లాక్కొని
ఇంటి పెరటి వైపు చేర్చేవాళ్ళం
మిత్రమా! చెంచమ్మ కొడుకు వెంకటముని
కేసీగాడు, రాగిచెంబోడు, ఇడ్లి కృష్ణుడు,
ఈగోడు, కన్నడు, లచ్చిగాడు
మొండేలమ్మ కొడుకు క్రిష్ణుడు, అక్కారోడు
ఆదికేశవులు, రోశన్న కొడుకు బాలూ
నాగమునెమ్మ కొడుకు దాము
వీళ్ళునాతో పోటీపడి భోగిమంటలకు
సరంజామా సమకూర్చేవారు
వీరంతా మావీధి వారు గనుక
నేస్తం నీకు గుర్తుండక పోవచ్చు
మావీధి చిననాటి నేస్తాలతో
గోలీకాయలు ఆడాను
వేలకువేలు బొత్తాలను పణంగా గెలిచాను
ఆ బొత్తాలను డబ్బాలలో పదిలంగా చూస్తూ
నిక్షేపాల్లాగా రక్షించాను
గోళీకాయలు ఆడేవేళల్లో
వెట్ట మునస్వామి అయ్యవారు వచ్చే అలికిడికి
ఆయన కంటికి కనబడకుండా

దాక్కొన్నాం ఎన్నోసార్లు
వీళ్ళతో బాటే బొంగరాలు ఆడాను
రంగు రంగులవి చేసే సాయి బొకడుండేవాడు.
ఇలాంటి సాయిబులు ఎందరో వుండినారు
ముష్ఠి కొయ్యల బొంగరం, రెప్పాళ్ళ కొయ్యబొంగరం
చాలాగట్టిగా ఉండే వాటిని, చక్రాల చెట్టునుండి కొట్టు కొచ్చిన
ముష్ఠి కొయ్యలతో చేయించిన బొంగరాన్ని తీసికొని
ఎంతోదర్జాగా ఎన్నో ఆటలు ఆడే వాళ్ళం
ఒక్కో ఆటకు ఒక్కో పేరు
ఆ ఆటల పేర్లన్ని నాకిపుడు మతిలోలేవు
ప్రత్యర్థి నాబొంగరంపై కసితో ''గెసికీ'' వేస్తే
ఒంటి మీద బాకుతో గుచ్చినంత బాధ కలిగేది
ప్రతీకార వాంఛతో మరుక్షణమే వారి బొంగరాలను
రెండు దెబ్బలుగా చేస్తేగాని కసి తీరేది కాదు
అది ఆట సరదా నా బొంగరాలకు ఎప్పుడు వడి వేలాచారి
కొలిమిలో తయారైన ములికిలే ఉండేవి.
వాళ్ళందరితో కొన్నిరోజులు చక్రాలు తిప్పుకొంటూ
నగర వీధుల్లో పచార్లు చేశాను
చిన్న చక్రం, పెద్దచక్రం, నడిమిచక్రం
రక రకాల చక్రాలను త్రిప్పడం బాగా అలవాటు పడ్డాను,
శ్రీ కృష్ణుని సుదర్శన చక్రంలా అడ్డంగా కాకుండా
నేల మీద గిర గిరా, పడకుండా
పట్టుకోకుండా పుల్లలతో నడిపాను

వెన్నెల రాత్రులలో, పున్నమి రాత్రులలో
వెన్నెల కుప్పలు ఒక అద్భుత
క్రీడా విశేషం అబ్బాయి, అమ్మాయన్న తేడాలేక
వెన్నెల రాత్రుల్లో గుజ్జాలాటలు ఉప్పర పట్టెలు

తొక్కుడు బిళ్ళలు చిన్నగిరి, పెద్దగిరి ఆటలన్నీ ఆడాం
జిల్లాంగోడి ఆటలో ఎంత పసందు
దాన్ని ''ఇండియన్ క్రికెట్'' అన్నారెవరో
జిల్ల చిన్నది, కోడి పెద్దది.
''ఏకుటాంగీ సత్తరింగి మూలముష్ఠి నాలగోడ
ఐదకోనే, ఆరంకె, చల్ చక్కన గోల్,
ఏభాషా పదాలో ఇవి
ప్రతి ఆటగాడు నిరాటంకంగా రాగయుక్తంగా పలికేవాడు
ఇటుకలు నిలబెట్టి టెన్నిస్ బంతితో
కొట్టడం అదోరకమైన ఆట
గోళీలాటలో ఓడిన వాడు మనవాడైతే
ఉత్త పెనాల్టీ పనిష్మెంట్ చిట్టడం, ముట్టడం వంటివి
కాని వాడైతే డోకడం నాచేత ఓడి
నెత్తురు చిమ్మించుకున్న వారున్నారు.
నన్నోడించి నెత్తురు చుక్కలు కార్పించిన వారు ఉన్నారు.
ఆట అక్కసులు అప్పటి కప్పుడే చెల్లు బాటయి పోయి
ప్రక్కరోజుకి మిగలవు
వానాకాలంలో వీధుల్లో ఆనకట్టలు కట్టి
పడవ ఆటలు ఆడుకున్నాం.
రక రకాల సిగరెట్టు పెట్టెలు, అట్టముక్కలు, అగ్గిపెట్టెలు
పణంగా పెట్టి గోళీకాయలు, బచ్చాలాటలు
ఎన్నో ఆడాంకదా నేస్తం
ఆడిన ఆటల మైకంలో ఎవేవోరాశాను
నేను చెబుతూ ఉండినది భోగిపండుగకు
సమాయత్త పడడం గురించి కదూ
ప్రక్కయిండ్లవారి కంటే, ఎదురింటి వారి కంటే
వెనుకింటివారి కంటె భోగినాటి ఉషః కాలంలో
పెద్దగా, చాలసేపు భోగిమంటలు వేయాలని పోటీపడి భోగి

మండలు ప్రోవులు ప్రోవులుగా, పెరటికి సమకూర్చు కొన్నాంగదా!
అమ్మ మొర్రిపోయిన గోడలను మరమ్మత్తు చేసి
ఇంటి కప్పు క్రింద బూజు దులిపి గోడలకు సున్నంకొట్టించి
నెల రోజులుగా ఇంటిని ముస్తాబు చేయించి
పనికి రాని వస్తువుల్ని పాత చాపలను
బట్టల్ని, చీపురు కట్టెల్ని భోగి మంటల్లో సమిథలుగా
వేయడానికి ఆమెవంతు వాటా యిచ్చేది
అటకపై కెక్కి శుభ్ర పరచే నెపంతో
అజ్ఞానంతో తాత ముత్తాతల నాటి
తాళపత్ర గ్రంథాలను వేరు చేసి ప్రతిభోగికి
కొన్ని ప్రతులను అగ్నిదేవుడి కర్పించాను.
ఎన్ని విలువైన కృతులు భోగిమంటల కాహుతి చేశానో
తలచు కొన్నప్పుడల్లా కనుకొలకుల్లో
నీళ్ళు దొరలు తాయి నేస్తం! మా అవ్వలు చెప్పేవారు
వామన మూర్తి చేత పాతాళానికి
త్రొక్కబడ్డ బలిచక్రవర్తికి తన సామ్రాజ్యమైన భూలోకాన్ని
దర్శించడానికి ఏటేటా నాలుగురోజులు కేటాయించారట
విష్ణుమూర్తి ఆనాల్గు రోజులే ఈభోగి సంక్రాంతి.
కనుమ, పశువుల పండుగలట
భోగిపండుగ ముందురోజు గడుగ్గాయి అబ్బాయిలు
నాల్గువీధుల కూడలిలో నభోవీధికి మంటలు ఎగబ్రాకాలని
పెద్ద పెద్ద ''తుండులు'' కట్టె పుల్లలు సేకరించి మంటలు వేస్తారు.

ఏమరిన వారి యింటి తలుపులు దూలాలు
తడికలు కొయ్యవస్తువులు చేతికి చిక్కిన వన్నీ
పట్టుకుపోయి కనుసన్న కాలంలో భోగిలోకి చేర్చేవారు, కొయ్యసామగ్రి
లాక్కు పోయేప్పుడు కనుగొన్న యింటి యజమాని
శాపనార్థాలు తారస్థాయికి అందుకొన్నా పెడచెవిని పెట్టేవారు.

వారిలక్ష్యానికి పగ్గాలు లేవు, వారిసాహసానికి బంధాలు లేవు
నడివీధిన భోగి ఒక అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది.
ఇండ్లలో భోగిమంటలు వేయడంలో నిమగ్నమైన నేను
నడివీధిలోని భోగిలో పాలుపంచుకోలేదేనాడు. భోగి మండలు బూడిద
కాగా తలంటి స్నానాలు అమ్మ చేయించి
దోసె, కుర్మా, టిఫిను ఎవరి నియమాను సారమో, విధిగాజేసి
వేడి వేడి దోశెల్తో రుచులూరే కుర్మాలు ఆరగించి
తిరిగే వాళ్ళం ఆడుకొనేందుకు
నాన్న కేక లేసినా లెక్క చేయక
గాండ్ల మిట్టకో మండపం వద్దకో
హైస్కూల్ ప్రాంగణానికో వెళ్ళేవాళ్ళం
పండుగ ప్రత్యేకత కని ★ పెద్దబ్బ, చిన్నబ్బలు
(కీ.శే. R.B. సుదర్శనవర్మగారి కుమారులు.)

బ్యాట్మెంటు మ్యాచ్ ఏర్పాటు చేసే వుంటారు
ఒకసారి కలసి ఆడేవాణ్ణి లేకుంటె
ఆటచూసి ఆనందించేవాణ్ణి
సంక్రాంతిరోజు ఉదయం పదకొండు గంటల సమయాన
అయ్యవారు వచ్చి పూజచేయించ
సంసిద్ధమైనపుడు మానాన్నగారు తండ్రి
తాత, ముత్తాతలకు పెద్దల రూపాలు
పితృమూర్తులకు పూజాదికాలు
మంత్ర సమేతంగా నిర్వహించేవారు.
ఆ పవిత్ర సందర్భంలో
కావలసిన సామగ్రి అందించే వాణ్ణి
తమ్మునితోపాటు ప్రతి అమావాస్యకు చేసినట్లు
సంక్రాంతిరోజు మరీ విశేషంగా

ఈ పితృ సంస్కరణ కార్యం సాగేది
కొనసాగుతూవుంది ఈనాటికి
పితృదేవతలు ప్రతి అమావాస్యకు,
సంక్రాంతికి మాత్రం షడ్రసోపేతమైన
భోజనాలు చేస్తారట అందుకే పిండివంటలు
పాయసాన్నాలు, పంచామృతాలు
చేసి ఆకుల్లో వాటిని వడ్డించి
పితృదేవతల్ని పిలిచి ఆరగించండని
వేడి కోలుగా అడుగుతాం ఇది మన కార్వేటినగర
జన జీవన స్రవంతిలో సంక్రాంతి
ఎంత ప్రాముఖ్యాన్ని సంపాదించు కుందో!
సంకురాతిరి సంబరాల్లో మరో ముఖ్యవిషయం
కార్తీకం చివర్లో, మార్గశీర్షం మొదట్లో
ఆడపిల్లలు గొబ్బి పాటలు పాడి ఆడేవారు
నలుగురైదుగు రమ్మాయిలు గుములు గూడి
ప్రతిరోజు సాయంత్రాల్లో
దరిదాపుల నున్న ఇంటి ముంగిట్లో
వాకిట మధ్యలో పేడనీళ్ళు చల్లి ముగ్గులు పెట్టినచోట
గొబ్బెమ్మను పెట్టి గురుగు పూలు, తంగేడుపూలు
మాలలు చుట్టి వలయాకారంగా తిరుగుతూ
లోపల కోసారి వెలుపల కోసారి
చప్పట్లు తట్టుతూ పాడితే పాడిన ప్రతియింట
★అణా నో అర్ధణా నో వేసేవారు
★ అప్పటికింకా నయాపైసలు రాలేదు.
కొందరు దోసిలినిండా బియ్యం కూడా వేసేవారు
అక్క, ఆమె సఖీబృందము
చేరదేసి కళ్ళతో వాటిని స్వీకరించి

గుజ్జన గూళ్ళువండి అందరికి పంచిపెడుతూవుంటే
వారికి అండగా నేనుండి సహకరించిన తీరు
చిన్నగుండెకు చేదోడుగ ఉండటం నేర్పించింది నేస్తం
పెద్ద పండగ నాటి, మిగిలిన ఫలాహారాలు
కనుమనాడు చలిది అన్నంతో ఆరగించాం
నేను, అక్క, చెల్లెలు, తమ్ముడు వరుసగ
బాసిక పట్టు వేసి కూర్చుంటే
దోసిళ్ళ నిండా అన్నం పప్పు కూరలు అమ్మవడ్డించేది
పంచ భక్ష్య పరమాన్నంలాగా
దోసిలి భోజనం భుజించాం.
సంక్రాంతికి చేసిన వంటకాలను వృధా చేయకూడదని
పారవేయరాదని మరెవ్వరికి ఇచ్చివేయరాదని
అట్లాచేస్తే పితృదేవతలకి అపచారం చేసినట్లు
అని అవ్వలు అంబుజమ్మ, తాయారమ్మ, సాలమ్మలు చెబితే
అది అక్షరాల నిజమని నాన్న బలపరిచేవారు.
అందుచేత అమ్మమాచేత తినిపించేది మాకవి రుచించేవి.
చలిది ఆరగించాకే పశువుల పండగ జరిగే తీరు
తెన్నులు గమనించేవారం కదా!
సావాస గాళ్ళం అంతా వూరంతా తిరిగొచ్చే వారం
పక్కింటి పార్వతమ్మ మొగుడు గంగన్న కుమారుడు
నాదముని సాయంతో ఎద్దులకు స్నానం చేయించి,
కొమ్ములకు రంగులు వేయించి, మువ్వగంటలు కట్టి,
అలంకరించిన తీరులన్ని పరికించి, ఇల్లుచేరి
నగరాన స్వేచ్ఛగా మేసే అప్పటెద్దును
పెద్ద బసవెద్దును తేరిపారజూచి బండోడిని చూచి
తూర్పు వీధిన రైతుల ముంగిళ్ళలో
ఎద్దుల అలంకరణలు అన్నిటిపై కనులప్పగించి చూచేవాళ్ళం నేస్తం
అన్నాలు తిని గొబ్బిపాటలు పాడు

అక్కా, చెలియల వెంట అండగావెళ్ళగా
ముగిసెను నలభైరోజుల గొబ్బి వ్రతాలు
అతి ముఖ్యమైనవి, ఆఖరి రోజని
తిరగవలసిన వీధులు తిరిగి తిరిగి
వెళ్ళవలసిన ఇళ్ళకు వెళ్ళి తట్టి
దొరికిన బియ్యాన్ని చేరిన సొమ్ముల్ని
లెక్కలు జమకట్టి సమంగా పంచుకొని
కనుమ కార్యక్రమాల్ని ముచ్చటించుకొని
అన్నాలు తిని హాయిగా పడుకున్నాం
చలి బాధకు వెచ్చటి కుంపటి వేసేవారు మా అవ్వలు.
ఆ కుంపటి వేడియేనాకు వెచ్చటి, స్వెట్టరు
అదే మఫ్లరు, అదే ఉన్ని దుప్పటి (వార్మ్ క్లోతింగ్) అన్నమాటే
తెలియక మన బాల్యం గడచింది
కనుమ పండగ గొబ్బి తట్టిన
ఆడపిల్లలకు విశేషమైన వేడుక
కొందరు అమ్మాయిలు ఆలత్తూరుకి వెళ్ళి
కొండచుట్టు పండగ చేసి కొనడానికి వెళితే
మరికొందరు ఊళ్ళోనే, ఇంటి వాకిళ్ళ లోనే
పండగ చేసికొనే వారం
మా అక్కయ్య ఎప్పుడూ అలత్తూరు వెళ్ళలేదు
నేస్తాల్తో కలసి వాకిట్లో సున్నం కొట్టి
ఎఱ్ఱమట్టితో అంచులు కట్టి
బాగా అలికి ముగ్గులు మురియబడిన బొమ్మరింటిలో
చిన్నచిన్న కుండలు, పిడతలు పెట్టి
గొబ్బి బియ్యంతో గొబ్బి కాసులను ఖర్చుపెట్టి
బుజ్జి పొయ్యి మీద బువ్వ వండించి, తీపి వంటలు చేసి
ఆనాటి సాయంత్రం చిట్టి చిట్టి ఆకుల్లో పెట్టి
గుజ్జన గూళ్ళను తిని కబుర్లు చెప్పుకొని

ఇంకా ఏదైనా పైకం మిగిలింది సమానంగా పంచుకొని
ఆ ఏటి సంకురాతిరి పండుగకు వందన సమర్పణ చేసేవాళ్ళం
నాల్గురోజుల పెద్ద పండగ ప్రతిఏట హాయిగాగడిపేవాళ్ళం
పండుగ అప్పుడే వెళ్ళి పోయిందే అని
దిగాలు పడిన నాకు తాయారమ్మ అవ్వ
త్వరలో రథసప్తమీ, శివరాత్రి
పండుగలు వస్తాయిగదా! బాబూ! అని సముదాయించేది
శివరాత్రి అదొక అద్భుతమైన
అనుభూతినిచ్చే పర్వం
సమవయస్కులు, సహృదయులు, సావాసగాళ్ళు
పదిమందో పదిహేను మందో అర్ధరూపాయ చందా వేసుకొని
అలసందులు, ఉలవలు కొని
గుగ్గిళ్ళు చేయడానికి పథకాలు పన్ని
రాత్రి ఎనిమిది గంటలకో ఆతర్వాతనో
ఊరి వెలుపల ఒక గుడిలోనో
ఆఫీసు ప్రాంగణంలోనో, క్రొత్త కోనేటి వద్ద
రావి చెట్టు చెంతనో కాసాతోట బంగళా వద్దనోచేరి
మాలో పెద్దలైన వారు చతుర్ముఖ పారాయణం
ప్రారంభిస్తే చిన్నవాళ్ళం మనము వారిచుట్టూ
కూర్చొని వేడుక చూస్తూ, వేడివేడి గుగ్గిళ్ళు
ఆడేవారికి యిస్తూ మనమూ తింటూ జాగారం చేసేవాళ్ళం
మనవూళ్ళో అప్పట్లో సినిమాటెంట్లు లేవు కదూ!
ఏదో ఒక వీధిలో హరికథా కాలక్షేపం ఏర్పాటైతే
కాసేపు అక్కడ కూర్చొని మళ్ళీ
మా బృందం వద్దకు వెళ్ళే వాళ్ళం
ఇట్లారాత్రంతా నిద్రమాని జాగారం చేయడానికి నాన్న
సమ్మతించే వారు కాదు. అమ్మ అనుమతి పొంది
చడీ చప్పుడు కాకుండా జాగారం బృందంలోకి

మెల్లగా జారుకొనే వారం
ఒక శివరాత్రి రోజు కొప్పేటి లోకనాథం, శేషపిళ్ళై
కొడుకు జనార్ధనం, ఇరగం గురుస్వామి
ఈచంబాడి రామలింగారెడ్డి, కరణం మునిసుబ్రహ్మణ్యపిళ్ళై వీళ్ళందరితో
గడపిన స్మృతులు ఇప్పటికి పచ్చగా
మనఃక్షేత్రం మీద నిలిచి ఉన్నాయి నేస్తమా!
శివరాత్రిలాగే అనేక సార్లు
డిసెంబరు నెలలో వచ్చే
వైకుంఠ ఏకాదశి రాత్రులు కూడ గడిపే వాళ్ళం
రథసప్తమినాడు సెలవుండేది
ఆ రోజుల్లో పండగలో ప్రాముఖ్యం
ఉదయంలేస్తూనే ఇంటి దరిదాపుల్లో
ననుగానక అమ్మ బాలగుంట గుట్టలోనో
పీనుగ చేనుల్లోనో వెదికించి నన్ను పట్టేది
పట్టితెచ్చి జిల్లేడాకులు కోసుకొని వచ్చి
ఆకులపై అక్షింతలు పెట్టి తలంటుస్నానం అమ్మచేయించేది
సూర్యుడు ఏడు గుఱ్ఱాలు కట్టిన రథంలో పయనిస్తూ
దక్షిణ ముఖంనుండి ఉత్తర ముఖంగా ప్రయాణం
ప్రారంభించే ఘడియలో సూర్యనమస్కారాలు చేస్తే
ఆరోగ్యానికి మంచిదని నాన్నమ్మలు చెపితే
తు.చ. తప్పకుండ పాటించి అమ్మరథసప్తమి చేసేది.
స్నేహితులతో కలసి పండుగ చేసే ఛాన్సు ఇందులోలేదు
త్వరగా వచ్చే ఉగాది పైనే మన చూపంతా!

(1) ప్రభవ, (2) విభవ, (3) శుక్ల, (4) ప్రమోదూత, (5) ప్రజోత్పత్తి, (6) అంగీరస, (7) శ్రీముఖ, (8) భావ, (9) యువ, (10) ధాతు, (11) ఈశ్వర, (12) బహుధాన్య, (13) ప్రమాది, (14) విక్రమ, (15) విసు, (16) చిత్రభాను, (17) స్వభాను, (18) తారణ, (19) పార్థివ, (20) వ్యయ, (21) సర్వజిత్తు,

(22) సర్వధారి, (23) విరోధి, (24) వికృతి, (25) ఖర, (26) నందన, (27) విజయ, (28) జయ, (29) మన్మథ, (30) దుర్ముఖి, (31) హేవిళంబ, (32) విళంబి, (33) వికారి, (34) శార్వరి, (35) ప్లవ, (36) శుభకృతు, (37) శోభకృతు, (38) క్రోధి, (39) విశ్వావసు, (40) పరాభవ, (41) ప్లవంగ, (42) కీలక, (43) సౌమ్య, (44) సాధారణ, (45) విరోధి కృత్, (46) పరీధావి, (47) ప్రమాదీచ, (48) ఆనంద, (49) రాక్షస, (50) నళ, (51) పింగళ, (52) కాళయుక్తి, (53) సిద్ధార్థి, (54) రౌద్రి, (55) దుర్మతి, (56) దుందుభి, (57) రుధిరోద్గారి, (58) రక్తాక్షి, (59) క్రోధన, (60) అక్షయ వరకు అన్ని నామాలు ముసలిగారి మునిరత్నం అయ్యవారు, కాను కృష్ణమరాజు, చేజర్ల గురువ రాజు, చలపతి నాయుడు అయ్యవారు నాచేత కంఠస్థం చేయించి అప్పగింపచేశారు. అందువల్ల ఉగాది వస్తుందంటే ఫలానా నామ సంవత్సరం వెళ్ళి ఫలానా నామ సంవత్సరం వస్తుందని చెప్పేసే వాళ్ళం. మానాన్న తప్పని సరిగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి పంచాంగం కొని తెచ్చేవారు. తాతగారు ముకుందం దైవజ్ఞులు. వారి వద్ద 60 సంవత్సరాల పంచాంగాలు భద్రంగా ఉన్నాయని అందరూ అనుకొనేవారు. అందువల్లే నాపుట్టిన రోజు వివరంగూడ పాతపంచాంగంలో ముకుందం పిళ్ళ తాతగారు రాసిపెట్టి నందువల్లే తెలిసింది. మానాన్న గారికి జాతకాలపై పెద్ద జాగరూకతలేదు. అందువల్లే నాపుట్టిన రోజు అసలైంది. నిన్న మొన్నటి వరకు తెలియనేలేదు.

ఉగాది రోజు సూర్యోదయానికి ముందే తలంటు స్నానాల తర్వాత వేడి వేడిగా దోసెలు కుర్మా తినడం ఆనవాయితి ఉదయం పది గంటలకు వేపపచ్చడి తినడం మధ్యాహ్నం సుష్ఠుగా భోంచేసి బాలగుంట మిట్టమీద కోడి పందాలు చూడ్డం ★''బులాంపు'' లాటలు ఆడటమో ★గోలీకాయలతో ఒక ఆట చేసేవాళ్ళం గుర్తుందా నేస్తం సాయంత్రాన ఒక్కసారి ఆమ్నాయ నిలయానికి వెళ్ళి పెద్దబ్బ, చిన్నబ్బల నేతృత్వంలో జరిగే Badminton ఆటలు ఆడేవాళ్ళం. బాడ్మింటన్ అంటే గుర్తుకొస్తుంది.

పెద్దబ్బ వాళ్ళబావ ఆనగొంది వారు, శ్రీతిరుమలరాజుగారు, రాజ బంధువులలో మరికొందరు, ఈసం బలరాంగారు బ్యేడ్మింటన్ బాగా ఆడేవారు.

డాక్టర్ నాగరాజన్ కూడ చక్కగా ఆడేవారు అవతల కోర్టులో పైసా పడవేసి గురి చూచి బంతి ద్వారా పైసాను కొట్టేవారట తిరుమల రాజు, ఈ చాతుర్యం ఒక విశేషంగా ఊళ్ళోవాళ్ళు చెప్పు కొంటుంటే విని అబ్బుర పడే వాళ్ళం.

ఆమ్నాయ నిలయంలో ఆడుతూ ఉంటే ఆటలను చూచి ఆనందించే వాళ్ళం ఒక్కొక్కసారి అవకాశం వస్తే ఒక అదృష్టంగా భావించి ఆ అనుభూతిని పంచుకొనే వాళ్ళం ఆ సందర్భాల్లో నానేస్తాల పరిధి విస్తరించింది.

బొంగరాలకు, గోళీకాయలకు, ఉప్పర పట్టెలకు పరిమితమైన మావీధి మిత్రులకు పడమటి వీధికి ముడివడి ఉండిన స్నేహితాలు విస్తరిల్లాయి.

నరసింహ రాజుతో ఒకటవ తరగతి నుండి చదువు ఉండినా అది పరిచయంగానే ఉంటూ ఉండేది.

మెల్లగా గట్టి అనుబంధం రూపొందడం ఆరంభించింది.

ఆమ్నాయ నిలయం క్రీడాకలాపాలతోనే ఈనాటి కబాడీని ఆనాడు బలిగుడు, చెడుగుడు అని వ్యవహరించే వారు.

నరసింహరాజు ''గుడుగుడు'' అని చాల సేపు గుక్క పట్టేవాడు ఎదుటి వాళ్ళు Catch చేసి కొంతసేపు పట్టి పెట్టినా పీక నొక్కినా ఎక్కడో బావిలోని కూతలాగ ''గుడుగుడు'' అంటూ తప్పించుకొని పట్టీని స్పృశించేందుకు యాతన పడేవాడు. నేనెప్పుడూ మరచి పోలేను చెడుగుడు ఆడినరోజులు మాకందరికి మోకాళ్ళు, మోచేతుల వద్ద భుజాల మీద, కాళ్ళమీద, ముఖంమీద గాయాలే ఒక చిన్నగాయం తగిలి ఒకబొట్టు నెత్తురు వస్తే వెంటనే A.T.S. వేసుకోవలెనని ఆరాట పడేవాళ్ళంకాము. అమ్మా నాన్నలకు కూడా ఒంటిమీద తగిలిన గాయాల సంగతి తెలిపే వాళ్ళముగాము ఇప్పుడు పిల్లాడికి చిన్నగాయంతగిలితే ఎంత హంగామా చేస్తున్నాం మనం తలచు కుంటే ఆరోజులు ఎంత అమాయకపు రోజులో అనిపిస్తుంది ప్రకృతి చైతన్యంలో ఒక భాగంగా గడచిన నాటి జీవితాలు సాగి పోయాయిగదూ మాణిక్యం ఉగాది నుండి సాయంత్రాలు బాగా నిడివి కావడం ఆరంభిస్తాయి మామిడి తోటల్లో మామిడి పిందెలు రాలడం ఆరంభమౌతాయి మా యిళ్ళల్లో పిందెమామిడిని దబ్బలుగా కోసి ఉప్పులో నానవేసి, అన్నంతింటూ

మామిడి దబ్బలను సంజుకోవడం ఒక విశేషం నాన్నగారికి వేసవిలో ప్రతిరోజు ఇట్లాతినడం అలవాటు, అభిలాష అంటుమామిడి పిందెలు ''బెంగుళూరు'' మామిడి కాయల పిందెలు దబ్బలుగా చేస్తే అట్లాతినడానికి బాగుంటాయి.

అన్ని ఊళ్ళలో లాగా మన ఊళ్ళోనూ కానగ చెట్లు ఉగాదికి చిగురిస్తాయి ఆ చివురించిన కానగ చెట్లు చూడ్డానికి ఎంతో అందంగా లేత పచ్చ తొడుగులను వేసికొని'' ఉత్సాహవంతంగా ఉంటే మనలోనూ ఉత్సాహం ప్రతిబింబించేది. అందు వల్లే ఉగాదిని గురించిన పద్యాలు రాస్తూ కోయిల కూతలను వింటూ స్కూల్లో పాఠాలు చదువుకొన్నాము చిరు వేసవి రోజుల్లో

''నిన్న కృశించి దైన్యముగ''
నీరసమై తలవాల్చి తోటలో
నున్న తమాల పాదపము
లుచ్చదశనం నను బల్కరింప హ
ర్షోన్నతి చూపుచున్నవవి
గో తదనంత మహాప్రహర్షం సం
పన్నత జూడ నా యెదద
పైననలెత్తును కోటి కోరికల్'' అని వ్రాసుకొన్నాను.

''కానగ చెట్ల వైభవము గాంచవలెన్ మధుమాసమందు'' అని చెప్పాను. ఉగాది వెళ్ళిన తర్వాత సంవత్సరాంత పరీక్షల గురించి పట్టించు కోవలె. ఏప్రిల్ నెల పరీక్షల నెల ఆటపాటలు కట్టి పెట్టి 'అక్కరగా' పాఠాలు చదివి ప్యాసయి పైక్లాసుకెళ్ళే ఆశతో చదువుకోను అరంభించే వాళ్ళం. బుడ్డి దీపాలు వెలిగించుకొని రాత్రిళ్ళు చదువుకొనే వాళ్ళం. బ్రహ్మ ముహూర్తంలో లేచి చదివితే బాగా ఒంట బడుతుందని 'అవ్వవాళ్ళు' చెప్పేవారు వారి సూచనలను అనుసరించి తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిదుర లేపమని అమ్మతో చెప్పితే అమ్మ అట్లాగానే లేపితే బుడ్డీదీపం వెలిగించుకొని గంటో, గంటన్నర కాలమో పాఠాలు చదివే వాళ్ళం. ఏప్రిల్ చివర పరీక్షలు కొశ్చన్ పేపర్సును ముందుగానే తెలుసుకో వచ్చన్న భావనగానీ ఫలితాలను మ్యానుపులేట్ చేయడానికి వీలున్నదన్న భావనగాని మాకెవ్వరికీ రాలేదు.

మాతల్లిదండ్రులకు రాలేదు. నీలం నారాయణస్వామి అయ్యవారు నోటిసు బోర్డులో ఫలితాల కాగితం అంటించే వరకు మాకు ఫలితాలు తెలియవు. ప్రకటించిన తర్వాత అది శిలా శాసనంగా, సుప్రీం కోర్టు జడ్జి మెంటులాగా ఆమోదించ బడేది. కొశ్చన్ పేపరు లీకు అన్నమాట క్లాసులో పాఠాలు బోరు కొడుతున్నాయన్నమాట. రీవాల్యువేషన్ అన్నమాటలు ఇవన్ని కళాశాల చదువులు ప్రారంభించిన నాటినుండి. పరిచయమైన పదజాలం ఫెయిలు అయినవాడు వెంటనే పాసు అవడంగానీ పాసు అయినవాడు ఫెయిల్ కావడంగాని, తక్కువ మార్కులు వచ్చేవానికి ఎక్కువ మార్కులు రావడంగాని, తద్విపర్యయంగాని చాల అరుదుగా జరిగేది. అసలు జరిగేదేకాదు అప్పట్లో.

అందువలన ఆ ఉపాధ్యాయుల జడ్జిమెంటుకు సాధారణంగా తిరుగులేదు. ఏప్రిల్లో Sports Games పోటీలు S. రాధాకృష్ణన్ మాస్కూలు ఛాంపియన్ స్వత స్పిద్ధంగా ఆయనలో కొన్ని కుశలతలు ఉండటం రూమీ సాహెబ్ కనిపెట్టాడు. అతనికి మంచి ప్రోత్సాహ మిచ్చాడు ''హై జంప్'', లాంగ్ జంప్'' ''పోల్వాల్ట్'' మొదలైన స్పోర్ట్సులో రాధాకృష్ణన్ మంచి చాతుర్యాన్ని ప్రదర్శించేవాడు.

డిస్ట్రిక్ స్పోర్ట్స్‌లో పేరు ప్రతిష్ఠలు సంపాదించాడు. స్కూలు మేగజైనులో ఆయన ఫోటోకూడా పడ్డది. చెడుగుడు ఆటలు పోటీలుగా పెడితే సదాశివరాజు, దీన దయాళులు ఎక్కడుంటే అక్కడే గెలుపు. సదా శివరాజు బాగా ఆట నాణ్యత తెలిసినవాడు. దీనదయాళుని ఎవరు అటకాయించలేరు. అంత అనర్గళంగా చెడుగుడు ఆటను ఆడేవారు. దీనదయాళు సదాశివరాజు వీరిరువురు ఈ ఆటలో మాకు ఆదర్శ ప్రాయులు. చిన్నప్పుడు మొరటుగా ఆడేవాళ్ళం. హైస్కూలుకు వచ్చాక ఆ ఆటలో నాణ్యత, శాస్త్రనిబద్ధత సమకూరింది. ఆటలు, పరీక్షలు వీటి సందట్లో ఏప్రిల్ కు వీడ్కోలిచ్చి మేనెలలో అడుగుపెట్టేవాళ్ళం. మే ఒకటి నుండి ముప్పయి ఒకటి వరకు ఎలిమెంటరీ పాఠశాలలకు సెలవు. చుట్టు ప్రక్కల అనేక గ్రామాలలో టీచర్లు ఉద్యోగాలు చేసే వాళ్ళలో చాలమంది ''నగరం వాళ్ళే''. అందరు గూటికి చేరిన పక్షుల్లాగా మే ఒకటవ తేదీ నగరం విచ్చేసే వాళ్ళు. వీరి రాకతో నగరానికి ఒక కొత్త కళ. ప్రతి సాయంత్రం ద్రౌపదమ్మ గుడి ముంగిట్లోనో హైస్కూలు వాకిట్లోనో వాలీబాల్, బేడ్మింటన్ క్రీడలు జరిగేవి. అందుకే మాకు వేసవి

సెలవులంటే మహాసరదా. ఎండ వేడిమి గురించి, ఉష్ణోగ్రత పరిమాణాలను గురించి మాకేమీ తెలియవు. చిన్నప్పుడు అక్కా, నేను దగ్గరగానున్న మైదానాలకు వెళ్ళి సబ్జాగింజలు తెచ్చి చక్కెర నీళ్ళతో షర్బత్ చేసికొనే వాళ్ళం. అక్క వాళ్ళతో కలిపి చింతగింజలు తెచ్చి గుజ్జూల ఆట ఆడేవాళ్ళం అచ్చన గాయలు ఆడేవాళ్ళం. దాయాలు ఆడే వాళ్ళం. గుంత పలకలతో ఆడుకొనే వాళ్ళం. వెన్నెల వేళల్లో వెన్నెల కుప్పలు, ఉప్పర పట్టెలు విశేషంగా మమ్మల్ని ఆకర్షించేవి. వాకిట్లో పడుకొని ఆకాశంలో చుక్కల్ని లెక్కపెట్టే పనికి ఉపక్రమించి చేయలేక పోయి చింతించాము.

సందె వేళల్లో ఇంటి వెనకాలనున్న పెద్ద చింత చెట్ల మీదికి ఉల్లాసంగా చేరే కాకులను చూస్తూ కాలక్షేపం చెయ్యడం అమ్మనడిగి ''చిట్టి ఉడుకునీళ్ళు'' త్రాగడం కాఫీ, టీల కాలం కాదది మాకు. ఇవి ఆనాటి స్మృతులు, సరదాలలో కొన్ని హైస్కూలు రోజుల నాటి మే నెలల గురించి చెబుతూ ఎలిమెంటరీ మేనెలలోకి వెళ్ళి పోయాను గదా! మాణిక్యం వాలీ బాల్ ఆటలో మన వీరులు ఎందరో మంచి హిట్టరు రాధాకృష్ణను అనుకొంటే బలరాం, సదాశివరాజు మంచి లిఫ్టర్సు గాడీ కిట్టమ్మ, లక్ష్మణరాజు, అజీజ్, ధనంజయులు, రాజరత్నం, ఉల్లాం లక్ష్మయ్య మొదలైన వాళ్ళు మంచి సెంట్రల్ ఆటగాళ్ళు. వడ్డె వెంకటేశం, ఈచంబాడి సుబ్రమణ్యంరెడ్డి అరిగి కృష్ణారెడ్డి బంకు (పడదలం) మునస్వామి వీళ్లు చాలాబాగా సర్వీసు చేస్తారని పేరు.

ఆ రోజుల్లో Rotation పద్ధతి లేదు. లిఫ్టరు ఎప్పుడూ లిఫ్టరే, సెంటర్ ఎప్పుడూ సెంటరే, సర్వర్ ఎప్పుడూ సర్వరే, రాయల్ చెఱవు రామమూర్తి రూరల్ డెవలప్ మెంటు ఖాదీ గ్రామోద్యోగ శాఖలో ఉద్యోగం చేస్తూ ఉండి అప్పుడప్పుడు నగరం వచ్చేవారు. ఆయన మేనెల్లో వస్తే మాకంతా సరదా వాలీబాల్ అన్ని Position లలో నైపుణ్యంతో ఆడేవాడాయన స్వయంకృషితో పైకి వచ్చిన వారిలో ఆయన్ని, రాజరత్నం గారని పేర్కొనేవారు మన ఊరివారు. రాజరత్నం ప్రస్తావన వచ్చింది గనుక ఆయన విలక్షణమైన వ్యక్తిత్వం గుఱించి చెబుతా. తండ్రితో విభేదించి స్వతంత్ర పోరాటంలో చేరాడు. వార్ధాకు వెళ్ళి గాంధీని కలిశాడు. శాంతి నికేతనం వెళ్ళినాడు హిందీ పండితుడైనాడు Hand made paper చేశాడు. జాతీయవ్రతం ప్రారంభించాడు.

మాకు హిందీ పాఠాల్లో ప్రవేశం, ఆసక్తి కల్పించి ఎన్నో అంశాలు బోధించాడు. ఆయన ఒక మంచి టీచరే కాదు,వాక్చాతుర్యం కలిగిన వక్త. మే నెలలో అప్పుడప్పుడు వడగండ్ల వాన మధ్యాహ్నంలో కురిస్తే ఆ సాయంత్రం ఆటలకు భంగం వాటిల్లేది. మాకు ఎంతో కష్టం కలిగేది మేనెల 1 నుంచి 31 వరకు ప్రతిరోజు సరదాగా గడిపేవాళ్ళం.

బీద విద్యార్థుల సహాయార్థం మనం అభ్యుదయ నాట్యమండలిని స్థాపించి విరాళాలు ప్రోగుచేసి ఒకవైపు కళారాధన, మరోవైపు సంఘసేవ ఇంకోవైపు యువజన చైతన్యం ఇన్నిటిని కొనసాగించాం. అభ్యుదయ నాట్యమండలికి నువ్వు చేసిన సేవ అమూల్యంమాణిక్యం ★G.B.S., ధర్మారావు, శంకరయ్యల (హైస్కూలులో మాకు టీచర్లు) రాకవల్ల మన కళా జీవనానికి ఒక స్ఫూర్తి చేకూరింది కదూ! మన తరంవారు వీరిని ఎన్నటికి మఱచి పోలేరు.

పినిశెట్టి ఆత్రేయ కొప్పరపు సుబ్బారావు నాటకాలు, భమిడిపాటి రాధాకృష్ణవి ఎన్నెన్నో ప్రదర్శించాము. అభ్యుదయ నాట్యమండలి జ్ఞాపకాలు కోకొల్లలు ఓ. సుబ్రమణ్యం గారి గంధర్వగానము వారి నటనా కౌశలం, దర్శకత్వాలు మోహన రాజు, జగదాభి బాల సుబ్రమణ్యంరాజు, కుప్పసామి, ముని కన్నప్ప, అరుణాచలం (రెడ్డి) ప్రభృతులు పాల్గొనడాలుఎన్ని విశేషాలు! ఎన్ని సన్నివేశాలు!! నాటకం ఆడించడం ఒక పండుగగా మనం జరుపుకొన్నాం ప్రతివేసవిలో అది ఒక నవ్యమైన, భవ్యమైన అనుభూతి. మన బాల్య మిత్రుల నందరిని ఒక చోటికి చేర్చిన అభ్యుదయ నాట్యమండలి ఆవిర్భావం మహత్తరమైన సంఘటనే మాణిక్యం. ఉగాది తర్వాత శ్రీరామనవమి ఘనంగా చేసికొనే వారం కదూ! ఉగాది వెళ్ళిన తొమ్మిదవరోజే శ్రీరామ నవమి ఈ నవమికి నగరానికి గొప్ప అనుబంధం తెలుగువారి ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుడు వీధి వీధినా వెలసిన దేవుడు 'కోదండరాముడు' శివాలయం వీధిలో, రాజబంధువుల వీధిలో సంపర్తి వీధిలో, వేణుగోపాల విభుని కోవెలలో వెలసిన నాడు పడమటవీధి భజన మందిరపు రాముడ్ని సంవత్సరాద్యంతం ఆరాధించే వాళ్లం భక్త కోటికి కొంగు బంగారంగా అమరిన వాడు ఆ కోదండ రాముడు.

సంస్థానం సిరిసంపదలతో వర్ధిల్లిన రోజుల్లో ముకుంద పిళ్ళె తాతయ్య భజన గుడి వైభవాన్ని ఆవేశంతో చెప్పినప్పుడు తనువులు పులకలెత్తగా విని ఓహో! అని, ఆహా! యని, ఆహా యని పరవశించినాం మాణిక్యం. వడపప్పు, పానకం, గుగ్గిళ్ళు, పొంగలి, చెక్కెర పొంగలి మినప వడలు పంచామృతాలు, ఎన్నెన్ని ప్రసాద విశేషాలో ఉభయదార్ల ఔదార్యానికి ప్రదర్శనంగా, నిదర్శనంగా వినియోగం జరిగేది. మన భజన గుడి అంటూనే మనకందరికి జ్ఞాపకానికి వచ్చే ఒక మహనీయుడు వెట్టమునస్వామి. ఆయన మామూలు మాటల్లో చెప్పాలంటే ఒక స్కూలు ప్యూను కాని ఆయన హృదయం గగన మంత గంభీరం, వ్యక్తిత్వం ఏనుగంత ఎత్తు. బహుశః యావద్భారత దేశంలోనే అతడొక విలక్షణమైన వ్యక్తి అనడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. శ్రీరాముని భక్తుడైన హనుమంతుడు ''యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృత మస్తకాంజలిం బాష్పవారి పరిపూర్ణలోచనం.'' అలాగే నగరంలో ఎక్కడ రఘునాథుని సంకీర్తన ఉంటుందో అక్కడ వెట్టమునస్వామి హాజరు ''కృతాంజలి మస్తకంతో'' ముకుందపిళ్ళె గారి ఇంటి అరుగు మీద రామాయణ కథా కాలక్షేపం ఉంటే అక్కడ ఉంటాడు వెట్టమునస్వామి. ప్రతిరోజు నిష్టగా స్నానాదికములు సల్పి రాముని స్తుతించి కష్టాలను మూటగట్టి అటకపై ఉంచి ఉద్యోగంలో తలమునకలై పోయేవాడు. ఆయన అసలు పేరు చింతల మునస్వామి వెట్ట మునస్వామి. నామధేయం ఆయన ఎట్లా పొందాడో నీకేమన్నా తెలుసునా మాణిక్యం? ముకుందపిళ్ళె ఆయన్ని ఓరేయ్ వెట్ట! అని ఎక్కడ వెట్టడు? అని సరసాలకు వెళ్ళేవారు. నగరంలో పుట్టి, ఉండూరునే నమ్ముకొని ఉన్న దానితో తృప్తిపొంది చేయవలసిన దానికన్న ఘనంగా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించి ఉత్తముడైన జీవన్ముక్తుడు వెట్ట మునస్వామి. బడి ప్యూను వెట్ట మునస్వామి అయ్యవారుగా పూరివారిచేత మన్ననలు పొందాడు. అందుకే ఆయన్ని దేశానికే అరుదైన దివ్యజీవుడని పేర్కొన్నాను.

మన త్యాగరాజస్వామి కీర్తనలను మొట్టమొదటగా భజనలో వినడం జరిగింది వెట్ట మునస్వామి మృదంగమో హార్మోనియమో వాయిస్తు ఉంటె మరెవరైన కీర్తనలు గానంచేస్తే రోజు గంటో, గంటన్నరో భజన కార్యక్రమంజరిగేది

కంటి అద్దాల సుబ్బారెడ్డి, ఆయన జ్యేష్ఠపుత్రుడు బాలకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు నీలకంఠరెడ్డి ఈమూడు తరాల వారికి భజనతో సంబంధం ఉంది. వీరందరి తోను వెట్టమునస్వామికి సంబంధం ఉంది.

ఒకనాడు వెట్టమునస్వామి సహధర్మచారిణి చావు బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. వెట్టమునస్వామి భజన మందిరంలో పట్టాభిరాముని ప్రార్ధనలో ఉన్నాడు. మిగతా మరో ఉత్తరంలో వ్రాస్తాను మాణిక్యం.

నవంబరు, డిసెంబరు'94

★ కార్వేటినగరం సంస్థానాధీశుల బలమందుండి ప్రాచుర్యంలో ఉంటూ ఈనాటికీ ప్రతి డిసెంబరు నెలలో ప్రదర్శింపబడి Martial March.

Fall in New Jersey

ఆకులు రాలుకాలమున అందము ప్రోవులు వోసినట్లుగా
మ్రాకుల కొమ్మకొమ్మలకు రంగులు పొంగులు వారుచుండు భూ
లోకవు వర్ణపర్వమవలోకన సేయగ నుత్సహించి స్వ
ర్లోకము నుండి వత్తురమరుల్ మన పశ్చిమ రమ్యసీమకున్.

ఋతు సంహారము వ్రాసినట్టి సుకవిశ్రేష్ఠుండు సత్యద్భుత
ప్రతిభామండిత కాళిదాసు తిలకింపంగా మహోహేల స
త్కృతి వేఱొక్కటి మానవాళికి మహాదృష్టమ్ముగా వర్ధిలున్
ఋతులీలా విలసన్మనోహరి ధరిత్రీ కాంత రంజిల్లగన్.

కుంకుమనెత్తి పైపులుము కొన్నవి కొండలు కోనలే
వంకను వెళ్ళినన్ ప్రకృతి స్వాగత గీతుల వర్ణ పత్రప
ర్యంకములన్ రచించు మది రంజన జేయుచు సంభ్రమమ్ముతో
నింక మరిన్ని రంగులు రహిల్లగ నుల్లము పల్ల లింపనన్.

పసుపున వన్నె లెన్నియొ విభాసిలుచున్నవి. రంగులెల్లవై
మిసమిసలాడు ఛాయలు సమేయము గౌరవర్ణముల్
పసిడి వెలుంగులున్ నయన పర్వము చేసెడీ కాంతి సంగతిన్
రసమయ కావ్యమై ప్రకృతి రాగరసాంబుధి తేలిపోయెడిన్.

హంస మరణించు సమయాన ఆలపించు
నట మనోహర సంగీత మందు వలన
"హంస గీతి" నాబడు నుడి ఆంగ్లమందు
రూఢియైనట్టి మాట గుర్తునకు వచ్చె
పండి రాలు ఆకులు తమ బాధ తెలిపి

మన మనసుల నలుపకుండ మంచి మధుర
మైన అనుభూతులను పంచి అంతరించు

ఆకుల్ రాలెడి కాలముల్ దొరలు నత్యాశ్చర్యముల్ గూర్చు
ర మ్యాకారమ్ముల దాల్చ దీ ప్రకృతి మా యాణెమ్ములన్ నాణెముల్
మ్రాకుల్ జేరునొకింత చైత్రమున సామాన్య ప్రభాపుంజముల్
ప్రాకంగైతలనల్లు కొందుము మహా ప్రహ్లన్న చేతస్కులై. 14-9-95

అమెరికాలో రసం (చారు)

చింత పండును మిరియము జీలకరయును
పప్పునీరుప్పు ''తక్కాళి'' పండ్లు జేర్చి
ఉల్లి కరివేప యింగువ లుల్లసిల్ల
అమ్మ! కల్యాణి నీచేతి కమ్మని రస
మెంత రుచిగా నమరెనొ! వర్ణించలేక
నూరుమార్కుల నిడవచ్చు నూటిపైన
ఏబది యటంచు మెచ్చి వచించినాను. 11–11–95

సర్వదా శివమౌ ఓ జగదీశ్వరా!

కవితల్ వ్రాయగ కూరుచున్నపుడు వేగన్ వచ్చి శబ్దావళుల్
కమనీయంబుగ నాట్యమాడి తమ ప్రాశస్త్యంబు నిండారగా
కవిరాజానను నన్ను నన్ను నేను నన్ గై కొమ్మనున్ భక్తిమై
భవదీయాద్భుత శేముషీ విభవ సంపద్దీప్తికిన్ సర్వదా
శివమౌ ఓ జగదీశ్వరా! అమెరికా సీమాగ్ర విద్వన్మణీ! 21195

ఓ రాజన్నకవీ!

''ఒక గాంధర్వకళాతపస్వి భువిపై నుల్లాసియై డిగ్గి'' నీ
కకలంకంబగు ప్రేమతో నొసగె శిష్యత్వంబు ధన్యుండహో
సుకవిశ్రేష్ఠ!నిజమ్ము నీ గళమునన్ శోభిల్లు సత్కావ్యగా
నకళాశ్రీలు, రసజ్ఞ బృందముల కానం దంబు సంధించుతన్.

శ్రీరామరాజ భూషణు
కీరితికిన్ వారసుడవు కీర్తింతును ని
న్నో రాజన్న కవీ! నీ
పేరున సార్ధకముగ కవిబిరుదము నిలిచెన్.
పాడుదు వీవు రమ్యముగ పద్యములెప్పుడు వీణ మెట్లపై
పాడిన యట్లు చోద్యమది పండితులున్ కవులున్ శెభాషనన్
వేడుక గూర్చు శ్రోతలకు వీనుల విందులమర్చి సాహితీ
క్రీడలనీదుపోకడలు ప్రీతికరమ్ములు నాకుమిత్రమా!

సాహిత్యమ్మున గానమాధురిని విస్తారింపగాజేసి వాగ్
మాహాత్మ్యమ్మును దిగ్దిగంతముల సమ్మానింపగా జేయు ను
త్సాహ స్ఫూర్తిని శ్రీ విభుండిడు కుంటాడు ప్రసాదంబద్ది, గైకొమ్ము నీ
అహోయందురు పశ్చిమ ప్రజలు ప్రహ్లాన్నాంతరంగమ్ములన్
సాహిత్యోన్నతి జూచి, రాజన కవీ! సౌజన్య విద్యాకృతీ!

ఆవసుచరిత్ర కవితావిపంచి
మీటి ''కవి తాపపంచిన మేటి కవివి
భట్టుమూర్తి మరొకసారి పుట్టెనంట
కడప మండల మందున గాంచుడంచు
నిన్ను జూచి రసజ్ఞులు సన్నుతింప
'సరసచతురవచోనిధి' పరిమళించు

నీదు సత్కీర్తి సతతమ్ము నిక్కువముగ
పండిత సుకవి, రాజన్న పలుకుమిన్న

పలుకులు కండచక్కెరగ, పక్వరసాలము రీతి, తీయనై
నెలకొను పుట్టతేనెయటు, నివ్వరిపిండిన ఆవు నేతిలో
కలిపినయట్లు, బాదమును కమ్మని ద్రాక్షను, ముంతమామిడిన్
కలుపరు చించునట్లుశ్రుతి క్రమమనోహరగీతి భాతి, ని

ర్మల గగ నాంతరాళమున రాజమరాళము నిండు జా
బిలివలె గుండుమల్లియల పెంచెడి పంచెడి సౌరభమ్మునాన్
జిలిబిలి పాటపాడు చిరు చేతములట్టుల, చైత్రమాస కో
కిల కలకూజితమ్మటుల, కేకి యొనర్చెడి నాట్యమట్లు, కొ

వ్వలపుల నూత్నదంపతులు స్వప్నజగత్తుల నేలినట్లు, పెన్
దలపుల కాన బెట్టగల తాపసి మానసవృత్తి వోలె నీ
తెలుగున పద్దెముల్ చదువు తీరు విలక్షణ మైన రమ్యకౌ
శలమది నీదెయౌను కవిచంద్రమ! రాయల సీమ రత్నమా! 20-3-96

Heights of Greatmen - గొప్ప వారి ఉన్నతులు

గొప్పవారైన వారు చిక్కులనెదిర్చి
విజయ పర్వత శిఖరాల వెలసినారు
చిటికలోన హఠాత్తుగా చేరలేదు
సహచరుల్ శయనించి విశ్రాంతి గొనెడి
రాత్రి వేళల కూడ విరతినెఱుగక
గిరి తలమ్ముల బ్రాకి శిఖరము వారి
గమ్యసీమగా నెంచి సంకటములోర్చి. (మూలం, ఆంగ్ల పద్యం) 6-8-96

RENE DESCARTES*

Cogito, Ergo Sum (I think, therefore I exist)

French Mathematician and Philosopher (1596-1650)

జ్యామితి వధువు బీజగణితము వరుడు
        పెండ్లి జేసితి వీవు పెద్దగాను
గణిత జగత్తు అగణితగణితకళా
        చంద్రుడవని నిన్ను సంస్తుతింప.

తత్త్వవేత్తలు మహాతాత్త్వికమణివని
        నీరాజనాలిచ్చి నిన్ను మెచ్చ
మౌలికచింతనా శీలిగా విఖ్యాత
        శాస్త్రవేత్తలు నిన్ను సన్నుతింప

రేనె డేకార్టె నీదు చరితమువిన్న
మేనుపులకించు ఆశ్చర్యమౌనుతలప,
మనసులందున మల్లెల మాలలూగు
కనుల పున్నమి వెన్నెల కాంతులీను
నాలుగు శతాబ్దముల దీర్ఘకాలము, గడ
చినను నీదు పుట్టినరోజు ఘనముగాగ
గణితలోకము కొండాడు గాదె యిపుడు

కలలు మానవ జీవన గమనపథము
ముందుగాగ సూచించును కొందరి కది
నీ యెడల సత్యమైనదని తెలిసినపు
డచ్చెరువుగల్గు పడమటి యాణెముల జ
నులకు నిట్టినమ్మకములు కలవటన్న.
పెనుతుపాను ధాటికి తట్టుకొనక నీవు
నేలవ్రాలితివొక రాత్రి నీదువెంట
నడచుచుండిన వారలు జడియలేదు
నేలపడను లేదిది కల మేలుకాంచి

మరల నిద్దురపోతివి మరొక కలను
మరల కనుమూసి, కలగన్న తరుణమందు
వెల్గుముక్కలు గదియెల్ల విస్తరిల్లె
దివ్యతేజము గది నిండ తేజరిల్లె
మరలనిదురపోయినపుడు మరొకసారి
నీకు కలవచ్చె కలలోన కావ్యమొకటి
కానుపించెను జీవన గమ్యమేది?
నిర్ణయించుకొన్నావ రేనేడెస్కార్టెన్
అనేది ప్రశ్న కావ్యాదిని కనబడినది

''మొదటి కలవల్ల నాదు తప్పిదము తెలిసె
రెండవ కలలోకేశ్వరు కృపకు పాత్రు
డనయితినని తెలిసితి మూడవది నాదు
జీవిత పరమార్ధము తెల్పు త్రోవజూపె
నని కలల వివరణలిచ్చిన అతిలోక
చతురుడవని నిన్నెప్పుడు సంస్తుతింతు
జింకతోలును దుప్పటి చేసి కప్పు
కొని పడకపై ననవరతము నిదురనెఱు
గు మఱొకటి సేయుటకు నశక్తుడు కొడుకను
తండ్రి మాట కల్లయొనర్చి, తత్త్వగణిత
శాస్త్రముల శిఖరములపై జయపతాక
నిలిపినావు ఘనుడవు రెనేడికార్టె
నీకు కలిగినట్టులనే అలౌకికమగు
అనుభవా లెన్నియోగల వచ్చెరువగు
శ్రీనివాసరామానుజన్ జీవితాన
అద్భుతాను భూతు, లెఱుక కందని ఘట
నలు జరిగె పరమాత్మ లీలలిటు లుండు.

15-12-95

శ్రీ కె. రామిరెడ్డి IAS

వృత్తిరీతిగనొక ఉత్తమోపాధ్యాయు
డై విశిష్ట యశమునందె నెవరు?
ప్రతిభ, నిరంతరాభ్యా సమ్ముల కతన
మేధావిగా వెల్గుమేటి ఎవరు?
పూని, ఆదర్శాల ప్రోత్సాహమున వర
పాలనా దక్షుడై పరగునెవరు?
లలితకళా రాధనల కళాకారుల
గారవించి తనియు ఘనుడెవండు?
గంభీరవాక్చమత్కా రమ్ముతో సభా
జనులను రంజించు చతురుడెవరు?
రచయితయై తోడి రచయితలను ఆద
రించి సంతోషించు నెవరతండు?
సాహితీ సంస్కృతీ సామర్థ్యములు మాన
వత తనవిగా నున్న వంద్యుడెవరు?

అతడె మా రామిరెడ్డి సౌహార్ద్రమూర్తి
అతని జీవితరథము హర్షాంకితమయి
ఆయురారోగ్యభోగభాగ్యములతోడ
వరలవలెనని కోరి శ్రీ తిరుమలేశు
శ్రీనివాసుని ప్రార్థింతు చిత్తమలర.

ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి

ఆరాధింతుము శిష్యులెల్లరము మా ఆచార్యు జీరెడ్డి చె
న్నారెడ్డిన్ గురుదేవుడంచు నెదలానందాబ్ధిలో తేలగా
ధీరోదాత్తుడు వేయిపున్నమల దీప్తింగన్న ధన్యుండు సం
స్కారస్ఫూర్తికి దోహదమ్మిడెడి విక్రాంతుండు స్తుత్యుండహో!

16–4–57

8 (X)

ఒక క్షణ ముప్వేత్తుగ ను
త్పుకతవెలార్చి యటు పిదప తొలిస్థితికిన్ జే
రుకొను నెడంద గణితమున
ప్రకటించును మన డిరాకు (DIRAC) ★ఫంక్షను దీనిన్

15–7–97

Prof. P.A.M. Dirac (1902 1984) University of Cambridge.

మానవజీవన జ్యోతి

మనుజుడు దేనికో మనుటమాని నిరంతరమున్ శ్రమించి జీ
వన సుఖమున గడించి పలువన్నెల ఇంద్ర ధనస్సు వోలె, చిం
తను దరి జేరనీక నిజతత్త్వము సంస్కృతియుజ్వలింప చే
సిన ది రోమనుల్ చరిత చెప్పును వారి మహత్త్వగాథలన్.

31–5–98

PIZZA

అటు మా భారత దేశమున్ వదలి ''ఊతప్పంబు'' మోదంబుతో
ఇటలీ క్షోణితలిన్ ప్రవర్తిలుచు స్థాయింబెంచి పీతాఖ్యతో
అటలాంటక్ సువిశాల వార్ధిని సునాయాసంబుగా దాటి ప్రా
కట భక్ష్యమ్మయె మెచ్చగా నమెరికా ఖండాన సర్వప్రజల్.

20–8–98

ఆచార్య నల్లాన్ చక్రవర్తుల

పట్టాభిరామాచార్యులు, వరంగల్లు

చతురవచోనిధి వితరణశీలి యౌ
పట్టాభి రామాఖ్యు ప్రణుతి సేతు
అధ్యాపక విధుల నంకిత భావాన
పాటించు నాచార్యా ప్రణుతి సేతు
తరగతి బోధన తపముగా తలచి వృ
త్తి కొనసాగించె ప్రతిష్ఠ గాంచె
విద్యార్థుల హృదయ విధుల నిండుగా
జ్ఞాన కాంతులిడి ప్రఖ్యాతి గాంచె

నేడు విరమణ పొందు చున్నాడు విజయ
వంతమైన ఉద్యోగ జీవనము చేసి
ఇంతకంటె మించిన దేమికోరు
కొనును ఉపాధ్యాయుడీ జగతినెటనైన?
సుందరకాండను వందల సారులు
పారాయణము సేయుభక్తుడితడు
గోదామహాలక్ష్మి కూర్చిన కృతులను
నిష్ఠతో వల్లించు శిష్యుడితడు.

శ్రీ వైష్ణవాచార శీల సంపద పెంచి
క్రమశిక్షణను మను ఘనుడితడు
గణితశాస్త్రమున అఖండ పాండిత్యంబు
సాధించి మించునా చార్యుడితడు

వృత్తి విరమణ చేసెడి వేళ హితులు
పండితులు సంస్థలకు నధిపతులు మంచి

స్నేహితులు, ఛాత్రులు ప్రభృతుల్ చిత్తమలర
కురిసి రభినందన కుసును గుచ్ఛములను.

బోధన, సుగణిత శాస్త్రా
రాధన, నూతన విషయ పరామర్శయు సం
శోధనలే ఊపిరిగా
సాధించితివి ఘనయశమ్ము సన్మిత్రమణీ!
ఆంధ్రదేశాన గణిత సమాఖ్యనొకటి
స్థాపన మొనర్చి పోషించి శాస్త్రనిధులు
ఛాత్రవరులను పాల్గొని చర్చ చేయు
వేదికగ దిద్దితీర్చిన విజ్ఞుడవని
సర్వులంగీక రింతు రాచార్యవర్య

రంగస్థల నటనలలో
నంగడు నిపుణుడ వని అభినందించుచు చె
ప్పంగ ముదంపడు మది నీ
ప్రాంగణమున బుధులు యెదట రామాచార్యా!

చిన్ననాడు జ్యామితి మీద శ్రేష్ఠమైన
గ్రంథమొక్కటి మీచేత వ్రాయబడినది
చదివితిని శ్రద్ధగ నల్వదేండ్ల మాట
చెక్కు చెదరక నిల్చెనా స్మృతి పథాన.

గణితాచార్య నభోతలాన ధ్రువనక్షత్రమ్ముగా వెల్గు ల
క్ష్మణ రావున్ గురుదేవుగా గొనిన మీ సంస్కార మర్యాదలో
ప్రణుతింతున్ గురుషష్ఠి పూర్తిని మహాపర్వమ్ముగా చేసి స
ద్గుణవంతుండని పేరుగాంచితివి సంతోషంబు మిత్రోత్తమా.

ఐహిక సమస్యల వలలో నంతరంగ
ము తగులు కొనిన్ జడియక వెతలలోడ
''పద్మపత్ర మి వాంభసా ప్రవచనమ్ము
ననుసరించి మనుట నేర్చిన విబుధుడవు
రమ్యగుణధామ! పట్టాభిరామ నామ!

శ్రీ తిరుమల స్వామి దయగురియ సతమ్ము
ఆయురారోగ్యభోగ భాగ్యముల తోడ
నడచి శ్రీ వైష్ణవ పథాన, విడువకుండ
గణిత భారతి సేవలు గ్రాల వయ్య
మనుగడ పరిమళభరితమై చెలంగ. 31–10–93

సాయిరామ చంద్రాశతకం

శ్రీకరమ్మగు నీదు ఆశీస్సులంది
ఆయురారోగ్య భోగ భాగ్యములెగాక
సత్త్వగుణ సంపద పెరిగి తత్వమెఱిగి
మరలు భక్త కోటుల కెల్ల వందనములు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ప్రతి నిమేషమ్ము కల్మష భావపంక
మలమి కొను మదీయ హృదయ ఫలకమందు
విమల హృదయమ్ము, సద్భావ వృద్ధి కొఱకు
కొలుతునో స్వామి నిన్ను మిక్కుటముగాగ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సంశయాత్ముడు భువి వినాశమ్ము జెందు
గాన, ఈ సంశయా స్పదమైన మనస్సు
లోని దీర్ఘ తమస్సుల పోనడంచి
''ఎఱుక'' యను వెల్గు నింపుమా త్వరితగతిని
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జబ్బుపడి పెడ మార్గాన జనెడి మనసు
అదుపులో పెట్ట చక్కని ఆజ్ఞలిచ్చి
ఆత్మ తత్త్వమ్ము నెఱిగించి ఆదుకొనుము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

పిరికి తనమది గుండెలో పేరుకొనియె
ఆత్మ బలము సడలిపోయె ఆర్తి హెచ్చె

స్వామి దీనుడ బ్రోవుము, శరణు! శరణు!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

పెక్కు కోర్కెలుంట నిజము, పేదరికము
కోర్కెలను జయించిన వాడె గొప్పవాడు
పేదలున్నాము కొల్లలు, చేదుకొనుము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

రామమూర్తిగ నాడు నారాయణుండు
ఒక యుగమ్మున వెలసి, వేరొక్కయుగము
నందు శ్రీ కృష్ణమూర్తియై అవతరించె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తప్పులను చేయు దుర్బుద్ధి తాపమందు
ఐనను దోషములవైపె అరుగుచుండు
విషవలయమిద్ది తొలగింప వేడుకొనుదు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయిరామ స్మరణ చేయు సమయమందు
మదిని తద్భిన్న భావాలు మసలు కతన
నామ జపము భంగమగును నష్టపడుదు
బ్రోవుమా పుట్టపర్తీశ! శ్రీ వికాస!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

స్వామి భవదీయ కరుణా ప్రసారమంది
దుఃఖ మేఘమ్ము తొలగ సంతోష సూర్య
కాంతి రంజిల్లు సుస్వాంత గగనసీమ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నన్ను క్షమియించు, నా స్వామి! నిన్ను గొలుతు
కర్మఫలములు ప్రస్తుత ధర్మదృష్టి
కనుగుణమ్ముగ ప్రసాదింతు వని స్తుతింతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జ్ఞానహీనుడ నే వింత మానవుండ
తప్పులను సైచి దయ యుంచి దారిచూపి
బ్రోవుమా పుట్టపర్తీశ పూర్ణతేజ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సర్వదేవతల ప్రతీక, సర్వశక్తి
సంపదకు విజయ పతాక సకలభక్తి
బృందముల భాగ్యరేఖవదే మహాత్మా!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

అన్ని మతముల కభిమతమైన మతము
అన్ని తత్త్వముల మహత్తులున్న తత్త్వ
మయె సాయి మహాత్మ్యమై అమరుగాదె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మొక్కుచున్నాము ఆపదల్ మూడినపుడు
మరచుచున్నాము సంపదల్ దొరలినపుడు
దీవెనలవల్లనే కడతేరవలయు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆపదల నుండి కడతేర్చి ఆదరించి
నన్ను కాపాడినావు మున్నెన్ని సార్లో
దేవదేవా! క్షమించి నన్ బ్రోవరావ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ప్రతి గుడి ప్రశాంతి నిలయమై పరిఢవిల్ల
ప్రతి ప్రతిమ సాయి బింబమై ప్రతి ఫలించు
నట్లు మా మనసుల నేలు మనవరతము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

వైద్యముల నెదురించిన వ్యాధులన్ని
మాయమయ్యెను సాయీశు మహిమ వలన
అట్టి మహిమామృతమ్ము నాకందజేసి
బ్రోచు వాడవు నీవ! ఆప్తుడవునీవ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

బరువు నీపైన మోపి ఉత్తరువు నీదె
అని మదిని నమ్మి నాచేయు పనులలోన
దోసముల నెంచ బోకు మాప్తుడను నేను
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

విశ్వచైతన్య నాయకా వెంకటేశ
నన్నశక్తుని శోధింప న్యాయమగునే
తాళగలవాడనా స్వామి! దయగురియుము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయి భగవాను తత్త్వార్థ సారమెరిగి
నట్టి మహనీయు లెందరో అవనిగలరు
వారి దరిదాపులకు గూడ చేరలేని
దీనుడను నేను కరుణించు దేవదేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

శాస్త్రమెచ్చట ఆగునో సాయితత్త్వ
మచట ప్రారంభమగునని ఆర్యులంద్రు
సాయితత్త్వమ్మున జనుము సార్థకముగ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆపదల నుండి రక్షించు అయ్యనీవు
శాంతి సంపదల్ సమకూర్చు స్వామినీవు
అహము నణచి మహాప్రభూ అంజలింతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

బిడ్డ తప్పులు మన్నించి ప్రేమజూపు
తల్లి ఉల్లము అమరమై ధరణి వెలయు
తల్లివలె బ్రోవుము స్వామి ఎల్లవేళ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఒకరి కిచ్చిన తరుగదు సకల శక్తి
మయ మనంతముగ పెరుగు, మహితదీప్తి
జ్యోతి నీదు అంశల నొక్కటై తనరును
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఎచట సాయమ్ము లభియించు నచట సాయి
కరుణ పనిచేయు ననియెడి స్ఫురణనాకు
కలుగు చున్నది, గాన భీతిలినడెంద
మందు నొక కొంత ధైర్యము నందుకొంటి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నిన్ను మ్రొక్కిన చాలును నిఖిలదేవ
తలను పూజించి నట్లౌను తథ్యముగను
సాయి భక్తుల గట్టి విశ్వాసమిద్ది
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కర్మఫలముల దిద్దెడు ధనవరుండు
భక్తులనెపుడు కాపాడు భద్రమూర్తి
స్వామి సత్యసాయి మహేశు సన్నుతించు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సకల భువన సంభావిత చక్రవర్తి
సర్వమత భక్తపాలక చారుమూర్తి
ఉద్ధరింపుము రుజబాపి ఓ మహేశ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

గుండె దడ హెచ్చుచున్నది గొంతున తడి
ఆరుచున్నది నీదయ అందజేసి
నన్ను రక్షింపుమా జగన్నాధ! కృష్ణ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయినాథు విభూతి ప్రసాదమార
గించి, పాల భాగాన ధరించి నంత
సంశయమ్ములు తొలగును జయము గలుగు
ననెడి గొప్పవిశ్వాసమ్ము మనము నిండు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నేను పడుచున్న మానస గ్లానిదెలసి
నన్ను సంశ యాత్ముని సేయంగ న్యాయమగునె
మంచి మార్గమిదియని చూపించవయ్య
సాయపడువారు భువిలేరు సాయిదప్ప
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కలలో కనపడి బుద్ధి గరుపుదువని
మారు రూపాలలో వచ్చి మంచి చేతు
వని మహాత్ములు భక్తులు వినిచినారు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భువిని భక్త జనుల బాధపోనడించి
సౌఖ్య శాంతుల నందించు సత్యదేవ
నీదయా దృష్టి నాపైన నిలుపుస్వామి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీదు కరుణయున్న జరుగనిది జగత్తు
నందున గలదె ఏదైన? ఆదిమూర్తి
నమ్మికొన్నాను కావుము నామొఱవిని
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీదు ప్రేమను ప్రసరించి మాదు జీవి
తాల పావన మొనరించి తనియజేసి
ఏలుకొనియెడి భగవంతుడీవె స్వామి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఈ పరిస్థితుల నడుమ నిరుకుకొన్న
ఖైది వలెనున్న నన్ను నీవాదుకొన్న
నే ప్రభూ! ప్రగతి గలుగు నిశ్చయమిది
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నాదు భవితవ్య మెటు వ్రాసినా వోస్వామి
నేడు కాపాడుమయ్య నాగోడు చూడు
చేయి విడువకు జగదీశ శ్రీనివాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నాదు మనసుననున్న ఆవేదన తతి
తెలియుగద నీకు సర్వజ్ఞ తెలియజేతు
తృప్తి కొరకె దీవించుము దీనబంధు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నిన్ను హృత్సమ నిలిపిన నిముసమందె
పావనమగు భావసరళి ప్రభవ మందు
ఇట్లు దివ్యాను భూతిని గట్టిజేసి
సవ్యమార్గాన గమియింప సాయపడుము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మనుజరూపము దాల్చిన మాధవుడవు
భక్త జన కల్పశాఖవి ప్రభుడవీవు
పిలిచిన పలుకు దైవమా గొలుతునిన్ను
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

దేశ దేశాలనుంచి ఏతెంచి పుట్ట
పర్తి సర్వేశు దర్శించు భక్తకోటి
సాధనాద్భుత శక్తికి సాటిలేదు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సర్వమతముల నడిపించు శక్తి ఒకటి
సాయి శక్తి యనుచు భక్తి జనులు తెలిసి
కొని భజించు చున్నారు. వైకుంఠవాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీదు భక్తులు జూపెడి నియమనిష్ఠ
అనుతింప నేరి తరము తనువు పులక
లెత్తునీ గాథలను విన్నవెవరికైన
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఔషధమ్ములకెల్ల భవౌషధమ్ము
సాయిబాబా విభూతికి సాటిఎద్ది?
సాయి భక్తుల దివ్య రసాయనమది
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సత్యనారాయణస్వామి సత్యసాయి
శ్యామ సుందరుడు మురారి ప్రేమసాయి
దాశరథి రఘురాముడు ధర్మసాయి
శాశ్వత శివ సుందరమూర్తి శాంతసాయి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తలపులు పరిశుభ్ర మయిన తక్షణంబె
గుండె తలుపులు తీసి దేవుండు సాయి
అడుగిడును ప్రేమ పొంగార నరయవచ్చు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

చంచలమగు నామనసును సంస్కరించి
సాధనా శక్తి నందించి, జ్ఞాన భిక్ష
నిడుట కీ స్థితి గల్పించి తేము స్వామి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఎన్ని జన్మల సుకృతమో! ఎన్నగలనె
వేద ఋషులు పూజించిన పాదములివి
సాధు గణములు మ్రొక్కిన చరణములివి
కనుల కద్దుకొంటినిగాని తనియనైతి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
ఆశకు నిరాశకు నడుమ నల్లలాడు
మనసునకు స్వస్థతను గూర్చు మా మహేశ!
నడి సముద్రపు నావను నమ్ముకొంటి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భక్తిలో ఉన్నత స్థాయి బడయలేదు
ప్రగతి గనలేదు సాధన పథమునందు
కాని నీయండ జేరిన దీనజనుడ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

బేరమాడు చున్నానని నేరమెంచ
కు విభు! నాదు దుఃఖమును పోగొట్టు శక్తి
నీకు దక్కలేదెవరికి నిక్కువముగ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భయము లొక అను క్రమముగా బయలు దేరె
వీటి నవరోహణ మొనర్ప వేడికొందు
భక్తజనుల భయము బాపు శక్తి నీవె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

విధిని లంఘించ వచ్చునీ విశ్వమందు
సాయి పరమాత్మ దయ కొంత సంక్రమింప
దివ్యశక్తి కతీతమేదియును లేదు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

అభయ మిచ్చిన స్వామికి అంజలింతు
శుభము గలిగించు స్వామికి స్తుతుల గూర్తు
విశ్వమెల్ల వ్యాపించిన విజయ శక్తి
సాయి శక్తికి మించిన శక్తి లేదు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కర్మ ఫలముల లభియించు కర్తవీవు
నాదుసుకృత మెట్టిదో? నీదు దయకు
పాత్రమైన చాలును జన్మపావనమగు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఉల్లమందు ఆనందము పల్లవింప
స్వామి దయ అనుకొందు కష్టములు దొలగ
చేయు నిలవేలుపువు నీవు చిద్విలాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

దేశ దేశాలనుండి నీ దీవెనలను
కోరి దరి చేరెడి భక్తకోటి జూచి
నప్పుడు గలుగు హృదిని దివ్యాను భూతి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కాలము, పని, హేతువు మూడుగలిసి పిదప
అనుభవము సమన్వయమైన యపుడె సత్య
దర్శనమగునని తెలిసె ధర్మతేజ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తల్లి, తండ్రి గురువు దైవమెల్ల నీవె
మాకు శ్రేయమన్నది యేదొ నీకెతెలుసు
ఐన చాపల్యవశమున 'అది' ఇదియని
అడుగు చున్నాము కరుణించు మయ్యమమ్ము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సర్వలోకాలు వ్యాపించి శాశ్వతము, న
నంతమైన ఆ పరతత్త్వ చింత నమ్మే
చంచలమయిన మనసున శాంతి నిలుపు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భూన భోంత రాళముల విభూతినింపి
జగము లేలెడి సాయీశు పొగడతరమె?
ఐన నర్పింతు గీత ప్రసూనములను
నాదు తృప్తి కొఱకు గూర్చినవివి స్వామి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సందియములు తగులుకొని సతమతమయి
మంచి చెడ్డలు తెలియక మ్రగ్గనాకు
శ్రేయ మేదియో తెలుపుము శ్రీనివాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కీలు బొమ్మగజేసి నన్నేల ఆడి
పించి మాటి మాటికి ఏడిపింతురు ప్రభు
నీదు దయయున్న జరుగదు నిశ్చయముగ

క్లిష్టములకు మూలమగు నీఖేలనమ్ము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీ దయా మృతమగు రసాస్వాదనమ్ము
చేయు యోగ్యత లేదేమొ చింత. సేయ
ఇంత విహ్వాలు డనయి నేనేడ్చు చుండ
కావ రావేల భక్త హృత్కమల వాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భక్తిలోన గజేంద్రుని వంటి ప్రౌఢి
ద్రౌపది కైవడి హృదయ సుద్ధి లేదు
కావున నీదయ రాదు ఏమో దేవ
నాదు గతి యేమి కావలె వేదమూర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయి నామకీర్తన జేయ శాంతి గలుగు
అంత రంగమందు కవిత లల్లిస్వామి
దివ్య వైభవ మొకవంక తెలియజేతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

చేయు పనులకు నీవు ఆశీస్సు లిడుదు
వన్న దృఢమైన నమ్మిక యున్నతెంపు
కలుగు, లేకున్న మనసు వైక్లబ్యమందు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయి అవతార తత్త్వము, సాయిలీల
లెఱిగిన బుధజనులు, భక్తులరిగినట్టి
మార్గముల బట్టి చనక ప్రమాద మందు
తగులు కొంటిని రక్షించు తండ్రివీవె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మొన్న కలిగిన అనుభూతి విన్నవింతు –
నన్ను కాపాడ వేంచేసినావు ప్రాణ

భిక్షనిడినావు, రుజనుండి రక్షణ నిడి
మూగ బోయెడి గొంతును బాగుపరచి
బ్రోచితివి స్వామి ధన్యోస్మి పుట్టపర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఒక సమస్య వెనుక మరియొక సమస్య
ఉద్భవించు దాన నెడదునుడుకు పెరుగు
దైవ చింతన కిది అడ్డు తగులు స్వామి
పాహిమాం, పాహిమాం పుట్టపర్తి తండ్రి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కష్టముల వల్లనే ప్రజకనులు తెఱచి
సాయి నారాయణ స్వామి శరణుగోరు
ఇదియె కుంతీ మహాసాధ్వి ఎపుడొచెప్పె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీదు పాదాబ్జముల చెంత నాదు శిరము
నుంచినపుడు తొలగు భయ సంచయములు
గాత్రమును దివ్య కవచమ్ము కప్పినట్లు
భావమేర్పడు కొండంత బలమువచ్చు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

'' నీవనంతుడవు సమస్త మీవయనుచు
స్తోత్ర పాఠాలు చేసిన సుఖముగలదె''
స్వామి కింపగు నట్లు మావర్తనమ్ము
పరిమళించి నపుడె దివ్య ఫలితమబ్బు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఈ చమత్కారముల వల్లనేమి గలుగు
భక్తులందు సంస్కారము పరిఢవిల్లు
పిదప లోకోపకారము వెలయు రీతి
చివర దివ్య సాక్షాత్కార సిద్ధిగలుగు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాగరుడు పొంగి శ్రీవారి చరణములను
కడిగి, రత్నాల హారమ్ము కాన్క నొసగి
పూజ లొనరించె, నీ మహాద్భుతము విన్న
మనసు లందున మల్లెపూ మాలలూగు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తోటి వారలు జయము, సంతుష్టియశము
బడని ప్రగతి పథమున సంబరముతోడ
వెడలుచున్నారు, నీ దయ వెల్లి విరిసి
నకతమున, నన్ను కూడ నీదు కరుణార్థ్ర
వీక్షణములు సోకించి దీవించవయ్య
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

రోగ మలమైన మనసుల బాగుపరచి
జ్ఞాన మయ మొనరించు ప్రజ్ఞాన దేవ
బ్రోవుమయ్య! మురహరీ! లక్ష్మి విభుడ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తపన భక్తికి మెచ్చెడి దైవమీవు
శరణు జేరిన వారిపై కరుణ జూపు –
విశ్వపితవు, నినుగొలుతు విమల బుద్ధి
నిచ్చి గురుదేవ! నన్నుద్ధరించవయ్య
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ప్రేమయే దైవమని యెడి ఋతవచనము
నీకు ప్రయోగ దీపిక గాగ సకల దిశల
నిండును గులాబి వర్ణంబు నీదు భవ్య
దివ్య మంగళ విగ్రహ తేజ జనిత
మై, పరంధామ! నిజభక్త తాపహరణ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జీవనోపాధియే కాదు, జీవన పర
మా వధియు విద్య లక్ష్యములందు ఎఱుగ
జేయు అమృత సూక్తులు చిత్తమలర
సాగిల బడి మ్రొక్కులిడుదు సన్నుతింతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జటిలమైన ఆధ్యాత్మిక సత్యములను
తీయ తేనియ విందుగా తెలియజేయు
దివ్యవాణికి నీ జిహ్వ భవ్య మీరి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

తాడు లేని బొంగరము విధాన విచ్చ
ల విడిగా తిరిగిన వారు భవదమోఘ
దివ్య కరుణార్ద్ర వీక్షణ దీప్తి సోకు
కతన బంగారు కొండలై ఖ్యాతిబొంది
నట్టి అద్భుతముల లెక్క పెట్టగలమె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భజన బృందము భగవాను విజయకథలు
భక్తి తన్మయత్వము పొంది పాడునపుడు
చేరివారితో, తాదాత్మ్య సిద్ధి పొందు
భాగ్యమును ప్రసాదించుము భక్త వరద
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సర్వము విడిచి సాయీశు శరణుజేరి
సాయి సేవయే జీవిత ధ్యేయమనెడి
భక్తవరుల త్యాగమునకు పరవశింతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భక్త జనుల ఆనందమే పర్తిదేవు
షడ్ర సోపేతమైన భోజనమటంద్రు
స్వామి అవతార మహిమమ్ము చరితగాగ
వ్రాసిధన్యాత్ములైన పావన మనుజుల
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
'' నేను నీ వెంట నుండంగ నీకు భయమ
దేటికని ధైర్యమును గూర్చు మేటి దేవు
డెవరు పర్తినాథుడు తప్పనీ ధరిత్రి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నాడు ద్వాపరమున యమునానదీత
టమ్ము నీదివ్య లీలాలయమ్ము కృష్ణ!
నేడు చిత్రావతీస్థలి నీ మహోజ్జ్వ
ల మహిమా విభూతికి స్థావరము మురారి!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

''సాయిబాబా'' యనగ జగత్ స్రష్టలైన
దివ్యమాతా పితల దెల్పు భవ్యపదము
ఆది దంపతులకు కూడ అభినుతింప
సాయ పడు మంత్ర శబ్దము సాయి పదము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాయి అవతారమును దాల్చి సర్వలోక
జనుల కారాధ్యమై సత్య శక్తిగాగ
వెలసెనిప్పుడు మహిలోన విష్ణుమూర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆపదలనుంచి కడతేర్చి ఆదరించి
నన్ను కాపాడినావు మున్నెన్నోసార్లు
దేవదేవా! క్షమించినన్ బ్రోవరావ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆర్తులకు గల్గు నారోగ్యము విరళముగ
భాగ్యములు జేరు నర్దార్థి భక్తతతిని
తత్త్వసిద్ధ జిజ్ఞాసువుల్ త్వరితగతిని
పొందనేర్తురు, జ్ఞానులు ముక్తినెలమి
స్వామి కరుణా కటాక్ష వీక్షణముసోక
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మత విభేదముల్ సమసిన మహితభూమి
తూర్పు పడమరల్ గలసిన దొడ్డ గడ్డ –
పర్తి విభు పాదముద్రలు పడినచోటు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జీవితమొక ఆట ఆడుము చిత్త మలర
తీయని కల అద్దానిని స్థిరమొనర్చు
ప్రేమ అది కనుక అనుభవింపదగిన
సాయి వాక్కులు చల్లగా జగతినిండె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మలిన మంటును నామది వలదనినను
నీ వధిష్టించినయపుడె నిర్మలమగు –
దైవచింతనామయమునే ధన్యమగును
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

బాల్యదశ సాగి పోయెను పరువముచనె
నీటి బుడగ నడి వయసు నాటి సొగసు

నేడు ముదిమి ప్రాప్తించెను నిశ్చయముగ
ఇంతవరకు సాధించిన దేమిలేదు
ఇంకనైన శంకర! కరుణించవయ్య!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
భోగభాగ్యాలు కూర్చు ''విభూతి'' ఘనత
పాపముల కాల్చి వేసెదు భస్మముగద
ఆపదల బాపు క్షీరము అనుటజెల్లు
రాక్షసాది దుశ్శక్తులు రావు దరికి
వెలయు బాబా విభూతికి వేయి పేర్లు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మనసు క్లైబ్యమందినపుడు మంచిచెడ్డ
లు గురు తించు విజ్ఞతను కోలుపోయి
''మాయ'' నే నిజమని నమ్మి చేయుదురిత
ముల క్షమించి బ్రోవుము ప్రభూ! మొక్కులివిగో!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

బీటలెత్తిన గుండెల బీళ్ళు తడిపి
సద్గుణములను పచ్చని సస్యములను
పెంచి అర్థమేలేని ఈ పేద బ్రతుకు
ల కొక వెలుగు నొసంగెదు సకల వంద్య
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

చేయరాని తప్పిదముల చేసి సారె
సారెకు క్షమాపణలు గోరు నేరుపుగల
నటకులని, కుహనా భక్తనాయకులని
త్రోసి పుచ్చకు, రక్షించు వాసుదేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భక్తి పరిణతి చెందని పామరుడను
తెలిసి తెలియక అపచారములను సేయు
ఆజ్ఞుడను దోసములనెన్నకమ్మా తండ్రీ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
విందు భోజనముల మెక్కి వెక్కసపడు
జనములకు మంచి మందు భోజనములనిడి
ఆదుకొనెడి మహావైద్యుడగుదు వీవు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
పూనుకొన్న ప్రతి యొకటి గ్లాని గూర్చు
చున్నది ప్రభూ! దిగులుతో ఖిన్నుడనయి
ఎదుగలేని దౌర్భాగ్యుడను, దయజూపి
బ్రోవుమయ! భక్త జనపోష ''పుట్టపర్తి''
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

స్ఫటికలింగము, చిటికలో భ్రాంతి కలుగ
తెచ్చి కైలాసమందుండి దివ్యగంగ
జలము దోసిలిన్ సృష్టించి శంభునికభి
షేక మొనరించిన మహాత్మ! చిద్విలాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

హేమ శకలమును దీని మహిమ పసిడి
కర్ణ కుండలములజేసి కరుణతోడ
కొండ జాతి బిడ్డకిడిన గొప్పఘటన
తలచు కొనెద నెప్పుడు పరంధామ దేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

కష్ట సాధనమైన దైవ కరుణవలన
సంక్రమించు మహాద్భుత సంపద అది

స్వ స్వరూప విజ్ఞత పుట్టపర్తిలోన
అడుగులిడి సత్య భగవాను నుడులువిన్న
ఆత్మ తత్త్వమునొక కొంత అరయవచ్చు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
ధ్యేయమునకు దూరమగుచు తెంపులేక
భీతి చెందు చున్నది మది పిరికి తనము
బాపినను బ్రోచి విజయమ్ము బడయనిమ్ము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నవమి శ్రీజయంతు లొకటయి వెలసినది
అది నవంబరు నెల ఇరువదిని మూడు
కలసిన సుదినము జగమె కదలి పర్తి
జేరి స్వామి దర్శనమందు చిత్తమలర
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఖండ ఖండాంతరములందు నిండినారు
నీదు భక్తతతులు వారినాదుకొనెడి
దివ్యశక్తి నీకె కలదు దేవదేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మమతలనురాగ వల్లరులు మనసునకు ని
రంతరము దాడి చేసెడి క్రమముతోప
నిర్వహణలో కలుగును హాని కరుణించు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

గడ్డి పోచలు రెండు నీకరములందు
శిలువయై ఏసు ప్రభువును నిలుపుకొన్న
ఘటన పులకలు కలిగించు – కమలనాభ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
ద్వేషలోభ మత్సరములు తెచ్చిపెట్టు

''జ్ఞానము'' జగతి శక్తి ఎట్లొనుశీల
మునె గణించ వలెను శక్తిగ నిజమిదిని
విశ్వ సూత్రములను దెల్పు వెంకటేశ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

వ్యధలతో నింపి మనసును వక్రమార్గ
గామిగా జేసి, కార్యదీక్ష సడలించి
పతనమై పోవుచున్నాను భాగ్యహీను
డనని ఆత్మనిందకు దిగి కనలు నన్ను
బ్రోచు దేవ దేవుడవు నీవు పుట్టపర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జబ్బు పడినట్టి మనసును సంస్కరించి
ఎండమావులు నిజమను మెండు భ్రాంతి
తొలగ జేసి జీవితమున వెలుగునింపి
కావగదవయ్య ఓదేవ దేవ పర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మానసిక శాంతి, సంతుష్టి మానవుండు
నిరతమును కోరు కొనునుగాని కృషిచేసి
పొందు పద్ధతి నెరుగని మంద బుద్ధి
కరుణ జూపుము మాధవా షిరిడి దేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

శిష్ట రక్షణా లక్ష్యము దుష్ట శిక్ష
ణ మొనరించి భక్తుల బ్రోచెను మురహరి, జ
నార్ధనుడు నాడు నేడు ఆనందదాయి
సాయినాథుడయ్యెను జగచ్ఛక్రవర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

భాగవత వాహిని పఠించి పరమపురుషు
డైన శ్రీకృష్ణమూర్తి నీవే నటంచు
స్తుతి యొనర్చును నీ భక్తతతి ముకుంద –
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీవు పరమాత్ముడవుగాన నీవొనర్చు
పనులు ఎల్లను భక్తుల భాగ్యఫలము
లోక కల్యాణ కరము త్రిలోక నాథ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఎఱుక లేమి వక్ర ప్రధాన అరుగు జనుల
కనులు విప్పుటకే బహుకార్యమగ్ను –
డవయి క్షణము తీరిక లేక పవలురేయి
భువనపాలన మొనరించు పుట్టపర్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

మాయ గప్పుకొన్న మనసు మభ్యపెట్టి
బుద్ధిని పెడమార్గము బడి పోవునట్లు
చేయుచున్నది, చింతల చెరువునందు
చిక్కు కొన్నాను, బ్రోవుము శేషశయన
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
స్వామి నీవు మాకొన గూర్చు సాయమునకు
ప్రతి ఫలమ్ముగ నామ జపమ్ముజేసి
నిన్ను మెప్పించ వచ్చునని మదినెంచు
బాల బుద్ధులు మావి, కాపాడ వయ్య
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నీవు కొండంత ప్రభుడవు నిన్ను గొలుచు
కొఱకు కొండంత పత్రిని కూర్చగలమ
మాదు బీద పూజలు గొనుమా! రమేశ!
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

‘‘రూప రహితుడు దేవుడు రూపుదాల్చి
అవత రించును తనదు భక్తవ రతతి అ
భీష్టములు ఫలించుటకుగా నిందు మౌళి,
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

దుష్ట శిక్షణ గావించు శిష్టరక్ష
ణ మ్మొనర్చుట, భక్త గణములకెపుడు
శాంతి సంతోషము లిడుట స్వామివంతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఒక్కక్షణమున ఉన్నట్టి ఉత్సుకత యు
కాన రాకున్నది ఇంత క్షణమునందు
మనసు బలహీనమై పోవు ననుదినమ్ము
చేయునది సున్న బ్రోవుమా శ్రీనివాస
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
చేతగాని పనులు చేయ ప్రీతి అడు
గడుగున విఫలు డనయి నిరాశ జెంది
లోకములు నన్ను బ్రోవుము స్వామి! కమల నయన
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఫలితములు పొందని శ్రమ సంచలిత మనము
దొరలు చున్నది కాలము కరుణజూప
వేని నిన్ను రక్షించు వారెవరు? దేవ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

నా కవిత్వము, నాభక్తి నాగణితము
నా ప్రసంగము లేవియు నీకు తగవు
వాని గుణము పెంచెడి వైనమేది?
తెలిపి ఉద్దరించెడి దేవ దేవుడెవరు?
పుట్టపర్తి విభుడు తప్ప బ్రోవవయ్య

కవుల లోక కవిగాను గణిత శాస్త్ర
పండితుల నడుమ గణన బడయలేదు
భక్త బృందము లందు సభ్యత్వమేది?
సిరులు సంపదలు గడియించి నదిలేదు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

సాహసోపేత కార్యముల్ జరుపలేదు
కళలు నేర్వలేదు ఘనత గాంచలేదు
చెప్పిమెప్పు బడయు పనిచేయలేదు
కాన నెవ్విధ సంతృప్తి కలుగునయ్యా
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆత్మనింద మహా పాపమనివ చింత్రు
బుధులు మిగులు నిందలు గాక పొగడనెట్లు
వీలగు నది వంచనగాదె ఫాలనేత్రసాయి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

చేయ వలసినపని వినాచేయనుల్ల
సిల్లు నుల్ల మన్యమును ఘటిల్లుహాని
ఎంత చింతించినను తుదకేమి ఫలము
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

శాస్త్ర చర్చల మీద నాసక్తి తగ్గె
సరస సంగీత సభల ప్రసక్తి లేదు
పూని ఏదేని చేయ సొంపు నశియించె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఏదియో బాధ నిరతము హృదయపీఠ
మాక్రమించుకొని మరింత విక్రమించు
పాలముంతువో! నీటనో ప్రభుడవీవె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

పనియొకటి చేయునప్పుడు మనసు వేరొ
క పనిమీద పరుగులెత్తుకతము వలన
కార్యహాని అడ్డదున కలుగునయ్య
ఎందు జాచిన నోటమి ఎదురుకొనును
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జలతలమ్ములు ఘనహిమ తలములయ్యె
మంచు గడ్డల దుప్పటి మడతలందు
ముడుచుకొని పరుండె ధరణి మూల్గజొచ్చె
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

అనువుగాని కాలమని మాతృ భగవాను
డప్పుడు నాసీనుదయ్యె నీ కృపవలెనని
బ్రతికె నీ తరతతి చలివెతల జిక్కి
అకట! తలప్రాణములు తోకలందుదాచి
సర్వ కీటకక కోటి విజ్ఞానము గరపు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

జనము జంతుపుత పక్షులు శక్తికొలది
తగు ఉపాయముల్ కని తలదాచు కొనియె
దుర్ధినములుగడచెను ద్యుమణి కిరణ
చరణ తాడనమున మంచు పొరలు తొలగె
శీత లీకృత నిశ్శబ్ద చేతనమ్ము
కొనలు నన లెత్తు తరువుల కొమ్మలందు
కనులు పండువులీను పచ్చని బయళ్ళు

యందు, జలతరంగము లందు, చందమామ
యందు, బాలబాలికలందు, నెందుజూడ
కర్షకుల కార్మికుల నిండు హర్షమందు
అడవు లందు జనపదములందు సంద్ర

మందు జంతు జాలముండు డెందమందు
విస్తరించెను జనమెల్ల వేడుకయ్యె
స్వామి కేళీ విలాసమే చైత్రదీప్తి
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!
వేసవి వసంతమును మ్రింగు విధికృతమ్మొ?
చలిభుజించును వర్షాభ్రజాలములను
ఋతుగతులు తారుమారయి వెతలు గలుగు
జగతి నొకచోట వేరొండు స్థలములందు
క్రమగతిని సాగు చుండు భాగ్యములుపండు
బాప నీవైపరీత్యము చూపవలయు
నీదు కరుణార్ధ్ర వీక్షణల్ మేదురమున

మృత జగత్ వస్తుకోటి కమృతపరిస్థి
తినిడు జ్ఞానమూర్తి! మతినను భవించు
ప్రతియొకటి యోగ్యతను బొంది భగవదనుగ్ర
హమ్ము నంది ఈ పరివర్తనమ్ము చెందు

నిస్సహాయులకు లభించు నీసహాయ
మని జగతి భక్తకోటినిన్ వినుతిజేయు
నీదుసాయ మాశించితి ఆదుకొనుము
సాయిరామ చంద్రా నిత్య సత్యసాంద్ర

ఉన్న దానితో సంతృప్తి నొందలేక
లేని దానికై వగయుచు గ్లాని చెంది
చేయ శక్యమైన పనులన్ చేయలేక
తోటి వారలసాటినా తూగలేక
పతనమై పోవునన్ను కాపాడరావ
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఆత్మ విశ్వాసము సడలినందువల్ల
కార్య దక్షత కొరవడె కలత హెచ్చె
నిట్టియెడ నీదు చేయూతనివ్వకున్న
ఏమికావలె? నా బ్రతుకే మిసేతు
సాయిరామ చంద్రా! నిత్య సత్యసాంద్ర!

ఇష్ట కార్యకరణము నభీష్ట సిద్ధి
కావ్య శాస్త్ర పఠనము రాగభరితమ్ము
మిత్ర సంసార సంతతి చిత్ర చిత్ర
ము కమనీయమగు తల్లి ఒడినిచేరు
క్షేత్ర తీర్థాటనములు సిద్ధి జనులు
సేవలను నావలందెక్కి పోవునేను
కాల సంద్రము పైపైన తేలుచుండి
ఒంటరి పయన మనగానె ఉలికి పడునె
డద లోతుల కీడ్చి బెడుగుల పాలు